ఈనాడు

విజయవాడ 24-1-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 164

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

స్మార్ట్... శుభోదయం



'శుభోదయ' సందేశాల వెల్లువతో భారతీయుల స్మార్ట్‌ఫోన్లు నిండిపోతున్నాయి. ప్రతి మూడు చరవాణుల్లో ఒకదాని పరిస్థితి ఇదే. అమెరికాలో అయితే ప్రతి పదింటిలో ఒకటి ఇలా నిండుతోంది.

6లో

షారుక్‌ఖాన్ సెల్ఫీ...



షారుక్‌ఖాన్ కనిపిస్తే సెల్ఫీ దిగాలని చాలా మంది ఆరాటపడుతుంటారు. అలాంటిది ఆయనే వేరొకరితో సెల్ఫీ కోరుకుంటే? దావోస్‌లో అదే జరిగింది. ఆయన సెల్ఫీ దిగాలనుకున్నది ఎవరితో?

11లో

కొలువు కోల్పోయిన రోబో



ఈ రోబో పేరు ఫ్యాబియో. ఎడిన్‌బరోలోని అత్యాధునిక 'మార్గియోటా' అనే స్టోర్‌లో పనిచేస్తోంది. పనిలో చురుగ్గా లేదంటూ పాపం ఉద్యోగం నుంచి తీసేశారు. ఫ్యాబియో వెళ్లిపోతుంటే సహోద్యోగి (మనిషి) ఏడ్చేశారట.

6లో

స్వేచ్ఛా స్వర్గాన్ని సృష్టిద్దాం

- రండి.. విభజనలు లేని ప్రపంచాన్ని నిర్మిద్దాం
- స్వార్థపూరిత పోకడలు వద్దు
- ప్రపంచ ఆర్థిక వేదికపై నుంచి ప్రధాని మోదీ పిలుపు
- శాంతి, సౌభాగ్యాలు కావాలంటే భారత్‌కు రావాలని ఆహ్వానం
- పెట్టుబడులకు స్వర్గధామంగా మలిచామని వెల్లడి



'మానవాళి భవిష్యత్తుకు సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన ప్రశ్నలెన్నో. మనం సాధిస్తున్న పురోగతి మన మధ్య విభేదాలు మరింత తీవ్రం చేస్తోందా? ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ చీలికలను, విభేదాలను ప్రోత్సహిస్తోందా? మంచి ఉమ్మడి భవిష్యత్తు కోసం ఈ విభేదాలను మనం తొలగించుకోగలమా?

వాతావరణ ఉద్గారాలను తగ్గించాల్సిందే అని ప్రతి ఒక్కరూ చెబుతారు. కానీ అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎన్ని అభివృద్ధి చెందిన దేశాలు.. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇవ్వడానికి ముందుకొచ్చాయి?'

దావోస్

ప్రపంచ ఆర్థిక వేదికపై ప్రధాని నరేంద్రమోదీ వసుధైక కుటుంబం మంత్రాన్ని పఠించారు. ప్రపంచీకరణ స్ఫూర్తి మరుగున పడిపోతోందని అప్రమత్తం చేశారు. ఆర్థిక ఆత్మరక్షణ ధోరణికి వ్యతిరేకంగా గట్టి సందేశం వినిపించారు. విభజనలకు తావులేని స్వేచ్ఛాపూరిత స్వర్గం సృష్టించాలని అభిలషించారు. అభివృద్ధి చెందిన దేశాలు తమ స్వార్థాన్ని చూసుకుంటూ అభివృద్ధి చెందుతున్న దేశాలను పట్టించుకోవడం లేదని పరోక్షంగా ట్రంప్ అనుసరిస్తున్న అమెరికా ఫస్ట్ విధానానికి చురకలు వేశారు. భారత్‌లో వ్యాపారానుకూల వాతావరణ ముందని వివరిస్తూ పెట్టుబడులు పెట్టాలని ప్రపంచ దేశాలను ఆహ్వానించారు. శాంతి, సంపద, శ్రేయస్సు కోరుకునేవారు భారత్‌కు రావాలని కోరారు. ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్లకు భారతీయ తత్వమే పరిష్కారమని వివరించారు. ప్రపంచ ఆర్థిక వేదిక ప్రారంభ సదస్సునుద్దేశించి మోదీ మంగళవారం కీలకోపన్యాసం చేశారు. ఈ సదస్సునుద్దేశించి 20 ఏళ్ల తర్వాత ప్రసంగించిన తొలి భారత ప్రధాని మోదీయే కావడం విశేషం. ఆయన మాట్లాడడానికి ఉపక్రమించగానే సదస్సు ప్రాంగణమంతా కరతాళ ధ్వనులతో మార్మోగిపోయింది. అంతకుముందు సభికులంతా గౌరవపూర్వకంగా లేచి నిలబడ్డారు.

నమస్కార్‌తో ప్రారంభించి హిందీలో దాదాపు గంట పాటు ప్రసంగించిన ప్రధాని.. సంస్కృత శ్లోకాలను ఉటంకించారు. 'వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, స్వార్థం'- ఈ మూడింటినీ ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లుగా పేర్కొన్నారు.

"భారత ప్రధాని చివరిసారి దావోస్ సదస్సుకు హాజరయింది 1997లో. అప్పటి ప్రధాని దేవెగౌడ ఆ ఏడాది సదస్సుకు హాజరయ్యారు. 1997లో భారత స్థూల జాతీయోత్పత్తి దాదాపు రూ.25.5 లక్షల కోట్లు మాత్రమే. ఇప్పుడు (మిగతా 6లో)



దావోస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో తెలంగాణ మంత్రి కేటీఆర్

పెట్టుబడులపై పట్టుదల

6లో

- దావోస్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు చర్చలు
- కృష్ణపట్నంలో చమురు శుద్ధి కేంద్రం ఏర్పాటుకు ఆహ్వానం
- హిటాచీతో ఈడీబీ ఒప్పందం

జాజివలసా హలో అంది

- గిరిజన గ్రామానికి ఫైబర్‌నెట్
- దావోస్ నుంచి ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- గిరిజనులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన సీఎం
- గూగుల్ ఎక్స్ పరిజ్ఞానంతో ఏర్పాటు

11లో

ఇలాగైతే భూసేకరణ ప్రక్రియనే నిలిపేస్తాం!


- నివేదికల సమర్పణలో ఇంత ఉదాసీనతా?
- ఇరు రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై హైకోర్టు అసంతృప్తి
- అపరిష్కృతంగా పరిహారం చెల్లింపుపై వేల పిటిషన్లు



ఈనాడు - హైదరాబాద్

ప్రజావసరాల కోసం సేకరించిన భూమికి పరిహారం చెల్లింపునకు సంబంధించి కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, అమలు చేసినవి, చేయాల్సిన వాటికి సంబంధించిన వివరాలతో నివేదికలు సమర్పించకపోవడంపై ఇరు రాష్ట్రాల తీరుపై ఉమ్మడి హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. పరిహారానికి సంబంధించి కింది కోర్టులు ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు సంబంధించి ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భూసేకరణ ప్రక్రియనే నిలిపివేయాల్సి ఉంటుందని హెచ్చరించింది.

భూసేకరణ ప్రక్రియలో పరిహారం పెంపు నిమిత్తం బాధితులు కోర్టుకు రాగా వీటిపై కింది కోర్టులిచ్చిన ఉత్తర్వులను ఆయా జిల్లా కలెక్టర్లు అమలు చేయడంలేదని, వాటిని అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌లే(ఈపీలు) ఎక్కువగా వస్తున్నాయని మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి జి. వెంకటకృష్ణయ్య గతేడాది జూన్ 24న హైకోర్టుకు లేఖ రాశారు. ఈ లేఖను హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణనలోకి తీసుకుంది. పరిహారం చెల్లింపు నిమిత్తం కోర్టు ఉత్తర్వుల అమలు కోసం దాఖలు చేసిన పిటిషన్‌లు ఒక్క మహబూబ్‌నగర్‌లోనే 1204 పిటిషన్‌లు అపరిష్కృతంగా ఉన్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ 3032 అపరిష్కృతంగా ఉన్నట్లు తేలింది. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. గత ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన నివేదికను పరిశీలించిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది. పూర్తి వివరాల్లేకుండా మొక్కుబడిగా నివేదిక సమర్పించడం సరికాదని పేర్కొంది. ఈనివేదిక ప్రకారం రూ.500కోట్లు చెల్లించాల్సి ఉందని, ఇంత పెండింగ్ ఉండగా భూసేకరణ ప్రక్రియ ఎలా కొనసాగిస్తున్నారని (మిగతా 6లో)



స్టాక్ మార్కెట్ జైత్రయాత్ర

- కొత్త జీవనకాల గరిష్ఠాలకు సూచీలు
- సెన్సెక్స్ తొలిసారి 36000 పాయింట్లకు
- 11000 మైలురాయిని అధిగమించిన నిఫ్టీ

- వివరాలు బిజినెస్ పేజీలో

సదావర్తి భూములపై వ్యాజ్య విచారణ మూసివేత

5లో

తమిళనాడులోని వివాదంపై ఇక్కడ విచారణ జరపలేమన్న హైకోర్టు

ఇదీ సంగతి!



అన్నీ అబద్ధపు లెక్కలే, నేను మరింత పేదవాణ్ని ఎలా అవుతాను సార్?

మహానగరం కావాలి

- అమరావతికి రూ.1.20 లక్షల కోట్లు అవసరం
- మౌలిక వసతులకే రూ.43వేల కోట్లు వెచ్చించాలి
- ప్రధానికి సమర్పించబోతున్న వినతిపత్రంలో వివరించనున్న ఏపీ
- 116 పేజీల పుస్తకం తయారీ

ఈనాడు - దిల్లీ

వ్యవసాయ ఆధారితంగా మిగిలిపోయిన ఆంధ్రప్రదేశ్‌కు దక్షిణాదిలోని మిగతా రాష్ట్రాల రాజధానులతో సమానమైన రాజధానిని నిర్మించుకోవాల్సి ఉందని, అందుకోసం అమరావతిని మహానగరంగా తీర్చిదిద్దడానికి రూ.1.20 లక్షల కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తోందని ప్రధాని నరేంద్ర మోదీకి అందించబోతున్న విజ్ఞాపన పత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివరించబోతోంది. ఈనెల 12వ తేదీన ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి రాష్ట్ర సమస్యలపై 17 పేజీల వినతి పత్రం సమర్పించినప్పుడు ఆయన మరిన్ని వివరణలు కోరారు. ఈ నేపథ్యంలో ప్రతి అంశంలోని లోతుపాతులను, పూర్వాపరాలను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 116 పేజీల పుస్తకాన్ని తయారు చేసింది. కేంద్ర మంత్రి సుజనా చౌదరి త్వరలో దీనిని ప్రధానమంత్రి కార్యాలయానికి అందించనున్నారు. ఇందులో అమరావతిని పూర్తిస్థాయి మహానగరంగా తీర్చిదిద్దడానికి వచ్చే రెండు దశాబ్దాల్లో రూ.1.20 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. అత్యవసర మౌలిక వసతులైన రాజ్ భవన్, సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీతోపాటు ప్రధాన రహదారులు, తదితర నిర్మాణాలకే వచ్చే ఐదేళ్లలో రూ.42,935 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని ఏపీ ప్రభుత్వం అంచనా వేసింది. అమరావతిని కొత్త రాష్ట్ర వృద్ధి కేంద్రంగా (మిగతా 6లో)

ఈనాడు

విశ్వవేదికపై 'అభివృద్ధి మంత్ర'

శతాబ్దాలుగా మన సంస్కృతీ సంప్రదాయాలకు, శాంతి సుహృద్భావానికి నెలవైన భారతావని ఆర్థిక వాణిజ్య విధానాల పరంగా రూపాంతరం చెందుతోంది... వెలుపలి పెట్టుబడుల్ని సాదరంగా స్వాగతిస్తోంది- దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదికపై నిన్న ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నినదించిన 'అభివృద్ధి మంత్ర' సారాంశమిది! 'విభజిత ప్రపంచానికి ఉమ్మడి భాగస్వామ్య భవిష్యత్ నిర్దేశం' అజెండాగా సాగుతున్న ప్రతిష్ఠాత్మక వార్షిక సదస్సును ఉద్దేశించి ఉపన్యసించిన ప్రధాని- భారతీయ తాత్త్వికత, చింతన, దార్శనికతలను వివరిస్తూ ఉటంకించారు. ఆ మూలాల్ని స్పృశించి భారత్ అమేయ శీలసంపద ఔన్నత్యాన్ని ఆవిష్కరించినంత లాఘవంగానే ప్రధాని మోదీ- సమకాలీన ప్రపంచం ఎదుర్కొంటున్న మూడు సంక్లిష్ట సవాళ్లను గుదిగుచ్చారు. పర్యావరణ సమతూకాన్ని నాశనం చేసుకునే జాతి ఆత్మవినాశాన్ని కొనితెచ్చుకొంటుందన్న హెచ్చరిక, ఉగ్రవాదుల్లో మంచి చెడు వ్యత్యాసం ఉండదన్న స్పష్టీకరణ, రక్షణాత్మక వాణిజ్య ధోరణులు తగవన్న ఉద్బోధ- నిన్నటి చారిత్రక ప్రసంగంలో మూడు కీలక పార్శ్వాలు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్య సమితి సహా ముఖ్య వ్యవస్థల్లో నిర్మాణాత్మక సంస్కరణల ఆవశ్యకతను చెప్పకనే చెప్పిన మోదీ- అంతర్జాతీయ స్థాయిలోనూ 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' (అందరి తోడ్పాటుతో అద్భుత ప్రగతి) శిరోధార్యమని పిలుపిచ్చారు. వేగవంతమైన అభివృద్ధికి దేశాలన్నీ తలోచెయ్యి వెయ్యాలంటూ, ఎక్కడికక్కడ గోడలు కట్టాలంటున్న తెంపరితనం తాలూకు అనర్థాన్ని ఎండగట్టారు. సమకాలీనాంశాల్ని నేర్పుగా ప్రస్తావించి, క్లిష్ట సమస్యలపై సమయోచితంగా స్పందించాల్సిందిగా సభ్య దేశాలను అప్రమత్తం చేసిన మోదీ- ఆర్థిక శక్తిగా భారత్ విరాట్ రూపం విస్తరించేదని చాటడంలోనూ కృతకృత్యులయ్యారు. ఆ మేరకు సమధిక పెట్టుబడుల రాకతో దేశ వాణిజ్యాభివృద్ధి స్థిరలక్ష్యం కుదురుకోగలుగుతుందా అన్న ప్రశ్నకు భవిష్యత్తే చెప్పాలి జవాబు!

నాలుగు పుష్కరాల క్రితం జర్మన్ ఆర్థికవేత్త క్లాస్ ష్వాబ్ చేతుల మీదుగా రూపుదిద్దుకున్న ఐరోపా నిర్వహణ వేదిక పదహారేళ్ల తరవాత పేరు మార్చుకుని డబ్ల్యూఈఎఫ్‌గా నిలదొక్కుకుంది. ఇన్నేళ్ల అస్తిత్వంలో ఎన్నడూ లేనివిధంగా ట్రంప్ ముఖతా 'అమెరికాయే ముందు'వాదం, ఐరోపా సమాఖ్యను కుదిపేసిన బ్రెగ్జిట్ పరిణామాల నేపథ్యంలో రక్షణాత్మక వాణిజ్య ధోరణులపై సర్వత్రా చర్చోపచర్చలు నెలకొన్నాయి. ప్రపంచ ఆర్థిక వేదికపై చైనా అధ్యక్షులు షీ జిన్‌పింగ్ నిరుటి బాణీ, రక్షణాత్మక ధోరణుల్ని సూటిగా తప్పుపట్టింది. ఈసారి అటువంటి దృఢమైన వాణి వినిపించగలవారెవరన్న నిరీక్షణకు మోదీ రూపేణా సమాధానం లభించింది! ప్రపంచ ఆర్థిక వేదిక తాజా నివేదిక ప్రకారం- చైనా, ఇండొనేసియాలను వెన్నంటి భారత్ మూడో అత్యంత విశ్వసనీయ దేశంగా నిలిచింది. 2016తో పోలిస్తే పోటీతత్వ ర్యాంకుల్లో ఇండియా ఎనిమిది స్థానాలు మెరుగుపరచుకొని జాబితాలో ఎనభై ఒకటోదిగా కుదురుకొంది. నైపుణ్యాల ప్రాతిపదికనా ఎదుగుదల కనిపిస్తోంది. 2014 సెప్టెంబరులో 'మీరు హార్డ్‌వేర్ దిగ్గజమైతే మేం సాఫ్ట్‌వేర్ మేరునగ'మని జపాన్ పర్యటనలో మోదీ ఆకట్టుకోవడం తెలిసిందే. భారత్ పరివర్తన చెందుతోందని జర్మనీ, అమెరికా ప్రభృత దేశాల్లో, ఏసియాన్ వంటి వేదికలపై గతంలో ధాటిగా చాటిన మోదీ- ఈసారి శ్రుతి మార్చి దావోస్‌లో సంక్షిప్త సందేశం వినిపించడానికి పరిమితమయ్యారు. 'కాలదోషం పట్టిన చట్టాలు, పద్ధతులు ఎన్నింటినో మార్చాం... మారుస్తున్నాం... మారుతున్నాం' అన్న మోదీ- ఎంతటి అనిశ్చిత పరిస్థితుల్లోనైనా భారత్ వృద్ధి సాధిస్తూనే ఉంటుందనడంలో ఎనలేని ధీమా ప్రస్ఫుటమవుతోంది. దేశీయంగా క్షేత్రస్థాయిలోనూ సానుకూల మార్పులకు దీటైన సంస్కరణలు చురుగ్గా పట్టాలకు ఎక్కాల్సిన ఆవశ్యకత విస్మరించరానిది.

దావోస్‌లో, పద్దెనిమిది దేశాలకు చెందిన నలభై దిగ్గజ సంస్థల సారథులతో భేటీ సందర్భంగా ప్రధాని మోదీ ఒక ముఖ్యాంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సరళతర వాణిజ్యానికి పెద్దపీట వేయడం కాదు, ప్రభుత్వంతో ఎక్కడా ఎటువంటి ఘర్షణా తలెత్తని వాతావరణ పరికల్పన తమ తదుపరి ధ్యేయమని ఆయన వెల్లడించారు. ఆర్థిక పరిమాణంలో 2028 నాటికి జపాన్, జర్మనీలను సైతం ఇండియా అధిగమించనుందన్న బ్రిటిష్ బ్రోకరేజీ సంస్థ హెచ్ఎస్‌బీసీ జోస్యం నిజం కావాలంటే- మరిన్ని కంతల పూడ్చివేత వడివడిగా సాగాల్సి ఉంది. 2013తో పోలిస్తే స్వీయ జమానాలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండింతలు కావడం పట్ల సంతృప్తి వ్యక్తీకరిస్తున్న మోదీ ప్రభుత్వం పూర్తిస్థాయి సత్తా కనబరిస్తేనే చైనాను మించగలదని ఆసియా అభివృద్ధి బ్యాంకు చెప్పింది అక్షర సత్యం. పన్నుల చెల్లింపు, నిర్మాణ అనుమతుల జారీలో మందభాగ్యం భారత్ పురోగతిని దిగలాగుతున్నట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక ఆ మధ్య ఆక్షేపించింది. అవినీతి, విద్యుత్ పంపిణీ, రవాణా వసతుల పరంగా ఫోర్బ్స్ నివేదిక వేలెత్తి చూపిన మౌలిక సవాళ్ల పరిష్కరణ శీఘ్రతరం కావాలనడంలో మరోమాట లేదు. వ్యవస్థ మూలగను నమిలేస్తున్న అవినీతిని కట్టడి చేసేలా విధివిధానాల పరిపుష్టీకరణపై రాజీపడే వీల్లేదు. భిన్నత్వంలో ఏకత్వమే భారతజాతి బలిమిగా అభివర్ణించిన ప్రధానమంత్రి- ప్రశాంతంగా సంపద సృష్టి కోసం తరలి రావాల్సిందిగా వెలుపలి పెట్టుబడిదారులకు ఆహ్వానం పలికారు. అపార మానవ వనరుల్ని నిపుణ శక్తులుగా మలచి, భావి సవాళ్లను అద్భుతావకాశాలుగా తీర్చిదిద్దే దార్శనిక వ్యూహ నిర్మాణాన్ని, దాని కార్యాచరణ ప్రాతిపదికల్ని సుసాధ్యం చేయడమే అసలైన గడ్డుసవాళ్లు. ఆ బాధ్యతల్ని సమర్థంగా నిభాయిస్తేనే విశిష్ట ఆర్థిక వ్యవస్థగా భారత్ కాంతులీనుతుంది; సమగ్రాభివృద్ధికి దర్పణం పడుతుంది!

మార్కెట్ మాయను ఛేదిస్తేనే మేలు



డాక్టర్ పరిటాల పురుషోత్తం

నేడు దేశంలో అనేక సంస్థలు రైతులతో ఒప్పంద సేద్యం చేయిస్తున్నా, అది పరస్పర నమ్మకంమీదే జరుగుతోంది తప్ప చట్టపరమైన ప్రాతిపదిక లేదు. దాంతో ప్రభుత్వానికి ఈ తరహా సేద్యంపై నియంత్రణ కొరవడి రైతుకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. కాంట్రాక్టు కుదుర్చుకున్న సంస్థ అనుకున్న సమయానికి నిర్ణయించిన ధరకు పంట కొనకపోతే న్యాయం కోసం రైతు కోర్టుకు వెళ్లలేకపోతున్నాడు. పరిస్థితిని చక్కదిద్దడానికి నిరుడు డిసెంబరు 24న కేంద్ర ప్రభుత్వం ఆదర్శ ఒప్పంద సేద్యం (ప్రోత్సాహం, అభివృద్ధి) ముసాయిదా చట్టం (2018) రూపొందించింది. ధరల్లో విపరీతమైన వ్యత్యాసాల వల్ల రైతులు నష్టపోకుండా చూడటం ఈ ముసాయిదా చట్ట లక్ష్యం. ఆహారశుద్ధి సంస్థలు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంలో, మౌలిక వసతుల కల్పనలో భారీగా పెట్టుబడి పెట్టేలా ఈ చట్టం ప్రోత్సహిస్తుంది. దీన్ని అమలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. ముసాయిదాపై అభిప్రాయాలు చెప్పి, సలహాలు సూచనలు ఇవ్వాల్సిందిగా రైతులు, రైతు సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం కోరింది. స్వచ్ఛంద సంస్థలు, ఒప్పంద సేద్య సంస్థలు, సంబంధిత కంపెనీలతోపాటు సాధారణ ప్రజల అభిప్రాయాలనూ కేంద్ర వ్యవసాయ శాఖ ఆహ్వానించింది.

అపనమ్మకాలకు మూలం

రైతుకు, సంస్థలకు మధ్య కుదిరే ఒప్పందాలకు చట్టపరమైన పునాది లేకపోవడం అపనమ్మకాలకు తావిస్తోంది. అయితే ఒప్పంద వ్యవసాయం వల్ల పంటల విస్తీర్ణం పెరిగి, రైతులకు ఆదాయాలు, కంపెనీలకు లాభాలు హెచ్చి మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపు వస్తుంది కాబట్టి దాన్ని తప్పక ప్రోత్సహించాల్సిందే. దళారులు, వడ్డీ వ్యాపారుల చేతిలో రైతులు మోసపోకుండా నివారించడానికి కాంట్రాక్టు సేద్యం తోడ్పడగలదు. ఇందులోనూ ఎన్నో లొసుగులు ఉన్నాయి. పలు సందర్భాల్లో ఒకే ఒప్పంద సంస్థ వందలు, వేలమంది రైతుల ఉత్పత్తిని కొనుగోలు చేస్తోంది. రైతులకు మార్కెట్ గురించి సరైన సమాచారం లేకపోవడం వల్ల బాగా నష్టపోతున్నారు. ఆ సమాచారాన్ని గుప్పిట్లో పెట్టుకున్న ఒప్పంద సంస్థ లాభాలు మూటగట్టుకుంటోంది. అలాగే ముందు ఒప్పుకొన్న ధరకన్నా విపణి ధర ఎక్కువున్నా, తక్కువున్నా ఒప్పందాన్ని ఉల్లంఘించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఒప్పంద సంస్థలతోపాటు రైతులూ ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడుతుంటారు. అలాంటప్పుడు ఉభయుల మధ్య కుదిరిన ఒప్పందాన్ని కచ్చితంగా అమలు చేయించే చట్టమేదీ లేదు. ప్రభుత్వ నియంత్రణా లేదు. దీనివల్ల తరచూ కాంట్రాక్టు సేద్యం విఫలమవుతోంది. చాలా సందర్భాల్లో ఒప్పంద సంస్థ ముందు ఒప్పుకొన్న ధరకన్నా విపణి ధర తక్కువగా ఉంటే ఏదో వంకపెట్టి పంట కొనకుండా ఎగవేస్తుంది. ఇది చిత్తూరు జిల్లా టమాటా రైతులకు అనుభవమే. కృష్ణా, ప్రకాశం, ఖమ్మం జిల్లాల్లో సుబాబుల్ రైతులకు బకాయిలు చెల్లించడంలో ఒప్పంద సంస్థలు విపరీతంగా ఆలస్యం చేస్తున్నాయి. ప్రస్తుతం కుదురుతున్న కాంట్రాక్టుల్లో అత్యధికం ఒప్పంద సంస్థకే అనుకూలంగా ఉంటూ రైతు ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. ఒకవేళ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దెబ్బతింటే నష్టమంతా రైతులే భరించాలి తప్ప ఒప్పంద సంస్థ పైసా నష్టం భరించదు. ఒప్పంద సంస్థలు ఎప్పుడంటే అప్పుడు ఒప్పంద ధర మార్చేసే వెసులుబాటును అట్టిపెట్టుకుని రైతుకు మాత్రం ఆ సౌలభ్యం లేకుండా చేస్తాయి. మార్కెట్ ధర కన్నా బాగా తక్కువకు కొని సొమ్ము చేసుకోవాలని చూస్తాయి. చిత్తూరు జిల్లాలో ఘెర్కిన్ (చిట్టి దోసకాయల) సాగుదారులకు ఇది బాగా అనుభవం. తమిళనాడులో బ్రాయిలర్ కోళ్ల పెంపకందారులనూ ఒప్పంద సంస్థలు ముప్పుతిప్పలు పెడుతుంటాయి. బకాయిలను 60 రోజుల ఆలస్యంగా చెల్లించడం ఈ సంస్థలకు ఆనవాయితీ. ఒప్పందం ప్రకారం నిర్దిష్ట సంఖ్యలో కోళ్లను పెంచాల్సి ఉంటుంది కాబట్టి రైతులు అందుకోసం భారీ పెట్టుబడి పెడతారు. తీరా సరకు కొనే సమయం వచ్చేసరికి ఒప్పంద సంస్థలు ధరల్లో మాయాజాలానికి పాల్పడతాయి. రైతులు మాత్రం ఒప్పందం నుంచి తప్పించుకోలేరు. కొంతమంది మోసగాళ్లయితే పంట కొనాల్సిన సమయానికి పత్తా లేకుండా పోతారు. ఈ పరిస్థితిలో అనేక కాంట్రాక్టు సేద్య ప్రాజెక్టులు విఫలమయ్యాయంటే ఆశ్చర్యమేముంది? రైతులు, ప్రాయోజక సంస్థలకు మధ్య కుదిరే ఒప్పందాలను సాధికారంగా నమోదు చేసే సదుపాయం లేకపోవడంతో ప్రభుత్వమూ జోక్యం చేసుకోలేకపోతోంది. ఈ లోపాలను సరిదిద్దడానికి కొత్త చట్టాన్ని ప్రతిపాదిస్తోంది.

ప్రతిపాదిత చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పంద సేద్య ప్రోత్సాహం, అభివృద్ధి ప్రాధికార సంస్థలను ఏర్పరుస్తాయి. ప్రాయోజక సంస్థలకు, రైతులకు మధ్య కుదిరే కాంట్రాక్టులను నమోదు చేసి, సక్రమంగా అమలయ్యేలా చూడటానికి జిల్లా, మండల, బ్లాకు స్థాయుల్లో ప్రత్యేక సంఘాలను నెలకొల్పుతారు. వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మార్కెటింగ్, గ్రామీణాభివృద్ధి, సహకార తదితర శాఖలకు చెందిన అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సంఘాలను ఏర్పాటు చేస్తుంది. వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ కమిటీల (మండీల) పరిధిలోకి ఒప్పంద సేద్యం రాదు. ప్రతిపాదిత ఒప్పందంలో ముఖ్యాంశం ఇదే. మండీలు దళారుల ఇష్టారాజ్యాలుగా మారి రైతుల పొట్ట కొడుతున్నాయనే ఆరోపణల మధ్య ఇది ఎంతో ప్రాముఖ్యం సంతరించుకొంటోంది.

రాష్ట్రాలపై గురుతర బాధ్యత

కొత్త చట్టం సక్రమంగా అమలై రైతులకు గరిష్ఠ ప్రయోజనం సిద్ధించాలంటే పొలం, గ్రామం, పంచాయతీ, మార్కెట్ స్థాయుల్లో పంటల గ్రేడింగ్‌కు పటిష్ఠ యంత్రాంగాన్ని నెలకొల్పాలి. ఒప్పంద సంస్థలు, రైతుల మధ్య విభేదాలను 15 రోజుల్లో పరిష్కరించే ఏర్పాటు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ స్థాయి అధికారులను పరిష్కర్తలుగా నియమించాలి. ఆ అధికారి నిర్ణయం నచ్చనప్పుడు రైతుగాని, ఒప్పంద సంస్థగాని న్యాయం కోసం 30 రోజుల్లో ప్రాధికార సంస్థకు విజ్ఞాపన చేసుకోవచ్చు. ఉభయుల వాదనలు విన్న తరవాత పక్షం రోజుల్లో ప్రాధికార సంస్థ తీర్పు చెప్పాలి. అదే అంతిమ నిర్ణయం అవుతుంది. ఈ సంస్థకు సివిల్ కోర్టు ప్రతిపత్తి ఉంటుంది. సాధారణ సివిల్ కోర్టులు ఇక్కడ జోక్యం చేసుకోవడానికి వీల్లేదు. ప్రాధికార సంస్థ తీర్పును గౌరవించని రైతులు, ఒప్పంద సంస్థలు జరిమానాలు, నష్టపరిహారాలు చెల్లించక తప్పదు. నేడు దేశమంతటా పండ్లు, కూరగాయలు, సుబాబుల్, చెరకు వంటి పంటలను కాంట్రాక్టు పద్ధతిలో సాగు చేస్తున్న నేపథ్యంలో రైతులను మార్కెట్ ధరల మాయాజాలం నుంచి రక్షించే విధంగా కొత్త చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి. ఒకవేళ విపణిలో ఏదైనా పంట ధర పతనమైతే నష్టాన్ని ప్రాయోజక సంస్థే భరించాలి. అనేక రాష్ట్రాలు ఆమోదించిన వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీ (ఏపీఎమ్‌సీ) చట్టాల్లో కాంట్రాక్టు సేద్యాన్ని ప్రోత్సహించే నిబంధనలు ఉన్నా, కేంద్రం పూర్తిగా కొత్త చట్టాన్ని తీసుకురావాలని నిశ్చయించింది. ఒప్పంద సేద్య వివాదాల్లో ఏపీఎమ్‌సీలు మధ్యవర్తులుగా వ్యవహరించే అవకాశమివ్వరాదన్న ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకొస్తోంది.

దళారులు, వ్యాపారులు కుమ్మక్కై పంటలకు మార్కెట్ ధరలను తగ్గించేసి రైతు పొట్టకొడుతున్న సంగతి అందరికీ తెలుసు. ఈ అన్యాయాన్ని సరిదిద్దడానికి మార్కెట్ సంస్కరణలు తీసుకురావాలి. కాంట్రాక్టు సేద్య చట్టం చేసి చేతులు దులిపేసుకుంటే సరిపోదన్నది కొందరు నిపుణుల వాదన. రైతుకు గిట్టుబాటు ధరలు లభించేలా చూసే సంస్కరణలు అమలులోకి వస్తే ఒప్పంద సేద్యం దానంతట అదే వ్యాపిస్తుందని వారు అంటున్నారు. ఈ చట్టం విజయవంతమవుతుందా లేదా అన్నది రాష్ట్ర ప్రభుత్వాల నిబద్ధతపై ఆధారపడి ఉంటుంది. చట్టం గురించి రైతుల్లో అవగాహన, చైతన్యం పెంచడం, అందరికీ ఆమోదనీయమైన గ్రేడింగ్ పద్ధతిని చేపట్టడం, పంటల నిల్వ సౌకర్యాల విస్తరణ, రైతులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా సకాలంలో వారికి సంస్థాగత రుణాలు అందించడం, వ్యాపారులు, దళారులు లాలూచీ పడి ధరలను కృత్రిమంగా తగ్గించకుండా జాగ్రత్త వహించడం- ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాల్సిన విధులు. రైతుల్లో సమష్టిగా బేరమాడే శక్తిని పెంపొందించడానికి సంస్థాగత ఏర్పాట్లు చేయాలి. ఒకటీ రెండు ఎకరాలు ఉన్న రైతులకు సహకార సేద్య ప్రయోజనాల గురించి వివరించాలి. రైతులను మొదట చిన్న చిన్న బృందాలుగా సమీకరించి, తరవాత వాటిని అనుసంధానిస్తూ సమష్టిగా పెద్ద బృందాలను నిర్మిస్తే వారికి బేరమాడే శక్తి పెరుగుతుంది. సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు కొత్త చట్టం అమలుకు చిత్తశుద్ధితో పనిచేసేట్లు చూడటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు కృషిని నిర్వహించాలి.

(రచయిత- 'సెస్'లో ఆచార్యులు)







ఒప్పంద సేద్యంపై కొత్త చట్టం

చిన్నరైతుకు పెద్ద భరోసా



చిన్న రైతులను ఒప్పంద సేద్యంలో పటిష్ఠ భాగస్వాములను చేస్తే నేడు భారత వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. రుణాలిచ్చే సంస్థలు, బీమా కంపెనీలు, విస్తరణ యంత్రాంగం చిన్న రైతును నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శలు రావడం తెలిసిందే. కాంట్రాక్టు సేద్యం వీటికి పరిష్కారం చూపగలుగుతుంది. పెద్ద కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు చిన్న రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమాచారం, పంటను మంచి ధరకు విపణిలో విక్రయించే వెసులుబాటు, సులభ షరతులపై రుణాలు లభిస్తాయి. లావాదేవీల ఖర్చు తగ్గుతుంది. కంపెనీల యాజమాన్య నైపుణ్యాలతో వారు లబ్ధి పొందగలుగుతారు. చిన్న రైతులకు సేద్యంలో ఆధునిక మెలకువలు అలవడి సామర్థ్యం పెరుగుతుంది. పెట్టుబడులు, గిట్టుబాటు ధరలు అందడంతో నష్టభయం తగ్గుతుంది. కాంట్రాక్టు సంస్థలు రైతులకు మేలైన ఎరువులు, విత్తనాలు, క్రిమినాశనులు, విస్తరణ సేవలు అందేలా చూస్తాయి. పంటల నాణ్యతపై ఎప్పటికప్పుడు నిఘా వేస్తాయి. ఫలితంగా ఆహార శుద్ధి పరిశ్రమలు వృద్ధి చెంది విస్తరిస్తాయి. దాని వల్ల వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులూ ఇనుమడిస్తాయి. కాబట్టి ఒప్పంద సేద్యం సక్రమంగా జరిగితే రైతుల ఆదాయాలు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వికసిస్తుంది. ఇటీవలి కాలంలో రైతుకు అధిక ఆదాయం తెచ్చిపెట్టే పండ్లు, పూలు, కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపల ఉత్పత్తి వైపు మొగ్గు పెరిగింది. అయినా దేశంలో ఒప్పంద వ్యవసాయం గొప్పగా విజయవంతమైన దాఖలా లేదు. కాంట్రాక్టు సంస్థలకు, రైతులకు మధ్య నెలకొన్న అపనమ్మకాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. అలాగని అసలు విజయగాథలే లేవనికాదు. పెద్ద కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా మధ్యప్రదేశ్‌లో మిర్చి, కుసుమ పంటల సాగులో, తెలంగాణలో సంకర విత్తనాలు, మహారాష్ట్రలో ద్రాక్ష, అరటి పండ్ల సాగులో చిన్న రైతులు విజయాలు సాధించి ఆదాయాలు పెంచుకోగలిగారు.

బంధనాలు ఇక చాలు

ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని ప్రధాని మోదీ ఇటీవల దేశ ప్రజలకు పిలుపిచ్చారు. బాలికల సంరక్షణ, సమాన అవకాశాల కల్పన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అంటూ దిల్లీలో ప్రతిజ్ఞా కార్యక్రమం నిర్వహించారు. బాలికల శ్రేయం కోసం పాలకులు ఎన్ని పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయి లోపాలవల్ల సమస్యలు అలాగే ఉండిపోతున్నాయి. 2008 నుంచి ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని దేశంలో నిర్వహిస్తున్నారు. అయినా వారి సంరక్షణ విషయంలో సాధించిందేమిటన్నది సమీక్షించుకుంటే నిరాశే మిగులుతోంది. దేశంలో ఏటా కోటికి పైగా ఆడశిశువుల భ్రూణహత్యలు జరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చట్ట నిబంధనలు ఎన్ని ఉన్నా లింగ నిర్ధారణ పరీక్షలకు కళ్లెం పడటం లేదు. శారీరకంగా మగబిడ్డలకన్నా ఆడశిశువులు బలంగా ఉంటారు. అయినా పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ వంటి విషయాల్లో వివక్షణ బాలికల పాలిట శాపమవుతోంది. సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా బాల్య వివాహాలు ఆగడం లేదు. వాటిలో 40 శాతం భారత్‌లోనే జరుగుతున్నాయని ఐక్యరాజ్యసమితి బాలల నిధి సంస్థ (యునిసెఫ్) కుండ బద్దలుకొట్టింది. బాల్య వివాహ అవ్యవస్థను కూకటివేళ్లతో పెకలించి వేయడానికి మరో అయిదు దశాబ్దాలు పడుతుందని తేల్చింది. దేశంలో ఏటా సుమారు మూడుకోట్ల బాల్యవివాహాలు వెలుగులోకి వస్తున్నాయి. వీటివల్ల భార్యాభర్తలు అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అధ్యయనాలు చాటుతున్నాయి. బాలికల అక్రమ రవాణా అంతకంతకు విస్తరిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ విష సంస్కృతి అత్యంత వేగంగా ప్రబలుతుండటం పెను ప్రమాద ఘంటిక. బాధితుల్లో ఎక్కువమంది మాదక ద్రవ్యాల సరఫరా, అవయవ విక్రయ ముఠాలు, వ్యభిచార కూపాల గుప్పిట్లో చిక్కుకుంటున్నారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆశచూపి తీసుకెళ్లే ముఠాలు అధికమయ్యాయి. శారీరకంగా కృత్రిమ ఎదుగుదల కోసం మైనర్ బాలికలకు సూది మందులు ఇస్తుండటం మరో దారుణం. ఇలా అడుగడుగునా బాలికలకు దేశంలో అభద్రతాభావ దుస్థితులే ఎదురవుతున్నాయి.

సమస్యల వలయం

భ్రూణహత్యలు, పౌష్టికాహార లోపాలు, అనారోగ్యం, అవిద్య, బాల్య వివాహాలు, అక్రమ రవాణా వంటి బాలికల సమస్యలపై మరింత చిత్తశుద్ధితో పాటుపడాల్సిన అవసరం ఉరుముతోంది. ఆధునిక భారతం, సాంకేతిక పరిజ్ఞానాలు సైతం కొత్త సమస్యలు, పరిష్కారాలను ముందుకు తెస్తున్నాయి. వీటిపై ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంచాలి. ఆడశిశువుల భ్రూణ హత్యలకు కళ్లెం పడకపోవడాన్ని పాలకులు తీవ్రంగా తీసుకోవాలి. వీటికి అడ్డుకట్ట వేయడానికి చర్యలు చేపట్టాలని సర్వోన్నత న్యాయస్థానం గతంలోనే రాష్ట్రప్రభుత్వాలకు సూచించింది. ఆడపిల్లలున్న ప్రతి కుటుంబానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పరిస్థితిలో మార్పు సాధించవచ్చు. దేశంలో ఏటా మూడు కోట్ల బాల్యవివాహాలు నమోదవుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో బాల్యవివాహ నిరోధక చట్టాన్ని తెచ్చినా ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో బాల్య వివాహాలకు పెద్దగా అడ్డుకట్ట పడటం లేదు. అవిద్య, అవగాహనలోపం, పేదరికం కారణంగా అనేకమంది తల్లిదండ్రులు పిల్లలకు త్వరగా పెళ్లిళ్లు చేసేస్తున్నారు. బాల్యవివాహాలతో తల్లిదండ్రుల బాధ్యత తీరే మాటెలా ఉన్నా, చిన్నారి పెళ్లిళ్లు పిల్లల ఆరోగ్యాలను అవి దెబ్బ తీస్తున్నాయి. వారికి పుడుతున్న పిల్లలు అనేక అనారోగ్య సమస్యలను పుట్టిన రోజు నుంచే ఎదుర్కొంటున్నారు. రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ పురిట్లోనే పిల్లలు మృతి చెందుతున్న ఘటనలు నేటికీ నమోదవుతున్నాయి. బాల్య వివాహాల నిరోధానికి 1872లో రూపొందించిన చట్టానికి తరవాత 1891, 1929, 2006 సంవత్సరాల్లో అవసరమైన మార్పులు తెచ్చారు. అయితే ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో బాల్యవివాహాలను అదుపు చేయలేకపోతున్నారు. గ్రామస్థాయిలో కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకు, మండల స్థాయిలో పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నుంచి జిల్లా ఎస్పీ వరకు అందరూ వీటి నిరోధంలో చురుకుగా భాగస్వాములు కావాలి. అనేక బాల్య వివాహాలను అడ్డుకుంటున్నామని ప్రభుత్వ అధికారులు చెబుతున్నా, వీటిలో 90 శాతం స్వచ్ఛంద సంస్థల చొరవతో ఆగినవేనన్నది అసలు నిజం.



నేడు జాతీయ బాలికా దినోత్సవం

తెలుగు రాష్ట్రాల పాఠశాలల్లో బాలుర కంటే బాలికలే తక్కువగా చేరుతున్నారు. ఈ దృష్ట్యా విద్యారంగంలో బాలికలను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. నిధుల మంజూరుకు వెనకాడితే బాలికల చదువులు అర్ధాంతరంగా ఆగిపోతాయన్నది చేదు నిజం. ఓ అధ్యయనం ప్రకారం ఎనిమిదో తరగతి బాలికల 'డ్రాపౌట్' శాతం ఏపీలో 3.78 శాతం, తెలంగాణాలో 5.31 శాతంగా ఉంది. తొమ్మిదో తరగతి బాలికలు ఏపీలో 2.89 శాతం, తెలంగాణలో 4.70 శాతం చదువులు ఆపేస్తున్నారు. పదోతరగతి బాలికలు ఏపీలో 23.62 శాతం, తెలంగాణ వ్యాప్తంగా 30.55 శాతం డ్రాపౌట్లుగా తేలడం ఆందోళన కలిగిస్తోంది. ఇంటర్‌లో బాలికలు ఏపీలో 11.79 శాతం, తెలంగాణలో 13.22 శాతం మధ్యలోనే చదువు మానేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బాలికలు పదోతరగతి పూర్తి చేయకుండానే చదువుకు దూరం కావడానికి నెలసరి సమస్యలు ప్రధాన కారణమని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. ఎంతోమంది విద్యార్థినులు రక్తస్రావంతో తరగతి గదిలో ఇబ్బందులు పడలేక నరకం అనుభవిస్తున్న వాస్తవాన్ని విద్యావేత్తలు, బాలల హక్కుల కార్యకర్తలు పలు సదస్సుల్లో ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. సర్వశిక్షా అభియాన్‌లో భాగంగా పాఠశాలల్లో బాలికలకు ప్రతి నెలా 'శానిటరీ ప్యాడ్స్' ఉచితంగా అందించాలని 2012లో జాతీయ కార్యక్రమం ప్రారంభించారు. నిధుల కొరత కారణంగా 2014 నాటికి అది నిలిచిపోయింది. బాలికలు చదువుకు దూరం కాకుండా ఉండటానికి ప్రభుత్వ పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా అందించాలని మహిళా సంఘాలు, విద్యాహక్కు చట్టం కార్యకర్తలు నినదిస్తున్నారు. కర్ణాటక, కేరళలోని కార్పొరేషన్ స్కూళ్లలో శానిటరీ నాప్కిన్లను అందజేసే యంత్రాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని 'ఇఫ్లూ'లో బాలికల హాస్టల్ వద్ద ఈ తరహా యంత్రం వాడుతున్నారు.

సమష్టి బాధ్యత

విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు నీరుగారిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. గత విద్యా సంవత్సరంలో తొమ్మిదోతరగతి చదివే బాలికలకు సైకిళ్లు అందజేయడానికి ఏపీ ప్రభుత్వం 'బడికొస్తా' పథకం ప్రారంభించింది. ఒక్కో సైకిల్‌కు ప్రభుత్వం నాలుగు వేల రూపాయలు వెచ్చిస్తోంది. విద్యా సంవత్సరం ముగిసినా కూడా అనేకచోట్ల పంపిణీ పూర్తికాలేదు. తొమ్మిదోతరగతిలో సైకిళ్లు అందిస్తే పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో బాలికలకు ఉపయోగపడతాయని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల్లో బయోమెట్రిక్ హాజరు కోసం పంపిణీ చేసిన ట్యాబ్‌లలో బాలికల ఐరిస్ తీసుకొని, సైకిల్ అందించిన తరవాత వారి ఫొటో తీసి కంప్యూటర్‌లో పొందుపరచాలనే నిబంధన విధించారు. విద్యార్థినుల ఐరిస్ తీసేందుకు సాంకేతిక సమస్య తలెత్తడంతో సైకిళ్ల పంపిణీ సక్రమంగా సాగలేదు. ఏకరూప దుస్తుల పంపిణీలో కూడా 'ఆప్కో' తీవ్రజాప్యం చేస్తోందనే విమర్శలున్నాయి. ఇలాంటి అవరోధాలకు అడ్డుకట్ట పడిననాడే బాలికల విద్య నిరాటంకంగా ముందుకు సాగుతుంది. దేశం అన్ని రంగాల్లో సమగ్ర ప్రగతి సాధించాలంటే సాంఘిక సమస్యలను ఎక్కడికక్కడ అడ్డుకోవాలి. సతీసహగమనాలు, కన్యాశుల్కాలను తుదముట్టించిన స్ఫూర్తితోనే బాలికలు ఎదుర్కొంటున్న ఇతర దురాచారాలకూ చరమ గీతం పాడాలి. బాలికల బంగారు భవిష్యత్తుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. వాటిని సమర్థంగా అమలు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగంతోపాటు, పౌర సంఘాలూ యథాశక్తి పాటుపడాలి. అప్పుడే అమ్మాయి నిండుగా నవ్వుతుంది!

- నిఖిత

రథ సప్తమి

మాఘమాసం శుక్లపక్షం సప్తమి తిథి 'రథ సప్తమి'గా ప్రసిద్ధం. సూర్యరథం దక్షిణాయనం ముగించి, పూర్వోత్తర దిశగా పయనం సాగిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. మాఘ సప్తమి మొదలు, వచ్చే ఆరు మాసాలూ ఉత్తరాయణ పుణ్యకాలం. అదితి, కశ్యప ప్రజాపతి దంపతులకు మహావిష్ణువు సూర్య భగవానుడిగా ఉదయించాడు కాబట్టి, నేడు 'సూర్య జయంతి' అని పురాణ గాథలు చెబుతాయి. సూర్యరథానికి కూర్చిన ఏడు గుర్రాలు ఏడు వారాలకు, పన్నెండు చక్రాలు పన్నెండు రాశులకు సంకేతాలు. సూర్యుడి పేరుతో ప్రారంభమయ్యేది భానువారం. శనివారంతో వారాంతమవుతుంది. మేషం నుంచి మీనం దాకా పన్నెండు రాశుల్ని పూర్తిచేయడానికి, సూర్యరథానికి ఒక ఏడాది పడుతుందంటారు. ఒకే సూర్యుడు పన్నెండు రూపాలు, పన్నెండు పేర్లతో ప్రకాశించడాన్ని ఆ విరాట్ పురుషుడి నేత్రావధాన ప్రభావంగా పరిగణిస్తారు. వేద వాక్యాన్ని అనుసరించి- ఉత్తరాయణం పుణ్యకాలంలా, ఆ సూర్యకాంతిలో జీవితం సాగడం మహాభాగ్యంగా వర్ణిస్తారు. ఉత్తరాయణ పుణ్యకాలం కోసమే భీష్మాచార్యులు అంపశయ్యపైన ఎదురుచూశారు.

రుగ్వేదంలోని పదో మండలం ఎనభై అయిదో మంత్రమే సూర్యుడి పరంగా చెప్పిన గాయత్రీ మంత్రం! రోజూ ఉదయ సూర్యుడికి ఎదురుగా నిలిచి నమస్కరించే ఆచారం అనాదిగా వస్తోంది. సూర్యోపాసకుల నిత్య జీవితంలో సూర్యనమస్కారాలకు ప్రత్యేక స్థానముంది. ఆరోగ్యాన్ని ప్రసాదించే సూర్యుడికి యోగాభ్యాసం చేసేవారూ పెద్దపీట వేశారు.

రథ సప్తమి నుంచి వాతావరణంలో మార్పు కనిపిస్తుంది. ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతుంది. ఉగాది నాటికి ప్రకృతికాంత సొగసులు సంతరించుకుంటుంది. పంటల పండుగ సంక్రాంతి తరవాత అవతరించే రథం పండుగ ఇది. రథ సప్తమినాడు ముంగిట్లో రథం ముగ్గులు సుందరంగా కనిపిస్తాయి. ఆ ముగ్గుల నడుమ పిడకలు వేసి, సూర్యభగవానుడికి ప్రియమైన పాయసం వండుతారు. పిడకలపైన పాలు పొంగించడాన్ని 'సిరుల పొంగు'కు సంకేతంగా భావిస్తారు. అప్పటికే రైతులు ధాన్యరాశులను ఇళ్లకు చేర్చి ఉంటారు. ఉదయాన్నే ఇంటిల్లిపాదీ స్నానాలు ముగిస్తారు. గాయత్రీ జపం, ఆదిత్య హృదయం, సూర్యాష్టకం, సూర్య సహస్రం వంటి స్తోత్ర పాఠాలు వల్లిస్తూ పూజలు చేయడం రివాజు.

మహావిష్ణువు ప్రతిరూపంగా పూజించే సూర్యభగవానుడికి దేశవిదేశాల్లో ఘనంగా పూజలు నిర్వర్తిస్తారు. రథసప్తమి రోజున అరసవల్లి సూర్యదేవాలయం, కర్ణాటకలోని మైసూరు ఆలయాల వద్ద సూర్యమండల, సూర్యదేవర ఊరేగింపులు ఉత్సాహంగా నిర్వహిస్తారు. మంగళూరు వీర వేంకటేశ్వర స్వామి కోవెలలో రథోత్సవం వైభవంగా జరుగుతుంది. తిరుపతి క్షేత్రంలో మలయప్పస్వామిని రథసప్తమి నాడు అలంకరించి- శ్రీదేవి, భూదేవి సమేతంగా సప్త వాహనాలపైన ఊరేగిస్తారు. తిరుమాడ వీధుల్లో స్వామి సూర్యప్రభ, చిన శేష, గరుడ, హనుమ, చక్రాసన, కల్పవృక్ష, సర్వభూపాల వాహనాల్ని అధిరోహించి నయనానందంగా విహరిస్తారు. ఏడుకొండలవాడు సప్తవాహనుడై సప్తాశ్వ సూర్యుడిలా ప్రకాశిస్తాడు.

సూర్యుడి దేవాలయాల్లో కోణార్క, విరించి నారాయణ క్షేత్రాలు (ఒడిశా); మొధేరా (గుజరాత్) ప్రఖ్యాతమైనవి. విదేశాల్లోనూ సూర్యారాధన సాగుతోంది. అందుకు చైనా, జపాన్, ఈజిప్టులు ఉదాహరణలు.

జీవరాశికి ప్రాణశక్తిని, ఉత్తేజాన్ని ప్రసాదించే అధిదేవత సూర్యుడు. సూర్యుడు జ్ఞానమండలం అని సూర్యమండలాష్టకమ్ చెబుతుంది. 'జయాయ జయ భద్రాయ' అంటుంది ఆదిత్య హృదయం. శరీరయాత్రలో జీవుడు చేసే కర్మలన్నింటికీ సాక్షీభూతుడు సూర్యుడు. బాహ్యప్రపంచాన్ని వెలిగించడంతోపాటు, అంతరంగంలో ఆవరించిన అజ్ఞాన అంధకారాన్ని తొలగించే జ్ఞానదీపం రవిబింబం. ప్రత్యక్ష దైవంగా సూర్యుణ్ని ఆరాధిస్తే పరబ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుందని సాధకుల ప్రగాఢ నమ్మకం. అందుకే సూర్యుడు సూర్యనారాయణ స్వామిగా రథసప్తమినాడు పూజలందుకుంటున్నాడు.



అంతర్యామి

- ఉప్పు రాఘవేంద్రరావు

అనుమతి లేని వైద్య శిబిరాలంటూ ఆకాశ రామన్న ఫిర్యాదు!

సీతంపేట, న్యూస్‌టుడే: అమెరికా నుంచి విశాఖకు పర్యాటకులుగా వచ్చిన సుమారు 40 మంది విశ్రాంత వైద్యులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారంటూ ముఖ్యమంత్రి కార్యాలయానికి ఒక అజ్ఞాత వ్యక్తి ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు, కేంద్ర హోం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఐఎంఎ, పోలీసులకు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదులు వెళ్లాయి. వైద్యులంతా విశాఖలోని ఓ హోటల్‌లో బస చేశారని, వీరు గత కొన్నిరోజులుగా చోడవరం, విజయనగరం, విశాఖ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని, వీటిని వీడియోల్లో చిత్రీకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అమెరికాలో వీరంతా లైసెన్స్ గడువు పూర్తయినవారని ఫిర్యాదు దారు తెలిపారు. స్పందించిన మహారాణిపేట సీఐ వెంకట నారాయణ నిర్వాహకులుగా ఉన్న రమేష్ షా, డాక్టర్ మూర్తి ఉప్పల, గరుడరావుతో మాట్లాడుతున్నారు. వైద్యుల పర్యటనకు సంబంధించి తమకెలాంటి సమాచారం రాలేదని డీఎంహెచ్‌వో ఆర్.రమేష్ తెలిపారు. నిర్వాహకుడు రమేష్ షాతో 'ఈనాడు' మాట్లాడినప్పుడు... వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నది వాస్తవమేనని, తాము అక్రమంగా చేయడంలేదని వివరించారు. ఫిర్యాదు విషయం తమ దృష్టికీ వచ్చిందని, పోలీసులకు సహకరిస్తామని తెలిపారు.

మమ్మల్ని రోడ్డున పడేయకండి

- మంత్రిని వేడుకున్న ఫార్మాడీ విద్యార్థులు
- ప్రణాళిక లేకనే ఇలా..వైద్యమంత్రి కామినేని

ఈనాడు, అమరావతి


మంత్రి కామినేని శ్రీనివాస్‌తో చర్చిస్తున్న ఫార్మాడీ విద్యార్థులు

'ఒక్కొక్కరం ఆరేళ్ల కోర్సుకు కలిపి 10 నుంచి 12 లక్షల రూపాయల వరకు ఖర్చుపెట్టాం. అర్హులకు ప్రభుత్వం బోధనా రుసుముల చెల్లింపు కింద రూ.3.84 లక్షల రూపాయల వరకు చెల్లించింది. ఆరేళ్ల వ్యవధి కలిగిన ఫార్మాడీ కోర్సులో అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ వంటి అంశాలపై అవగాహన పొందాం. ద్వితీయ సంవత్సరం నుంచి ఆస్పత్రుల్లో వైద్యుల పక్కనే ఉంటూ వైద్య సేవల్ని అందించాం. వైద్య ఆరోగ్యశాఖలో నియామకాలు లేవు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ తగిన ఉపాధి లభించడం లేదంటూ..విజయవాడలో మంగళవారం మంత్రి కామినేని శ్రీనివాస్ వద్ద ఫార్మాడీ విద్యార్థులు వాపోయారు. మమ్మల్ని రోడ్డుపై విడిచిపెట్టొద్దని మొరపెట్టుకున్నారు.

2010లో ఈ కోర్సును ప్రారంభించేందుకు ఫార్మసీ కౌన్సెల్ ఆఫ్ ఇండియా అనుమతినిచ్చింది. . ప్రతి ఏడాది రెండువేల మంది వంతున ప్రస్తుతం 18వేల మంది చదువుతున్నారు. ప్రస్తుతం కోర్సు పూర్తిచేసుకున్న వారి పరిస్థితి, రానున్న విద్యా సంవత్సరంలో ఈ కోర్సులో చేరాలనుకున్న వారి పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

విద్యార్థులకు న్యాయం జరగలేదు..: మంత్రి కామినేని

"కోర్సు నిర్వహణ తీరు, విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఎలా కల్పించాలన్న అంశాలపై చర్చించి నివేదికను అందచేసేందుకు కమిటీ ఏర్పాటు చేశాం. నిర్దిష్ట ప్రణాళిక లేకుండా ఏర్పాటుచేసిన ఈ కోర్సువల్ల విద్యార్థుల నష్టపోతున్నారు. సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉన్న ఈ కోర్సుకు వైద్య శాఖకు సంబంధంలేదు. రానున్న విద్యా సంవత్సరంలో కొత్తగా ఈ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు ఇవ్వొద్దని విద్యాశాఖ మంత్రి గంటాను కోరా. 45రోజుల్లోగా కమిటీ నివేదికను ప్రభుత్వానికి ఇస్తుంది. అవకాశం ఉన్నంత వరకు వీరికి వైద్య ఆరోగ్య శాఖ (వైద్య మిత్ర, జనఔషధి)లో సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తానని" పేర్కొన్నారు. ఈ సమావేశంలో శాసనసభసభ్యులు ప్రభాకర్‌చౌదరి, జితేందర్‌గౌడ్ పాల్గొన్నారు.


రథసప్తమి సందర్భంగా శ్రీవారి ఆలయానికి విశేషాలంకరణ

తిరుమలకు పోటెత్తిన భక్తులు

నేడు రథసప్తమి వేడుకలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలకు మంగళవారం భక్తజనం పోటెత్తారు. బుధవారం రథసప్తమి నేపథ్యంలో శ్రీవారి దర్శనానికి భక్తకోటి అధిక సంఖ్యలో తరలివచ్చింది. బుధవారం సూర్యోదయం నుంచి రాత్రి వరకు శ్రీవారు సప్త వాహనాల్లో విహరిస్తూ భక్తకోటిని అనుగ్రహిస్తారు. సూర్యప్రభ వాహనంతో ప్రారంభమై చంద్రప్రభ వాహనంతో ఈ సేవలు ముగుస్తాయి. రథసప్తమి నేపథ్యంలో శ్రీవారికి ఆర్జిత సేవలను తితిదే రద్దు చేసింది. వికలాంగులు, వృద్ధులు, చంటిబిడ్డలతో పాటు తల్లిదండ్రులు, ఇతర ప్రత్యేక దర్శనాలను నిలిపివేసింది.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు అరెస్టు

- తాడేపల్లి నుంచి గుంటూరు తరలింపు

తాడేపల్లి, న్యూస్‌టుడే: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధును తాడేపల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి బైపాస్‌రోడ్డులోని తన నివాసం నుంచి విజయవాడ పార్టీ కార్యాలయానికి వెళుతుండగా కుంచనపల్లి వద్ద మంగళగిరి గ్రామీణ సీఐ మధుసూదనరావు, తాడేపల్లి ఎస్ఐలు ప్రతాప్‌కుమార్, నారాయణ ఆయనను అరెస్టు చేసి తాడేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈనెల 24న గుంటూరు జిల్లాలో 'చలో పెద్దగొట్టిపాడు' కార్యక్రమాన్ని సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నేపథ్యంలో ముందస్తుగా మధును అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మధు విలేకర్లతో మాట్లాడుతూ పెద్దగొట్టిపాడు ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని తెలిపారు. ప్రభుత్వం కావాలని ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆరోపించారు. పోలీసులు చెబుతున్నట్లు పెద్దగొట్టిపాడు ప్రశాంతంగా ఉంటే ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయడం ఎందుకని ప్రశ్నించారు. మీడియాతో మాట్లాడిన అనంతరం మధును పోలీసులు గుంటూరుకు తరలించారు.

సదావర్తి భూములపై వ్యాజ్య విచారణ మూసివేత

- తమిళనాడులోని వివాదంపై ఇక్కడ విచారణ జరపలేమన్న హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: సదావర్తి సత్రం భూముల వ్యవహారం తమిళనాడులోని భూపరిపాలన కమిషనర్ కార్యాలయంలో అపరిష్కృతంగా ఉన్నందున ఇక్కడ విచారణ జరపలేమని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. తమకు విచారణ జరిపే అధికార పరిధి ఉండదని పేర్కొంటూ విచారణను మూసివేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈమేరకు ఆదేశాలు జారీచేసింది.

సదావర్తి సత్రానికి చెందిన తమిళనాడులోని 83 ఎకరాల్ని వేలంలో ఏపీ సర్కారు రూ.22.44 కోట్లకు విక్రయించడాన్ని సవాలు చేస్తూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరగా.. మళ్లీ హైకోర్టునే విచారించాలని సుప్రీం ఆదేశాలు జారీచేసింది. ఉమ్మడి హైకోర్టులో తమిళనాడు సర్కారు అనుబంధ పిటిషన్ దాఖలు చేసి.. సదావర్తి సత్రానివి అని చెబుతున్న భూములు తమకు చెందినవని వాదనలు వినిపించింది. మరోవైపు ప్రైవేటు వ్యక్తులు ఆ భూముల్లో కొంత విస్తీర్ణం తమకు చెందినవంటూ అనుబంధ పిటిషన్ వేశారు. మంగళవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. సదావర్తి సత్రం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆ భూములు సత్రానికి చెందుతాయని పేర్కొంటూ తమిళనాడులోని స్థానిక న్యాయస్థానం 1924లో తీర్పు ఇచ్చిందన్నారు. ఆ భూములకు రైత్వారీ పట్టా మంజూరు చేయాలంటూ తాము చేసిన అభ్యర్థనను అక్కడి రెవెన్యూ అధికారులు తోసిపుచ్చారన్నారు. ఆ ఉత్తర్వులపై తమిళనాడులోని భూపరిపాలన కమిషనర్ వద్ద అప్పీల్ దాఖలు చేశామని అది అపరిష్కృతంగా ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. అభ్యంతరం ఉన్నవాళ్లు అక్కడే వాదనలు చెప్పుకోవాలంటూ విచారణను మూసివేసింది.

యువత నూతన ఆవిష్కరణల వైపు అడుగేయాలి

- సైయెంట్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి
- జేఎన్‌టీయూకే స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం

కాకినాడ, న్యూస్‌టుడే: నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్యతో సరిపెట్టుకోవద్దని, చదివిన చదువుతో నూతన ఆవిష్కరణల వైపు అడుగు వేయాలని పారిశ్రామిక వేత్త, సైయెంట్ సంస్థ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జేఎన్‌టీయూకే ఆరో స్నాతకోత్సవం ఉపకులపతి వీఎస్ఎస్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బీవీఆర్ మోహన్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ అందజేశారు. అనంతరం మోహన్‌రెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం కమ్యూనికేషన్ రంగంలో యువత దూసుకెళుతోందని, దాదాపు 20 మిలియన్ల మంది అంతర్జాలం వినియోగిస్తున్నారని చెప్పారు. డిజిటల్ యుగంలో పలు సాంకేతిక టెక్నాలజీలకు డేటా అనేది చాలా అవసరమని, దీనివల్ల ప్రతి పని సులువుగా జరిగేందుకు అవకాశం ఉందన్నారు. అంతర్జాలం, కమ్యూనికేషన్ టెక్నాలజీలు ప్రజల జీవితంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చాయని తెలిపారు. 2020 నాటికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభించేలా ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. తమ కంపెనీ వార్షిక లాభాలలో 2 శాతం డిజిటల్ అక్షరాస్యతకు, నైపుణ్యాల శిక్షణకు వినియోగిస్తున్నామని మోహన్‌రెడ్డి తెలిపారు.

విద్యాహబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి: గంటా

ఆంధ్రప్రదేశ్‌ను విద్యా హబ్‌గా తీర్చిదిద్దేందుకు, నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో ఆర్థికలోటు ఉన్నా ఏటా విద్యకు రూ.23,200 కోట్లు నిధులు కేటాయించామన్నారు. మౌలిక వసతుల కల్పనకు రూ.380 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆరో స్నాతకోత్సవంలో భాగంగా 191 పీహెచ్‌డీలు, 69 మందికి బంగారు పతకాలను ప్రదానం చేశారు.


జేఎన్‌టీయూకే వీసీ కుమార్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న బీవీఆర్ మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి గంటా శ్రీనివాసరావు

38 శాతం పిల్లల్లో పోషకాహార లోపం

- రాష్ట్ర ఆహార భద్రత హక్కు కమిషన్ ఛైర్మన్ పుష్పరాజ్

వన్‌టౌన్(విశాఖపట్నం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇంకా 38 శాతం మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయని, ఇది ప్రపంచంలోని నిరుపేద దేశమైన ఉగాండా కంటే అధికమని రాష్ట్ర ఆహార భద్రత హక్కు కమిషన్ ఛైర్మన్ పుష్పరాజ్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐసీడీఎస్ కేంద్రాల ద్వారా 33 లక్షల మందికి, మధ్యాహ్న భోజనం పథకం కింద 35 లక్షల మందికి సరకులను సరఫరా చేస్తున్నామన్నారు. 1.42 కోట్ల కుటుంబాలకు పీడీఎస్ కింద బియ్యం ఇస్తున్నామన్నారు. ఇంత పెద్దఎత్తున ఆహార పంపిణీ జరుగుతున్నా ఇంకా 38 శాతం మంది బాలలు పోషకాహార లోపం ఉండడం ఆందోళన కలగిస్తోందన్నారు. అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేసి ఆహార భద్రత హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరి జిల్లాల జేసీ-2, పౌరసరఫరాల అధికారులు, మేనేజర్లు, తూనికలు కొలతలు, ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు, ఐటీడీఏ పీవోలతో మంగళవారం విశాఖలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈనాడు

ముువ్వన్నెల పతాకం.. ఒదిగింది విద్యార్థి లోకం

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై నగరంలోని ఓ పాఠశాలకు చెందిన 6,900 మంది విద్యార్థులు జాతీయ పతాకం ఆకారంలో కూర్చొని అందరినీ ఆకట్టుకున్నారు. రానున్న 69వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని చెన్నై ముగప్పేర్‌లోని వేళమ్మాళ్ పాఠశాల ఆధ్వర్యంలో ఈ వినూత్న ప్రయోగం చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో వేలాది విద్యార్థులతో దీనిని మంగళవారం ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



జాతీయ పతాకం ఆకారంలో విద్యార్థులు

శుభోదయం సందేశాలతో కిక్కిరిసిపోతున్న స్మార్ట్‌ఫోన్లు

వాషింగ్టన్: "మిత్రమా శుభోదయం" లాంటి సందేశాలతో భారతీయుల స్మార్ట్‌ఫోన్లు నిండిపోతున్నాయని తాజా అధ్యయనం చెబుతోంది. ప్రతి మూడు చరవాణుల్లో ఒకదాని పరిస్థితి ఇదేనని వివరిస్తోంది. అమెరికాలో అయితే ప్రతి పదింటిలో ఒకటి ఇలా నిండుతోందని వెల్లడిస్తోంది. వెస్టర్న్ డిజిటల్ కార్పొరేషన్ దీన్ని చేపట్టింది. ముద్దులొలికే చిన్నారులు, పక్షులతోపాటు సూర్యకిరణాల వెలుగుల్లో తలతల మెరిసే పువ్వులతో శుభోదయ సందేశాలను జత చేసిన చిత్రాలను భారత నెటిజన్లు విరివిగా పంపుతున్నట్లు సంస్థ తెలిపింది. లక్షలాది మంది ఉదయం ఆన్‌లైన్‌లోకి వస్తూనే సందేశాలు పంపడం మొదలు పెడుతున్నట్లు వివరించింది. గత ఐదేళ్లలో శుభోదయం చిత్రాల కోసం అంతర్జాలంలో అన్వేషణ పది రెట్లు పెరిగినట్లు పేర్కొంది. ఈ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి సామాజిక అనుసంధాన సంస్థలు 'స్టేటస్' అనే కొత్త సదుపాయాన్ని గతేడాది అందుబాటులోకి తెచ్చాయి. వీటి సాయంతో ఒకేసారి అందరికీ సందేశాలు చెప్పేసే అవకాశముంది.

యువత సంతోషం హారీ!.. స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోయే యుక్తవయస్కులు మిగతావారితో పోలిస్తే తక్కువ సంతోషంగా ఉంటున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. అమెరికాలోని జార్జియా వర్సిటీ నిపుణులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఫోన్లు, కంప్యూటర్లు, టాబ్లెట్లపై యువత వెచ్చిస్తున్న సమయం, తోటివారితో సంబంధాలు, జీవితంపై సంతృప్తి వంటి అంశాలపై ప్రశ్నలు అడిగి. సమాచారాన్ని సేకరించారు. అనంతర విశ్లేషణలో.. స్మార్ట్ తెరలకు అతుక్కుపోయేవారు మిగతావారి కంటే తక్కువ సంతోషంగా ఉంటున్నట్లు పరిశోధకులు తేల్చారు. స్మార్ట్ పరికరాలకు పూర్తిగా దూరంగా ఉండేవారు సంతోషంగా ఉంటారని తాము చెప్పడంలేదని.. అయితే వీటి వాడకానికి గంట కన్నా తక్కువ సమయం కేటాయించేవారు కొంచెం ఎక్కువ ఆనందంగా ఉంటున్నట్లు గుర్తించామని పరిశోధనలో పాలుపంచుకున్న జీన్ ఎం. ట్వెంజ్ తెలిపారు.

> **నేటి సమాజంలో చీలికలు బహువిధాలుగా ఉంది. మానవసంబంధాల్లో విచ్ఛిన్నత ఒకటి. ఒక దేశంలో వివిధ వర్గాల మధ్య అసమానతలు మరో రకమైన చీలిక, మరొకటి అంతర్జాతీయ స్థాయిలో విచ్ఛిన్నత. అంతర్జాతీయ స్థాయిలో విచ్ఛిన్నతకు ప్రధాన కారణాలు- ఆయా ప్రాంతాలను ప్రత్యక్షంగానో పరోక్షంగానో నియంత్రించుకోవాలనుకోవడం. అంతర్జాతీయ వాణిజ్యాన్ని, ప్రజల వలసలను నియంత్రించాలనుకోవడం. అంతర్జాతీయంగా చీలిక అనేది తీవ్రమయిన అంశం. మనం సంబంధాలు దెబ్బతినడానికి అనుమతిస్తున్నాం. తొలుత మనం కత్తిరిస్తాం. తర్వాత కుడతాం. కానీ అప్పటికే చాలా ఆలస్యమయి ఉంటుంది. అంతర్జాతీయ కోణంలో చూస్తే ఇలాంటి పరిస్థితులు ఎన్నో. ఏం చేయాలో తెలియని పరిస్థితి. చీలికనేదే ఏర్పడకుండా చూసుకోవడం నిజమయిన వ్యూహం. మనస్సులోనే అంతా ఉందని భారత్ తెలుసుకుంది. అందుకే చీలికలకు భారత్ వద్ద పరిష్కారం ఉంది.**
>
> **సామాజిక మాధ్యమం మనల్ని కేవలం కలుపుతోంది. మమేకం చేయడం లేదు. మనం మాట్లాడుతున్నాం. ఆలకించడం లేదు. వార్తలు, అభిప్రాయాలు పంచుకుంటున్నాం. దార్శనికతను కాదు.**
>
> **కొన్ని ప్రపంచ శక్తులు ప్రపంచీకరణను వదిలించుకోవాలనుకోవడమే కాదు.. దాన్ని నిలిపివేయాలని కూడా కోరుకుంటున్నాయి.**
>
> **డేటాను నియంత్రించేవారే ప్రపంచాన్ని శాసిస్తారు. అందుకే డేటా వెంబడి ప్రపంచం పరుగులు పెడుతోంది.**
>
> **-మోదీ**

స్వేచ్ఛా స్వర్గాన్ని సృష్టిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ఆరింతలకు పైగా పెరిగింది. 1997లో యూరో అమల్లో లేదు. బ్రెగ్జిట్ పరిణామం లేదు. ఒసామా బిన్ లాడెన్ గురించో హారీ పోటర్ గురించో ప్రపంచం వినలేదు. కంప్యూటర్ల చేతిలో చెస్ ఆటగాళ్లు ఓడిపోయే పరిస్థితి అప్పుడు లేదు. గూగుల్ లేదు. అమెజాన్ గురించి శోధిస్తే అడవులు, నదుల గురించి సమాచారం వచ్చేది. అప్పట్లో పక్షులు మాత్రమే ట్వీటేవి. ఇప్పుడు.. రెండు దశాబ్దాల తర్వాత ప్రపంచం, సమాజం క్లిష్టమైన నెట్‌వర్కులుగా అవతరించాయి. ఆ సమయంలో కూడా దావోస్.. ఆ నాటి కాలం కన్నా ముందుంది. ఇప్పుడున్నట్లుగా ఉంది. ఈ సారి దావోస్ సదస్సు చర్చాంశం 'విభజిత ప్రపంచంలో ఉమ్మడి భవిష్యత్తును నిర్మించడం'.

ప్రస్తుతం ప్రపంచంలో వేగవంతమైన ఆర్థిక, రాజకీయ మార్పులు సంభవిస్తున్నాయి. శాంతి, సుస్థిరత, భద్రతాంశాల్లో సరికొత్త, తీవ్ర సవాళ్లు ఎదురవుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానపు చోదక శక్తితో నడుస్తున్న ప్రపంచం.. సమాజంలోని అన్ని అంశాలనూ ప్రభావితం చేసింది. ప్రపంచాన్ని కలపడానికీ, విడదీయడానికీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగిస్తున్నారన్నదానికి సామాజిక మాధ్యమం పెద్ద ఉదాహరణ. డేటాను నియంత్రించేవారే ప్రపంచాన్ని శాసిస్తారు. అందుకే డేటా వెంబడి ప్రపంచం పరుగులు పెడుతోంది. ఒక వైపు విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక పురోగతి మానవాళిని వృద్ధి వైపు నడిపించగలదు, మరోవైపు బాధాకరమైన గాయాలకు కారణం కాగలదు. చాలా మార్పులు శాంతి మార్గానికి అడ్డుగోడలను సృష్టిస్తున్నాయి. ఉజ్వల భవిష్యత్తు కోసం మనం అవరోధాలను అధిగమించాలి. దూరాన్ని తగ్గించుకోవాలి. భారత్‌లో మేము ఎప్పుడూ విశ్వసించేది ఒక్కటే. ప్రజలను ఏకం చేయడం.. అంతేకాని విభజించడం కాదు. మేమెప్పుడూ వసుధైక కుటుంబం అని చెబుతుంటాం. ప్రపంచమంతా ఒక్కటే అని భారతీయత తత్వవేత్తలు వేల సంవత్సరాలుగా చెబుతున్నారు. ఈ తత్వం.. ప్రస్తుత కాలంలోని విభజనలను, దూరాలను పరిష్కరించడానికి తగినది. కుటుంబాల్లోనూ విభేదాలుంటాయి. అయితే సవాళ్లు ఎదురయినపుడు వాటిని అందరం కలిసికట్టుగా ఎదుర్కోవాలి. నేను చెబుతున్న సవాళ్లు చాలా ఉన్నాయి. కానీ మనకు సమయం పరిమితంగా ఉన్నందున మూడు అతి పెద్ద సవాళ్లను ప్రస్తావిస్తున్నా.



కెనడా ప్రధాని జస్టిన్‌తో మోదీ

> **భారత అభివృద్ధి అజెండా ఐదు మూల స్తంభాలపై ఆధారపడి ఉంది. 1) సంస్కరణ, ఆచరణ, పరివర్తన మంత్రం. అన్ని రంగాల్లోనూ సంస్కరణలు తెచ్చాం. పెద్ద నోట్ల రద్దు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, పన్ను బేస్‌ను పెంచడం వంటివి ఉదాహరణలు. 2) పరిపాలనలో మార్పునకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం. 3) రహదారులు, రైల్వేలు వంటి భౌతిక మౌలికసదుపాయాల కల్పన. 4) అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆర్థిక కార్యకలాపాల నియమ నిబంధనలను మార్చడం. 5) సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి- సులభతర వాణిజ్య విధానాలను అవలంబించడానికి కారణం లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికే.**
>
> **కార్పొరేట్ సామాజిక బాధ్యత అనేది పాత పదం. దానికి కొత్త నిర్వచనం ఇవ్వడానికి ప్రయత్నించండి. కేవలం పోటీ తత్వంతో కూడిన కార్పొరేట్ల సృష్టికి మాత్రమే వాణిజ్యవ్యవస్థలుండరాదు. పౌరుల శ్రేయస్సుకు దోహదపడేలా ఇది ఉండాలి.**

మొదటిది వాతావరణ మార్పులు

హిమనీనదాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఆర్కిటిక్ మంచు కరిగిపోతోంది. ద్వీపాలు మునిగిపోతున్నాయి. వాతావరణ వైపరీత్యాల ప్రభావాలయిన విపరీతమైన ఎండలు-విపరీతమైన చలి, కుంభవృష్టి-కరవు అన్ని చోట్లా కనిపిస్తున్నాయి. ఇక్కడ-దావోస్‌లోనూ గడచిన 20 ఏళ్లలోనే అత్యధిక హిమపాతం నమోదయింది. వాతావరణ మార్పుల సవాల్‌ను ఎదుర్కోవడానికి మనం విభేదాలను పక్కనపెట్టి ఏకం కావాల్సింది. కానీ మనం ఆ పని చేశామా?

మహాత్మాగాంధీ ఎప్పుడూ అవసరానికి తగ్గ వినియోగమే ఉండాలనేవారు. దురాశను వ్యతిరేకించారు. కానీ ఆయన ఆలోచన నుంచి మనం చాలా దూరం జరిగాం. ప్రకృతిని దోచేశాం. ఇదంతా అభివృద్ధా లేదా పతనమా అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి.

రెండో ముఖ్య సవాల్ ఉగ్రవాదం

ఉగ్రవాదం ప్రభావం గురించి మీ అందరికీ తెలుసు. ఉగ్రవాదం ఎంత ప్రమాదకరమో మంచి ఉగ్రవాదులు, చెడ్డ ఉగ్రవాదులు అంటూ వేరు చేసి చూడడం అంతకన్నా ప్రమాదకరం. ఉన్నత కుటుంబాల నుంచి చదువుకున్న యువత ఉగ్రవాదంలో చేరడం మరో ప్రమాదకర అంశం.

ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న స్వార్థం

ప్రపంచవ్యాప్తంగా ప్రపంచీకరణ తగ్గుతోంది. ప్రపంచీకరణ బదులు ఆర్థిక ఆత్మరక్షణాత్మక విధానం పెరుగుతోంది. ప్రపంచమంతా అనుసంధానమవ్వాలని అందరూ మాట్లాడతారు. కానీ ప్రపంచీకరణ మెరుగు తగ్గిపోతోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటయిన ప్రపంచ సంస్థలు ఇప్పటి మానవాళి ఆకాంక్షలను, కలలను ప్రతిఫలిస్తున్నాయా? ఈ విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంబంధించి పెద్ద అంతరం ఉంది.

'నా ఇంటి గోడలు, కిటికీలు మూసివేయాలని కోరుకోవడం లేదు. అన్ని దేశాల సంస్కృతుల గాలులు నా ఇంట్లోకి రావాలని కోరుకుంటున్నా. కానీ ఆ గాలులు నా సొంత సంస్కృతిని పెకలించివేయడానికి అంగీకరించను.' అని గాంధీ అన్నారు. భారత్ ఈ తత్వాన్నే అనుసరిస్తుంది. భిన్నత్వపు విలువను భారతీయులుగా మేము అర్థం చేసుకుంటాం. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకుంటాం.

భారత్‌కు రండి

పురోగతికి మేము అనుసరించే మార్గం- సంస్కరణ, ఆచరణ, పరివర్తన. అందుకే భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, భారత్‌లో తయారీ, భారత్‌లో పర్యాటకం గతం కన్నా సులభతరమయ్యాయి. లైసెన్స్ రాజ్‌కు ముగింపు పలకాలని ప్రతినబూనాం. అలసత్వాన్ని తొలగించి ఎర్రతివాచీ పరుస్తున్నాం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కొత్త ద్వారాలు తెరుస్తున్నాం. పురోగతికి అడ్డంకిగా ఉన్న 1400 చట్టాలను రద్దు చేశాం. వస్తు, సేవల పన్నును అమలు చేశాం. పారదర్శకత పెంపునకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాం. ప్రజాస్వామ్యం, పని చేసే వయస్సున్న జనాభా ఎక్కువగా ఉండడం, క్రియాశీలత... మా గమ్యాన్ని తీర్చిదిద్దుతున్నాయి. 2025 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం రూ. 318. 9లక్షల కోట్లకు చేరుతుంది.

మాది స్థిరమైన భారత్

ప్రపంచ ఆర్థిక, భద్రతా సంస్థల్లో సంస్కరణలు అవసరం. ప్రపంచ ఆర్థిక పురోగతి వేగవంతం కావాలి. సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రపంచానికి భారత్ ఎప్పుడూ సహకరిస్తూనే ఉంది. ఐక్యరాజ్యసమితి శాంతిపరిరక్షక దళంలో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించే సైనికులు ఎక్కువగా ఉన్నారు. పొరుగు దేశాల్లో, మిత్ర దేశాల్లో సంక్షోభాలొస్తే తొలుత స్పందించేది భారత్. అనిశ్చిత ప్రపంచంలో స్థిరమైన, పారదర్శక, అంచనావేయదగ్గ, పురోగామి భారత్ అన్నది ఒక మంచి పరిణామం.

భారత్ ఎప్పుడూ ఏకతాటిపై నడిపించే శక్తి. సామరస్యాన్ని పాదుకొల్పే శక్తి. స్వేచ్ఛా స్వర్గం గురించి రబీంద్రనాథ్ ఠాగూర్ రాశారు. ఆయన స్వేచ్ఛా ప్రపంచంలో ప్రపంచాన్ని సంకుచిత గోడలు విభజించవు. మనం దాన్ని వాస్తవం చేద్దాం. సహకారమే కానీ విభజన, చీలికలు లేని స్వేచ్ఛాపూరిత స్వర్గాన్ని సృష్టిద్దాం.

మీ అందరినీ భారత్‌కు ఆహ్వానిస్తున్నా- సంపదతో కూడిన శ్రేయస్సు కావాలంటే భారత్‌కు రండి; ఆరోగ్యంతో కూడిన పూర్ణత్వం కావాలంటే భారత్‌కు రండి. సౌభాగ్యంతో కూడిన శాంతి కావాలంటే భారత్‌కు రండి. భారత్‌లో మీకు ఎప్పుడు స్వాగతం లభిస్తుంది.

స్వదేశానికి బయల్దేరిన మోదీ

దావోస్: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం రాత్రి దావోస్ నుంచి స్వదేశానికి బయల్దేరారు. మంచి భవిష్యత్తును సృష్టించుకోవాలనే ఇతివృత్తం ఆలోచింపజేసేదేననీ, రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును సృష్టించే మార్గాలను చర్చించడానికి ఇది దోహదపడుతుందనీ ఆయన ట్వీట్ చేశారు.

పెట్టుబడులపై పట్టుదల





దావోస్‌లో ఆరాంకో వైస్‌ప్రెసిడెంట్ సయ్యద్ ఎ అల్ హద్రామితో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు ● హిటాచీ సంస్థ అధ్యక్షుడు తొషైకీ హిగషిహర, ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీ, హిటాచీ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: పెట్రోలియం శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు తమ రాష్ట్రం ఎంతో అనుకూలమని, కృష్ణపట్నంలో చమురు శుద్ధి కేంద్రం (రిఫైనరీ) ఏర్పాటు చేయాలని సౌదీ అరామ్‌కో సంస్థకు ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఆయన దావోస్‌లో మంగళవారం రెండోరోజు పలు సంస్థల ప్రతినిధులతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. చమురు, సహజవాయు నిక్షేపాల అన్వేషణ, ఉత్పత్తిలో ప్రసిద్ధి గాంచిన సౌదీ అరామ్‌కో ఉపాధ్యక్షుడు (అంతర్జాతీయ వ్యవహారాలు) సయీద్ అల్ హద్రమీతో చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్రోలియం పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాల్ని, అనుకూలతల్ని ఆయన వివరించారు. 'ఆంధ్రప్రదేశ్‌లో 974 కి.మీ.ల సముద్ర తీరం ఉంది. కృష్ణా- గోదావరి బేసిన్‌లో అపార చమురు నిక్షేపాలున్నాయి. మా రాష్ట్రాన్ని తాకుతూ రెండు పారిశ్రామిక కారిడార్లున్నాయి. కృష్ణపట్నాన్ని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. అక్కడ రిఫైనరీ ఏర్పాటు వాణిజ్యపరంగా ఎంతో లాభదాయకం. హెచ్‌పీసీఎల్, గెయిల్ కార్యకలాపాలకు మా రాష్ట్రం ఇప్పటికే ఆయువుపట్టుగా ఉంది. రాష్ట్రంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థల్ని స్థాపిస్తున్నాం. నైపుణ్యంగల మానవ వనరులు లభిస్తాయి. సమీప భవిష్యత్తులో పెట్రోలియం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం నెలకొనేందుకు ఇది దోహదం చేస్తుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఫిబ్రవరిలో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని అల్ హద్రమీని ఆహ్వానించారు. దానికాయన స్పందిస్తూ... 'భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు మీరు చూపిస్తున్న వ్యక్తిగత శ్రద్ధను అభినందిస్తున్నా' అని పేర్కొన్నారు. సౌదీ అరామ్‌కో సంస్థ ప్రతినిధులతో గతంలోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. కృష్ణపట్నంలో రిఫైనరీ ఏర్పాటుకు ఆ సంస్థ ఆసక్తి కనబరిచింది. సంస్థ ప్రతినిధులు రెండు దఫాలు రాష్ట్రంలో పర్యటించారు. ఈ నెలాఖరులో ముంబయిలో సౌదీ ఆరామ్‌కో ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు మరోసారి సమావేశమవనున్నారు.

అమరావతిలో ఎస్‌బీఐ క్యాంపస్

ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీష్ కుమార్ దావోస్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో ప్రాంతీయ ప్రధాన కార్యాలయం ప్రారంభించాలని ఆయనకు చంద్రబాబు సూచించారు. దానికి అంగీకరించిన ఆయన, అమరావతిలో ఐకానిక్‌గా, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఉండే క్యాంపస్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌కు వస్తాం: ఎజిలిటీ లాజిస్టిక్స్

ఎజిలిటీ లాజిస్టిక్స్ సంస్థ సీఈవో తరెక్ సుల్తాన్ అల్ ఎస్సా, డైరెక్టర్ ఉగెన్‌మెన్‌తో చంద్రబాబు ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించామని, సాంకేతికంగా ముందున్న ఆంధ్రప్రదేశ్‌పై ఎక్కువ దృష్టి సారించామని తరెక్ తెలిపారు. 'మా చేత పెట్టుబడులు పెట్టించేందుకు మమ్మల్ని ఒప్పించాల్సిన అవసరం లేదు. మీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఇప్పటికే స్థిర నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపారు. విమానాశ్రయాల్లో గ్రౌండ్ ఆపరేషన్స్ నిర్వహణకు ఈ సంస్థ ఆసక్తి కనబరిచింది. ముంబయితోపాటు, ఆఫ్రికాలోని కొన్ని నగరాల్లోని విమానాశ్రయాల్లో ఆ సంస్థ గ్రౌండ్ ఆపరేషన్స్ నిర్వహిస్తోంది.

హిటాచీతో ఎంవోయూ

హిటాచీ సంస్థ అధ్యక్షుడు తొషైకీ హిగషిహర ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)లో తాజా పురోభివృద్ధి, పరిణామాలపై హిగషిహరతో ముఖ్యమంత్రి చర్చించారు. వీరిద్దరి సమక్షంలో 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్'లో పరస్పర సహకారానికి సంబంధించి హిటాచీ సంస్థతో ఈడీబీ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ తరపున ఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిశోర్ ఒప్పందంపై సంతకం చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా హిటాచి సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఎంజీఆర్ఎం సిటిజెన్ లైఫ్‌సైకిల్ ఇ-గవర్నెన్స్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తుంది. సామాజిక సమస్యలకు వినూత్న పరిష్కారాల్ని సూచించడంలో తమకున్న అనుభవం, నైపుణ్యాన్ని అంధ్రప్రదేశ్‌కు అందజేసేందుకు హిటాచీ ముందుకొచ్చింది.

సుజ్లాన్ గ్రూప్ సీఎండీ తులసి తంతి చంద్రబాబుతో సమావేశమయ్యారు. పవన, సౌర, గ్యాస్ ఆధారిత విద్యుత్ రంగాల్లో భవిష్యత్ విస్తరణ ప్రణాళికల గురించి ఆయన వివరించారు. పునరుత్పాదక విద్యుత్ నిల్వ అంశంలో భారీ పరిశోధనలు చేస్తున్నామని, ఆంధ్రప్రదేశ్‌లో పైలట్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్నామని తులసి తంతి తెలిపారు.

ఏపీలో డేటా సెంటర్

మంత్ర డేటా సెంటర్స్ బోర్డు సభ్యుడు మోహన్ చైనాని ముఖ్యమంత్రిని కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో డేటా సెంటర్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని, అవసరమైన భూమి, విద్యుత్, ఫైబర్ వసతులు కల్పించాలని కోరారు. గూగుల్, యాక్సెంచర్ డేటా సెంటర్లను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

రోషేకి ఆహ్వానం..

గ్లోబల్ ఫార్మా కంపెనీ రోషే ప్రతినిధి క్రిస్టాఫే ఫ్రాంజ్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. భారత్‌లో దీర్ఘకాలంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం అత్యున్నత ఎలక్ట్రానిక్ మెడికల్ హెల్త్ రికార్డుల తయారీపై అధ్యయనం చేస్తున్నామని ఫ్రాంజ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నాలుగు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి ఉత్తమ ప్రయత్నం మొదలు పెట్టామని, రోషే సంస్థ కూడా కలిస్తే సంయుక్తంగా చేపడదామని సీఎం ఆహ్వానించారు. రోషే సంస్థ తమ వైద్య పరికరాల తయారీ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంటే బాగుంటుందని సూచించారు.

ఏపీలో తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి

జ్యూరిక్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థ ఏబీబీ ప్రాంతీయ అధ్యక్షుడు, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు చున్‌యువాన్ గుతో చంద్రబాబు సమావేశమయ్యారు. సౌర, పవన, హైబ్రిడ్ విద్యుత్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న నూతన విధానాలను, అమరావతిలో కాలుష్య రహిత విద్యుత్ వాహనాలకు ఇస్తున్న ప్రాధాన్యతను చంద్రబాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఏబీబీని ఆహ్వానించారు. ఏపీ విధానాలను అధ్యయనం చేసి, తయారీ కేంద్రం ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని చున్‌యువాన్ తెలిపారు.

● హెచ్‌పీ 3డీ ప్రింటింగ్ హెడ్ స్టీఫెన్ నీగ్రోతో కూడా ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.

రాష్ట్రానికి 150 సంస్థలు..!

స్విట్జర్లాండ్‌కు చెందిన వెంచర్ ఇన్వెస్టర్ సంస్థ మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. మెడ్‌టెక్ ఛైర్మన్ ఫెలిక్స్ గ్రెసార్డ్, బోర్డు డైరెక్టర్ హన్స్ ఫ్లోరియన్, సీఈవో క్రిస్టాఫ్ కొష్ సీఎంను కలిసినవారిలో ఉన్నారు. వైద్య, ఆరోగ్య రంగంలో 150 కంపెనీలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడానికి మెడ్‌టెక్ సంస్థ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే 60 సంస్థలతో సంప్రదింపుల ప్రక్రియ పూర్తి చేసింది. మెడ్‌టెక్‌తో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి సంస్థ (ఈడీబీ) గత సంవత్సరం ఒప్పందం చేసుకుంది. మెడ్‌టెక్ ఇప్పటివరకూ 50 సంస్థలతో లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ) చేసుకుంది. కేవలం పెట్టుబడులు తీసుకురావడమే కాకుండా, ఆ సంస్థలకు అనువైన వాతావరణాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కల్పించేందుకు మెడ్‌టెక్ ఇన్నోవేషన్ కృషి చేస్తోంది. సాంకేతిక నైపుణ్యం, శాస్త్ర నిపుణులతో 50 వేలకుపైగా ఉద్యోగాల కల్పన లక్ష్యంగా, దీనికి రెట్టింపు సంఖ్యలో పరోక్ష ఉద్యోగాలు కల్పించడం కోసం కృషి చేస్తోంది. విశాఖ పార్కులో భాగస్వామ్యం తీసుకుని క్రమంగా విస్తరించేందుకు మెడ్‌టెక్ ప్రణాళికలు రూపొందిస్తోంది. మెడ్‌టెక్ పార్కులో ఐరోపా సెగ్మెంట్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

చంద్రబాబుకి బ్లూమ్‌బెర్గ్ సీఈఓ ఆహ్వానం

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుని దావోస్‌లో మంగళవారం బ్లూమ్‌బెర్గ్ మీడియా గ్రూప్ సీఈఓ జస్టిన్ బి.స్మిత్ మర్యాదపూర్వకంగా కలిశారు. న్యూయార్క్ రావాలని ఆహ్వానించారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో బ్లూమ్‌బెర్గ్ నిర్వహించే వరల్డ్ లీడర్స్ ప్యానెల్స్‌లో పాల్గొనాలని కోరారు. జుబిలెంట్ భార్తియా గ్రూప్ వ్యవస్థాపకుడు, కోఛైర్మన్ హరి భార్తియా చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుపై ఇద్దరూ చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా 36 వేల మంది ఉద్యోగులు ఉన్న జుబిలెంట్ గ్రూప్ ఫార్మా, లైఫ్‌సైన్సెస్, డ్రగ్ డిస్కవరీ సర్వీసెస్, ఆహారం, వాహన, ఏరోస్పేస్ వంటి పలు రంగాల్లో విస్తరించింది.

విధుల నుంచి రోబో తొలగింపు!

లండన్: ఎడిన్‌బరోలోని అత్యాధునిక 'మార్గియోటా' స్టోర్‌లో పనిచేసే ఫ్యాబియో అనే రోబోను విధినిర్వహణలో అంత చురుగ్గా లేదన్న కారణంతో ఉద్యోగంలో నుంచి తీసేశారు. స్టోర్ యజమాని ఆదేశాల మేరకు వచ్చిన రోబో రూపకర్తలు దానిని చక్కగా ప్యాక్ చేసి తీసుకెళుతున్నప్పుడు ఫ్యాబియో సహోద్యోగి(రోబోలు కాదు) ఒకరు కంటనీరు పెట్టుకున్నారట. 'మార్గియోటా'లో చేరిన కొత్తలో 'ఫ్యాబియో' వినియోగదారులను చక్కగా పలకరించేది. తినుబండారాలనూ అందించేది. అయితే, అక్కడున్న అన్నిరకాల వస్తువుల గురించి కొనుగోలు దారులకు తెలియచేసి...అవి ఉన్న వైపుగా పంపే విషయంలో మాత్రం కొన్ని సందర్భాల్లో తెల్లమొగం వేసింది. దాంతో, స్టోర్ యజమానులు 'ఫ్యాబియో' తమకు వద్దన్నారు. తయారీదారులు వచ్చి ఫ్యాబియోను విడివిడి భాగాలుగా విడదీసి పట్టుకుని వెళ్లిపోయారు. తాము అనుకున్నట్లుగా పనిచేయలేదనీ...అందుకే, కొనుగోలుదారులు ఫ్యాబియోను విస్మరించారనీ స్టోర్ యజమాని చెప్పారు. నిజంగానే కదలికలకు సంబంధించి ఫ్యాబియోకు కొన్ని పరిమితులున్నట్లు తయారీదారులు అంగీకరించారు. త్వరలోనే మరింత సమర్థంగా పనిచేసే రోబోను అందుబాటులోకి తెస్తామన్నారు.

గ్రహం అనుగ్రహం

24-1-2018 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
సప్తమి: ఉ. 11-52 తదుపరి అష్టమి
అశ్విని నక్షత్రం: తె. 4-25 తదుపరి భరణి
అమృత ఘడియలు: రా. 9-20 నుంచి 10-55 వరకు
వర్జ్యం: రా. 12-29 నుంచి 2-03 వరకు
దుర్ముహూర్తం: మ. 11-49 నుంచి 12-33 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-46
రథసప్తమి, భీష్మాష్టమి

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
శ్రీకాకుళం	13.5	32.0
విశాఖపట్నం	14.8	28.8
తిరుపతి	16.0	30.5
గుంటూరు	16.0	31.0
హైదరాబాద్	16.1	31.4
రాజమహేంద్రవరం	17.0	31.0
విజయవాడ	18.0	29.8
కడప	18.0	33.0
అనంతపురం	18.4	31.3
కర్నూలు	18.4	32.5
నెల్లూరు	19.0	30.0
తాడేపల్లిగూడెం	19.0	31.0
నరసాపురం	19.2	30.1
ఒంగోలు	20.2	30.2

మహానగరం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

మార్చాలంటే రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రహదారి, రైలు అనుసంధానం చేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో విజయవాడ, విశాఖపట్నం, అమరావతి నగరాల్లో మెట్రో రైలు మార్గాలు నిర్మించడంతోపాటు, విశాఖపట్నం-చెన్నై నగరాలను హైస్పీడ్ రైలుతో అనుసంధానిస్తామని చెప్పినట్లు గుర్తు చేసింది. ఈ ప్రాజెక్టులు మొదలుకావడానికి 2018-19 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం చేయాలని కోరింది. విభజన చట్టంలోని సెక్షన్ 94(3) ప్రకారం కేంద్ర ప్రభుత్వం కొత్త రాజధానిలో రాజ్ భవన్, హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ, శాసన మండలి నిర్మాణంతోపాటు ఇతర అత్యవసర మౌలిక వసతులకు కేంద్రమే సాయం చేస్తుందని చెప్పినందున ఇతోధిక సాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. మౌలిక వసతుల నిర్మాణానికి రూ. 43వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని, కానీ కేంద్రం రూ. 3,500 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతం ఇచ్చిందని పేర్కొంది. ఇప్పటివరకూ మూడేళ్లలో ఏటా సగటున రూ. 500 కోట్ల చొప్పున రూ. 1500 కోట్లతోపాటు, కేంద్ర ఆర్థికశాఖ అదనంగా రాజధాని నిర్మాణం కోసం రూ. 1,050 కోట్లు విడుదల చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రధానికి ఇవ్వనున్న నివేదికలో పేర్కొంది. కానీ నూతన రాజధాని నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం కనీసం రూ. 10వేల కోట్లయినా ఇవ్వాలని 2015 జనవరి 6నే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరినట్లు గుర్తు చేసింది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ 2015 మార్చి 31న ప్రత్యేక సాయం కింద విజయవాడ, గుంటూరు మున్సిపాలిటీల్లోని మౌలిక వసతుల కోసం రూ. వెయ్యి కోట్లు ఇచ్చిందని, ఆ మొత్తాన్ని అమరావతి అభివృద్ధి కోసం ఉపయోగించే పరిస్థితి లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో రాజధాని నిర్మాణం పూర్తి చేయడానికి కేంద్రం తగిన సాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది.

ఇలాగైతే భూసేకరణ ప్రక్రియనే నిలిపేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించింది. మరోవైపు నివేదిక సమర్పణకు గడువు కావాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థించారు. దీనిపై స్పందిస్తూ..కనీసం తెలంగాణ మొక్కుబడి నివేదికనైనా సమర్పించిందంటూ, ఏపీ గడువు కోరడంపై అసహనం వ్యక్తంచేసింది. కోర్టు ఉత్తర్వుల అమల్లో ఉదాసీనత తగదని పేర్కొంది. వచ్చే విచారణనాటికి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ విచారణను మూడువారాలకు వాయిదావేసింది. లేని పక్షంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టంచేసింది.



మంగళవారం సచివాలయంలో 'నవ్యాంధ్రకు వందనం' గీతాన్ని విడుదలచేస్తున్న హోం శాఖ ప్రధాన కార్యదర్శి ఏఆర్ అనూరాధ. చిత్రంలో సైనిక సంక్షేమశాఖ సంచాలకుడు, విశ్రాంత కమాండర్ ఎంవీఎస్ కుమార్ తదితరులు

'నవ్యాంధ్రకు వందనం' గీతం విడుదల

ఈనాడు డిజిటల్, అమరావతి: దేశ రక్షణ కోసం పాటుపడుతున్న రాష్ట్రానికి చెందిన సైనికులకు అంకితమిస్తూ రూపొందించిన 'నవ్యాంధ్రకు వందనం' గీతాన్ని మంగళవారం సచివాలయంలో హోం శాఖ ప్రధాన కార్యదర్శి ఏఆర్ అనూరాధ విడుదల చేశారు. సైనిక సంక్షేమశాఖ సంచాలకుడు, విశ్రాంత కమాండర్ ఎంవీఎస్ కుమార్ ప్రముఖ సినీ గీత రచయిత భువనచంద్రతో సైనికుల గౌరవార్థం ఈ పాటను రాయించారు.

2019 జనవరికి ఉద్యోగుల నివాస సముదాయాలు పూర్తి

- పురపాలకశాఖ మంత్రి నారాయణ

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎమ్మెల్యే, అఖిల భారత సర్వీసు, ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాల నిర్మాణాన్ని 2019 జనవరి నాటికి పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. మంగళవారం సీఆర్‌డీఏ పరిధిలోని రాయపూడి, అనంతవరం గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న ఉద్యోగ నివాస సముదాయాలను మంత్రి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అధునాతన షీర్ వాల్ టెక్నాలజీతో భూకంపం వచ్చినా తట్టుకునేలా భవనాలను నిర్మిస్తున్నామన్నారు. అమరావతిలో నిరుపేదలకు గృహాలు నిర్మిస్తామన్న సీఎం హామీ మేరకు 7,500 ఇళ్లు మంజూరు చేశామన్నారు. సీఆర్‌డీఏ పరిధిలో ఏడాది లోపు రోడ్ల నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. గ్రావెల్ సమస్య ఉన్నమాట వాస్తమేనన్నారు.

కేసుల నుంచి తప్పించుకునేందుకే..

కేసుల నుంచి బయటపడేందుకే భాజపాతో పొత్తు అంటూ వైకాపా అధినేత జగన్ మాట్లాడుతున్నారని మంత్రి విమర్శించారు. పాదయాత్ర కూడా ఇందులో భాగమేనని ఎద్దేవా చేశారు. రాజధానిలో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా చూసి ప్రతిపక్షాలు మాట్లాడాలన్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షల కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు: మంత్రి గంటా

ఈనాడు, అమరావతి: ఇంటర్ ప్రయోగ పరీక్షల కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ప్రయోగ పరీక్షలు, పర్యావరణ విద్య, నైతికత-మానవీయ విలువల పరీక్షలపై కళాశాలల ప్రిన్సిపాళ్లతో కాకినాడ జేఎన్‌టీయూ సమావేశ మందిరం నుంచి మంత్రి గంటా శ్రీనివాసరావు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 928 కేంద్రాల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తుండగా.. వీటిలోని 393 ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయని, అక్కడ అయా యాజమాన్యాలే సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రయోగ పరీక్షలకు మొత్తం 3,35,998 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఈసారి ప్రయోగ పరీక్షల పర్యవేక్షకులకు (ఎగ్జామినర్లకు) జంబ్లింగ్ నిర్వహిస్తున్నామని మంత్రి చెప్పారు. పరీక్షకు గంట ముందు మాత్రమే పర్యవేక్షకులకు ఏ కేంద్రానికి వెళ్లాలో సమాచారం అందుతుందన్నారు.

రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నీరబ్

- దుర్గ గుడి ఈవోగా పద్మ

ఈనాడు అమరావతి: నలుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను రవాణా, రోడ్లు భవనాల శాఖకు బదిలీ చేసింది. ఆయన కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతనూ నిర్వహిస్తారు. సాధారణ పరిపాలన విభాగం(సేవలు-హెచ్‌ఆర్‌ఎం) ముఖ్య కార్యదర్శి గోపాల్‌కృష్ణ ద్వివేదీని పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. సాధారణ పరిపాలన విభాగం ముఖ్య కార్యదర్శిగాను ఆయన పూర్తి అదనపు బాధ్యతలో కొనసాగుతారు. పశుసంవర్ధక శాఖ బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రస్తుతం సెలవులో ఉన్న ఐఏఎస్ అధికారి జేఎస్‌వీ ప్రసాద్‌ని బదిలీ చేస్తూ, ఆయన సెలవు కాలం ముగిశాక తదుపరి పోస్టింగ్ కోసం నివేదించాల్సిందిగా సూచించింది. విజయవాడలోని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం(దుర్గ గుడి) కార్యనిర్వహణాధికారిగా 2004 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారిణి ఎం.పద్మను నియమించింది. ప్రస్తుతం బ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఎండీగా ఉన్న ఆమెను దుర్గ గుడి ఈవోగా బదిలీ చేస్తూ, బ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతనూ అప్పగించింది.

ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- అఖిల భారత సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ డిమాండు

ఈనాడు, దిల్లీ: పారిశుద్ధ్య కార్మికుల నియామకాల్లో ఒప్పంద ఉద్యోగ విధానం రద్దుచేసి ప్రస్తుతం ఉన్న ఒప్పంద ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని అఖిల భారత సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ డిమాండు చేసింది. ఇటీవల హరిద్వార్‌లో నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న జాతీయ కార్యదర్శి భూపతి అప్పారావు (కొత్తగూడెం) మంగళవారమిక్కడ మీడియాతో మాట్లాడారు. మెహతర్, బాల్మీకి, రెల్లి, సుదర్శన్, మాతంగి, బంగి, తోటి తదితర ఎస్సీ కులాలకు ఆయా రాష్ట్రాల్లోని ఎస్సీకోటాలో 2 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండు చేస్తున్నామన్నారు. సఫాయి కర్మచారి పిల్లలకు ఉన్నత విద్య వరకు అయ్యే ఖర్చును ప్రభుత్వాలే భరించాలన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన గండేటి శ్రీనివాసరావు, భూపతి లీలా ప్రసాద్, దళాయి మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసంకల్ప యాత్రలో జగన్మోహన్‌రెడ్డి తదితరులు

నవరత్నాలు అమలు చేస్తాం: జగన్

పెళ్ళకూరు, న్యూస్‌టుడే: ఎన్నికష్టాలు వచ్చినా అధికారంలోకి వచ్చిన తర్వాత నవరత్నాలను అమలు చేస్తామని ప్రతిపక్ష నేత, వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర మంగళవారం నెల్లూరు జిల్లా పెళ్లకూరు మండలం పునబాకలోకి ప్రవేశించింది. చిత్తూరు జిల్లా రెడ్డిగుంట నుంచి జిల్లాలోకి ప్రవేశించిన ఆయనకు జిల్లా నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జగన్ మాట్లాడుతూ.. నవరత్నాల అమలు కోసం ఎన్ని కష్టాలైనా పడతామన్నారు. పేదలందరికీ రూ.2 వేల పింఛన్లు పంపిణీ చేస్తామని, మహిళలకు రుణమాఫీని నాలుగు విడతల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పునబాక చెరువుతట్టు కండ్రిగ నుంచి ప్రారంభమైన ప్రజాసంకల్ప యాత్ర చెంబేడు, సీఎన్ పేట వరకు సాగింది.

వరికి తెలంగాణలో నీరెక్కువ కావాలి

- ఒక టీఎంసీ నీటితో ఏపీలో 7,882 టన్నుల ధాన్యం దిగుబడి
- తెలంగాణలో 4,947 టన్నులే
- అక్కడి నేలలు ఆరుతడి పంటలకు అనువైనవి
- అదనపు ప్రమాణపత్రం దాఖలు చేసిన ఆంధ్రప్రదేశ్

ఈనాడు - హైదరాబాద్

ఒక టీఎంసీ నీటితో ఆంధ్రప్రదేశ్‌లో 7,882 టన్నుల ధాన్యం దిగుబడి వస్తే తెలంగాణలో 4,947 టన్నులు మాత్రమే వస్తుందని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. వరి సాగుకు తెలంగాణలో ఎక్కువ నీరు అవసరమవుతుందని నివేదించింది. ఒక కేజీ బియ్యం ఉత్పత్తికి ఆంధ్రప్రదేశ్‌లో 3,593 లీటర్ల నీరు అవసరమైతే తెలంగాణలో 5,742 లీటర్లు కావాలని పేర్కొంటూ పదేళ్ల సాగు వివరాలతో అదనపు పత్రాన్ని సోమవారం బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌కు అందచేసింది. కృష్ణా జలాలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య విచారణ జరుపుతున్న బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట వ్యవసాయ పరిస్థితులపై గత ఏడాది సెప్టెంబరు ఐదున ప్రమాణపత్రం(అఫిడవిట్) దాఖలు చేసిన ఆంధ్రప్రదేశ్, ఇప్పుడు అనుబంధ ప్రమాణపత్రాన్ని దాఖలు చేసింది. మొదట ప్రమాణపత్రంలో కొన్ని పొరపాట్లున్నాయని, వాటిని సవరించడంతో పాటు తన పరిశోధనలో తేలిన అంశాలతో అదనపు ప్రమాణపత్రాన్ని దాఖలు చేస్తున్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్త పి.వి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోని సాగు విధానాలను అధ్యయనం చేశానన్నారు. నాగార్జున సాగర్ ఆధునికీకరణ నివేదికలో వరి సాగు గడువు 122 రోజులుగా పేర్కొన్నారని, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 150 రోజులు పడుతుందన్నారు. వ్యవసాయ వాతావరణ పరిస్థితులు ఇంచుమించు ఒకే రకంగా ఉన్నా, వరి ఉత్పత్తికి ఆంధ్ర కంటే తెలంగాణలో ఎక్కువ నీరు అవసరమని, కృష్ణాబేసిన్ పరిధిలోని జిల్లాలను చూస్తే తెలంగాణలో హెక్టారుకు 3.3 మిలియన్ లీటర్ల నీరు ఎక్కువ కావాలని, ఆంధ్రప్రదేశ్‌లో ఒక టీఎంసీ నీటితో తెలంగాణ కంటే 2,935 టన్నుల దిగుబడి అదనంగా వస్తుందని తాజా ప్రమాణపత్రంలో పేర్కొన్నారు. 2006-07 నుంచి 2016-17 వరకు ధాన్యం ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ధారణకు వచ్చినట్లు నివేదించారు. కృష్ణాబేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల కింద పంటల సాగును, పంటలకు అవసరమైన నీటిని, రైతులు వాస్తవంగా సాగు చేసే పద్ధతులను పరిగణనలోకి తీసుకొని ఈ అధ్యయనం చేసినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో సాగు సమయం 140 రోజులని, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల కింద కూడా 140 రోజులని.. ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో అక్కడి వాతావరణ పరిస్థితులను బట్టి 122 రోజులు కాకుండా 140 రోజుల్లో వచ్చే రకంవైపు రైతులు మొగ్గు చూపుతారని విశ్లేషించారు. గత ఏడాది దాఖలు చేసిన ప్రధాన ప్రమాణపత్రంలో రెండు రాష్ట్రాల్లోని నేల స్వభావం, వాతావరణం గురించి ఎక్కువగా పేర్కొన్నారు. తెలంగాణ, రాయలసీమ జిల్లాల్లోనూ, డెల్టా అప్‌లాండ్ ఏరియా నేలల స్వభావానికి, డెల్టా ప్రాంతంలోని నేలల స్వభావానికి ఉన్న తేడాను వివరిస్తూ, డెల్టా ప్రాంతంలో కొన్ని సందర్భాల్లో 14 రోజులపాటు నీరు నిలిచిపోతుందని, ఈ నేలలు వరి పండించడానికి మాత్రమే అనుకూలమన్నారు. ఎర్రనేలలున్న ప్రాంతంలో ఆరుతడి పంటలు సాగు చేయడానికి అవకాశం ఉందని, తెలంగాణలో కూడా ఆరుతడి పంటలకు నేల అనువైందన్నారు. రెండు రాష్ట్రాల్లోనూ జిల్లాల వారీగా వరికి అనుకూలమైన ప్రాంతం ఎంత అనే వివరాలూ ఇచ్చారు.

కృష్ణాజలాలపై మళ్లీ సుప్రీంకు..

కృష్ణాజలాలపై తెలంగాణ మరోసారి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కృష్ణా నీటి కేటాయింపులో తెలంగాణకు జరిగిన అన్యాయంపై గతంలో కేంద్ర ప్రభుత్వానికి చేసిన ఫిర్యాదుపై ప్రస్తుతం విచారణ జరుపుతున్న బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌కు పంపేలా ఆదేశాలు జారీ చేయాలని కోరింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో దరఖాస్తును దాఖలు చేసింది. 2015లో సుప్రీం కోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు అనుబంధంగా ఈ దరఖాస్తు చేసిన తెలంగాణ, దీనిపై వెంటనే విచారణ చేపట్టి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరింది. ఈ మేరకు రెండురోజుల క్రితం కోర్టులో దరఖాస్తు దాఖలు చేసింది. బచావత్, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునళ్ల ఎదుట తన వాదనను వినిపించుకునే అవకాశం తెలంగాణకు లేకుండా పోయిందని, తెలంగాణ ప్రయోజనాలకు తగ్గట్లుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాదనలు వినిపించలేదని పేర్కొంటూ 2014 జులై 14న కేంద్రజలవనరుల మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేసింది. నీటి కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి వీలుగా మొత్తం నీటిపై కొత్త ట్రైబ్యునల్ ఏర్పాటు చేయడం లేదా ఉన్న బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌కే ఫిర్యాదును పంపాలని కోరింది. దీనిపై కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో 2015 ఆగస్టు పదిన సుప్రీంకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేసి తమ ఫిర్యాదును ట్రైబ్యునల్‌కు పంపేలా ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ కోరింది.

బ్లాక్‌చైన్ వేదికపైకి ప్రభుత్వ సమాచారం

- దావోస్‌లో మంత్రి నారా లోకేష్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సాంకేతికతో అనుసంధానిస్తున్నామని... సైబర్ దాడులకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వ సమాచారాన్ని బ్లాక్‌చైన్ వేదికపైకి తీసుకొస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. అమరావతి పరిధిలోని భూ దస్త్రాలన్నింటినీ ఈ సాంకేతికత పరిధిలోకి తీసుకొస్తున్నామన్నారు. తద్వారా దస్త్రాల దిద్దివేతకు అవకాశం ఉండదన్నారు. దావోస్‌లో మంగళవారం బ్లాక్‌చైన్ కంపెనీల సీఈవోలతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నారా బ్రాహ్మణి కూడా పాల్గొన్నారు.



పే పాల్ అధ్యక్షుడు రిచర్డ్ నాష్‌తో మంత్రి లోకేశ్

ఫైబర్‌గ్రిడ్ ఏర్పాటుతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి!: ఆంధ్రప్రదేశ్‌లో ఫైబర్ గ్రిడ్ ఏర్పాటుతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందనుందని.. ఈ అవకాశాన్ని పేపాల్ సంస్థ వినియోగించుకోవాలని లోకేష్ పిలుపునిచ్చారు. ఆ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ రిచర్డ్ నాష్‌తో భేటీ అయ్యారు. "స్టార్టప్ రాష్ట్రంగా అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తూ కేవలం మూడున్నరేళ్లలో అభివృద్ధి సాధించాం. ఐటీ, ఫిన్‌టెక్ అభివృద్ధికి అనేక చర్యలు చేపడుతున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధానాలు తీసుకొచ్చాం. రాయితీలు కల్పిస్తున్నాం. విశాఖపట్నాన్ని నగదు రహిత లావాదేవీల నగరంగా మార్చేందుకు వీసాతో కలిసి పనిచేస్తున్నాం" అన్నారు. జూబ్లియంట్ గ్రూపు కంపెనీ సీఈవో హరిబార్తియాకు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న రియల్‌టైమ్ గవర్నెన్స్ గురించి లోకేష్ వివరించారు.

ఆ నడవాలను పారిశ్రామికాభివృద్ధికి వినియోగించుకుంటాం: విశాఖపట్నం-చెన్నై, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక నడవాలను రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కోసం వ్యూహాత్మకంగా వినియోగించుకుంటామని లోకేష్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి అనువుగా ఉత్పాదక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దావోస్‌లో సీఐఐ-పీడబ్ల్యూసీ సంస్థలు నిర్వహించిన "భారతదేశంలో పారిశ్రామిక నడవాలు" సదస్సులో ఆయన పాల్గొన్నారు.

జీవిత ఖైదీల విడుదలకు మార్గదర్శకాలపై కమిటీ

ఈనాడు, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా అర్హులైన జీవిత ఖైదీలను విడుదల చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ఖైదీల కుటుంబ సభ్యుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. వీటి ప్రకారం... ఏడేళ్ల శిక్ష పడిన వారిలో రిమాండుతో కలిపి ఐదేళ్ల శిక్షాకాలం పూర్తి చేసుకున్న మహిళా ఖైదీలను విడుదల చేస్తారు. పదేళ్ల శిక్ష పడిన వారిలో రిమాండుతో కలిపి ఏడేళ్లు పూర్తి చేసుకున్న పురుష ఖైదీలను విడుదల చేస్తారు. 65ఏళ్లు దాటి. . తీవ్రమైన వ్యాధులతో బాధపడే వారికీ అర్హతలను నిర్దేశించారు. వీరు ఏడేళ్ల శిక్షాకాలంలో రిమాండుతో కలిపి ఐదేళ్లు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి హోంశాఖ ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీలో న్యాయశాఖ కార్యదర్శి, డీజీపీ, సీఐడీ న్యాయ సలహాదారు, నిఘా విభాగం ఏడీజీపీ సభ్యులుగా ఉంటారు.

గన్నవరం విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టు

ఈనాడు, అమరావతి: గన్నవరం విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టు ఏర్పాటును ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏ.ఆర్.అనురాధ ఈ ఉత్తర్వులు విడుదల చేశారు.



హంపీలో ఓ పర్యాటకుడి వాహనంలో కనిపించిన అరుదైన సర్పం

హంపీలో అరుదైన పాము పట్టివేత

హొసపేటె, న్యూస్‌టుడే: కర్ణాటకలోని పర్యాటక ప్రాంతమైన హంపీలో మంగళవారం అరుదైన జాతికి చెందిన పాము దర్శనమిచ్చింది. విజయపురకు చెందిన కొందరు పర్యాటకులు ఓ వాహనంలో హంపీ సందర్శనకు వచ్చారు. ఉగ్రనరసింహ స్మారకం వద్ద బస్సును ఆపి స్మారకాన్ని తిలకించారు. అనంతరం బస్సు ఎక్కుతుండగా ఓ సీటులో పాము కనిపించింది. విషయం తెలుసుకున్న స్థానికులు పాముల సంరక్షకుడు, కమలాపురకు చెందిన పంపయ్యస్వామి మళెమఠకు సమాచారం అందించారు. ఆయన అక్కడికి వచ్చి ఆ పామును పట్టుకుని హంపీ అటవీ ప్రాంతంలో వదిలేశారు. కోలుబార్ బోలనతి రేజ అని పిలిచే ఈ పాము చాలా అరుదైనదని.. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కనిపిస్తుందని పంపయ్యస్వామి చెప్పారు. ఇది కాటేసినా ప్రాణాంతకం కాదని, విష ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని వివరించారు.

ప్రజాధనం పరిరక్షణకు సామాజిక తనిఖీలు

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉపాధి పనులు నిబంధనల ప్రకారం చేశారా? లేదా? అనే వివరాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజావేదికల ద్వారా గుర్తించాలని రాష్ట్ర సామాజిక తనిఖీ విభాగం సంచాలకులు శ్రీకాంత్ సూచించారు. గుంటూరు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్రంలోని ఉపాధి పథకం విజిలెన్స్ అధికారులతో మంగళవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఇప్పటికి 660కిగాను 503 మండలాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారని, మిగిలిన మండలాల్లోనూ నిర్ణీత గడువులోపు నిర్వహించాలని పేర్కొన్నారు. ఇకపై ఆయా నెలల్లో నిర్వహించిన సామాజిక తనిఖీల నివేదికలను జిల్లా స్థాయిలో కలెక్టరు, రాష్ట్ర స్థాయిలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి సమర్పించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సామాజిక తనిఖీ విభాగం ముఖ్య నిఘా అధికారి శివశంకర్‌ప్రసాద్, గుంటూరు జిల్లా విజిలెన్స్ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలతో మున్ముందు ఫలితాలు

- పన్నులు చెల్లించకపోవడం నేరమే
- ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

హైదరాబాద్, న్యూస్‌టుడే: కొత్తగా సంస్కరణలు అమలులోకి వచ్చినప్పుడు ప్రాథమిక దశలో కొన్ని ఇబ్బందులున్నప్పటికీ మున్ముందు మంచి ఫలితాలుంటాయని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. హైదరాబాద్ నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ సైన్సెస్ (కేఎంఐసీఎస్) ఆధ్వర్యంలో 'ఆర్థిక విపణి, పన్నుల విధానంలో సమకాలిన సమస్యలు, సవాళ్లు' ('కాంటెంపరరీ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ ఇన్ ఫైనాన్స్ మార్కెటింగ్ అండ్ టాక్సేషన్') అనే అంశంపై రెండు రోజుల సదస్సును వెంకయ్యనాయుడు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక సంచికను ఆవిష్కరించి ఉపన్యసించారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ), పెద్ద నోట్ల రద్దు నిర్ణయాల వల్ల దేశానికి బహుళ ప్రయోజనాలు కలగనున్నాయన్నారు. ప్రజలపై పన్నుల భారం తగ్గుతుందన్నారు. జీఎస్టీ విధానంతో పన్నుల రాబడి పెరిగిందన్నారు. 2017లోనే జీఎస్టీ కింద 5.1 మిలియన్ల మంది నమోదైతే ఆదాయపన్ను చెల్లించేవారు 2.2 మిలియన్లుగా ఉన్నట్లు వివరించారు. జీఎస్టీ కౌన్సిల్ ప్రతి రెండు నెలలకోసారి పన్నుల విషయంలో సమావేశమై చర్చిస్తోందని నిపుణులు సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించడానికి సిద్ధంగా ఉందన్నారు. అవినీతి, నల్లధనమే మన శత్రువులన్నారు. ప్రభుత్వాలు అందరికీ ఉద్యోగాలివ్వలేవని, ప్రైవేటు రంగంలో లేదా స్వయంశక్తితో అవకాశాలు పొందాల్సి ఉందన్నారు. స్వాతంత్ర్యం తరువాత భారతదేశంలో ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చిన తెలుగు వ్యక్తి పి.వి.నరసింహారావు అని, ఆ తర్వాత వాజ్‌పేయీ అయితే.. మూడో వ్యక్తి నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ కళాశాలలో నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అంతరాలపై ప్రభుత్వం జాగ్రత్తపడాలి: ఆర్థిక అసమానతలు పెరిగిపోవడంతో లక్షాధికారులు కోటీశ్వరులవుతుంటే.. పేదల జీవితాలు మరింత దిగజారుతున్నాయని వెంకయ్యనాయుడు అన్నారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలన్నా.. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలు చేయాలన్నా.. తగినంత రాబడి ఉండాలన్నారు. ప్రజలు కూడా విధిగా సకాలంలో పన్నులు చెల్లిస్తే బాగుంటుందని, చెల్లించకుండా తప్పించుకోవడం కూడా నేరమే అవుతుందని అభిప్రాయపడ్డారు. ఎన్నో దేశాల చరిత్ర కాలగర్భంలో కలిసిపోయినా భారతదేశం గర్వంగా తలెత్తుకుందంటే 'సర్వేజనా సుఖీనోభవంతు' అనే సిద్ధాంతాన్ని నమ్మడం వల్లే అన్నారు. పురాణ కాలంలోనే అస్త్రశస్త్రాలకు సంబంధించి చర్చ ఉందని, ఇప్పుడు అబ్దుల్ కలాం వంటివారు మనకు అందించారని పేర్కొన్నారు. అది కల్పనే కావచ్చు కానీ ఆనాడే విజ్ఞానం గురించి చర్చ ఉందని మాత్రం తెలుసుకోవాలన్నారు. యువత మాతృభూమి, మాతృభాష, కన్న తల్లిదండ్రులను మరిచిపోరాదన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన విలువతో కూడిన విద్యను అందించాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్.రామచంద్రం మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో ఐటీ కీలకమైందన్నారు. కేశవ స్మారక విద్యా సంస్థల అధ్యక్షులు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అధ్యక్షోపన్యాసం చేశారు.

సీట్ల పెంపుపై ఉన్న స్పష్టత హోదాపై ఎందుకు లేదు

- రఘువీరారెడ్డి సూటిప్రశ్న

ఈనాడు, దిల్లీ: శాసనసభ సీట్ల పెంపుపై ఉన్న స్పష్టత రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తుందన్న అంశంపై ఎందుకు లేదని ఏపీ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, ప్రత్యేకహోదా వంటి అంశాల్లో లేని స్పష్టత శాసనసభ సీట్ల పెంపుపై మాత్రం కచ్చితంగా ఉందని ఎద్దేవా చేశారు. ఏపీ ప్రజలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. మంగళవారమిక్కడ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో భేటీ అనంతరం రఘువీరా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత అంశాలు, కార్యక్రమాలపై రాహుల్‌తో చర్చించినట్లు వెల్లడించారు. అసెంబ్లీ సీట్ల పెంపు బిల్లు పార్లమెంటు ముందుకు వస్తే ప్రత్యేక హోదా అంశాన్ని కూడా చేర్చాలని డిమాండ్ చేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారన్నారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడి నియామకంపై రాహుల్‌గాంధీ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

మోదీ పక్కన జగన్‌ను చూడలేం

- పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటా: కామినేని
- ఎవరు మద్దతు ఇచ్చినా స్వాగతిస్తాం: మాణిక్యాలరావు

ఏలూరు, ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే వచ్చే ఎన్నికల్లో భాజపాకు మద్దతిస్తామన్న వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలపై భాజపా మంత్రులు విభిన్నంగా స్పందించారు. నీతినిజాయితీలకు మారుపేరుగా నిలిచే ప్రధాని నరేంద్రమోదీ పక్కన జగన్‌ను చూడలేమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ వ్యాఖ్యానించగా.. భాజపాకు ఎవరు మద్దతిచ్చినా స్వాగతిస్తామని దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో మంగళవారం వీరిద్దరూ వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. "అవినీతి, అరాచకాలకు నిలయమైన వైకాపాతో పొత్తును నేను వ్యక్తిగతంగా ఇష్టపడటం లేదు. ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉన్నందున పొత్తులఅంశంపై నేనేమీచెప్పలేను. కానీ పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడిఉంటా" అని కామినేని స్పష్టం చేశారు. భాజపాకు జగన్ స్వచ్ఛందంగా మద్దతు ఇస్తే ఎలాంటి అభ్యంతరం ఉండదని మాణిక్యాలరావు పేర్కొన్నారు. ఎవరినీ బలవంతంగా పిలవడంలేదని.. ఎన్డీఏకు స్వచ్ఛందంగా మద్దతు ఇస్తే స్వాగతిస్తామని తెలిపారు.

భాజపా స్వీకరించదు: ఆదినారాయణ

జగన్ మద్దతును భాజపా స్వీకరించదని మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

దళితుల్ని దగా చేసింది మీ కుటుంబమే

- జగన్‌పై మంత్రులు జవహర్, ఆనందబాబు విమర్శలు

ఈనాడు, అమరావతి: దళితుల్ని మరోసారి మోసం చేయడానికి ప్రభుత్వంపై వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి దుష్ప్రచారానికి పూనుకున్నారని రాష్ట్ర మంత్రులు కె.ఎస్.శామ్యూల్ జవహర్, నక్కా ఆనందబాబు విమర్శించారు. దళితులను బెదిరించి భూములు లాక్కొన్న చరిత్ర వైఎస్ కుటుంబానిదేనని జవహర్ ఆరోపించారు. ఇప్పటికీ వారి కుటుంబ ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూముల్ని దళితులకు అప్పగించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్ హయాంలో దళితులకు అనేక అన్యాయాలు జరిగాయంటూ.. 12 ప్రశ్నలు సంధిస్తూ మంగళవారం ఆయన జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. జగన్ తాత రాజారెడ్డి, తండ్రి రాజశేఖరరెడ్డి సమాధులను ఇడుపులపాయలోని దళితుల భూముల్లో కట్టారని నక్కా ఆనందబాబు ఆరోపించారు. గుంటూరులోని రాష్ట్ర తెదేపా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దళితుల సంక్షేమానికి ఎవరేం చేశారో దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల పక్కనే వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ఏర్పాటుచేసి.. రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు.

హోదాపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు: కళా

జగన్‌కు ప్రత్యేక హోదాపై మాట్లాడే అర్హతలేదని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు విమర్శించారు. కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వకపోతే తనపార్టీ ఎంపీలతో రాజీనామా చేయిస్తానని 8 నెలల క్రితం ప్రకటించిన జగన్.. ఇప్పుడు ఆ విషయాన్ని ఎందుకు చెప్పడంలేదని ప్రశ్నించారు.

కేసుల నుంచి బయటపడేందుకే

- భాజపాకు జగన్ వత్తాసు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నందిగామ, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి తనపై ఉన్న సీబీఐ కేసుల్లో జైలుకు వెళ్లకుండా ఉండేందుకు భాజపాకు, ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వత్తాసు పలుకుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. కృష్ణాజిల్లా నందిగామలో మంగళవారం ఆయన రాష్ట్ర పార్టీ కార్యదర్శి రామకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా ఇస్తే భాజపాకు మద్దతు పలుకుతామని జగన్ ప్రకటించటం వల్ల ఆయనకు వ్యక్తిగతంగా ప్రయోజనం ఉంటుందన్నారు. కమ్యూనిస్టులతో కలిసి పని చేద్దామని వైకాపా నాయకులు కొందరు జగన్‌కు సూచిస్తే ఒప్పుకోలేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ భాజపాకు చంద్రబాబు మద్దతు ఇస్తున్నా, కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. జగన్ తాజాగా హోదా ఇస్తే మద్దతు ఇస్తామని చెప్పటం వల్ల ప్రయోజనం లేదన్నారు.

నారాయణకు గవర్నరు నరసింహన్ ఫోన్

రాష్ట్ర గవర్నరు నరసింహన్ మంగళవారం సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు ఫోన్ చేశారు. ఈనెల 26న నిర్వహిస్తున్న ఎట్‌హోం కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు. ఆయన రాజకీయాలు చేస్తున్నందున తాను వెళ్లనని నారాయణ తెలిపారు. గవర్నర్‌పై తాను అనుచితంగా మాట్లాడటం తన స్థాయికి తగదని, తన మాటలను వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారు.

ప్రత్యక్ష ఉద్యోగ నియామకాల్లో క్రీడాకారులకు 2 శాతం రిజర్వేషన్లు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వశాఖల్లో ప్రత్యక్ష ఉద్యోగ నియామకాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులకు 2 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సబార్డినేట్ నిబంధనలు-1996లో సవరణలు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్రీడావిధానంలో భాగంగా ఈ మేరకు సవరణలు చేశారు. రోస్టర్‌లో 48, 98 పాయింట్ల వద్ద ఉద్యోగాలను విధిగా ప్రతిభావంతులైన క్రీడాకారులకు మాత్రమే ఇక నుంచి కేటాయించనున్నారు. లేనపుడు మాత్రమే ఓపెన్ కేటగిరిలో నియమకాలు చేపట్టాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

సెన్సెక్స్ ▲ 342 **36140**

నిఫ్టీ ▲ 117 **11084**

రూపాయి 63.78 ▲ 09 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

బంగారం 30,240 ▲ రూ.లలో 50 (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)

వెండి 38,760 ▼ రూ.లలో 125 (ముంబయిలో కిలో)

ముడి చమురు 69.81 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	26,192	−23
నాస్‌డాక్	7,454	+46
నిక్కీ 225 (జపాన్)	24,124	+308
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,592	+23
షాంఘై(చైనా)	3,547	+46
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,732	+16
డాక్స్ (జర్మనీ)	13,560	+96

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.06	67.33
పౌండ్ స్టెర్లింగ్	81.19	94.15
యూరో	71.16	82.54
జపనీస్ యెన్/100	52.42	60.78
ఆస్ట్రేలియా డాలరు	46.41	53.72
సింగపూర్ డాలరు	44.03	52.17
థాయ్ బాత్/100	182.37	218.12
బహ్రెయిన్ దీనార్	157.24	180.19
కువైట్ దీనార్	175.52	218.65
సౌదీ రియాల్	15.46	18.30
యూఏఈ దిర్హమ్	15.80	18.47
మలేషియా రింగిట్	14.47	17.80
చైనీస్ యువాన్	7.05	11.44

మంగళవారం నిఫ్టీ కదలికలు



ఐఓసీ, గెయిల్‌లో వాటాల అమ్మకం!

- ఓఎన్‌జీసీకి ప్రభుత్వ అనుమతి • హెచ్‌పీసీఎల్ కొనుగోలు కోసమే
- రూ.30,000 కోట్లు సమకూరే అవకాశం

దిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), గెయిల్‌లో తమ వాటాను విక్రయించేందుకు ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ)కు ప్రభుత్వ అనుమతి లభించింది. ఈ నెలారంభంలోనే ప్రభుత్వం అనుమతించినా, ఈ షేర్లకు సరైన విలువ కోసం ఓఎన్‌జీసీ వేచి చూస్తోందని సమాచారం. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్)లో ప్రభుత్వానికి ఉన్న 51.11 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఓఎన్‌జీసీకి రూ.36,915 కోట్లు అవసరమైనందున, అవి సమకూర్చుకునేందుకే ఈ సంస్థల్లో వాటాలను విక్రయించనుంది.

- ✦ దేశీయంగా అతిపెద్ద రిఫైనరీ అయిన ఐఓసీలో ఓఎన్‌జీసీకి 13.77 శాతం వాటా ఉంది. ప్రస్తుత షేర్ విలువ ప్రకారం, ఈ వాటా విక్రయంపై రూ.26,200 కోట్లు లభిస్తాయి.
- ✦ గెయిల్ ఇండియా లిమిటెడ్‌లో 4.86 శాతం వాటా ఓఎన్‌జీసీకి ఉంది. ప్రస్తుత షేర్ విలువ ప్రకారం, ఈ వాటా అమ్మకం ద్వారా రూ.3,847 కోట్లు సమకూరుతాయి.
- ✦ అంటే రెండు సంస్థల్లో వాటాల విక్రయంపై ఓఎన్‌జీసీకి రూ.30,047 కోట్లు లభిస్తాయి. ఇప్పటికే సంస్థ వద్ద రూ.12,000 కోట్ల నగదు నిల్వలున్నాయి.
- ✦ ఐఓసీ, గెయిల్‌లో వాటాల విక్రయం కోసం జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)ని తొలుత ఓఎన్‌జీసీ సంప్రదించిందని సమాచారం. అయితే ప్రస్తుత విలువలో 10 శాతం రాయితీ ఇమ్మని ఆ సంస్థ కోరినందునే, ఓపెన్ మార్కెట్ ద్వారా విక్రయించేందుకు ఓఎన్‌జీసీ సిద్ధపడుతోంది.



రుణ రహిత సంస్థ ఓఎన్‌జీసీ

ఇప్పటివరకు ఓఎన్‌జీసీ రుణ రహిత సంస్థగానే ఉంది. ఇదే విధంగా కొనసాగాలని సంస్థ ఆశిస్తోంది. ఇప్పుడు ఐఓసీ, గెయిల్‌లో వాటాల అమ్మకం వల్ల నిధులు వచ్చేలోపు, హెచ్‌పీసీఎల్ కొనుగోలు కోసం ఏడాది కాల వ్యవధితో రుణం తీసుకుంటుందని చెబుతున్నారు. అయితే ఎటువంటి జరిమానా లేకుండా ముందస్తు చెల్లింపునకు అవకాశం ఉండేలా ఈ రుణం తీసుకోనుందని సమాచారం. రుణ పరిమితిని రూ.25,000 కోట్ల నుంచి రూ.35,000 కోట్లకు పెంచుతూ కంపెనీ బోర్డు నిర్ణయం తీసుకున్నట్లు ఓఎన్‌జీసీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశి శంకర్ గత ఆదివారం తెలిపారు. హెచ్‌పీసీఎల్ కొనుగోలుకు తొలుత కంపెనీ వద్ద ఉన్న నిధులను వినియోగిస్తామని, అనంతరం ద్రవ్య ఆస్తులను వాడాకే, రుణం తీసుకుంటామని వివరించారు. అయితే ద్రవ్య ఆస్తులను విక్రయించే ఉద్దేశం లేదని, పైగా రూ.50,000 కోట్ల వరకు రుణాన్ని తక్కువ వడ్డీకి దేశ, విదేశీ సంస్థలు ఆఫర్ చేస్తున్నాయని పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్ విలువను మదింపు చేసేందుకు నియమించిన ఈవై సంస్థ సూచించిన మొత్తం కంటే, తక్కువ నిధులనే ప్రభుత్వానికి చెల్లించినట్లు ఓఎన్‌జీసీ సీఎండీ తెలిపారు. అంతకు మించి వివరాలను ఆయన వెల్లడించలేదు.

తొలిసారిగా లక్ష్యాన్ని చేరనున్న ప్రభుత్వం

ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా, నిర్దేశించుకున్న మొత్తాన్ని ఆర్జించగలగడం ప్రభుత్వానికి ఇప్పుడే సాధ్యమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.72,500 కోట్లు ఇలా ఆర్జించాలన్నది బడ్జెట్ ప్రతిపాదన. ఓఎన్‌జీసీ-హెచ్‌పీసీఎల్ లావాదేవీకి ముందే, ఈ రూపేణ రూ.54,337.60 కోట్లు ఖజానాకు చేరాయి.

ఇదీ జరుగుతోంది

- ✦ హెచ్‌పీసీఎల్ షేరుకు రూ.473.97 చొప్పున ప్రభుత్వానికి ఓఎన్‌జీసీ చెల్లిస్తోందని సమాచారం. గత శుక్రవారం షేరు ముగింపు ధర కంటే ఇది 14 శాతం అధికం. 60 రోజుల సగటు ధరను తీసుకున్నా, 10 శాతం అధికంగానే ఉంది.
- ✦ హెచ్‌పీసీఎల్‌లో 51.11 శాతం వాటాను విక్రయించేందుకు ప్రభుత్వం రూ.69,000 కోట్లు ఆశించింది. అయితే సంస్థలో నియంత్రణ వాటా పొందుతున్నందున, ప్రీమియంతో కలిపి షేరుకు రూ.475 చెల్లించవచ్చని ఈవై సిఫారసు చేసింది. మరో సంస్థ సిటీ అయితే షేరుకు రూ.500 చొప్పున చెల్లించవచ్చని పేర్కొంది.

హెచ్‌పీసీఎల్ విలీనంతో..

హెచ్‌పీసీఎల్‌ను ఓఎన్‌జీసీ స్వాధీనం చేసుకోవడం వల్ల, చమురు-సహజవాయువు వెలికితీత నుంచి శుద్ధి చేసి, ఉత్పత్తుల విక్రయం వరకు అన్ని సేవలు అందించే సమగ్ర సంస్థ ఏర్పాటవుతోంది. దేశంలో ఇదే తొలి సంస్థ కూడా అవుతుంది. ఓఎన్‌జీసీ అత్యధిక మొత్తంతో జరుపుతున్న కొనుగోలు కూడా ఇదే. కేజీ బేసిన్‌లోని గ్యాస్ క్షేత్రంలో గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్‌కు ఉన్న 80 శాతం వాటాను ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.7,738 కోట్లకు ఓఎన్‌జీసీ కొనుగోలు చేసిన సంగతి విదితమే.

పెట్టుబడులతో రండి

‘ఆసియాన్’ దేశాలకు జైట్లీ పిలుపు



దిల్లీ: భారత్‌లోని మౌలికవసతులు, సేవలు తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ.. ఆగ్నేయాసియా దేశాల కూటమి (ఆసియాన్)లోని సభ్య దేశాలకు పిలుపునిచ్చారు. వాణిజ్యం, పెట్టుబడులు వంటి అంశాల్లో భారత్.. అంతర్జాతీయంగా అనుసంధానమవుతోందన్నారు. మంగళవారం దిల్లీలో జరిగిన ఆసియాన్-భారత్ వ్యాపార, పెట్టుబడి సదస్సులో ఆయన మాట్లాడారు. ‘మౌలిక వసతుల రంగం, తయారీ, సేవల రంగాల్లో పెట్టుబడులకు అద్భుత అవకాశాలు ఉన్నాయి’’ అని చెప్పారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వృద్ధి సాధించే సామర్థ్యం తనకు ఉందని భారత్ ఇప్పటికే రుజువు చేసిందన్నారు. వచ్చే 2-3 దశాబ్దాల్లో ఆసియాన్, భారత్ మధ్య సంబంధాలు మరింత వృద్ధి చెందుతాయని చెప్పారు. ఇరు పక్షాల్లోనూ 200 కోట్ల మంది జనాభా ఉందన్నారు. ఆసియాన్ కూటమిలో బ్రునై, కంబోడియా, ఇండోనేసియా, మలేసియా, మయన్మార్, సింగపూర్, థాయ్‌ల్యాండ్, ఫిలిప్పీన్స్, లావోస్, వియత్నాంలు సభ్యదేశాలుగా ఉన్నాయి.

ఆసియాన్ దేశాలకు చెందిన బ్రాండ్లు, రిటైలర్లకు గమ్యస్థానంగా ఎదిగే అవకాశం భారత్‌కు ఉందని కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీ పేర్కొన్నారు. భారత్-ఆసియాన్‌లు జౌళి రంగంలో సంబంధాలు ఏర్పరచుకోవడంపై జరిగిన ఒక సదస్సులో ఆమె మాట్లాడారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన ఆసియాన్-భారత్ వ్యాపార సదస్సులో కేంద్ర ఆహార శుద్ధి శాఖ మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ మాట్లాడారు. భారత్‌లో ఆహార ప్రాసెసింగ్ కేవలం 10 శాతమే ఉందని, దాన్ని రెట్టింపు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. మరో సదస్సులో కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. భారత్‌కు సాఫ్ట్‌వేర్, భారీ డిజిటల్ ప్రాజెక్టుల్లో అద్భుత సత్తా ఉందన్నారు. భారత్-ఆసియాన్ యువజన అవార్డుల ప్రదానోత్సవంలో విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ మాట్లాడారు. ఆసియాన్‌తో భారత్‌కు గట్టి సాంస్కృతిక బంధం ఉందన్నారు. ఈ ప్రత్యేక బంధాన్ని రెండు ప్రాంతాల్లోని యువతకు తెలియజెప్పాలన్నారు. “భారత్‌తో ఆసియాన్‌ను అనుసంధానించే అంశాలు రెండు ఉన్నాయి. అవి.. బౌద్ధం, రామాయణం’’ అని తెలిపారు.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
ఆర్‌బీఎల్ బ్యాంక్	165.33	128.69	1409.01	1143.48
ఎడెల్‌వీస్ ఫైనాన్షియల్(కన్సా)	236.39	155.18	2,081.33	1,612.47
సింఫనీ	66.31	54.93	225.67	189.57
మోర్‌పెన్ ల్యాబ్స్	9.67	4.67	142.73	139.04
ఫోర్స్ మోటార్స్	14.65	23.25	749.52	716.05
క్రాంప్టన్ గ్రీవ్స్	69.50	54.35	944.81	909.64
ఎల్ అండ్ టీ టెక్నాలజీ	126.3	108.7	969.1	810.4
ఎన్ఐఐటీ (కన్సా)	19.7	4.4	209.4	202

నేటి బోర్డు సమావేశాలు

★ ఐడియా ★ బయోకాన్ ★ కెనరా బ్యాంక్ ★ ఆదిత్య బిర్లా మనీ ★ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ★ రేమండ్ ★ ఎం & ఎం ఫైనాన్షియల్ ★ విజయా బ్యాంక్ ★ కేపిటల్ ఫస్ట్ ★ కాంకర్ ★ ఎవరెస్ట్ ఇండస్ట్రీస్ ★ ఫైజర్ ★ జిందాల్ సా ★ కిర్లోస్కర్ బ్రదర్స్ ★ కేపీఐటీ టెక్నాలజీస్ ★ లిబర్టీ షూస్★ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ ★ ఎంఫసిస్ ★ పిడిలైట్ ★ క్వెస్‌కార్ప్ ★ సాగర్ సిమెంట్స్ ★ టీటీకే ప్రెస్టీజ్

ఏఆర్, వీఆర్ అంకురాలకు ప్రోత్సాహం

- ఫేస్‌బుక్, టి-హబ్‌ల ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: వర్చువల్ రియాల్టీ (వీఆర్), అగ్మెంటెడ్ రియాల్టీ (ఏఆర్) అంకుర సంస్థలకు ప్రోత్సాహం ఇచ్చేందుకు టి-హబ్, ఫేస్‌బుక్‌లు చేతులు కలిపాయి. ‘ఇండియా ఇన్నోవేషన్ హబ్ యాక్సిలరేటర్’ కార్యక్రమం కింద ఈ రంగంలో పనిచేస్తున్న అంకురాలకు ఫేస్‌బుక్, టి-హబ్‌లోని నిపుణుల సేవలు, మెంటార్‌లు, పెట్టుబడుల సమీకరణ తదితర అంశాల్లో అవసరమైన సహాయం అందనుంది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఏఆర్, వీఆర్ రంగంలో పనిచేస్తున్న అంకుర సంస్థలు దరఖాస్తు చేసుకునే వీలుంది. ఫిబ్రవరి 28 వరకూ ఈ దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇందులో నుంచి మొత్తం 20 సంస్థలను ఎంపిక చేసి, కొన్ని సమస్యల మీద తమ పరిష్కారాలను చూపించాల్సిందిగా కోరతారు. ఇందులో ప్రతిభ చూపించిన 10 అంకురాలను ఎఫ్‌బీ స్టార్ట్ కింద ఎంపిక చేస్తారు. ఆ తర్వాత ఏప్రిల్ 5 నుంచి జూన్ 29 వరకూ యాక్సిలరేటర్ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సమయంలో ఆయా అంకురాలకు అవసరమైన మెంటార్‌షిప్, పెట్టుబడుల సమీకరణ, సాంకేతిక సహాయంలాంటివన్నీ టి-హబ్, ఫేస్‌బుక్‌లు అందిస్తాయి. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఫేస్‌బుక్, టి-హబ్‌లు ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ ఇండియా ప్లాట్‌ఫాం పార్టనర్‌షిప్ విభాగాధిపతి సత్యజీత్ సింగ్ మాట్లాడుతూ.. గత పదేళ్లుగా అంకురాలకు వివిధ అంశాల్లో అవసరమైన సహాయాన్ని ఎఫ్‌బీ డెవలపర్ కింద అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎఫ్‌బీ స్టార్ట్‌లో భాగంగా ఏఆర్, వీఆర్‌లలో పనిచేస్తున్న సంస్థలకు ప్రోత్సాహం ఇస్తామన్నారు. టి-హబ్ సీఈఓ జయ్ కృష్ణన్ మాట్లాడుతూ.. రాబోయే ఐదారేళ్లలో దేశీయ ఏఆర్, వీఆర్ మార్కెట్ వృద్ధి రేటు దాదాపు 76 శాతం వరకూ ఉండబోతోందని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థల సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ సంస్థలు సృజనాత్మకంగా వ్యవహరించాలన్నారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, రవాణా రంగంలో ఏఆర్, వీఆర్, ఎక్స్ఆర్‌ల వినియోగం పెరుగుతోందన్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఈ సంస్థలు అభివృద్ధి చెందేందుకు ఈ ఒప్పందం ఉపకరిస్తుందని పేర్కొన్నారు.



ఇండియా ఇన్నోవేషన్ హబ్ యాక్సిలరేటర్ ఒప్పందం కుదుర్చుకుంటున్న సత్యజీత్ సింగ్, జయ్ కృష్ణన్

ఇండియాబుల్స్ హౌసింగ్ లాభంలో 55% వృద్ధి

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో తనఖా రుణాల సంస్థ ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ ఏకీకృత ప్రాతిపదికన రూ.1,167.7 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.751.5 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 55.4 శాతం అధికం. ఓక్‌నార్త్ బ్యాంక్‌లో మూడింట ఒకవంతు వాటా విక్రయంతో గణనీయంగా లాభపడినట్లు కంపెనీ తెలిపింది. దీంతో తొలిసారిగా ఒక త్రైమాసికంలో రూ.1000 కోట్లకు మించి లాభాన్ని ఆర్జించినట్లు వివరించింది. ఇక మొత్తం ఆదాయం రూ.3,004.47 కోట్ల నుంచి 36.65 శాతం వృద్ధితో రూ.4,105.66 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం రూ.1,141 కోట్ల నుంచి 23.6 శాతం అధికమై రూ.1,410 కోట్లకు పెరిగింది. మొత్తం అడ్వాన్సుల్లో స్థూల ఎన్‌పీఏలు 0.85 శాతం నుంచి 0.77 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.36 శాతం నుంచి 0.31 శాతానికి తగ్గాయి. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.14 మధ్యంతర డివిడెండు చెల్లించేందుకు కంపెనీ ఆమోదం తెలిపింది.

సాగర్‌సాఫ్ట్ ఆదాయం రూ.11 కోట్లు


ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి సాగర్‌సాఫ్ట్ ఆకర్షణీయ ఆదాయ, లాభాలను ప్రకటించింది. 2016-17 మూడో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.19 లక్షలు ఉండగా.. 2017-18 ఇదే కాలానికి రూ.1.31 కోట్లు ఆర్జించింది. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.4.34 కోట్ల నుంచి రూ.11.52 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. వ్యయం రూ.4.07 కోట్ల నుంచి రూ.9.34 కోట్లకు చేరింది. బీఎస్ఈలో షేరు ధర మంగళవారం అప్పర్ సర్క్యూట్ బ్రేకర్‌ను తాకింది.

వేదాంతా



రూ.328.10 వద్ద ప్రారంభమై రూ.328.10- 349.95 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.326.95తో పోలిస్తే రూ.16.55 (5.06%) లాభంతో రూ.343.50 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,82,22,487.

అంబుజా సిమెంట్స్



రూ.268.45 వద్ద మొదలై రూ.262- 269.40 మధ్య చలించి క్రితం ముగింపు రూ.268.45తో పోలిస్తే రూ.5.75 (2.14%) నష్టంతో రూ.262.70 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 31,27,752 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

ఎల్ అండ్ టీ	1415.00	సైయెంట్	686.00
ఇన్ఫోసిస్	1188.00	బయోకాన్	652.80
టాటా ఎలెక్సీ	1095.00	యాక్సిస్ బ్యాంక్	627.60
హెచ్‌సీఎల్ టెక్	1000.00		
రిలయన్స్ ఇండస్ట్రీస్	990.95		
భారత్ ఫోర్జ్	755.00		

52 వారాల కనిష్ఠం (రూ.లలో)


సీఎల్ ఎడ్యుకేట్	275.50

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
23/01	8,312	7,083	1,229	6,324	6,155	169
22/01	7,002	5,435	1,568	3,583	4,054	−462
18/01	9,015	7,120	1,895	4,396	5,053	−657
17/01	7,883	7,258	625	4,688	4,520	169
16/01	8,203	7,510	693	4,003	4,249	−246

23వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) — కోడిగుడ్లు

(100కు రూపాయలలో)



హైదరాబాద్	390	వరంగల్	404
చిల్లరగా(ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	412
బెంగళూరు	400	చెన్నై	405
24న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	412	నమక్కల్	380

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 438.40 (438.05) 4659591
AMBUJA CEMEN 262.70 (268.45) 3127752
ASIAN PAINTS 1169.90 (1176.00) 1841634
AUROBIND PHA 653.75 (640.80) 1872601
AXIS BANK LT 620.10 (611.55) 14286343
BAJAJ AUTO L 3295.95 (3274.50) 324780
BAJAJ FINANC 1708.70 (1706.35) 1245493
BHARTI AIRTE 492.10 (490.70) 5543486
BHARTI INFRA 339.40 (343.50) 5668180
BOSCH LTD 19776.00 (19981.50) 14150
BPCL 481.15 (469.15) 3779440
CIPLA 622.35 (601.15) 2105060
COAL INDIA L 293.10 (285.05) 3974425
DR. REDDYS 2520.40 (2496.55) 730091
EICHER MOTOR 27071.25 (27649.80) 117399
GAIL 470.80 (457.40) 6286207
HCL TECH 995.35 (966.35) 2507601
HDFC 1884.65 (1872.00) 2158639
HDFC BANK 1951.30 (1963.35) 1261949
HERO MOTOCOR 3630.00 (3602.95) 285236
HINDALCO IND 264.95 (255.10) 17400430
HINDUSTAN UN 1368.35 (1355.10) 1284895
HPCL 395.90 (401.80) 5209316
ICICI BANK 362.30 (351.50) 22485663
INDIABULLS H 1379.10 (1355.15) 2611848
INDIAN OIL 389.40 (382.50) 6610514
INDUSINDBANK 1723.35 (1683.20) 1763797
INFOSYS LTD 1177.10 (1150.00) 7701898
ITC 276.60 (273.65) 18244388
KOTAK MAHIND 1075.45 (1074.10) 2458463
LARSEN & TOU 1410.70 (1398.85) 4804202
LUPIN 937.35 (930.05) 1507345
M&M 769.05 (759.60) 2775928
MARUTI SUZIK 9393.40 (9310.10) 561948
NTPC LTD 172.70 (172.40) 5398827
ONGC 207.35 (200.70) 15755015
POWER GRID C 195.85 (195.30) 9075432
RELIANCE IND 983.25 (971.50) 10298500
SBI 318.10 (306.50) 35252217
SUN PHARMA 579.35 (576.15) 4790590
TATA CONSULT 3102.00 (3116.40) 1619805
TATA MOTORS 418.00 (421.90) 6185011
TATA STEEL L 779.75 (752.20) 8036841
TECH MAHINDR 588.25 (569.50) 4103152
ULTRATECH 4374.70 (4330.00) 250337
UPL LIMITED 807.25 (813.60) 1371476
VEDANTA LIMI 343.50 (326.95) 18222487
WIPRO 315.25 (321.55) 3230027
YES BANK LTD 359.55 (355.35) 10196645
ZEE ENTERTAI 597.15 (608.85) 2448720

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1639.70 (1602.30) 227856
ACC 1790.15 (1827.20) 248086
ASHOK LEYLAN 124.00 (121.05) 10962021
AVENUE SUPER 1169.20 (1176.30) 301434
BAJAJ FINSER 5014.60 (5051.45) 178301
BANK OFBAROD 173.15 (164.80) 18168528
BEL 174.70 (175.40) 4616826
BHEL 104.45 (104.55) 20713446
BRITANNIA 4736.45 (4707.35) 100355
CADILA HEALT 430.95 (438.75) 1006539
COLGATE PALM 1157.15 (1172.55) 256965
CONTAINER 1466.20 (1483.25) 256745
CUMMINS INDI 910.20 (913.70) 308058
DABUR INDIA 364.00 (363.10) 1287281
DLF LIMITED 259.65 (250.95) 9049840
EMAMI LIMITE 1243.70 (1245.85) 125374
GLAXOSMI CON 6672.30 (6648.40) 20574
GLAXOSMI PHA 2458.90 (2463.05) 15567
GLENMARK PHA 632.50 (620.20) 792356
GODREJ CONSU 1085.40 (1092.70) 950942
HAVELLS INDI 584.15 (552.65) 4397044
HINDUSTAN ZI 296.65 (292.45) 2894490
ICICI PRU LI 431.10 (438.75) 1240517
IDEA CELLULR 99.35 (99.50) 9798561
INTERGLOBE A 1192.10 (1198.15) 1176930
JSW STEEL LT 294.05 (278.65) 8672380
LIC HOUS.FIN 573.50 (575.05) 2237016
MARICO LIMIT 313.85 (316.35) 599429
MCDOWELL 3750.60 (3787.15) 714156
MOTHERSON 386.10 (384.40) 3052471
MRF 69930.70 (69677.30) 6857
NHPC LTD 30.45 (30.05) 6558630
NMDC LTD 149.45 (144.15) 7418323
OIL INDIA 375.15 (371.80) 503670
ORACLE FIN S 4245.95 (4208.00) 53780
P&G HYG&HEAL 9285.70 (9276.40) 19748
PETRONET LNG 245.85 (237.80) 4564815
PIDILITE IND 886.35 (895.00) 509131
PIRAMAL ENTE 2844.65 (2830.20) 246357
PNB 185.80 (176.00) 28176767
POWER FIN CO 121.00 (120.00) 3762017
RURAL ELEC C 157.75 (155.65) 3640311
SAIL 96.85 (92.45) 22670874
SHREE CEMENT 18391.95 (18479.35) 30808
SHRIRAM TRAN 1468.80 (1476.25) 896951
SIEMENS 1319.80 (1319.20) 148682
SUN TV LTD 1040.40 (1033.65) 547311
TATA POWER 92.50 (92.10) 4928177
TITAN IND 905.70 (909.75) 1747166
TORRENT PHAR 1443.00 (1451.35) 155033

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 227.50 (231.25) 1720032
ADANI ENTERP 204.40 (198.90) 7561852
ADANI POWER 38.25 (37.60) 27045728
ALL BANK 72.70 (70.50) 3228047
AMARA RAJA 819.65 (824.45) 360521
ANANT RAJIND 70.30 (71.70) 1541404
ANDHRA BANK 58.10 (56.15) 2432419
APOLLO HOSPI 1146.50 (1168.80) 229030
APOLLO TYRES 264.85 (259.60) 1899243
APTECH 358.50 (357.50) 376752
BAJAJ ELECT. 527.15 (521.70) 306922
BAJAJ HIND 14.30 (14.50) 3090106
BAJAJ HOLDIN 2827.65 (2800.85) 11594
BALAJI TELE 157.60 (155.35) 204389
BALLARPUR IN 15.75 (16.15) 1728631
BALRAMPUR CH 126.40 (124.15) 2873232
BANK OF MAHA 21.15 (21.00) 1281203
BANK OFINDIA 169.30 (164.30) 4612077
BATA INDIA 733.10 (730.35) 539573
BGR ENERGY S 140.75 (139.75) 255267
BHARAT FORGE 748.50 (739.70) 1206318
BHUSHAN STEE 64.00 (65.45) 2646400
BIOCON LTD 643.70 (603.85) 11193528
BOMBAY DYE 254.35 (257.85) 2692098
CANARA BANK 374.50 (362.95) 4198832
CEAT LIMITED 1856.85 (1837.85) 285413
CENTRAL BANK 74.50 (73.20) 475886
CHAMBAL FERT 158.70 (155.65) 1368877
CHENNAI PETR 430.70 (427.70) 725025
CITY UNIBANK 174.10 (174.55) 746094
CORPO BANK 39.50 (39.00) 511384
COX & KINGS 258.60 (260.70) 113743
D B REALTY L 68.00 (70.20) 712798
DELTA CORP L 387.70 (350.15) 13281255
DENA BANK 26.55 (25.95) 3719900
DHANALAKBANK 28.90 (28.50) 745591
DIVIS LAB 1101.35 (1077.85) 1019038
EDELWEISS CA 295.05 (289.55) 6976785
EID PARRY 350.95 (349.50) 310483
EIH 200.80 (203.55) 294857
ESSAR SHIPPI 28.85 (29.05) 74099
ESTER INDUST 58.15 (59.00) 128057
EXIDE INDUST 222.50 (223.60) 1654013
FEDERAL BANK 103.25 (101.60) 21438591
FINOLEX CABL 729.05 (743.70) 32734
G E SHIP LTD 436.35 (457.35) 81741
GAMMON INFRA 3.80 (3.80) 4162590
GATI LIMITED 137.80 (139.30) 990717
GAYATRI PROJ 215.80 (218.55) 149837
GITANJALIGEM 67.90 (67.70) 1626619
GMR INFRASTR 23.85 (22.95) 100158161
GODREJ IND 628.50 (640.00) 262472
GRASIM IND 1223.40 (1239.30) 971547
GUJ ALK&CHEM 872.35 (890.60) 114720
GUJ NRE COKE 1.30 (1.25) 3710975
HCL INFOSYS 57.75 (59.20) 2143131
HEXA TECH 363.45 (352.20) 1251613
HIMACHAL FUT 32.10 (32.10) 6785687
HOUSING DEV 61.00 (61.60) 12326531
IDBI 61.90 (61.10) 3406984
IDFC 58.20 (58.55) 6966923
IFCI 30.80 (31.00) 17648127
IL&FS TRANS 80.80 (83.10) 323127
INDBULLS REL 239.75 (243.30) 3418683
INDIA CEM 184.00 (184.75) 3202579
INDIAN BANK 397.60 (382.05) 1576073
INDO RAMA SY 49.10 (49.40) 218334
INDRAPRASTHA 312.35 (309.70) 2732751
INGERSOLL-R 815.25 (820.45) 7594
IOB 23.20 (23.00) 1195051
IPCA LAB 581.50 (588.35) 414057
IRB INFRA DE 242.35 (239.45) 1036474
J&K BANK 75.85 (76.85) 507148
JAI CORP 188.40 (191.25) 1710998
JAIN IRRIGAT 143.55 (139.80) 18023973
JAYPEE INFRA 15.50 (15.00) 15284330
JET AIRWAYS 795.70 (783.40) 3633682
JINDAL SAW 175.10 (165.30) 4313999
JINDAL STEEL 290.75 (263.75) 36250757
JK LAKSHMI C 428.20 (430.70) 67623
JK PAPER LIM 145.20 (148.00) 894343
JM FINANCIAL 161.70 (163.85) 798038
JP ASSOCIATS 22.10 (21.95) 52899443
JSW ENERGY L 90.60 (88.70) 7822465
JUBILANT FOO 2283.00 (2273.30) 2337022
JUBILANT ORG 891.65 (887.45) 568753
JYOTHY LABS 371.25 (371.15) 285018
JYOTI STRUC 12.15 (12.60) 1785669

ఘనం (+)

నిఫ్టీ	23న	మార్పు %
VEDANTA	343.50	5.06
HINDALCO	264.95	3.86
SBI	318.10	3.78
TATA STEEL	779.75	3.66
CIPLA	622.35	3.53
ONGC	207.35	3.31
TECH MAHINDRA	588.25	3.29

గ్రహణం (-)

నిఫ్టీ	23న	మార్పు %
AMBUJA CEMENTS	262.70	-2.14
EICHER MOTORS	27071.25	-2.09
WIPRO	315.25	-1.96
ZEE ENTERTAINMENT	597.15	-1.92
HPCL	395.90	-1.47
BHARTI INFRATEL	339.40	-1.19
BOSCH	19776.00	-1.03

KARNATA BANK 159.65 (158.35) 3345935
KEC INTL LTD 367.85 (357.50) 370929
KOLTE PATIL 372.50 (378.25) 282765
KPIT CUMMINS 203.45 (199.95) 2432704
L&TFIN.HOLD 179.65 (178.30) 7156394
LAK VIL BANK 137.40 (140.30) 509186
M & M FINANC 508.00 (488.60) 2995179
MANAPPURAM G 119.35 (120.90) 8022751
MMTC LIMITED 64.85 (64.80) 1981944
MPHASIS LTD 796.20 (802.00) 104886
MRPL 131.50 (129.85) 1637914
MTNL 26.30 (26.05) 1950634
NAGARJUNA OI 4.10 (4.15) 472967
NCC LIMITED 126.70 (126.90) 3116095
NETWORK18 FI 55.60 (55.40) 1257046
NEULAND LAB 880.30 (885.40) 10626
NIIT LTD 107.80 (109.60) 6561072
NIIT TECHNOL 783.75 (765.75) 1132377
OMAXE LTD 227.05 (225.45) 709906
ONMOBILE GLO 57.10 (57.85) 480197
ORIENTALBANK 125.75 (122.45) 2959573
PARSVNATH DE 25.55 (25.25) 103258
PATEL ENGG 80.95 (81.10) 320418
PFIZER 2113.05 (2145.55) 69232
POLARIS SOFT 413.30 (416.20) 131935
POWERTRADING 114.70 (114.80) 1599498
PRAJ IND 113.65 (114.20) 1364634
PRISM CEMENT 140.05 (142.60) 1463848
PUNJ LLOYD 23.60 (23.60) 1684489
PUNJAB & SIN 47.65 (47.25) 117823
PURAVANKARA 149.60 (148.75) 405477
PVP VENTURES 8.55 (8.90) 601525
PVR LIMITED 1529.30 (1474.10) 508483
RADICO KHAIT 412.70 (389.60) 6701704
RAJESH EXPOR 821.30 (821.25) 615876
RALLIS INDIA 252.45 (270.95) 1757712
RAMCO IND 302.25 (305.10) 79572
RAMCO SYS 499.40 (510.35) 31375
RAMKY INFRA 219.70 (222.50) 171041
RAYMOND 1123.80 (1102.45) 609714
RELIANCE CAP 526.35 (522.55) 6158705
RELIANCE COM 29.25 (28.65) 146096411
RELIANCE INF 516.85 (509.60) 2592969
RELIANCE POW 48.40 (48.00) 17506799
ROLTA INDIA 68.70 (70.65) 1207663
SAGAR CEMENT 1076.15 (1050.65) 12370
SAREGAMA 829.85 (802.60) 367854
SHANTHI GEAR 156.70 (158.80) 24540
SHIPPNG CORP 88.05 (90.10) 1558036
SHREE RENUKA 15.60 (15.60) 1218786
SINTEX IND 23.95 (23.95) 2344581
SOBHA DEVELO 595.10 (599.25) 598047
SOUTHINDBANK 32.30 (32.20) 10163596
SRS LIMITED 1.75 (1.80) 199322
STERLITE TEC 395.80 (368.60) 3120006
SUN PHARMA 496.35 (501.70) 171926
SUND FASTNER 551.00 (551.80) 143213
SUZLON ENERG 15.00 (15.00) 23536033
SYND. BANK 80.50 (77.15) 5437664
TATA CHEM 732.60 (735.80) 380662
TATA COFFEE 158.55 (160.75) 525620
TATA COMMUN 639.40 (644.50) 426592
TATA GLOBAL 307.20 (308.85) 4416130
TATA METALIK 907.45 (887.60) 284719
TATA MOT DVR 238.25 (239.05) 2323875
THE INDIAN H 156.75 (150.65) 5126004
TORRENT POWE 297.30 (305.60) 1114639
TRIVENI ENGG 64.20 (66.00) 983045
TTK PRESTIGE 8596.40 (8668.85) 3242
TV TODAY NET 458.65 (451.65) 200385
TV18 BROADCA 61.30 (61.20) 6726413
TVS MOTOR 706.15 (715.00) 799914
UCO BANK 31.10 (30.90) 1046125
UNION BANK 145.05 (140.35) 5273202
UNITECH 8.90 (8.95) 32456410
UNITED BANK 17.90 (17.70) 566568
UNITED BREWE 1160.15 (1155.55) 490576
USHA MARTIN 27.25 (27.95) 1797592
VADILAL INDU 925.60 (919.70) 11993
VENKYS 2856.90 (2552.50) 459814
V-GUARD IND 239.25 (247.60) 4008432
VIJAYA BANK 69.10 (67.10) 3424772
VIP 366.45 (367.00) 499102
VOLTAS 625.55 (624.95) 2197060
ZEE LEARN LI 45.05 (45.45) 533430
ZUARI GLOBAL 216.85 (221.65) 78429
ZYDUS WELLNE 1103.85 (1092.85) 4624

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 930.40 (954.90) 3046
AMAR RAJA BA 820.75 (825.15) 16341
ANDHRA BANK 58 (56.05) 272136
ANDHRA CEMEN 13.18 (13.37) 43976
ANDHRA PAPER 373.90 (383.35) 13386
ANDHRA PETRO 71.25 (67.90) 192218
ANDHRA SUGAR 703.10 (701.45) 6593
ANJANI PORTL 240.75 (243.15) 2053
ASTRA MICROW 115.30 (117.50) 86595
AUROBINDO PH 654.70 (641) 97423
AVANTEL SOFT 481.30 (488.10) 3902
AVANTI FEEDS 2543.30 (2512.15) 17049
BALAJI AMIN 712.60 (701.15) 12568
BARTRONICS 14.80 (14.68) 31150
BHAGYA NAG 44.35 (45.20) 10087
BN RATHI SEC 45.25 (46.10) 3758
BRILLIANT SE 14.59 (15.34) 932125
CAMBRIDGE TE 93.15 (95.05) 10966
CONT COFFEE 296.50 (295.05) 8407
COROMAN FERT 572.60 (572.10) 19287
CYBERMATE 3.97 (3.80) 210917
CYIENT LIMIT 663.55 (630.50) 72825
DECCAN CEMEN 612 (607.60) 346
DIVI'S LAB 1102.20 (1078.75) 39484
DIVYA GRANIT 111.95 (111.70) 3517
DR REDDY 2522.45 (2491.50) 52955
GATI CORPN 138.15 (139.50) 194645
GAYATRI PROJ 215.15 (218.45) 28435
GMR INFRASTR 23.85 (22.90) 6827834
GOLDST INFRA 219.95 (227.35) 42240
GRANULES (I) 139.10 (138.90) 151576
GVK POWER 22.75 (23.15) 972520
HBL NIFE POW 67.40 (66.45) 176907
HERITAGE FOO 800.35 (790.35) 2709
IDL INDUSTRS 635.45 (612.25) 6839
ILFS ENGINEE 46.95 (48.35) 10782
INNAREDY COM 4.99 (5.25) 18071
IVRCL INFRAS 5.52 (5.69) 216838
KALLAM SPG 22.95 (23.85) 38708
KAVERI SEED 519.30 (522.50) 43102
KCP LTD 147.90 (147.70) 55668
KNR CONSTRUC 317 (309.65) 22616
LANCO INDUS 398.30 (398.20) 13853
LANCO INFRAT 1.86 (1.95) 187838
LAURUS LABS 556.15 (549.70) 15096
MADHUCON PRO 34.20 (34.40) 18064
MIC ELECTRON 8.90 (8.90) 99394
MOLDTK PLA 360.15 (361.75) 9026
NAGARJAGRICH 57.65 (55.90) 75149
NATCO PHARMA 1016.65 (1008.05) 18071
NAVA BH VENT 167.35 (165.45) 58383
NCC 126.70 (126.75) 365023
NCL IND 293.45 (289.80) 13192
NEHA INTER 8.19 (8.43) 32595
NETTLINX 86.40 (87.05) 17686
NEULAND LAB 879.05 (896.40) 1044
NIHAR INFO 14.30 (14.99) 1689
PANYAM CEMEN 59.90 (60.20) 10436
PENNER IND 64.75 (63.90) 72725
PIONEER DIST 204.75 (210) 4720
PITTI LAMIN 95.60 (97.35) 7734
POKARNA 227.65 (229.25) 6853
PRISM CEMENT 140.70 (143.15) 146246
PRUDENTL PHA 5 (5.03) 195037
RAIN INDUSTR 424.85 (430.80) 470266
SAMKRG PIST 339.10 (338.20) 25252
SAMPRE NUTRI 80.85 (83.95) 10393
SMS PHARMA 103.50 (105.15) 67067
SREE RAYAL A 71.50 (73.35) 205919
STEEL EXCHAN 34.45 (34.40) 59824
SUJANA METAL 1.51 (1.57) 63641
SUJANA TOWER 4.61 (4.85) 3975
SUJANA UNIVE 1.02 (1.06) 216529
SURANA TELE 5.96 (6.09) 5309
SURYALAKSH.C 97.15 (96.20) 5999
SURYALATA SP 179.50 (175.70) 619
SUVEN PHARMA 204.30 (199.80) 113808
TAJ GVK HOTE 190 (188.50) 90291
TANLA 38.60 (39.60) 296697
TERA SOFTWAR 70.25 (65.60) 41235
VICEROY HOTE 19.50 (19.40) 131158
VIJAY TEXTIL 58.20 (55.60) 78825
VIMTA LABS 217 (180.85) 317372
VIVIMED LABS 95.65 (93.30) 205224
VJIL CONSULT 17.60 (18.50) 1012
YBRANT DIGIT 6.70 (6.99) 306909
ZENTECH 129.25 (129.80) 58814

ఏ రికార్డు అయినా ఎప్పుడోకప్పుడు బద్దలు కావాల్సిందే.. మన మార్కెట్‌కు మాత్రం ప్రతి రోజూ బద్దలు కావాల్సిందే అలా ఉంది.. దాని దూకుడు.. ఒకటా.. రెండా.. మూడా వరుసగా ఐదు రోజులుగా రికార్డులను తిరగరాస్తూనే ఉంది.. కొత్త చరిత్రను లిఖిస్తూనే ఉంది.. మరి ఈ మురిపెం బడ్జెట్ వరకేనా.. ఆ తర్వాతా కొనసాగేనా.. ఏమో వేచిచూడాల్సిందే..

మైలురాళ్లు

సెన్సెక్స్ పాయింట్లు	తేదీ	నిఫ్టీ పాయింట్లు	తేదీ
31000	26 మే 2017	6000	1 నవంబరు 2007
32000	13 జులై 2017	7000	12 మే 2014
33000	25 అక్టోబరు 2017	8000	1 సెప్టెంబరు 2014
34000	26 డిసెంబరు 2017	9000	3 మార్చి 2015
35000	17 జనవరి 2018	10000	25 జులై 2017
36000	23 జనవరి 2018	11000	23 జనవరి 2018

ఈనాడు బిజినెస్



ఇవే పెంచాయ్..

- ✦ బడ్జెట్‌పై ఆశలు ✦ ప్రభుత్వ నిర్ణయాలు
- ✦ అమెరికా మార్కెట్ల రాణింపు
- ✦ అంతర్జాతీయ సానుకూలతలు
- ✦ కంపెనీల ప్రోత్సాహకర ఫలితాలు
- ✦ దేశీయ/ విదేశీ మదుపర్ల పెట్టుబడులు ✦ వృద్ధి రేటుపై సానుకూల అంచనాలు

మార్కెట్ల అప్రతిహత లాభాల జైత్రయాత్ర కొనసాగుతోంది. విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాలు, భారత వృద్ధి రేటుపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనాల కారణంగా మంగళవారం ట్రేడింగ్ ప్రారంభం నుంచే రికార్డుల మోత మోగింది. సెన్సెక్స్ తొలిసారి 36000 పాయింట్ల ఎగువకు వెళ్లగా.. నిఫ్టీ మొట్టమొదటిసారి 11000 మైలురాయిని అందుకుంది. అక్టోబరు- డిసెంబరు త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా ఉండొచ్చన్న అంచనాలతో లోహ, బ్యాంకింగ్, మౌలిక రంగాల షేర్లు రాణించడం ఇందుకు దోహదం చేసింది. ఐటీ షేర్ల జోరు కొనసాగడం కూడా కలిసొచ్చింది. ఉదయం నుంచి లాభాల్లోనే కదలాడిన సెన్సెక్స్ చివరకు 341.97 పాయింట్ల లాభంతో 36,139.98 వద్ద ముగిసింది. నిఫ్టీ 117.50 పాయింట్లు పెరిగి 11,083.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీ రెండింటికీ ఇవే తాజా రికార్డు స్థాయి ముగింపులు. మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1,08,019.59 కోట్లు పెరిగి రూ.156,56,592 కోట్లకు చేరింది.

దిగ్గజాల దూకుడు: సూచీలు కొత్త శిఖరాలను అధిరోహించడంలో దిగ్గజ కంపెనీల షేర్లు కీలక పాత్ర పోషించాయి. సెన్సెక్స్ షేర్లలో ఎస్‌బీఐ 3.84%, టాటా స్టీల్ 3.72%, ఓఎన్‌జీసీ 3.6%, ఐసీఐసీఐ బ్యాంక్ 3.6%, కోల్ ఇండియా 3.04%, ఇండస్ ఇండ్ బ్యాంక్ 2.37%, ఇన్ఫోసిస్ 2.16%, డాక్టర్ రెడ్డీస్ 1.24% చొప్పున పెరిగాయి. ప్రోత్సాహకర ఫలితాల ప్రభావంతో యాక్సిస్ బ్యాంక్‌కు లాభాలు కొనసాగాయి. బీఎస్ఈలో 1.28% లాభపడింది.



మోదీ వచ్చిన వేళ..

44 నెలల్లో..11000 పాయింట్లు పైకి..



నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం రోజున (26 మే 2014) సెన్సెక్స్ 25019 పాయింట్ల వద్ద ఉంది. అప్పటి నుంచి ఒక్కో మైలురాయిని అధిగమించుకుంటూ 2015 మార్చిలో 30000 చేరువకు వచ్చింది. కాని అప్పుడు ఆ స్థాయి ఎగువకు వెళ్లలేకపోయింది. ఆ తర్వాత తిరోగమనబాట పట్టిన సూచీ తిరిగి 2017 ఏప్రిల్ 26న 30000 మైలురాయిని అదిగమించింది. ఇక అక్కడ నుంచి సూచీ వెనక్కి తిరిగి చూడలేదు. కేవలం 8 అంటే 8 నెలల్లోనే 6000 పాయింట్లు పెరిగింది. నిఫ్టీ కూడా

సంపద రెట్టింపు: మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మదుపర్ల సంపద కూడా గణనీయంగా పెరిగింది. ఆయన అధికారం చేపట్టిన రోజు బీఎస్ఈలోని నమోదిత కంపెనీల విలువ రూ.75 లక్షల కోట్లుగా ఉంది. మంగళవారం ట్రేడింగ్ ముగిసేనాటికి ఇది రూ.156,56,592 కోట్లుగా నమోదైంది. అంటే 44 నెలల్లో మదుపర్ల సంపద రెట్టింపు (రూ.80 లక్షల కోట్లు)నకు పైగా పెరిగిందన్న మాట.

సూచీ	26 మే 2014 (మోదీ ప్రమాణ స్వీకారం రోజు)	ప్రస్తుతం	వృద్ధి
సెన్సెక్స్	25,019	36140	11121 (44%)
నిఫ్టీ	7,456	11084	3,628 (49%)

నేటి మార్కెట్

నేడు సైతం మార్కెట్లు లాభాలను అందించవచ్చని భావిస్తున్నారు. బడ్జెట్‌కు ముందు మదుపర్లు కొనుగోళ్లు చేస్తుండడమూ కలిసివస్తోందని వారు అంటున్నారు. నిఫ్టీ నేడు 11,000-11,150 పాయింట్ల స్థాయిలో కదలాడవచ్చని బ్రోకరేజీ సంస్థలు అంటున్నాయి. దేశీయ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందన్న ఆశల మధ్య బ్యాంకు, లోహ షేర్లు రాణించే అవకాశం ఉందని అంచనా. అయితే ప్రస్తుత నెల డెరివేటివ్ సిరీస్‌కు గడువు గురువారంతో ముగియనుండడం; ఫిబ్రవరి 1న బడ్జెట్ ఉండడంతో స్టాక్ మార్కెట్లు ఊగిసలాటకు గురికావొచ్చని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు.

జోరు గుర్రాలు

● రికార్డుల పర్వంలో సూచీలు ● రూ.లక్ష కోట్లు పెరిగిన మదుపర్ల సంపద

5 రోజుల్లో 1000

సెన్సెక్స్ ఈ నెల 16న తొలిసారి 35000 మైలురాయిని అధిగమించింది. అప్పటినుంచి కేవలం 5 రోజుల్లోనే మరో 1000 పాయింట్లు పెరిగి 36000 మైలురాయిని అందుకుంది. కాగా నిఫ్టీ 10000 నుంచి మరో 1000 పాయింట్లు పెరగడానికి 6 నెలలు పట్టింది. గతేడాది జులై 26న తొలిసారి 10,000 పాయింట్లను అధిగమించింది. జనవరి 8న 10600 పాయింట్లను దాటినప్పటి నుంచి కేవలం 15 రోజుల్లోనే 500 పాయింట్లు పెరిగి ప్రస్తుతం 11100 చేరువకు వెళ్లింది.

రోజుకు మరో 500 ఎంబీ డేటా ఉచితం: జియో

దిల్లీ: ప్రస్తుతం రోజుకు 1 జీబీ, 1.5 జీబీ పథకాలు వినియోగిస్తున్న చందాదార్లకు అదనంగా రోజూ 500 ఎంబీ డేటా ఇవ్వనున్నట్లు రిలయన్స్ జియో ప్రకటించింది. గణతంత్ర దినోత్సవం (ఈనెల 26) నుంచి ఈ ఆఫర్లు అమల్లోకి వస్తాయని తెలిపింది. ప్రస్తుతం రూ.98 పథకానికి 14 రోజుల కాలావధి మాత్రమే ఉండగా, ఇకపై 28 రోజులు వినియోగించుకోవచ్చు. అపరిమిత కాల్స్‌తో పాటు 28 రోజులకు కలిపి 2జీబీ డేటా లభిస్తుంది. ఇప్పటివరకు రోజుకు 1 జీబీ డేటా లభిస్తున్న పథకాలకు, ఇకపై రోజుకు 1.5 జీబీ డేటా, 1.5 జీబీ డేటా లభిస్తున్న పథకాలకు రోజుకు 2 జీబీ చొప్పున 4జీ డేటా లభించనుంది. ఆయా పథకాల ధరలను కూడా రూ.50 చొప్పున తగ్గించింది.

రోజూ 1.5 జీబీ	రూ.149	రూ.349	రూ.399	రూ.449
	28 రోజులు	70 రో	84 రో	91 రో
4జీవేగంతో	42 జీబీ	105 జీబీ	126 జీబీ	136 జీబీ
రోజూ 2 జీబీ	రూ.198	రూ.398	రూ.448	రూ.498
	28 రోజులు	70 రో	84 రో	91 రో
4జీవేగంతో	56 జీబీ	140 జీబీ	168 జీబీ	182 జీబీ

డాట్సన్ రెడిగో ఆటోమేటిక్

దిల్లీ: డాట్సన్ చిన్నకారు రెడి-గోలో ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంటీ) వెర్షన్‌ను నిస్సాన్ మోటార్ ఇండియా విపణిలోకి విడుదల చేసింది. 1 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ మోడల్ ప్రారంభ ధర రూ.3.8 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. రెడి-గో 'స్మార్ట్ డ్రైవ్ ఆటో' కారును వినియోగదారులకు అందజేయడం మంగళవారం నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. కొత్త డ్యూయల్ డ్రైవింగ్ మోడ్, రష్ హవర్ మోడ్‌లతో కారు లభించనుంది.

ఒకే రోజు 11 విక్రయశాలలు

హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆరు దేశాల్లో కొత్తగా 11 విక్రయశాలలను ప్రారంభించింది. ఇవన్నీ ఒకేరోజున ప్రారంభం కావడం విశేషం. వీటితో సంస్థకు తొమ్మిది దేశాల్లో మొత్తం విక్రయశాలల సంఖ్య 208కు చేరింది. కొత్త విక్రయశాలు యూఏఈలో అల్ ఖలీల్ మాల్, సహారా సెంటర్, అల్ బుహైరా లులు, అజ్మన్ సిటీ సెంటర్, అల్ హజనా లులు, ఖతార్‌లో మాల్ ఆఫ్ ఖతార్, లగూనా మాల్, ఒమన్‌లో మస్కట్ సిటీ సెంటర్, సింగపూర్‌లో ఏఎంకే హబ్, మలేసియాలో ఆంపాంగ్ మాల్, తెలంగాణలో వరంగల్‌లలో ప్రారంభమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా 200 విక్రయశాలలను తెరిచిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ పాల్గొన్నారు. యూఏఈలోని షార్జా దగ్గర లులు హజనా విక్రయశాలను ఆయన ప్రారంభించారు. చిత్రంలో మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపీ అహ్మద్, మలబార్ గోల్డ్ ఎండీ షామ్‌లాల్ అహ్మద్, గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేపీ అబ్దుల్ సలామ్, సీనియర్ డైరెక్టర్‌లు మయిన్ కుట్టి, ఇతర మేనేజ్‌మెంట్ బృంద సభ్యులు ఉన్నారు.



యూఏఈలోని షార్జా వద్ద లులు హజానా విక్రయశాలను ప్రారంభిస్తున్న బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్, చిత్రంలో కంపెనీ ప్రతినిధులు

పాశ్చాత్య దేశాలు గుర్తుంచుకోండి



● వర్ధమాన దేశాల సహాయం లేకుండా ముందుకెళ్లలేరు

● ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

దావోస్: వర్ధమాన దేశాల సహాయం లేకుండా పాశ్చాత్య దేశాలు వృద్ధి చెందలేవన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ పేర్కొన్నారు. పరిస్థితుల్ని చక్కదిద్దకపోతే లయ తప్పిన ప్రపంచ సమస్యల్ని ఎవరూ కూడా పరిష్కరించలేరని హెచ్చరించారు. 'పాశ్చాత్య దేశ జనాభాకు వయసైపోతోంది. వారికి కావలసిన ఉత్పత్తులన్నీ వర్ధమాన ప్రపంచం నుంచే వస్తున్నాయన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాల'ని.. ఏ ఒక్క దేశం పేరును ఉటంకించకుండా వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాల్లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'ఒక మంచి ప్రయత్నం కోసం పాశ్చాత్య ప్రపంచం మారాలి. లేదంటే.. ప్రపంచ సమస్యలన్ని తీర్చగలగడం కష్టతరమవుతుంద'ని అన్నారు. ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో సాంకేతికత, జనాభా వయసు, వాతావరణ మార్పులు తదితర సమస్యలను ఎదుర్కొంటోంది. 'సింగపూర్ వంటి కొన్ని ప్రభుత్వాలు ఆదాయ అసమానతలు, ఇతరత్రా సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించాయి. అమెరికా విషయం నాకు తెలియదు కానీ కొన్ని దేశాలు మాత్రం గట్టిగానే ప్రయత్నిస్తున్నాయ'ని చెప్పుకొచ్చారు.

నాలుగో పారిశ్రామిక విప్లవంతో ఆదాయ అసమానతలు

డెలాయిటీ నివేదిక

కృత్రిమ మేధ వంటి కొత్త తరం సాంకేతికతలను అందిపుచ్చుకోవడం పెరగడంతో భవిష్యత్‌లో భారత్, దక్షిణాఫ్రికా, చైనా వంటి దేశాల్లో సామాజిక, ఆదాయ అసమానతలు పెరగవచ్చని ఓ నివేదిక అంటోంది. నాలుగో పారిశ్రామిక విప్లవం(ఇండస్ట్రీ 4.0) తెచ్చిపెట్టే మార్పులపై డబ్ల్యూఈఎఫ్ సమావేశంలో డెలాయిటీ గ్లోబల్ ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. 'భారత్, దక్షిణాఫ్రికా, చైనా దేశాల్లో ఇటీవల ప్రధాన ఆర్థిక, రాజకీయ మార్పులు జరిగాయి. వీటి ప్రభావంతో అధిక వృద్ధి నమోదవుతోంది. అయితే భవిష్యత్‌లో దీని వల్ల సామాజిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికన్లు మాత్రం తమపై అంత ప్రభావం ఉండకపోవచ్చని పేర్కొంటున్నారు.'

పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయం భారత్

పీడబ్ల్యూసీ నివేదిక

పెట్టుబడులు, వ్యాపారావకాల విషయంలో అత్యంత ఆకర్షణీయమైన దేశాల్లో భారత్‌కు అయిదో స్థానం లభించింది. పీడబ్ల్యూసీ నిర్వహించిన ఈ సర్వే ప్రకారం.. జపాన్‌ను తోసిరాజని భారత్ ఈ స్థానాన్ని దక్కించుకుంది. గతేడాది భారత్ ఆరో స్థానంలో ఉంది. ఇక అగ్రస్థానంలో అమెరికా నిలిచింది. 46 శాతం మంది సీఈఓలు ఆ దేశానికి ఓటేశారు. ఇక ఆ తర్వాతి స్థానంలో చైనా(33%), జర్మనీ(20%), బ్రిటన్(15%), భారత్(9%)లు నిలిచాయి. గతేడాదితో పోలిస్తే వ్యూహాత్మక సంస్కరణల మూలంగా భారత్ మెరుగ్గా కనిపిస్తోందని పీడబ్ల్యూసీ ఇండియా ఛైర్మన్ శ్యామల్ ముఖర్జీ పేర్కొన్నారు. కాగా, 40 శాతం మంది సీఈఓలు భౌగోళిక, రాజకీయ అనిశ్చితులపై తీవ్ర ఆందోళనతో ఉండగా.. 41% మంది ఉగ్రవాదంపై ఎక్కువ భయపడుతున్నారు. ఇంకా కీలక నైపుణ్యాల లభ్యత(38%), పక్షపాత ధోరణి(35%), విదేశీ మారక ఊగిసలాట(29%), మారుతున్న వినియోగదారు ధోరణి(26%) తదితరాలపైనా ఆందోళనతోనే ఉన్నారు. ఈ సారి వృద్ధికి విఘాతం కలిగించే తొలి 10 అంశాల్లో ఉగ్రవాదం ఉండగా.. గతేడాది మాత్రం కేవలం 20 శాతం మంది మాత్రమే ఆ అభిప్రాయంతో ఉన్నారు. ఇక విధానాల పరంగా చూస్తే.. నియంత్రణల పరంగా అధిక నిబంధనల పట్ల(40%); పెరుగుతున్న పన్ను(36%)పై కూడా ఎక్కువ మంది సీఈఓలు ఆందోళన చెందుతున్నారు.

భారత్‌లో అపార అవకాశాలు: గోయల్

అంతర్జాతీయ పెట్టుబడులకు భారత్‌లో అపార అవకాశాలున్నాయని, ఇంతటి వీలు మరే దేశంలోనూ లేదని కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై నాయకత్వ స్థానానికి భారత్ చేరువవుతోందని, సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపుతోందని వివరించారు. ప్రపంచ ఆర్థికస్థితి, సామాజిక ఉద్రిక్తలు, వాతావరణ మార్పులు.. ఇలా ఏ అంశం తీసుకున్నా, భారత్ పాత్ర ఇనుమడిస్తోందని ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన మంత్రి వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యక్తిగత ప్రాచుర్యానికి తోడు ప్రపంచ నాయకుల గౌరవం పొందుతూ, సమస్యల పరిష్కారానికి నేతృత్వం వహించేలా ఎదిగారని ప్రశంసించారు. 125 కోట్ల మంది భారతీయులకు ఇది గౌరవప్రద విషయమన్నారు. సూపర్ పవర్‌గా భారత్ అవతరిస్తుండటం, సరికొత్త ఆర్థిక వ్యవస్థతో రూపుమారుతున్నందునే ప్రపంచం ఆసక్తి ప్రదర్శిస్తోందని వివరించారు. గత మూడేళ్లుగా శరవేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ మనదని, మౌలిక వసతుల కల్పనలో భారీ అవకాశాలను అందరూ గమనిస్తున్నారని తెలిపారు. 2 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులకు ఈ రంగంలో అవకాశాలున్నాయని మంత్రి గుర్తు చేశారు.

భారత ఆర్థిక వ్యవస్థలో మహిళలను భాగస్వాములను చేయాలి

ఐఎమ్ఎఫ్ అధిపతి క్రిస్టీన్ లగార్డే

భారత్ తన సంస్కరణలను కచ్చితంగా కొనసాగించాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎమ్ఎఫ్) సంస్థ అధిపతి క్రిస్టీన్ లగార్డే సూచించారు. ముఖ్యంగా ఆర్థిక రంగ సంస్కరణలపై దృష్టి సారించాలని తెలిపారు. ఇంకా భారత్ తన ఆర్థిక వ్యవస్థలో విస్తృతంగా, వాస్తవంగా మహిళలను భాగస్వాములు చేయడంపై తక్షణం పరిశీలన చేపట్టాలని అన్నారు. డబ్ల్యూఈఎఫ్ వార్షిక సమావేశాలకు హాజరైన మహిళా సహ-అధిపతులతో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ 'గ్రామీణ భారత్‌లో మహిళలు ఎదుర్కొంటున్న అత్యధిక స్థాయి అసమానతలపై ఆందోళన కలుగుతోంది. ఈ అంశాన్ని సత్వరం పరిష్కరించాల్సిన అవసరం ఉంద'ని అన్నారు. ఈ ఏడాది భారత్ 7.4 శాతం వృద్ధి సాధిస్తుందన్న ఐఎమ్ఎఫ్ అంచనాలను ఆమె పునరుద్ఘాటిస్తూ.. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత సంస్కరణలను ఎలా ముందుకు తీసుకెళుతుందన్నదానిపై భవిష్యత్ వృద్ధి ఆధారపడి ఉంటుందని అభిప్రాయపడ్డారు.


సంస్కరణల పథంతో 10% వృద్ధి: పనగడియా

న్యూయార్క్: భారత్‌కు 10 శాతం వృద్ధి సాధించే సామర్థ్యం ఉందని నీతి ఆయోగ్ మాజీ ఛైర్మన్ అరవింద్ పనగడియా పేర్కొన్నారు. అయితే కార్మిక చట్టాలు, భూ సేకరణ వంటి ప్రధాన సంస్కరణలు జరగాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 'నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి మూడేళ్లలో భారత్ 7.5 శాతం వృద్ధి చెందింది. అయితే పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు వంటి రెండు ప్రధాన సంస్కరణలు వృద్ధిపై కొంత ప్రభావాన్ని చూపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని భారత్ 6.5 శాతం వృద్ధితో ముగించవచ్చు. అది కూడా మంచి వృద్ధి రేటే'నని ఆయన అన్నారు. 'భారత్ ఎనిమిది శాతానికి పైగా వృద్ధిని సాధిస్తుందనడంలో సందేహం లేద'ని ప్రతిష్ఠాత్మక కొలంబియా యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్ర ఆచార్యుడిగా సేవలందిస్తున్న పనగడియా ఇక్కడ జరిగిన 'న్యూ ఇండియా' ప్రసంగాల ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి పేర్కొన్నారు. 'చైనా 6-7 శాతం వరకు వృద్ధితో రాణిస్తున్నప్పటికీ వచ్చే అయిదేళ్లలో అది తగ్గే ప్రమాదం ఉంది. అదే భారత్ విషయానికొస్తే.. భారీ తప్పులు చేస్తే తప్ప వచ్చే రెండు దశాబ్దాల పాటు అధిక వృద్ధి రేటును కొనసాగించే సత్తా ఉంది. అది కూడా ప్రస్తుత సంస్కరణల సాయంతోనే. భారత్‌కు 10 శాతం వృద్ధి సాధించే సత్తా అయితే ఉంద'ని అన్నారు. రాబోయే బడ్జెట్.. గత బడ్జెట్లతో పోలిస్తే వైవిధ్యంగా ఏమీ ఉండకపోవచ్చునని, సంస్కరణలు కొనసాగొచ్చునని పేర్కొన్నారు.

మళ్లీ ఆల్టోకే అగ్రస్థానం

అగ్రగామి 10 మోడళ్లలో మారుతీ హవా

దిల్లీ: దేశీయ ప్రయాణికుల వాహనాల విపణిలో మారుతీ సుజుకీ జోరు కొనసాగుతోంది. డిసెంబరులో అత్యధిక అమ్మకాలు జరిగిన 10 మోడళ్లలో ఆరు మారుతీ సుజుకీవే కావడం విశేషం. ఇక తొలిపదిలో 3 హ్యుందాయ్ మోటార్‌కు చెందినవి ఉన్నాయి. వాహన తయారీదార్ల సంఘం (సియామ్) గణాంకాల ప్రకారం.. మారుతీ సుజుకీ చిన్న కారు ఆల్టో అగ్రస్థానంలో నిలిచింది. డిసెంబరులో అల్టో కార్లు 20,346 అమ్ముడయ్యాయి. 2016 డిసెంబరులో అమ్ముడైన 17,351 ఆల్టోలతో పోలిస్తే ఇది 17.26 శాతం ఎక్కువ. ఇక రెండో స్థానంలో కంపెనీ కాంపాక్ట్ సెడాన్ మోడల్ డిజైర్ నిలిచింది. ఇక 14,551 విక్రయాలతో బాలెనో మూడో స్థానం దక్కించుకుంది.



గోఎయిర్ రిపబ్లిక్ డే ప్రత్యేక తగ్గింపు

ఈనాడు, హైదరాబాద్: గో ఎయిర్ గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణానికి అన్నీ కలిపి రూ.1,326 ధరను ప్రకటించింది. 2018, మార్చి 1 నుంచి డిసెంబరు 31 మధ్య ప్రయాణం చేయడానికి జనవరి 24 నుంచి 28 తేదీల మధ్య బుకింగ్ చేసుకునే ప్రయాణానికి ఈ ఆఫర్ వర్తిస్తుందని కంపెనీ వెల్లడించింది. గో ఎయిర్ వెబ్‌సైట్ ద్వారా టికెట్ బుక్ చేసుకునే వారికి జూమ్ కారు నుంచి రూ.1,200, లెన్స్‌కార్ట్ నుంచి రూ.1,000 విలువైన వోచర్లు లభిస్తాయని వివరించింది. పేటీఎం ద్వారా చెల్లింపు చేస్తే రూ.250 క్యాష్ బ్యాక్ సౌకర్యం ఉంది. గోఎయిర్ మొబైల్ యాప్ ద్వారా కొనుగోలు చేస్తే 10 శాతం డిస్కౌంట్ ఉంటుందని కంపెనీ పేర్కొంది.

అలస్కా, జకార్తాల్లో తీవ్ర భూకంపం

● జపాన్‌లో అగ్నిపర్వత విస్ఫోటం

వాషింగ్టన్/జకార్తా/టోక్యో: అలస్కా తీరం వద్ద అత్యంత భారీస్థాయి... ఇండోనేసియా ద్వీపం జకార్తాలో ఓ మోస్తరు తీవ్రమైన భూకంపాలు మంగళవారం సంభవించాయి. అలస్కా, కెనడా పశ్చిమ తీరాలకు సునామీ హెచ్చరికలు జారీ అయినాయి.

జపాన్‌లో అగ్నిపర్వత విస్ఫోటనం సంభవించింది. జపాన్‌లోని పేరుగాంచిన మంచు క్రీడలకు కేంద్రమైన ఓ స్కీయింగ్ రిసార్ట్ సమీపంలో సంభవించిన ఈ విస్ఫోటం మంచుతుపానుకు కారణమైంది. మంచుతుపాను దాటికి పలువురు గాయపడ్డారు....పెద్దసంఖ్యలో ప్రజలు ఓ పర్వతంపై చిక్కుకుపోయారు.

అలస్కాకు సునామీ హెచ్చరిక

'అత్యవసర ప్రమాద హెచ్చరిక. తీరానికి సునామీ ముప్పు పొంచి ఉంది. ఎగువప్రాంతానికి వెళ్లిపోండి' అంటూ అలస్కాలోని సెల్‌ఫోన్‌లకు ప్రమాద హెచ్చరికల సందేశాలు అందాయి. అలస్కాలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిపోవలసిందిగా సూచనలు అందాయి.

అలస్కా దక్షిణ తీరం వద్ద మంగళవారం సంభవించిన భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 8.2గా నమోదైంది. అక్కడి కాలమానం ప్రకారం ఉదయం 9 గంటల 31 నిముషాల ప్రాంతంలో అలస్కా జలసంధి వద్ద కొడియాక్ పట్టణానికి 280 కిలోమీటర్ల దూరంలో భూకంపం సంభవించింది. దీంతో, అలస్కా, కెనడా పశ్చిమ తీరాలకు సునామీ హెచ్చరికలను జారీ చేసినట్లు జాతీయ సునామీ హెచ్చరిక కేంద్రం వెల్లడించింది. సముద్రగర్భంలో పదికిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియాలజికల్ సర్వే వెల్లడించింది.



ఫిలిప్పీన్స్‌లో బద్దలైన అగ్నిపర్వతం నుంచి చిమ్ముతున్న నిప్పుల మాదిరి ఎగసిపడుతున్న లావా

జావాలో భూకంపం కలవరం

ఇండోనేసియా ద్వీపం అయిన జావాను కూడా మంగళవారం ఓ మోస్తరు భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై 6.0గా నమోదైన ఈ భూకంపం తీవ్రతకు పశ్చిమ జావాలోని తీరప్రాంతంలో వందలాది ఇళ్లు.....కొన్ని ప్రార్థనాస్థలాలు, ఆసుపత్రి భవనాలు దెబ్బతిన్నాయి. ఓ పాఠశాల పై కప్పు విరిగిపడి ఆరుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. భూకంపం తీవ్రతకు భవంతులు పది నుంచి ఇరవై సెకండ్లపాటు కంపించాయి. భయభ్రాంతులైన ప్రజలు ఒక్కసారిగా ఇళ్లల్లో నుంచి పరుగెత్తుకుంటూ వెలుపలికి వచ్చేశారు. కొన్ని భవంతుల నుంచి ప్రజలను అధికారులు ఖాళీ చేయించేశారు. అయితే, జావాలో సంభవించిన భూకంపం సునామీకి కారణమయ్యేంత తీవ్రంగా లేదని అధికారులు వెల్లడించారు.

ముసురుకున్న పొగ.. మంచుతుపాను బీభత్సం

జపాన్‌లోని ప్రముఖ స్కీయింగ్ రిసార్ట్ సమీపంలో ఒక్కసారిగా అగ్నిపర్వత విస్ఫోటం సంభవించింది. భారీ మంచుతుపానుకు దారితీసింది. మంచుతుపాను దాటికి పలువురు గాయపడ్డారు. అగ్నిపర్వతంలో ఓ వైపు లావా విరజిమ్మిన అనంతరం చిక్కటి నల్లటి పొగ వెలువడింది. మరోవైపు అదేప్రాంతంపై గడ్డకట్టిన మంచు పెళ్లలు ఒక్కసారిగా విరిగి పడిపోయాయి. ఏటవాలుగా ఉన్న స్కీయింగ్ వేదిక నుంచి ఈ మంచుపెళ్లలు జారి పడిపోయాయి. శిక్షణ కార్యక్రమం నిమిత్తం మౌంట్ కుసత్సుశిరానెపై కి చేరిన ఆరుగురు సైనికుల్ని అధికారులు అంతకుముందు రక్షించారు. నల్లని, చిక్కటి పొగమేఘంలో చిక్కుకున్న పరిసరాల్లోని ఆవాసాల నుంచి కనీసం వందమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరోవైపు గండోలాలో ఉన్న సుమారు 78 మంది ప్రజలు విద్యుత్ వసతి నిలిచిపోవడంతో అందులోనే ఉండాల్సి వచ్చింది. వారిని ఎలా సురక్షిత ప్రదేశానికి తరలించాలనే విషయమై తర్జన భర్జనలు పడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ ఏడాదీ నిరుద్యోగంలో మార్పు ఉండదు: ఐఎల్‌వో

జెనీవా/ దావోస్: ప్రపంచ ఆర్థిక రంగం కుదుటపడుతున్నా, మానవ వనరుల పెరుగుదల వస్తున్న కారణంగా ప్రపంచంలో నిరుద్యోగిత 2018 సంవత్సరంలోనూ గత ఏడాది మాదిరిగానే ఉంటుందని 'అంతర్జాతీయ కార్మిక సంస్థ' (ఐఎల్‌వో) నివేదిక పేర్కొంటోంది. 'ప్రపంచ ఉపాధి రంగం... సామాజిక దృక్పథం: 2018లో పోకడలు' పేరుతో ఈ నివేదికను వెలువరించింది. 2017 నాటికి మొత్తం నిరుద్యోగుల సంఖ్య 19.20 కోట్లకు చేరి ఉంటుందని అంచనా వేసింది. గత ఏడాది 5.6 శాతంగా ఉన్న నిరుద్యోగిత ప్రస్తుత ఏడాది 5.5 శాతంగా ఉంటుందని తెలిపింది. 2017లో 1.4 బిలియన్ల మంది కార్మికులు ఉంటే 2019 నాటికి మరో 3.50 కోట్ల మంది పెరుగుతారని తెలిపింది.

సేవారంగంలో ఉద్యోగాలు ఎక్కువ: 'సేవా రంగంలో ఉద్యోగాలు ఎక్కువగా లభిస్తాయి. వ్యవసాయ/ తయారీ రంగంలో అవకాశాలు తగ్గుతూ వస్తాయి' అని ఐఎల్‌వో పరిశోధన విభాగం డైరెక్టర్ సాంఘియన్ లీ తెలిపారు. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో మాత్రం అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే కొంత తక్కువగా, అంటే 4.2% నిరుద్యోగ సమస్య ఉంటుందని ఐఎల్‌వో అంచనా. స్పెయిన్, గ్రీస్‌లలో నిరుద్యోగ సమస్య తగ్గుతుందని తెలిపింది.

సీజేఐపై అభిశంసన తీర్మానానికి సీపీఎం యోచన

దిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్రపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు సీపీఎం యోచిస్తోంది. ఈమేరకు ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు ప్రారంభించింది. ఇటీవల సుప్రీంకోర్టుకు చెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు సీజేఐ వ్యవహారశైలిని తప్పుపడుతూ పలు అంశాలను లేవనెత్తిన సంగతి తెలిసిందే. దాదాపు 2 వారాలవుతున్నా ఆ వివాదం న్యాయవ్యవస్థ పరిధిలో సమసిపోలేదని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. ఈమేరకు సీజేఐపై అభిశంసన తీర్మానానికి సంబంధించి ఆయన ఎన్‌సీపీ నేత తారిఖ్ అన్వర్, జేడీయూ తిరుగుబాటు నేత శరద్ యాదవ్‌లను కలిసి చర్చించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం ప్రవేశపెట్టేలా ఇతర పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు ఏచూరి మంగళవారం తెలిపారు.

బెయిల్ మంజూరుకు విదేశీయత ప్రత్యేక అర్హత కాదు!

● సుప్రీంకోర్టు స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: విదేశీయతను ప్రత్యేకంగా పరిగణించి నిందితులకు బెయిల్ ఇవ్వరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఓ కేసులో తీర్పు చెప్పింది. "సీఆర్‌పీసీలోని సెక్షన్ 439 ప్రకారం చట్టం ముందు ఎవ్వరైనా సమానమే. జాతీయత ఆధారంగా ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదు" అని న్యాయమూర్తులు తమ తీర్పులో పేర్కొన్నారు. బ్రిటిష్ జాతీయుడైన రేషన్‌చంద్ కలేర్‌కు మరి కొందరితో కలిసి తలెత్తిన భూవివాదంలో ఒకరిపై కాల్పులు జరిపారు. వాగ్వాద సమయంలో జరిగిన ఈ సంఘటనలో మరికొందరు గాయపడినట్లు ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో ప్రధాన నిందితుడైన కలేర్‌కు పంజాబ్, హరియాణా హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన కేసులో సుప్రీంకోర్టు తాజాగా తీర్పును వెలువరించింది.

వైవాహిక స్థితిపై ఎన్ఐఏ దర్యాప్తు తగదు

దిల్లీ: కేరళలో లవ్‌జిహాద్ బాధితులైన స్త్రీ, పురుషుల వైవాహిక స్థితిపై 'జాతీయ దర్యాప్తు సంస్థ' (ఎన్ఐఏ) విచారణ చేపట్టడం తగదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'లవ్‌జిహాద్ బాధితురాలుగా చెబుతున్న కేరళకు చెందిన 25 ఏళ్ల మహిళ హదియా న్యాయస్థానానికి హాజరై తనంత తానుగానే షఫీన్ జహాన్‌ను వివాహం చేసుకున్నట్లు తెలిపింది. తాను ఎంచుకున్న భాగస్వామి మంచివాడా, కాదా అనేది నిర్ణయించుకోవాల్సింది ఆమే. ఆమె వయోజనురాలు. ఓ ఎక్స్, వై, లేదా జడ్‌ను పెళ్లి చేసుకోరాదని ఎవరైనా ఆమెకు ఎలా చెప్పగలరు? అందువల్ల నేర కోణం నుంచి వివాహ విషయాన్ని విభజించాలి. లేదంటే చట్టంలో ఓ దుష్ట దృష్టాంతాన్ని సృష్టించినట్లవుతుంద'ని వ్యాఖ్యానించింది.

అమెరికాలో ముగిసిన ప్రతిష్టంభన

● తాత్కాలిక బడ్జెట్‌కు కాంగ్రెస్ ఆమోదం

వాషింగ్టన్: అమెరికాను మూడు రోజుల పాటు కుదిపేసిన ప్రభుత్వ ప్రతిష్టంభన ఎట్టకేలకు ముగిసింది. అక్రమ వలసదారుల భవితపై డెమోక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య ఒక అవగాహన కుదరడంతో.. తాత్కాలిక బడ్జెట్‌కు కాంగ్రెస్‌లోని ఉభయ సభల నుంచి ఆమోదం లభించింది. ఈ బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేయడంతో ప్రభుత్వ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. పలు దఫాలుగా జరిగిన చర్చల అనంతరం.. యువ అక్రమ వలసదారుల భవితను కాపాడే అంశంపై డెమోక్రాట్లకు హామీ లభించింది. దీంతో కాంగ్రెస్ ఉభయ సభల్లో తాజాగా జరిగిన ఓటింగ్‌లో వారు తాత్కాలిక బడ్జెట్‌కు అనుకూలంగా ఓటువేశారు.

డీఎన్ఏ పరీక్షలే నేతాజీ మరణం మిస్టరీని ఛేదిస్తాయి: అనితాబోస్

దిల్లీ: తన తండ్రి మృతిపై నెలకొని ఉన్న అనుమానాలు ఆయన శరీర అవశేషాలపై డీఎన్ఏ పరీక్షలను నిర్వహించడం ద్వారా పటాపంచలైపోతాయని నేతాజీ కుమార్తె అనితాబోస్ పేర్కొన్నారు. ఆయన అంత్యక్రియల అనంతరం మిగిలి ఉన్న అస్థికల నుంచి సేకరించిన డీఎన్ఏను పరీక్షిస్తేనే అది సాధ్యపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. 1945 సెప్టెంబరు నుంచి టోక్యోలోని రెంకోజీ ఆలయంలో నేతాజీ శరీర అవశేషాలను భద్రపరిచి ఉన్నట్లు భావిస్తున్న విషయం గమనార్హం. 'లెయిడ్ టు రెస్ట్: ది కాంట్రవర్సీ ఓవర్ సుభాష్‌చంద్రబోసెస్ డెత్' అనే పుస్తకానికి రాసిన ముందుమాటలో అనితాబోస్ ఈ డీఎన్ఏ పరీక్షల గురించి ప్రస్తావించారు. ఈ పుస్తకాన్ని ఆశిష్ రే రాశారు.

బ్రిటన్‌లో భారత బృందం బసచేస్తున్న హోటల్ సమీపంలో గ్యాస్ లీక్

లండన్: బ్రిటన్‌లో భారత ప్రతినిధుల బృందం బస చేస్తున్న హోటల్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గ్యాస్ లీకయ్యింది. దీంతో అందరినీ హుటాహుటిన వేరేప్రాంతానికి తరలించారు. ప్రపంచ విద్యా వేదిక- (ఈడబ్ల్యూఎఫ్)2018 సదస్సు కోసం ఈ బృందం బ్రిటన్ వచ్చింది. దీనిలో ఉత్తర్ ప్రదేశ్ డిప్యూటీ సీఎం దినేశ్ శర్మ కూడా ఉన్నారు. వీరికి చారింగ్ క్రాస్ ప్రాంతంలోని అంబా హోటల్‌లో ఆతిథ్యమిచ్చారు.

భాజపాతో మైత్రికి శివసేన రాంరాం

● వచ్చే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరే

● పార్టీ అధ్యక్షుడిగా మళ్లీ ఎన్నికైన ఉద్ధవ్ ఠాక్రే

ముంబయి: భాజపాతో చెలిమికి శివసేన ముగింపు పలకనుంది! వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగనున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. ఇకపై మహారాష్ట్ర వెలుపల ఇతర రాష్ట్రాల్లోనూ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలిపింది. పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో మంగళవారం ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంది. శివసేన అధ్యక్షుడిగా ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ ఎన్నికయ్యారు. భాజపాతో వేరుపడి వచ్చే ఏడాది ఎన్నికల్లో ఒంటరిగా బరిలో దిగే ప్రతిపాదనతో శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ప్రవేశపెట్టిన తీర్మానం తాజా కార్యవర్గ సమావేశాల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. హిందూత్వం పేరుతో



భాజపా తమతో జట్టు కట్టిందని.. అయితే, గత మూడేళ్లుగా ఆ పార్టీ అధికార బలంతో తమను నైతికంగా దెబ్బతీస్తోందని రౌత్ ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో భాజపాతో పొత్తు ఉండదని ప్రకటించినప్పటికీ.. ప్రస్తుతం కేంద్రం, మహారాష్ట్రలో భాజపాతో కలిసి కొనసాగుతారా? లేదా? అనే విషయాన్ని శివసేన స్పష్టంగా చెప్పలేదు. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వంపై ఉద్ధవ్ ఠాక్రే విమర్శలు గుప్పించారు. కేంద్రం, మహారాష్ట్రలో భాజపాతో మిత్రపక్షమైన శివసేన.. వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ), రైతుల సమస్యలు వంటి అంశాలపై భాజపాను పదేపదే విమర్శించిన సంగతి తెలిసిందే.

ఆగ్నేయాసియా నేతలతో ప్రధాని మోదీ విస్తృత చర్చలు

● 3 రోజుల్లో 9 ద్వైపాక్షిక సమావేశాలు

దిల్లీ: ఉగ్రవాదంపై పోరులో కలిసి పనిచేయటంతో పాటు ఆసియా దేశాలతో మరింత అనుసంధానతను, కోరుకుంటున్న భారత్ ఆ దిశగా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఆసియాన్ దేశాలతో 25 ఏళ్ల స్నేహబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఈనెల 25న దిల్లీలో సదస్సును నిర్వహిస్తోంది. ఈ సదస్సుకు హాజరు కావటంతో పాటు గణతంత్ర వేడుకలకు అతిథులుగా తొలిసారిగా విచ్చేస్తున్న ఆసియాన్ దేశాల నేతలతో ప్రధాని నరేంద్ర మోదీ విస్తృత సంప్రదింపులు జరుపనున్నారు. వచ్చే మూడు రోజుల్లో 9 ద్వైపాక్షిక సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. దీనిలో భాగంగా బుధవారం వియత్నాం ప్రధాని న్యూయాన్ జుయాన్ ఫ్యూక్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రొడ్రిగో ద్యుతెర్టె, మయన్మార్ స్టేట్ కౌన్సెలర్ ఆంగ్ సాన్ సూచీలతో భేటీ అవుతారు.

పట్టిసీమపై పట్టు!

● రూ.350 కోట్లు అ'ధనం' ఇచ్చేశారు: వైకాపా

● ఆ ప్రాజెక్టువల్లే నెల్లూరుకు నీరొచ్చాయ్: తెదేపా

● ప్రజాపద్దుల కమిటీలో చర్చ

ఈనాడు, అమరావతి: పట్టిసీమ ప్రాజెక్టులో ప్రజాధనం దుర్వినియోగమైందని ఒకరు... కాదు ఆ ప్రాజెక్టువల్లే నెల్లూరు వరకూ నీరొచ్చిందని, రాయలసీమ ప్రాజెక్టులకూ దన్నుగా నిలిచిందని మరొకరు.. పద్ధతి ప్రకారమే పనులిచ్చాం.. కాగ్ అభ్యంతరాలను డ్రాప్ చేయండంటూ అధికారులు.. ఇదీ అసెంబ్లీ కమిటీ హాలులో మంగళవారం జరిగిన అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) సమావేశంలో సభ్యుల మధ్య జరిగిన చర్చ, వాద ప్రతివాదాలు. కమిటీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో పట్టిసీమపై ప్రధాన చర్చ సాగింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కమిటీలో సభ్యుడిగా ఉన్న ఎమ్మెల్యే ఎ.సురేష్ (వైకాపా) మాట్లాడుతూ... ప్రాజెక్టులో రూ.350 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందంటూ లెక్కలతో సహా కాగ్ అభ్యంతరాలనూ ఉటంకిస్తూ అధికారులను ప్రశ్నించారు.. మరో సభ్యుడు ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్ (తెదేపా) కలగజేసుకుని పట్టిసీమవల్లే నీరొచ్చాయని వ్యాఖ్యానించారు. 'నదుల అనుసంధానం అనే గొప్ప లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్టు పట్టిసీమ. దీనివల్లే కృష్ణా డెల్టాకు, అంతెందుకు నెల్లూరుకూ 5 టీఎంసీల నీరొచ్చింది' అని రవిచంద్ర పేర్కొన్నారు. వారిరువురి మధ్య వాదన జరుగుతుండగా కమిటీ ఛైర్మన్ బుగ్గన కలగజేసుకుని... పట్టిసీమ సామర్థ్యం మేర నీరు రాలేదని, పైగా డబ్బు దుర్వినియోగమైందని కాగ్ స్పష్టంగా చెబుతోంది కదా అని వ్యాఖ్యానించారు. సాగునీటి పారుదలశాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు ఇతర ఉన్నతాధికారులు శాఖాపరంగా వాదన వినిపించారు. చర్చను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని సురేష్‌పై రవిచంద్ర వ్యాఖ్యానించారు. దీంతో తాము సబ్జెక్టుపైనే మాట్లాడుతున్నామని సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కమిటీలో మరో సభ్యుడైన భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు కలగజేసుకుని.. ఎక్సయిజ్ సుంకం కింద గుత్తేదారుకు చెల్లించిన మొత్తాన్ని రికవరీ చేయాలని, ప్రాజెక్టులో ఇలా అదనపు చెల్లింపులు చేసుకుంటూ పోవడమేంటని, మీ సొంత డబ్బయితే ఇలాగే ఇచ్చేస్తారా? అని ప్రశ్నించారు. తనకు సమావేశానికి రావడానికి విమాన టిక్కెట్ల మొత్తాన్ని చెల్లిస్తారని, అయినా రైలులోనే వస్తున్నానని, ప్రభుత్వ ధనం దుర్వినియోగం కారాదనే ఇలా చేస్తున్నామని తెలిపారు. ఎక్సయిజ్ సుంకం మినహాయింపు విషయమై కేంద్ర ఉత్తర్వుల్లో వేర్వేరు క్లాజుల్లో వేరుగా ఉందని, ఆ క్లాజుల ప్రకారం చెల్లించాల్సిన మొత్తం ఇచ్చామని ఓ ఉన్నతాధికారి కమిటీకి నివేదించారు. కాగ్ అభ్యంతరాలను డ్రాప్ చేయాలని అధికారులు కమిటీకి విజ్ఞప్తి చేశారు. చివరగా.. తర్వాత సమావేశానికి పట్టిసీమలో దేనికెంత అంచనా? ఎంత చెల్లించారు? కచ్చితమైన వివరాలను తీసుకురావాలని అధికారులను కమిటీ ఆదేశించింది.



గణతంత్ర దినోత్సవంనాడు రాజ్‌పథ్‌లో ప్రదర్శించబోయే ఆకాశ్వాణి శకటం.. మంగళవారం నిర్వహించిన రిహార్సల్స్‌లో ఆకట్టుకున్న దృశ్యం

రూ.2 వేలకు మించి నగదు రూపంలో వద్దు

● పార్టీలకు విరాళాలపై ప్రజలను హెచ్చరించిన ఆదాయపు పన్నుశాఖ

దిల్లీ: రాజకీయ పార్టీలకు నగదు రూపంలో రూ.2 వేల కంటే ఎక్కువ విరాళం ఇవ్వకూడదని ప్రజలను ఆదాయపు పన్నుశాఖ హెచ్చరించింది. నగదు అక్రమ లావాదేవీలకు దూరంగా ఉండాలని కోరింది. పలు ప్రముఖ దినపత్రికల్లో మంగళవారం ఈ మేరకు ప్రకటనలు జారీ చేసింది. నమోదిత ట్రస్టులు, రాజకీయ పార్టీలకు రూ.2 వేల కంటే ఎక్కువమొత్తాన్ని నగదు రూపంలో విరాళమివ్వకూడదని అందులో స్పష్టం చేసింది. నగదురహిత లావాదేవీలు జరపాలని.. అక్రమాలకు దూరంగా ఉండాలని ప్రకటనలో ఆదాయపు పన్నుశాఖ ప్రజలను కోరింది. ఒకే కార్యక్రమం/ఒకే సందర్భానికి సంబంధించి ఒక వ్యక్తి నుంచి ఒక్కరోజులో రూ.2 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదును స్వీకరించకూడదని సూచించింది.

విదేశీ బొగ్గులో అవినీతి దిగుమతి

● రూ.487 కోట్ల మేర కుంభకోణం

● సీబీఐ దర్యాప్తు ప్రారంభం

దిల్లీ: ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి సంస్థలకు నాణ్యమైన విదేశీ బొగ్గును సరఫరా చేస్తామని టెండరు దక్కించుకున్న సంస్థలు భారీ మోసానికి పాల్పడిన వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. ప్రైవేటు సంస్థలతో చేతులు కలిపి కుట్రకు సహకరించిన మూడు ప్రభుత్వ రంగ సంస్థల అధికారుల పాత్రనూ కేంద్ర దర్యాప్తు సంస్థ నిగ్గు తేల్చనుంది. 2011-12, 2014-15 సంవత్సరాల్లో బొగ్గు దిగుమతుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై రెవెన్యూ నిఘా విభాగ డైరెక్టరేట్ (డీఆర్ఐ) దర్యాప్తు ఆధారంగా సీబీఐ ఈ చర్యలకు ఉపక్రమించింది. నాసిరకం బొగ్గును సరఫరా చేయటమే కాకుండా దానిని నాణ్యమైనదిగా చూపటం, అధిక ధరను వసూలు చేయటం ద్వారా దాదాపు రూ.487 కోట్ల నష్టం ప్రభుత్వ రంగ సంస్థలైన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ), ఆరావళి పవర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ (ఏపీసీపీఎల్)లకు వాటిల్లిందని సీబీఐ తన ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)లో పేర్కొంది. చెన్నైలోని కోస్టల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ (సీఈపీఎల్) ప్రమోటర్ అహ్మద్ ఏఆర్ బుహారితో పాటు ఎన్టీపీసీ, ఏపీసీపీఎల్, మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్(ఎంఎంటీసీ)కు చెందిన గుర్తుతెలియని అధికారులపైనా నేరపూరిత కుట్ర కేసులను దాఖలు చేసింది.

మోసానికి పాల్పడిందిలా..: ఎన్టీపీసీ, ఏపీసీపీఎల్(ఎన్టీపీసీ-హరియాణా, దిల్లీ ప్రభుత్వాల సంయుక్త సంస్థ) తమ విద్యుత్ కేంద్రాలకు విదేశీ బొగ్గు కావాలంటూ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించాయి. ఈ టెండర్లలో అధిక భాగం సీఈపీఎల్, మిగిలిన వాటిని ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎంఎంటీసీ దక్కించుకుంది. అయితే, ఒప్పందం ప్రకారం ఈ రెండు సంస్థలు ఇండోనేసియా నుంచి నాణ్యమైన బొగ్గును నేరుగా దిగుమతి చేసుకోలేదు. దుబాయ్‌లోని తమ అనుబంధ కంపెనీ ద్వారా నాసిరకమైన బొగ్గును సీఈపీఎల్ తెప్పించింది. ఇక ఎంఎంటీసీ కూడా సీఈపీఎల్, దుబాయ్‌లోని దాని అనుబంధ సంస్థతో త్రైపాక్షిక ఒప్పందాన్ని చేసుకుని వాటి ద్వారానే బొగ్గు తెప్పించింది. మొత్తంగా ఎన్‌టీపీసీ, ఏపీసీపీఎల్‌ల ద్వారా సీఈపీఎల్‌కు రూ.363 కోట్లు, ఎంఎంటీసీకి రూ.124 కోట్లు మేర అసలు సరకు విలువను మించి చెల్లింపులు జరిగినట్లు డీఆర్ఐ నిర్ధరించింది.

భర్త, బంధువుల కళ్లెదుటే మహిళపై అత్యాచారం

● గురుగ్రామ్‌లో దారుణం

గురుగ్రామ్: దేశ రాజధాని దిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌లో మరో దాష్టీకం చోటుచేసుకుంది. ఓ మహిళను కారులోనుంచి బయటకు లాగిన దుండగుడు.. భర్త, బంధువుల కళ్లెదుటే ఆమెపై అత్యాచారం జరిపాడు. ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ దారుణ ఘటనకు సంబంధించి పోలీసులు ఐదుగుర్ని అరెస్టు చేశారు.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ మహిళ(22) గురుగ్రామ్‌లో తన కుటుంబంతో కలిసి ఉంటున్నారు. ఆదివారం ఆమె టిగ్రా గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. భర్త, బంధువులతో కలిసి కారులో రాత్రి తిరుగుప్రయాణమయ్యారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకుగాను సెక్టార్-57 ప్రాంతంలో వారు ఆగారు. అంతలో జొహాల్కా గ్రామానికి చెందిన సంజీత్, దెశ్వీర్, పవన్, ధర్మేందర్, పవన్ శర్మ రెండు కార్లలో అక్కడికి చేరుకొని.. వారితో వాదనకు దిగారు. అనంతరం ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. కారులో నుంచి మహిళను బయటకు లాగిన సంజీత్.. భర్త, బంధువుల కళ్లెదుటే ఆమెపై అత్యాచారానికి తెగబడ్డాడు. ఆ సమయంలో దెశ్వీర్, పవన్, ధర్మేందర్, పవన్ శర్మ బాధిత మహిళ భర్త, బంధువులతో గొడవ పడుతూ ఉన్నారు. మహిళను విడిచిపెట్టాలంటూ సంజీత్‌కు తన స్నేహితుల్లో ఒకరు సూచించినా.. అతడు పట్టించుకోలేదు. అనంతరం నిందితులంతా అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలి భర్త నిందితుల కార్ల నెంబర్లను గుర్తించడంతో.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

జమిలి ఎన్నికలపై పార్టీలతో చర్చలు

ఈనాడు, దిల్లీ: కేంద్రం, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రధాని మోదీ యోచనపై ఏకాభిప్రాయం సాధించేందుకు పార్లమెంట్ లాంఛనంగా కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 22న నిర్వహించిన సమావేశంలో ఈ అంశంపై వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాలను న్యాయ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం కోరింది. జమిలి ఎన్నికల వల్ల కలిగే ప్రయోజనాల గురించి విపక్షాలకు వివరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కమిటీకి నేతృత్వం వహిస్తున్న భాజపా ఎంపీ భూపేంద్ర యాదవ్ ఈనాడుకు తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో ఎన్నికల సంఘానికి చెందిన సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ ఆలోచనకు జేడీయూ, బీజేడీ అనుకూలంగా ఉన్నాయి. జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్, వామపక్షాలు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు భావించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ విధానం ఆచరణ యోగ్యం కాదని వారు పేర్కొన్నారు.

ఆప్ ఎమ్మెల్యేల తాజా పిటిషన్ నేడు దిల్లీ హైకోర్టు విచారణ

దిల్లీ: లాభదాయక పదవులను చేపట్టామనే కారణంతో కేంద్రం తమను అనర్హుల్ని చేస్తూ జారీ చేసిన ప్రకటనను తప్పుపడుతూ 20 మంది ఆప్ శాసనసభ్యులు మంగళవారం దిల్లీ హైకోర్టులో కొత్తగా పిటిషన్లు దాఖలు చేశారు. వారి కొత్త అభ్యర్థనలపై హైకోర్టులో బుధవారం విచారణ జరగనుంది.

మార్కులపై తల్లిదండ్రులది విపరీత ధోరణి

- చూచిరాతకు తావిస్తే విద్యావ్యవస్థను నాశనం చేసినట్లే
- ప్రోత్సహించే ఉపాధ్యాయులపై చర్యలుంటేనే మార్పు
- ఉమ్మడి హైకోర్టు వ్యాఖ్యలు

ఈనాడు, హైదరాబాద్: చదివి రాస్తున్నారా? కాపీ కొట్టి రాస్తున్నారా? అన్నదానితో సంబంధం లేకుండా 90 శాతం మార్కులు రావాల్సిందేనంటూ తల్లిదండ్రులు విపరీత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఉమ్మడి హైకోర్టు వ్యాఖ్యానించింది. సాధించాల్సిన విజ్ఞానం కంటే మార్కులే ప్రాతిపదికగా భావిస్తున్నారంది. మార్కుల కోసం చూచిరాతలకు తావిస్తే విద్యా వ్యవస్థను నాశనం చేసినట్లేనని వ్యాఖ్యానించింది. కాపీని ప్రోత్సహిస్తున్న, అవకాశం కల్పిస్తున్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. కేసులు నమోదు చేయడంతోపాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటే పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖాధికారులతోపాటు ఆయా శాఖల ముఖ్యకార్యదర్శులనూ బాధ్యులను చేస్తే కొంత మేర ఫలితాలను రాబట్టవచ్చంది. చూచిరాతలు ఎక్కువగా జరుగుతున్న పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు వాటిని ప్రోత్సహించే వారిపై ఏం చర్యలు తీసుకుంటున్నారో వెల్లడించాలంటూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

విచ్చలవిడిగా కొనసాగుతున్న చూచిరాతలను అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని, పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలంటూ ఏలూరుకు చెందిన ప్రొఫెసర్ శ్రీనివాస్ గుంటుపల్లి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావులతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. 10వ తరగతి పరీక్షలనాటికి 1500 పరీక్షా కేంద్రాలకుగాను 405 కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సంజీవ్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కాపీకి అనుమతిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రాసిక్యూట్ చేస్తామని, ఈ వివరాలతో ఇన్విజిలేటర్లకు సర్క్యులర్లు జారీ చేస్తామన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుతో సమస్య పరిష్కారం కాదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఫలితం ఉంటుందని, చూచిరాతలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టంచేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

వారి నుంచి ధైర్యం నేర్చుకున్నా

- ఓ ఘటన తన జీవితాన్ని ఎలా మార్చిందో దావోస్ వేదికపై వివరించిన షారుఖ్
- సెల్ఫీ కోసం అనుమతి కోరి వినమ్రత చాటిన అగ్రనటుడు



సర్ ఎల్టన్‌జాన్, కేట్ బ్లాంచెట్‌లతో షారుక్‌ఖాన్

దావోస్: బాలీవుడ్ అగ్రశ్రేణి నటుల్లో ఒకరైన షారుక్ ఖాన్ కనిపిస్తే స్వీయచిత్రం దిగాలని చాలా మంది అభిమానులు ఆరాటపడుతుంటారు. అలాంటిది ఆయనే వేదికపై మరో ఇద్దరు అంతర్జాతీయ సినీ ప్రముఖుల ముందు అలాంటి అభ్యర్థన చేసిన ఘటన దావోస్‌లోని 'ప్రపంచ ఆర్థిక వేదిక' (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో సోమవారం రాత్రి చోటు చేసుకొంది. మానవ హక్కుల పరిరక్షణపై అవగాహనకు 'మీర్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఖాన్ అందిస్తున్న విశిష్ట సేవలకు గానూ ఆయనకు డబ్ల్యూఈఎఫ్ నిర్వాహకులు పురస్కారాన్ని అందజేశారు. ఆయనతో పాటు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ నటి కేట్ బ్లాంచెట్‌కు, అంతర్జాతీయంగా పేరెన్నికగన్న గాయకుడు/పాటల రచయిత సర్ ఎల్టన్ జాన్‌కు ఈ పురస్కారాలు లభించాయి. అసాధారణ ప్రజ్ఞాపాటవాలున్న ఈ ఇద్దరితో కలిసి ఈ పురస్కారాన్ని స్వీకరించడాన్ని ఎంతో గౌరవప్రదంగా భావిస్తున్నానని ఖాన్ చెబుతూ... అంతటివారు వేదిక దిగిపోయేలోగా వారితో ఓ సెల్ఫీ దిగడానికి వినమ్రంగా అనుమతి కోరారు. మహిళలు, పిల్లల గురించి ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగాన్ని ప్రపంచ దేశాధినేతలు ఆసక్తిగా విన్నారు. ఎల్టన్ జాన్ పాటలంటే చెవి కోసుకునే కోట్లాదిమందిలో తానొకడినని ఖాన్ చెబుతూ తన అభిమానాన్ని చాటుకున్నారు. కేట్ అభిమానులకు కొదవే లేదన్నారు.

నేనూ సౌందర్యారాధకుడినే.... 'బాహ్య సౌందర్యంపై నమ్మకం లేనట్లుగా చెప్పడానికి మేమెంతగా బయటకు నటించినా ఏదో ఒక రూపంలో మేమంతా దానికి బానిసలమే. ఇలాంటి సౌందర్యారాధన ఉన్న నేను ఒకసారి ఆమ్లదాడికి గురైన మహిళను చూశాను. ఆ ఘటన నా జీవితాన్ని, ఆలోచన తీరును మార్చేసింది. సేవ వైపు మళ్లేలా చేసింది. ఒక అమ్మాయిని అందవిహీనంగా చేయడానికి ఆమె ముఖంపై ఆమ్లదాడికి పాల్పడడం అత్యంత క్రూరమైన చర్య. తమ ఇష్టాయిష్టాలను వ్యక్తం చేయడానికి మహిళలకు హక్కు లేదా?' అని షారుఖ్ ప్రశ్నించారు.

వారి నుంచి ఎంతో నేర్చుకున్నా... ఆమ్లదాడులకు గురైన మహిళలు మరింత బలంగా, ధైర్యంగా మారుతున్నారని షారుక్ చెప్పారు. 'బాధల నుంచి ధైర్యంగా బయటపడడాన్ని వారి నుంచి నేను నేర్చుకున్నాను. దయ చూపడం కంటే సంఘీభావం ప్రకటించడం ద్వారా సమస్యలను ఎలా ఎదుర్కోవచ్చో వారి నుంచి తెలుసుకున్నాను. మానవాళి కోసం మనమంతా ఎంతో కొంత చేయాలి. మీర్ ఫౌండేషన్ ద్వారా ఎందరో గొప్ప మహిళల్ని, పిల్లల్ని కలిసినప్పుడు నా దృక్కోణం మొత్తం మారింది. నన్ను తీర్చిదిద్దడంలో సోదరి, భార్య, చిన్నారి కుమార్తె చేసిన కృషికి కృతజ్ఞతలు. ఒక మహిళపై ఒత్తిడి తీసుకురాకుండా ఆమె చేత అవుననిపించడానికి అభ్యర్థన చేసేలా నన్ను వారు మలిచార'ని వివరించారు. ఆమ్లదాడి, అగ్నిప్రమాద బాధితులైన అతివలకు అవసరమైన వైద్యచికిత్సతోపాటు వృత్తిపరమైన శిక్షణను అందిస్తున్న ఖాన్ సంస్థను నిర్వాహకులు కొనియాడారు.

దేశ సంపద కొద్ది మంది వద్దే ఎందుకు పోగుపడుతుందో చెప్పండి

మోదీకి రాహుల్ గాంధీ ట్వీట్

దిల్లీ: ఎన్డీయే ప్రభుత్వం ధనికుల కోసమే పనిచేస్తుందంటూ ప్రధాని మోదీపై తరచూ విమర్శనాస్త్రాలు సంధించే కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి తన వాగ్బాణాలను ఎక్కుపెట్టారు. దేశ సంపదలో మూడొంతులు ధనికుల చెంతకే ఎందుకు చేరుతుందో చెప్పాలన్నారు. 2017లో దేశంలో ఉత్పత్తి అయిన సంపదలో 73 శాతం దేశ ప్రజల్లో ఒక్క శాతంగా ఉన్న వారి వద్దకే చేరిందన్న ఆక్స్‌ఫామ్ సర్వేను ఉటంకిస్తూ "ప్రియమైన ప్రధాని దేశ సంపదలో 73 శాతాన్ని జనాభాలో ఒక్క శాతంగా ఉన్న వారే ఎందుకు పొందారో దావోస్‌లో చెప్పండి" అంటూ ట్వీట్ చేశారు.

వ్యాపారానికి మారుపేరు భారత్

- అంతర్జాతీయ సీఈవోలతో మోదీ వ్యాఖ్య

దావోస్: భారత్.. వ్యాపారానికి మారుపేరని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ వ్యాపార సంస్థలకు అద్భుత అవకాశాలను అందిస్తోందన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో అగ్రశ్రేణి వ్యాపార సంస్థల సీఈవోలతో మోదీ సమావేశమయ్యారు. భారత వృద్ధి తీరుతెన్నులను వివరించారు. దేశంలో పెట్టుబడులకున్న అపార అవకాశాలను తెలియజేశారు. విడిగా భారత సీఈవోలతోనూ మోదీ సమావేశమయ్యారు. స్విస్ అధ్యక్షుడు ఎలైన్ బెర్‌సెట్‌తోనూ మోదీ సమావేశమయ్యారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో భారత ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ప్రపంచ ఆర్థిక వేదిక ఇటు నెదర్లాండ్స్ రాణి మాగ్జిమాతోనూ మోదీ సమావేశమైనట్లు వెల్లడించింది.

రక్షణాత్మక ఆర్థిక విధానాలు పెరిగిపోతున్నాయి

స్విస్ అధ్యక్షుడు బెర్‌సెట్ ఆందోళన

దావోస్: కొన్ని దేశాలు రక్షణాత్మక ఆర్థిక విధానాలను అవలంబించడంపై స్విస్ అధ్యక్షుడు అలైన్ బెర్‌సెట్ ఆందోళన వ్యక్తంచేశారు. స్వేచ్ఛా వాణిజ్యం, బహుళత్వం వంటి వాటి అపనమ్మకం పెరిగిపోతోందన్నారు. దీని వల్ల ప్రపంచం మరింత ముక్కలుచెక్కలవుతుందని హెచ్చరించారు. ఆయా ఆర్థిక వ్యవస్థల్లో స్వేచ్ఛాయుత విధానాలు కొనసాగేలా చూడటానికి ప్రజలు తమతమ ప్రభుత్వాలను విశ్వసించాలని కోరారు. దావోస్‌లో బెర్‌సెట్ మాట్లాడారు. ముక్కలుచెక్కలుగా ఉన్న ప్రపంచంలో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలన్న ఈ ఏడాది డబ్ల్యూఈఎఫ్ నినాదంపై తక్షణ స్పందన అవసరమన్నారు. "పురోగతి మార్గంలో మనం కొనసాగాలంటే.. అంతర్జాతీయ సహకారం, బహుళత్వ సంవత్సరంగా 2018 నిలిచిపోవాలి" అని సూచించారు.



ప్రపంచ ఆర్థిక సదస్సులో కేటీఆర్, లోకేశ్, ఎంపీ గల్లా జయదేవ్

లోకేశ్‌కు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ద్వారా తెలంగాణ ప్రగతి, పారిశ్రామిక విధానాలను విశ్వవ్యాప్తం చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణలోని వనరులు, ఇతర అనుకూల అంశాలను పారిశ్రామికవేత్తలకు తెలియజేసి పెట్టుబడులను సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. దావోస్‌లో మంగళవారం ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో కేటీఆర్ మాట్లాడారు.

ఈ సదస్సుకు హాజరైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు. ఏపీ మంత్రి లోకేశ్‌కు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీతోనూ కేటీఆర్ భేటీ అయ్యారు. ఎంపీ గల్లా జయదేవ్‌లతోనూ సమావేశమైన కేటీఆర్.. ఆయన తనకు పాత మిత్రుడని చెప్పారు. లోకేశ్, జయదేవ్‌లతో కేటీఆర్ సెల్ఫీ దిగారు.

...జాజివలసా 'హలో' అంది

దావోస్ నుంచి గిరిజన గ్రామానికి ఫైబర్‌నెట్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు



దావోస్ నుంచి జాజివలస ప్రజలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న చంద్రబాబు

ఈనాడు అమరావతి: "నీ పేరేంటమ్మా..? ఏం చేస్తుంటావు.. వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడటం ఎలా అనిపిస్తోంది..? దీని వల్ల మీకు లాభం ఉందా"

"నమస్కారమండీ. మీతో ఇలా మాట్లాడటం చాలా సంతోషంగా ఉంది"

"ఒక్క ఫోనే కాదమ్మా, వీడియో కాన్ఫరెన్స్‌తో పాటు టెలీమెడిసిన్ వంటివీ మీకు అందుబాటులోకి వస్తాయి. ఏ డాక్టరుతో కావాలన్నా నేరుగా మాట్లాడుకోవచ్చు. గిరిజన ప్రాంతాల్లో ఇలాంటి సదుపాయం కల్పించడం ఆనందంగా ఉంది. ప్రపంచంలోనే మొదటిసారి ఈ సాంకేతికత వచ్చింది. అది మీ ఊరులో పెట్టడం చాలా సంతోషంగా ఉంది."

- ఇది స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, తూర్పుగోదావరి జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామం జాజివలసలోని గిరిజన మహిళకు మధ్య మంగళవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్‌లో జరిగిన సంభాషణ.

జాజివలస తూర్పుగోదావరి జిల్లాలోని వై. రామవరం మండలంలో కొండకోనల మధ్య ఉన్న మారుమూల గిరిజన గ్రామం. కనివాడ పంచాయతీ పరిధిలోని ఈ గ్రామానికి ఇప్పటి వరకు ల్యాండ్‌ఫోను, సెల్‌ఫోను సదుపాయమే లేదు. నియోజకవర్గ కేంద్రం రంపచోడవరం నుంచి దాదాపు 80కి.మీ.ల దూరంలో ఉండే ఈ కుగ్రామానికి మంగళవారం తొలిసారి ఫోన్, ఇంటర్నెట్, కేబుల్ టీవీ సదుపాయాలొచ్చాయి. ఏపీ ఫైబర్‌నెట్ సంస్థ 'గూగుల్ ఎక్స్' అందించిన ఫ్రీ-స్పేస్ ఆప్టికల్ కమ్యూనికేషన్' (ఎఫ్ఎస్‌వోసీ) పరిజ్ఞానం ద్వారా ఈ అనుసంధానతను కల్పించింది.



సీఎంతో మాట్లాడుతున్న శాసనసభ్యురాలు వంతల రాజేశ్వరి

ఈ సదుపాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం దావోస్ నుంచి ప్రారంభించారు. జాజివలస ప్రజలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖాముఖి మాట్లాడారు. ఒక గిరిజన మహిళ తనకు ఇల్లు లేదని చెప్పడంతో వెంటనే మంజూరు చేయాల్సిందిగా ఐటీడీఏ పీఓని ముఖ్యమంత్రి ఆదేశించారు. తమ ఊరికి ఫోన్ లేదని, ఫోన్ సదుపాయం కావాలంటే 30-40 కి.మీ. దూరంలోని మండల కేంద్రం మారేడుమిల్లి వెళ్లాల్సిందేనని సాంబిరెడ్డి అనే వ్యక్తి పేర్కొన్నారు. తమకిలాంటి సదుపాయం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రంపచోడవరం శాసనసభ్యురాలు వంతల రాజేశ్వరి కూడా ముఖ్యమంత్రితో మాట్లాడారు. తన నియోజకవర్గంలోనే మొదటిగా ఈ సదుపాయాన్ని ప్రారంభించినందుకు కృతజ్ఞతలు చెప్పారు.

ఎఫ్ఎస్‌వోసీ అంటే..?

'ఫ్రీ స్పేస్ ఆప్టికల్ కమ్యూనికేషన్' గూగుల్ ఎక్స్ సంస్థ రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం. వైర్లు వేయడానికి అవకాశం లేని మారుమూల ప్రాంతాలకు ఈ పరిజ్ఞానంతో వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం కల్పించవచ్చు. 20 కిలోమీటర్ల పరిధిలో దీని ద్వారా 20 జీబీపీఎస్(గిగాబైట్సు పర్ సెకండ్) వేగంతో ఈ సౌకర్యం కల్పించవచ్చు. ఏపీ ఫైబర్ నెట్ సంస్థ ఈ సదుపాయం కల్పిస్తోంది.

ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాల్సిందే

'రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మేలు జరిగేలా చూడండి.. ఏ మాత్రం నష్టం జరిగినా సహించేది లేదని' ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం అక్కడ నుంచే ధాన్యం కొనుగోళ్లపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టిసీమ వల్ల కృష్ణా జిల్లాలో దిగుబడులు దండిగా వచ్చిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పంట చేతికొచ్చిన ఈ సమయంలో రైతులు నష్టపోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగాలని సూచించారు. ప్రధానంగా కృష్ణా జిల్లా కలెక్టర్ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

మడమ తిప్పను

జనసేన సిద్ధాంతాలను ప్రకటించిన పవన్ కల్యాణ్

'కులాలను కలిపే ఆలోచనా విధానం, మత ప్రమేయం లేని రాజకీయం.. యాస, భాషలను గౌరవించే సంప్రదాయం.. సంస్కృతిని కాపాడే సమాజం.. ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం.. అవినీతి, అక్రమాలపై రాజీలేని పోరాటం.. పర్యావరణాన్ని పరిరక్షించే విధానమే జనసేన సిద్ధాంతం.'

– పవన్ కల్యాణ్

ఈనాడు – కరీంనగర్

"తెలంగాణ కోసం ఎలా మహోద్యమం చేసి సాధించారో.. అవినీతి అక్రమాలు, ఆశ్రిత పక్షపాతం లేని సమాజ స్థాపన కోసం మరో యుద్ధానికి సిద్ధంకండి. 2019 ఎన్నికల విషయం మాట్లాడుతున్నారు కొందరు. ఒక సంవత్సరం కోసం వచ్చి పోయే వ్యక్తిని కాను. చాలా ఆలోచించి.. దెబ్బలు తినడానికీ సిద్ధపడి రంగంలోకి దిగాను. మీ కోసం నిలబడతానని మాట ఇచ్చాను.. మడమ తిప్పను" అంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెల్లడించారు. రాజకీయ యాత్రలో భాగంగా కరీంనగర్ విచ్చేసిన ఆయన మంగళవారం ఇక్కడ పూర్వ ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల కార్యకర్తల సదస్సులో పార్టీ సిద్ధాంతాలను వివరించారు. "జనసేన ఆవిర్భావం రోజైన మార్చి 14లోపు పూర్తిస్థాయి ప్రణాళిక ప్రకటిస్తాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కులాలను విస్మరించి రాజకీయాలు చేయలేని పరిస్థితి.. ఈ క్రమంలో కులాలను కలిపే ఆలోచన విధానంతో ముందుకు సాగుతాం. కొన్ని కులాలకే అధికారం పరిమితం కాకూడదు. కాన్షీరాం, జ్యోతిబాపూలే.. నారాయణగురు.. ఆలోచన విధానాలతో ముందుకుసాగుతాం. సామాజిక న్యాయం అంటే సీట్లు పంచడం కాదు. వనరులు అన్ని కులాలకు అందేలా చూడాలి. జనసేన పార్టీ అన్ని మతాలవారికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తాం. నా సినిమాల్లో తెలంగాణకు చెందిన దళిత కవులు, కళాకారులకు అవకాశం ఇచ్చా. సదర్, బతుకమ్మ.. సమ్మక్క, సారలమ్మ.. ఇతర జాతరలన్నింటిని గౌరవించాను. తెలంగాణ భాషను, యాసను ప్రోత్సహించా. తెలంగాణ రావడానికి సాంస్కృతిక ఐక్యతే కారణం. దేశం కలిసి ఉండాలంటే అన్ని సంస్కృతులు కలిసి ఉండాలి. దానికి జనసేన కట్టుబడి ఉంటుంది. ప్రాంతీయ భావాలతో జాతీయవాదాన్ని విస్మరించడం బాధాకరం. సగటు విద్యార్థి, యువకుడు, అన్నదమ్ములు, ఆడపడుచులు అవినీతి లేని జీవితంలో ప్రవేశించాలి. ఆ సమాజ నిర్మాణానికి జనసేన పోరాడుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూనే అభివృద్ధి వైపు అడుగులు వేయాలి.

పోరాటాలు చేసేవారిని గౌరవిస్తా...

కేసీఆర్ కష్టపడి పని చేస్తున్నారంటే కొంతమందికి ఇబ్బంది కలిగింది. కేసీఆర్‌పై ముందు నుంచి ఇష్టం ఉంది. రాజకీయాల్లో పోరాడే వారిని గౌరవిస్తా. కాంగ్రెస్ నాయకులను అర్థం చేసుకోమని కోరుతున్నా. మా అన్న కాంగ్రెస్ నాయకుడే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో నిబద్ధతతో కూడిన రాజకీయం చేస్తా. సమస్యలపై ముందు విన్నవిస్తా.. పరిష్కారం కానప్పుడు రోడ్లపైకి వస్తా.. ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆంధ్రకు చెందిన గుంటూరు శేషేంద్ర శర్మ, శ్రీశ్రీలను గౌరవించడం లేదని శేషేంద్రశర్మగారి సతీమణి నా దృష్టికి తీసుకొచ్చారు. గతంలో గుర్తింపునకు నోచుకోక గాయపడిన కవులు, కళాకారుల గుర్తింపు కోసం.. తెలంగాణ వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన సభలుగా వాటిని గౌరవించాలని ఆమెను కోరాను.



కరీంనగర్‌లో మూడు జిల్లాల కార్యకర్తలతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

తెలంగాణ నాకు ప్రాణం

పునర్జన్మ ఇచ్చిన తెలంగాణకు రుణపడి ఉంటాను. జై తెలంగాణ నినాదం నన్ను పులకరింపజేస్తుంది. వందేమాతరం ఆ తరానికి ఎలాంటి మహామంత్రమో.. జైతెలంగాణ అలాంటిదే. అలాంటి తెలంగాణ నుంచి జనసేన పూర్తి స్థాయి రాజకీయాలు ప్రారంభించింది. 2009లో సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నామని తెలియజేశాం. నేను ఇక్కడే ఎక్కువకాలం పెరిగాను. తెలంగాణ ఆవిర్భావ సమయంలో నేను వ్యతిరేకించలేదు. అన్నదమ్ముల్లా విడిపోయామనేదే నా భావన. ఉద్యమ సమయంలో నేను అభిమానించే గద్దరన్నను ఆంధ్ర పాలకులు, ప్రజలను వేరు చూసి చూడమని కోరాను. కేసీఆర్, కాంగ్రెస్ పెద్దలందరికీ అదే విన్నవించాను. మీ ఇంట్లో ఒకనిలా.. మీ తల్లిదండ్రులకు బిడ్డలా.. మీ అక్కచెల్లెళ్లకు తమ్ముడిలా ఉన్నా. మాది సుదీర్ఘ పోరాటం. ఇక్కడ మీరు ఇచ్చే ప్రేమ ముందు వేల కోట్ల సంపద ఏపాటిది? తెలంగాణ తల్లికి శిరసు వంచి నమస్కరిస్తున్నాను. తెలంగాణ తల్లికి సేవ చేసే భాగ్యం కలిగించాలని కోరుతున్నాను."

నూతన వీసా తీసుకోవటం మంచిది..!



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

చెదల కారణంగా నా పాస్‌పోర్టు దెబ్బతింది. వీసా కంట్రోల్ నంబరు మాత్రం దెబ్బతినలేదు. ఆ పాస్‌పోర్టుపై నేను అమెరికా ప్రయాణం చేయవచ్చా? అదేమైనా సమస్యవుతుందా? - కె.రాజశేఖర్

మీ పాస్‌పోర్టు, వీసా ఎంత మేరకు దెబ్బతిందన్నది మీరు నూతన వీసా కోసం దరఖాస్తు చేయనిదే అంచనా వేయలేం. ప్రయాణ పత్రాల్లో కీలకమైన వీసా కొద్ది మేరకు దెబ్బతిన్నా అది చెల్లుబాటు కాదు. ఎలాంటి సమస్య లేకుండా ప్రయాణం చేయాలంటే మీరు నూతన పాస్‌పోర్టు పొందటం మంచిది. వీసా దెబ్బతినకపోతే మీరు దాన్ని వినియోగించవచ్చు. విమానాశ్రయంలో, ప్రవేశ ప్రాంతంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఇంటర్వ్యూ మినహాయింపు పథకం(ఐడబ్ల్యూపీ) కింద మీరు నూతన వీసాకు దరఖాస్తు చేసుకోటం మంచిది.

అమెరికా ప్రవేశ ప్రాంతంలో నా వీసాను తిరస్కరించారు. వీసా పొందడమెలా? - ఎం.కె.కృష్ణ

ప్రవేశ ప్రాంతంలో మీరు ఎంత కాలం అనర్హులన్నది అధికారులు నిర్ధారిస్తారు. ఆ గడువు తీరే వరకు మీరు వీసా కోసం దరఖాస్తు చేసుకోకపోవటం మంచిది. కానీ ఎప్పుడైనా మీరు వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఎందుకు తిరస్కరించారన్న అంశాన్ని ఇంటర్వ్యూ సమయంలో అధికారితో చర్చించేందుకు సిద్ధంగా ఉండండి. వీసా అనర్హతలు, తిరస్కారం తదితర సమాచారం కోసం www.travel.state.gov ను పరిశీలించండి.

త్వరలో నా వీసా కాలం తీరనుంది. ఇప్పటికి ఆరు దఫాలు అమెరికాలో పర్యటించాను. నా వీసాను పునరుద్ధరించుకుందామనుకుంటున్నాను. విధివిధానాలేమిటి? - ఎం.ప్రసాద్

జనవరిలో మీ వీసా కాలం తీరునున్న దృష్ట్యా ఇంటర్వ్యూ మినహాయింపు పథకం(ఐడబ్ల్యూపీ)కింద దరఖాస్తు చేసుకోవచ్చు. మీరు అర్హులా? కాదా? అన్నది తెలుసుకునేందుకు https://www.usravel-docs.com/in ను చూడండి. ఐడబ్ల్యూపీ అన్నది ఇంటర్వ్యూ భారాన్ని కొంత తగ్గిస్తుంది. దరఖాస్తును వ్యక్తిగతంగా అందజేయాల్సి ఉంటుంది. ఐడబ్ల్యూపీకి అర్హత పొందకపోతే అదే వెబ్‌సైట్ ద్వారా వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు సిద్ధం కావాలి. కాలం తీరకముందైనా వీసా పునరుద్ధరణ దరఖాస్తు చేసుకోవచ్చు. వీసా కాలం తీరి ఏడాది గడిస్తే ఐడబ్ల్యూపీకి అర్హతపొందలేరు.

నేను ఇంజినీరింగు నాలుగో సంవత్సరం చదువుతున్నాను. అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ చేద్దామనుకుంటున్నాను. ఉపకారవేతన వెసులుబాటు ఉంటుందా? ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు సరైన సమయం ఏది? - కె.మోహన్‌రెడ్డి

మాస్టర్స్ చేసే భారతీయ విద్యార్థులకు అమెరికాలోని కొన్ని విశ్వవిద్యాలయాలు ఉపకారవేతనాలు అందజేస్తాయి. అమెరికాలో చదువుకునేందుకు సమాచారం కోసం https://educationusa.state.gov/ ను పరిశీలించండి. మరింత సమాచారం కోసం ఆయా విశ్వవిద్యాలయాల ఆర్థిక విభాగాలను నేరుగా సంప్రదించండి. ఐ-20 వచ్చిన వెంటనే విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేయండి. ఐ-20లో నమోదు చేసిన కోర్స్ ప్రారంభ తేదీ నుంచి 30 రోజుల కన్నా ముందుగా అమెరికా వెళ్లేందుకు అవకాశం ఉండదన్న అంశాన్ని గుర్తించాలి.

వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను **support-india@ustraveldocs.com** కు ఈ–మెయిల్ చేయండి.
మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.govను సంప్రదించవచ్చు.
హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా సేవలకు సంబంధించినప్రశ్నలను usvisa@eenadu.netకు పంపగలరు.

టెట్ వాయిదా వేయాలి

- కాకినాడలో మంత్రి గంటా వాహనాన్ని అడ్డుకున్న అభ్యర్థులు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గడువును పెంచాలని, సిలబస్ తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాకినాడలో ఉపాధ్యాయ ఉద్యోగార్థులు మంగళవారం రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు వాహనాన్ని అడ్డుకుని, ఆందోళనకు దిగారు. జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు మంత్రి కాకినాడ వచ్చారు. ఆయన బసచేసిన హోటల్ వద్ద ఈ ఆందోళన జరిగింది. ఆయన్ను ఎలాగైనా కలవాలని ఉద్యోగార్థులు అక్కడే పెద్దసంఖ్యలో నిరీక్షించడంతో అక్కడ దాదాపు రెండుగంటల పాటు హైడ్రామా నడిచింది. కొందరు ప్రతినిధులు లోపలకు వెళ్లి మంత్రితో మాట్లాడారు. ఇప్పటికే మూడు వారాలు పొడిగించామని, తిరిగి పొడిగిస్తే ఉపాధ్యాయుల భర్తీ జాప్యమవుతుందని ఆయన వివరించారు. అయినా ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. వారు బయటకొచ్చి అదే విషయాన్ని ఉద్యోగార్థులకు స్పష్టం చేశారు. దీనికి వారు అంగీకరించలేదు. మంత్రి తమ వద్దకు వచ్చి టెట్ పొడిగింపుపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు పోలీసులు ఆయన్ను బందోబస్తు నడుమ బయటకు పంపించారు. అడ్డువచ్చిన అభ్యర్థులను పక్కకు నెట్టేశారు.



మంత్రి వాహనాన్ని అడ్డుకుంటున్న టెట్ అభ్యర్థులు

టెట్ దరఖాస్తుకు ముగిసిన గడువు..

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు సోమవారం అర్ధరాత్రితో దరఖాస్తుల గడువు ముగిసింది. మొత్తం 4,46,833 మంది దరఖాస్తు చేశారు. వీరిలో పేపర్-1కు 1,80,749మంది, పేపర్-2కు 2,12,794 మంది, పేపర్-3కు 53,290 మంది దరఖాస్తు చేశారు. టెట్‌కు సమయం కావాలని విద్యార్థులు గడువు కోరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం కోసం వారు ఎదురుచూస్తున్నారు. బుధవారం(నేటి) నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు.



పోలీసు హౌసింగ్‌బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న నాగుల్‌మీరా

పోలీసులు అందరికీ ఇళ్లివ్వాలన్నదే లక్ష్యం

పోలీస్ హౌసింగ్‌బోర్డు ఛైర్మన్ నాగుల్‌మీరా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పోలీసులు అందరికీ నివాస గృహాలు సమకూర్చాలన్నదే తమ లక్ష్యమని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ లబ్బీపేటలోని ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ హౌసింగ్ బోర్డు సమావేశంలో పోలీసుశాఖ గృహసముదాయాల నిర్మాణంపై చర్చించారు. రాష్ట్రంలో సీఐడీ కార్యాలయాలు, ఏసీబీ, ఎస్పీలకు భవన సముదాయాలతో పాటు రూ.22 కోట్లతో అమరావతిలో లేబరేటరీ నిర్మాణం వేగంగా సాగుతున్నట్లు నాగుల్‌మీరా తెలిపారు. రాష్ట్రంలో 25 మోడల్ పోలీస్‌స్టేషన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు వివరించారు. ఆధునిక సౌకర్యాలతో ఏలూరు, నూజివీడు, అనంతపురంలో 70 క్వార్టర్ల నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వీటిని త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. డీజీపీ మాలకొండయ్య మాట్లాడుతూ విభజన అనంతరం పోలీస్‌శాఖలో సమస్యల పరిష్కారంపై చర్చించామని వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణపై హైకోర్టు ఆదేశాలు అందాయని, కేసును సిట్ పునర్విచారణ చేస్తుందని డీజీపీ తెలిపారు. కోడిపందేల నిర్వహణపై హైకోర్టు అడిగిన నివేదికను అందజేస్తామన్నారు. అనంతరం డీజీపీ మాలకొండయ్యను నాగుల్‌మీరా సత్కరించారు. కార్యక్రమంలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి అనురాధ, అగ్నిమాపకశాఖ డీజీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రాణం తీసిన మద్యం మత్తు

- తాగిన మైకంలో భార్యను కొట్టిన భర్త
- పొరపాటున కర్ర తగిలి కుమార్తె మృతి



సుప్రియ మృతదేహం

బోనకల్లు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఉన్న భర్త.. భార్యని కర్రతో కొట్టబోగా..అది తగిలి నాలుగేళ్ల కుమార్తె మరణించిన ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం జానకీపురం గ్రామానికి చెందిన పుట్టా కృష్ణయ్య, నాగమణి దంపతులు కొంతకాలంగా విశాఖపట్నంలో ఉంటున్నారు. అమ్మమ్మ కర్మకాండ కోసం ఆదివారం జానకీపురం వచ్చారు. తల్లి శేషమ్మ ఇటీవలే నిర్మించిన ఇంటికి తనకు చెందిన రేకులు వినియోగించినట్టు కృష్ణయ్య గుర్తించాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇదే విషయమై తల్లితో గొడవపడ్డాడు. వారించేందుకు వెళ్లిన భార్యను కర్రతో కొట్టేందుకు యత్నించాడు. అది ఆమె చంకలో ఉన్న కుమార్తె సుప్రియ(4)కు తగలడంతో చిన్నారి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. బెదిరిపోయి నిద్రపోతోందని భావించిన తల్లి..బిడ్డను మంచంలో పడుకోబెట్టి అర్ధరాత్రి వరకు భర్తను సముదాయిస్తూ ఉండిపోయింది. అర్ధరాత్రి తర్వాత కుమార్తె అచేతనంగా ఉండటాన్ని గుర్తించి వైద్యుని సంప్రదించగా..అప్పటికే మరణించినట్టు ఆయన ధ్రువీకరించారు. కృష్ణయ్య పరారీలో ఉన్నాడు.

న్యాయం చేస్తారా లేక ఆత్మహత్య చేసుకోమంటారా?

ప్రధాని మోదీ, సీఎం యోగికి రక్తంతో లేఖ రాసిన అత్యాచార బాధితురాలు

రాయ్‌బరేలీ: ఉత్తరప్రదేశ్ పోలీసుల తీరుతో విసిగిపోయిన ఓ అత్యాచార బాధితురాలు.. ప్రధాని మోదీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు తన రక్తంతో ఉత్తరం రాసింది. న్యాయం చేస్తారా.. లేదంటే ఆత్మహత్య చేసుకుని చావమంటారా? అని ఆ లేఖలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. జనవరి 20న బాధితురాలు రాసిన ఉత్తరంపై ఏఎస్పీ శశిశేఖర్ సింగ్‌ను విలేకరులు వివరణ కోరగా బారబంకిలో దివ్య పాండే, అంకిత్‌వర్మపై మార్చి 24న కేసు నమోదు చేశామన్నారు. లేఖ గురించి తెలియదన్నారు. ఇంజినీరింగ్ చదివే తన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడి ఆమెను బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె తండ్రి వాపోతున్నారు. మరోవైపు ఫేస్‌బుక్‌లో తప్పుడు వివరాలతో నమోదైన ఓ ఖాతాలో సదరు విద్యార్థిని అసభ్య ఫొటోలు అప్‌లోడ్ చేశారు.



నాదస్వరం వాయిస్తున్న కళాకారులు

త్యాగరాజ స్వామికి నాద నీరాజనం

తిరుపతి(తాతయ్యగుంట), న్యూస్‌టుడే: శ్రీ సద్గురు త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాల సందర్భంగా సంస్మరణ సంగీతోత్సవాన్ని మంగళవారం తిరుపతిలో కనులపండువగా నిర్వహించారు. త్యాగరాజస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. తెలుగు రాష్ట్రాలతో పాటు శ్రీలంక, పాండిచ్చేరికి చెందిన డోలు కళాకారులు, కేరళకు చెందిన నాదస్వర కళాకారులు 500 మందితో త్యాగరాజస్వామి చిత్రపటంతో తిరునగరిలో భారీ ఊరేగింపు నిర్వహించారు. గాంధీరోడ్డు నుంచి కళాకారులు ప్రదర్శనగా రామచంద్ర పుష్కరిణి వరకు సాగారు. ఈ వాయిద్యాల ప్రదర్శన బుధవారం ఉదయం 5గంటల వరకు కొనసాగుతుంది.

కన్యత్వ పరీక్షల వ్యతిరేక ప్రచారకులపై దాడి

మహారాష్ట్రలోని పింప్రీలో ఘటన

పుణె: మహారాష్ట్రలోని ఓ సామాజిక వర్గంలో ఆచరణలో ఉన్న 'వివాహమైన రాత్రి వధువుకు కన్యత్వ పరీక్షలు నిర్వహించటమ'నే పద్ధతిని వ్యతిరేకిస్తున్న వ్యక్తులపై దాడి జరిగింది. కన్యత్వ పరీక్షలను వ్యతిరేకిస్తున్న కొందరు వాట్సాప్ గ్రూప్‌లో ఒక బృందంగా ఏర్పడి ఈ విధానాన్ని నిరసిస్తూ, ప్రజలను చైతన్యపరిచేలా సామాజిక మాధ్యమం ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ బృందంలోని ముగ్గురు వ్యక్తులు ఆదివారం రాత్రి పింప్రీ పారిశ్రామిక పట్టణంలో బంధువుల వివాహానికి హాజరుకాగా వారి సామాజిక వర్గానికే చెందిన దాదాపు 40 మంది భౌతిక దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. హత్యకు గురైన హేతువాది నరేంద్ర దభోల్కర్ స్థాపించిన 'మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన్ సమితి' ఆధ్వర్యంలో మూఢాచారాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు బాధితులు తెలిపారు.



అమ్మాయిలను బతకనిద్దాం.. బతుకునిద్దాం

కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో రూపుదిద్దుకున్న సైకత శిల్పమిది. ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం అనే నినాదంతో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా రంగపేటకు చెందిన శ్రీనివాస్ దీన్ని రూపొందించారు. – ఈనాడు, కాకినాడ

రెండేళ్లలో మరో 3వేల పీజీ వైద్యసీట్లు

- ప్రభుత్వ జిల్లా ఆసుపత్రులకే తొలి ప్రాధాన్యం
- వైద్య కళాశాలలు లేకుండానే పీజీ సీట్లు
- జిల్లా ఆసుపత్రిలో 200 పడకలుంటే చాలు
- ప్రత్యేక వైద్యసేవల ఆసుపత్రికి 100 పడకలు సరి
- పీజీ నీట్‌ను మరింత సరళతరం చేస్తాం
- 'ఈనాడు'తో జాతీయ పరీక్షల సంస్థ అధ్యక్షులు అభిజాత్ సేథ్

ఈనాడు – హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ పీజీ వైద్య విద్య సీట్లు గణనీయంగా పెరగనున్నాయి. వచ్చే రెండేళ్లలో (2020 నాటికి) సుమారు 3వేలకు పైగా పీజీ వైద్యవిద్య సీట్లు కొత్తగా అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ వైద్యంలోనే పీజీ స్పెషాలిటీ సీట్లను పెంచడానికి ప్రాధాన్యమివ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'డిప్లొమాట్ నేషనల్ బోర్డు (డీఎన్‌బీ)' కోర్సులను జిల్లా ఆసుపత్రుల్లో విస్తారంగా ప్రవేశపెట్టనున్నారు. వైద్యకళాశాలలతో అవసరం లేకుండా జిల్లా ఆసుపత్రిలో కేవలం 200 పడకలుంటే చాలు డీఎన్‌బీ స్పెషాలిటీ కోర్సులను ప్రవేశపెట్టడానికి వీలుగా జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌బీఈ) నిబంధనలను సరళీకరించింది. ప్రసూతి, కంటి, మానసిక, చెవి, ముక్కు గొంతు తదితర ప్రత్యేక వైద్య సేవలందిస్తున్న ఆసుపత్రుల్లో 100 పడకలుంటే చాలు. . కేవలం ఆ విభాగానికి డీఎన్‌బీ కోర్సుల్లో సీట్లను మంజూరు చేయాలని నిర్ణయించినట్లు ఎన్‌బీఈ అధ్యక్షులు డాక్టర్ అభిజాత్ సేథ్ తెలిపారు. అధికారిక పర్యటనలో హైదరాబాద్ వచ్చిన అభిజాత్ సేథ్, ఎన్‌బీఈ ప్రత్యేకాధికారి రాకేశ్‌శర్మలు.. డీఎన్‌బీ కోర్సుల్లో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, నీట్ పీజీ వైద్యవిద్య పరీక్ష నిర్వహణ తదితర అంశాలపై 'ఈనాడు'తో ముఖాముఖి మాట్లాడారు.

ఈనాడు: డీఎన్‌బీ కోర్సుల అమలుపై ఎలాంటి సరళీకృత విధానాలు తీసుకొస్తున్నారు?

డాక్టర్ అభిజాత్: దేశంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యకు అనుగుణంగా పీజీ సీట్లు లేవు. దీంతో వైద్య విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడుతున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో స్పెషాలిటీ వైద్యుల సేవలు అందడం లేదు. అందుకే 2016లో నూతన పాలకమండలి ఏర్పడగానే పీజీ సీట్ల సంఖ్యను పెంచడంపైనే దృష్టిపెట్టాం. 2016లో 4వేలున్న డీఎన్‌బీ పీజీ సీట్లను 2018 నాటికి 6,700కు పెంచాం. వచ్చే రెండేళ్లలో ఈ సంఖ్యను 10 వేలకు పెంచాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాం. పాఠ్యప్రణాళికల్లో మార్పులు, పరీక్ష పత్రాల రూపకల్పన, మూల్యాంకనం, పరిశోధనలు.. తదితర పలు అంశాల్లో కీలక సిఫార్సులు, అమలు, పర్యవేక్షణ కోసం వైద్యనిపుణులతో కమిటీలను నియమించాం.

డీఎన్‌బీ కోర్సులను ఎక్కువగా ప్రైవేటు వైద్యరంగమే వినియోగించుకుంటోంది. కారణం?

భారతీయ వైద్యమండలి (ఎంసీఐ) నిబంధనల ప్రకారం పని చేస్తున్న బోధనాసుపత్రుల్లో డీఎన్‌బీ కోర్సులను ప్రవేశపెట్టడానికి అవకాశం ఉండదు. అయితే వైద్య కళాశాలలతో సంబంధం లేకుండా పనిచేస్తున్న జిల్లా ఆసుపత్రులు రాష్ట్రాల్లో చాలానే ఉంటాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లోనూ ఈ తరహా జిల్లా ఆసుపత్రులున్నాయి. వీటిల్లో డీఎన్‌బీ కోర్సులు ప్రవేశపెట్టడానికి ప్రోత్సహిస్తున్నాం.

ఈ కోర్సులతో ప్రయోజనం ఏమిటి?

జిల్లా ఆసుపత్రుల్లో డీఎన్‌బీ స్పెషాలిటీ కోర్సులను ప్రవేశపెట్టడం వల్ల ఒక్కో విభాగంలో మూడేళ్ల పాటు స్పెషాలిటీ వైద్యవిద్యార్థులు అందుబాటులో ఉంటారు. ఉదాహరణకు గైనకాలజీలో రెండు సీట్లు డీఎన్‌బీ కింద వచ్చాయనుకుంటే మూడేళ్లకు ఆరుగురు గైనకాలజీ పీజీ వైద్యవిద్యార్థులుంటారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, పిడియాట్రిక్స్, అనస్తీషియా. ఇలా పలు విభాగాల్లో పీజీ వైద్యుల సేవలు అందుబాటులోకి వస్తే 24 గంటల స్పెషలిస్టు వైద్యసేవలు రోగులకు లభిస్తాయి. పీజీ సీట్ల సంఖ్య పెరగడంతో ఎక్కువ మంది వైద్యవిద్యార్థులు స్పెషాలిటీ వైద్యవిద్య అభ్యసించగలుగుతారు. జిల్లా ఆసుపత్రి నుంచి మూడేళ్లలో 20 మంది స్పెషలిస్టు వైద్యులను తీర్చిదిద్దగలిగితే అందులో కనీసం మూడోవంతు మంది ఆ ప్రాంతంలోనే సేవలందించినా కొరత చాలావరకు తీరుతుంది.

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి వెసులుబాటు కల్పిస్తున్నారు?

పీజీ సీటు పొందడానికి నిబంధనలను సరళీకరించాం. వైద్యకళాశాలలో పనిచేయకపోయినా.. జిల్లా ఆసుపత్రిలో తమ విభాగంలో 10 ఏళ్ల అనుభవమున్న వైద్యుడుంటే సంబంధిత విభాగంలో డీఎన్‌బీ సీట్లు మంజూరు చేస్తాం. జిల్లా ఆసుపత్రిలో 200 పడకలుంటే చాలు బహుళ విభాగాల్లో పీజీ స్పెషాలిటీ డీఎన్‌బీ సీట్లు ఇస్తాం. ప్రత్యేక వైద్యసేవలందించే ఆసుపత్రిలోనైతే 100 పడకలుంటే ఒక్క స్పెషాలిటీలో డీఎన్‌బీ సీటు ఇస్తున్నాం. ఉదాహరణకు ప్రసూతి ఆసుపత్రిలో 100 పడకలుంటే గైనకాలజీ స్పెషాలిటీలో పీజీ సీటు లభిస్తుంది. ఎంతమంది అనుభవజ్ఞులైన వైద్యులు ఆ విభాగంలో ఉంటే అన్ని డీఎన్‌బీ సీట్లు మంజూరవుతాయి. ఒక ఆసుపత్రిలో ఒక విభాగంలో డీఎన్‌బీ స్పెషలిస్టు కోర్సు అభ్యసిస్తున్న పీజీ వైద్యవిద్యార్థి.. మరో జిల్లా ఆసుపత్రిలో అదే కోర్సుకు సంబంధించిన అదనపు వైద్యపరిజ్ఞానాన్ని 3-6 నెలల్లో పొందేలా మార్పులు తీసుకొచ్చాం.

డీఎన్‌బీలో అధునాతన స్పెషాలిటీ కోర్సులేమైనా ప్రవేశపెట్టారా?

డీఎన్‌బీ క్రిటికల్‌కేర్, బేరియాట్రిక్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ మెడిసిన్ తదితర కొత్త సూపర్ స్పెషాలిటీ కోర్సులను ప్రవేశపెట్టాం.



అభిజాత్ సేథ్, రాకేశ్‌శర్మ

ఇటీవల జరిగిన పీజీ వైద్యవిద్య నీట్ నిర్వహణపై విద్యార్థుల్లో చాలా అసంతృప్తి నెలకొంది?

గతంలో పీజీ వైద్యవిద్యకు 15 రోజులపాటు పరీక్ష లుండేవి. ఇప్పుడు ఒకే పరీక్ష. అన్ని విభాగాల ప్రశ్నలతో నిష్ణాతులైన వైద్యులే ప్రశ్నపత్రాన్ని రూపొందించారు. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు తొలిరోజే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కువ మంది ఒకేసారి దరఖాస్తు చేయడంతో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. రెండో రోజు నుంచే వాటిని పరిష్కరించాం. పరీక్ష కేంద్రాలు మరిన్ని అవసరమన్నచోట సంఖ్య పెంచాం. సాంకేతిక సమస్యలతో మూణ్నాలుగు సార్లు దరఖాస్తు చేసినవారికి రుసుములు తిరిగి చెల్లించాం. ఆన్‌లైన్‌లో జరిగే పీజీ వైద్యవిద్య ప్రవేశపరీక్షలో కాగితం, పెన్ను అవసరమయ్యే ప్రశ్నలివ్వరు. అలాంటివి ఇచ్చి ఉంటే వాటి విషయంలో పరిష్కారాలు అన్వేషిస్తాం. వచ్చే ఏడాది ఇలాంటివి జరగకుండా చూస్తాం.

'ఎగ్జిట్'.. పరీక్ష విధానంపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది కదా?

దేశవ్యాప్తంగా వైద్యపరీక్షల్లో ఏకరూపత సాధించాలనే లక్ష్యంతో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులందరికీ అర్హత పరీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం 'ఎగ్జిట్' పరీక్ష విధానాన్ని తెరపైకి తెచ్చింది. వైద్యకళాశాలల స్థాపన, సీట్ల పెంపు తదితర అంశాల్లో నిబంధనలను సడలించినప్పుడు నాణ్యమైన వైద్యులు వస్తున్నారా లేదా అని సరిచూసుకునే విధానం ఒకటి ఉండాలి. అయితే విద్యార్థుల అర్హత, నాణ్యతను నిర్ణయించడానికి పలు రకాల పరీక్షలు ఉండొద్దు. ఒకవేళ ఎగ్జిట్ పరీక్షను నిర్వహిస్తే ఆరోగ్య విశ్వవిద్యాలయాల పరీక్షలు నిర్వహించరేమో. ఈ విషయంలో ఇంకా స్పష్టత లేనప్పుడు దానిపై ప్రతికూలంగా మాట్లాడడం తొందరపాటు అవుతుందేమో!

రాజ్యహింసను ఐక్యంగా ప్రతిఘటించాలి

విరసం నేత వరవరరావు

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెరాస ప్రభుత్వం అవలంబిస్తోన్న రాజ్యహింసను ఐక్యంగా ప్రతిఘటించకపోతే తెలంగాణ మరో లాటిన్ అమెరికాగా మారుతుందని విరసం నేత వరవరరావు ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ డిక్లరేషన్ సభపై ప్రభుత్వ దాష్టీకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వరవరరావు, పౌరహక్కుల సంఘం తెలంగాణ అధ్యక్షులు ఆచార్య లక్ష్మణ్, తెలంగాణ ప్రజాఫ్రంట్ అధ్యక్షులు నలమాస కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం వారు హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21న వరంగల్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించేందుకు వెళ్లిన వారిపై పోలీసులు అసభ్యకరంగా వ్యవహరిస్తూ చిత్రహింసలకు గురిచేశారని, ఇదేనా స్నేహపూర్వక పోలీసింగ్ అని ప్రశ్నించారు. సినీ హీరోలు, తెలంగాణ ద్రోహుల సభలు, ర్యాలీలకు అనుమతులిచ్చిన సర్కారు అసలైన తెలంగాణ ఉద్యమకారులకు అనుమతులివ్వకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఉద్యమకారులపైన అక్రమ కేసులను ఎత్తివేయాలని, దురుసుగా ప్రవర్తించిన పోలీసులను చట్టబద్ధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ విషయంలో తెరాస ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని వరవరరావు ఆరోపించారు. శాంతియుతంగా దీక్ష చేపట్టిన మందకృష్ణ మాదిగపై పాతకేసులూ తిరగదోడుతూ జైల్లో పెట్టడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

బెయిల్‌పై విడుదలైన మందకృష్ణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: దళితులు, వర్గీకరణ అంశాల్లో కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. సికింద్రాబాద్ 10వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానం ఆయనకు మంగళవారం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ.5 వేల పూచీకత్తుతో పాటు అనుమతులు లేకుండా దీక్షలు, సభలు, ఆందోళనలు చేపట్టకూడదనే షరతులను విధించింది. బెయిల్‌పై చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన మంద కృష్ణ మాదిగ మంగళవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం తరువాత నిజాం ప్రభుత్వాన్ని మేం చూడలేదు కాని.. నేడు అంతకంటే అధ్వానమైన ప్రభుత్వం కొనసాగుతుండటం దురదృష్టకరమన్నారు. మాల, మాదిగ శాసనసభ్యులకు విలువ లేదని ఆయన విమర్శించారు.

రికార్డు స్థాయిలో పెట్రో ధరలు!

- బడ్జెట్‌లో ఎక్సైజ్ సుంకం తగ్గింపునకు చమురుశాఖ విజ్ఞప్తి



దిల్లీ: పెట్రోలు, డీజిల్ ధరలు మంగళవారం రికార్డు స్థాయికి చేరుకున్నాయి. రోజువారీ ధరలు మారుతున్న క్రమంలో లీటరుకు పెట్రోలుపై 15 పైసలు, డీజిల్‌పై 19 పైసలు పెరిగింది. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోలు ధర గరిష్ఠస్థాయికి చేరింది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడమే ఈ పరిస్థితికి కారణం కాగా.. 2018-19 బడ్జెట్‌లో ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలంటూ కేంద్ర చమురు మంత్రిత్వశాఖ ఆర్థికశాఖకు నివేదించింది. బడ్జెట్‌కు ముందు సమర్పించే తమ నివేదికలో ఆర్థికమంత్రి పరిశీలనకు ఈ అంశం పెట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈమేరకు పలు సిఫార్సులతో నివేదికను సమర్పించినట్లు చమురు కార్యదర్శి కె.డి.త్రిపాఠీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోలుపై లీటరుకు రూ. 19.48, డీజిల్‌పై రూ. 15.33 వంతున ఎక్సైజ్ సుంకం వసూలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తే సామాన్య ప్రజానీకంపై భారం తగ్గుతుందని అధికారులు తెలిపారు. 2014 నవంబరు - 2016 జనవరి మధ్య ఎన్డీఏ ప్రభుత్వం 9 సార్లు ఎక్సైజ్ సుంకాన్ని పెంచగా.. గత అక్టోబరులో ఒక్కసారి (లీటరుకు రూ. 2) తగ్గించింది. దీంతో ఆ నెలలో పెట్రోలు రూ. 68.38కి, డీజిల్ రూ. 56.89కి తగ్గింది.

★ దినసరి ఇంధన ధరల జాబితా ప్రకారం దిల్లీలో పెట్రోలు ధర లీటరు రూ. 72.38కు చేరింది. డీజిల్ ధర రూ. 63.20ను తాకింది.

★ స్థానిక పన్నులు లేదా వ్యాట్ అధికంగా ఉన్న ముంబయిలో గత డిసెంబరు మధ్య నుంచి ఇంతవరకు పెట్రోలుపై రూ. 3.31 పెరిగి.. రూ. 80 మార్కును దాటింది. అలాగే దాదాపు నెల రోజుల్లో డీజిల్‌పై రూ. 4.86 పెరిగి.. లీటరు రూ. 67.30కి చేరినట్లు చమురు సంస్థలు తెలిపాయి.

★ విజయవాడలో పెట్రోలు ధర రూ. 77.95కు చేరింది.

అపురూపం... ఆదిత్యుని నిజరూప దర్శనం

- 'రథసప్తమి'కి తరలివచ్చిన భక్తజనం

శ్రీకాకుళం సాంస్కృతికం, అరసవల్లి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలు మంగళవారం అర్ధరాత్రి నుంచి వైభవంగా ఆరంభమయ్యాయి. అరసవల్లిలోని స్వామి సన్నిధిలో స్వామి నిజరూప దర్శనభాగ్యంతో భక్తులు తన్మయులయ్యారు. మహాక్షీరాభిషేకాన్ని అశేష భక్తజన కోలాహలం మధ్య కనులపండువగా ప్రారంభించారు. సేవలో విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రభృతులు ఇందులో పాల్గొన్నారు.



దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

'సొహ్రాబుద్దీన్ కేసులో అమిత్ షా విముక్తి సవాలును వ్యతిరేకిస్తాం'

ముంబయి: వివాదాస్పద సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో భాజపా అధ్యక్షుడు అమిత్ షా నేర విముక్తిని సవాల్ చేస్తూ ముంబయి హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) వ్యతిరేకించనున్నట్లు సీబీఐ న్యాయవాది తెలిపారు. 2014 డిసెంబరు 30న కోర్టు తీర్పుతో అమిత్ షాకు లభించిన నేర విముక్తిని సీబీఐ సవాల్ చేసి ఉండాల్సిందని, అలా చేయకపోవటం అక్రమం, ఏకపక్షం, దురుద్దేశపూరితమంటూ ఇటీవల ముంబయి హైకోర్టులో పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ విచారణార్హత, కాలపరిమితిపై అభ్యంతరాలున్నాయని సీబీఐ న్యాయవాది వెల్లడించారు. సీబీఐ న్యాయవాది అభ్యర్థన మేరకు కేసు విచారణను వచ్చే నెల 13వ తేదీకి ముంబయి హైకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది.

పోలవరం.. పట్టిసీమ.. తలాక్

- వర్తమాన అంశాలపై అభ్యర్థులకు ప్రశ్నలు
- గ్రూప్-I ఇంటర్వ్యూల తీరిదీ...

ఈనాడు, అమరావతి: పోలవరం నిర్మాణంవల్ల కొత్తగా ఎంత ఆయకట్టు సాగులోకి వస్తుంది? ఎన్ని గ్రామాలకు తాగునీరు అందుతుంది? పట్టిసీమ, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుల మధ్య వ్యత్యాసాలేమిటి? లాంటి వర్తమాన అంశాలపై గ్రూప్-1 అభ్యర్థులకు మౌఖిక పరీక్షల్లో ప్రశ్నలు ఎదురవుతున్నాయి. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలో సోమవారం నుంచి ఈ మౌఖిక పరీక్షలు జరుగుతున్నాయి. రెండు రోజులపాటు జరిగిన ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల్లో 75% మంది వరకూ ప్రభుత్వ, అనుబంధ శాఖల్లో పనిచేస్తున్న వారే ఉన్నారు. ఇకపై జరిగే మౌఖిక పరీక్షలకు హాజరయ్యే వారిలోనూ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారే అధిక సంఖ్యలో ఉన్నారు. ఛైర్మన్ నేతృత్వంలో ఏర్పాటైన ఇంటర్వ్యూ బోర్డులో ఒక సభ్యుడితోపాటు సీనియర్ ఐఏఎస్, సబ్జెక్టు నిపుణులు కలిపి నలుగురైదుగురు ఉంటున్నారు. ముఖ్యంగా అభ్యర్థులు సమర్పించిన బయోడేటాలో పేర్కొన్న వివరాల ఆధారంగా ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. డిగ్రీ, పీజీలో చదివిన గ్రూపులకు పొంతన లేని వారికి ఎందుకు అలా చదివారు? కారణాలేంటి? అన్న ప్రశ్నలు ఎదురయ్యాయి. అలాగే అభ్యర్థులు చేస్తున్న ఉద్యోగంపై ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి. ముమ్మారు తలాక్ ద్వారా వంద మందిలో ఎంత మందిలో మార్పు వస్తుందని భావిస్తున్నారు? నదుల అనుసంధానం గురించి మీ అభిప్రాయాలేమిటి? కాశ్మీరులో నెలకొన్న తాజా పరిస్థితులపై అభ్యర్థులకు ప్రశ్నలొచ్చాయి. కాపు రిజర్వేషన్లకు సంబంధించిన షెడ్యూలు 9 గురించి, తునిలో జరిగిన అల్లర్ల గురించి సందర్భానికి తగినట్లుగా బోర్డు నుంచి ప్రశ్నలు వచ్చినట్లు తెలియవచ్చింది. భారత్.. చైనా మధ్య డోక్లాంపై నెలకొన్న వివాదానికి సంబంధించిన ప్రశ్నలూ అడిగారు. ఒక్కో అభ్యర్థిని 15 నుంచి 20 నిమిషాల వరకూ ఇంటర్వ్యూ చేస్తున్నారు. అభ్యర్థుల జిల్లాను అనుసరించీ ప్రశ్నలు వస్తున్నాయి. 2011 నోటిఫికేషన్‌ను అనుసరించి ఇప్పుడు ఇంటర్వ్యూలు జరుగుతుండటం, విధి నిర్వహణలో తలమునకలై సబ్జెక్టుల్లో పట్టు సాధించడంపై దృష్టి పెట్టనందున జవాబులు చెప్పలేని పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు కొందరు అభ్యర్థులు మాట్లాడుకోవడం కనిపించింది.

నీతి తప్పిన అధికారులపై వేటు

ఏఎస్పీ సునీతరెడ్డి, కల్వకుర్తి సీఐ మల్లికార్జున్‌రెడ్డి సస్పెన్షన్



సునీతరెడ్డి



మల్లికార్జున్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: అనైతిక వ్యవహారాలతో పోలీస్‌శాఖ పరువును బజారుకీడ్చిన ఇద్దరు అధికారులపై వేటు పడింది. అవినీతి నిరోధక శాఖ ప్రధాన కార్యాలయం అదనపు ఎస్పీ సునీతరెడ్డి, నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి సీఐ మల్లికార్జున్‌రెడ్డిలను సస్పెండ్ చేస్తూ మంగళవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 'ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్ గార్డెనియా గేటెడ్ కమ్యూనిటీలోని ఏఎస్పీ సునీతరెడ్డికి చెందిన ఫ్లాట్ నుంచి వస్తూ సీఐ మల్లికార్జున్‌రెడ్డి ఆమె భర్త సురేందర్‌రెడ్డికి పట్టుబడటం, ఈ సందర్భంగా ఆయన అమ్మతోపాటు..అత్త, పెద్దత్త(ఏఎస్పీ అమ్మ, పెద్దమ్మ) ప్రమీల, సునందలు సీఐపై చెప్పులతో దాడిచేయడం తెలిసిందే.' ఈ వ్యవహారం రచ్చకెక్కడంతో పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు తక్షణ చర్యలకు ఉపక్రమించారు. ఏఎస్పీ భర్త ఫిర్యాదు మేరకు సీఐని సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ రేంజ్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర మంగళవారం ఉత్వర్వులిచ్చారు. సీఐపై నమోదైన కేసు తాలూకా ఎఫ్‌ఐఆర్‌లో ఏఎస్పీ పేరు ఉండటం, ఆమె అనైతిక ప్రవర్తనతో పోలీస్‌శాఖ ప్రతిష్ఠ మసకబారిందన్న కారణంతో ఆమెపైనా సస్పెన్షన్ వేటు వేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజయ్‌మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి తీసుకోకుండా ఏఎస్పీ హైదరాబాద్ దాటి వెళ్లరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తమిళనాడు లేఖపై 3 నెలల్లో నిర్ణయం తీసుకోండి

- కేంద్రానికి సుప్రీం ఆదేశం
- రాజీవ్ హత్యకేసులో దోషుల విడుదల అంశం..

దిల్లీ: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దీర్ఘకాలంగా జైలుశిక్ష అనుభవిస్తున్న ఏడుగురు దోషులను విడుదల చేయడంలో ఏకీభావం కోరుతూ తమిళనాడు ప్రభుత్వం రాసిన లేఖపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. రాజీవ్ హత్యకేసులో కారాగారవాసం అనుభవిస్తున్న ఏడుగురిని విడుదల చేయాలని తాము ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని.. అయితే, 2015లో సుప్రీంకోర్టు వెలువరించిన ఉత్తర్వు ప్రకారం ఇందుకు కేంద్రప్రభుత్వ ఏకీభావమూ అవసరమని సూచిస్తూ తమిళనాడు ప్రభుత్వం 2016 మార్చి 2న కేంద్రానికి లేఖ రాసింది. దీనిపై కేంద్రం స్పందించలేదు. దీంతో లేఖపై ఏదో ఒక నిర్ణయం వెలువరించేలా కేంద్రాన్ని ఆదేశించాలని విన్నవిస్తూ ఏడుగురు దోషులు సుప్రీంను ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎ.ఎం.సప్రె, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం తాజాగా విచారణ నిర్వహించింది. తమిళనాడు లేఖపై3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది.

కుల్‌భూషణ్ జాదవ్ కేసులో వాదనల సమర్పణకు తేదీల ఖరారు

దహేగ్: కుల్‌భూషణ్ జాదవ్ కేసులో భారత్, పాకిస్థాన్‌లు తమ లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) తేదీలు ఖరారుచేసింది. ఏప్రిల్ 17 కల్లా భారత్, జులై 17 కల్లా పాకిస్థాన్‌లు వాదనలు దాఖలుచేయాలని ఓ అధికారిక ఉత్తర్వులో ఐసీజే సూచించింది. కేసుకు సంబంధించిన దేశాల అభిప్రాయాలు, పరిస్థితులకు అనుగుణంగా తేదీలను ఖరారుచేసినట్లు దీనిలో పేర్కొంది. గూఢచర్య ఆరోపణలపై పాక్‌లో జాదవ్ మరణ శిక్షను ఎదుర్కొంటున్నారు.

పాక్ ప్రధాన న్యాయమూర్తిపై మహిళల మండిపాటు

ఇస్లామాబాద్: ఆసక్తి రేకెత్తించే మంచి ప్రసంగమంటే ఎలా ఉండాలో వివరించడానికి దానిని మహిళల స్కర్టు కొలతతో సరిపోలుస్తూ బ్రిటిష్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ చేసిన వ్యాఖ్యను పాకిస్థాన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సాఖిబ్ నిసార్ ప్రస్తావించడంపై మహిళా సంఘాలు విరుచుకుపడుతున్నాయి. ఈ నెల 13న కరాచీలో ప్రసంగిస్తూ ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్య చేశారు.

ఛాంపియన్స్

సన్నాహంలో లోపం లేదు

శాస్త్రితో విభేదించిన కోహ్లి

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా పర్యటనకు ఇంకా ముందు వచ్చుంటే బాగుండేదన్న కోచ్ రవిశాస్త్రితో భారత కెప్టెన్ కోహ్లి విభేదించాడు. ''ఈ సిరీస్‌కు మేం సరిగా సన్నద్ధం కాలేదని నేను భావించట్లేదు. టెస్టు సిరీస్‌లో ఓడిపోయాక సన్నాహాన్ని వేలెత్తి చూపను. సిరీస్‌కు సన్నద్ధం కావడానికి మాకు వారం సమయం లభించింది. తీరిగ్గా కూర్చుని.. బయటి అంశాలు మా ఓటములుకు కారణమని ఆలోచించం. మా తప్పులు, మంచి అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవడం సిరీస్ కోల్పోవడానికి కారణాలు'' అని చెప్పాడు. దక్షిణాఫ్రికా పర్యటనకు తాము మరో పది రోజులు ముందుగా వచ్చుంటే బాగుండేదని ఇంతకుముందు రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. మూడో టెస్టులో పూర్తిగా పేస్ బౌలర్లతో బరిలో దిగే అవకాశముందన్నాడు కోహ్లి. ''పిచ్‌పై చాలా పచ్చిక ఉంది. కచ్చితంగా ఐదుగురు పేసర్లతో ఆడే అవకాశాన్ని పరిశీలిస్తాం'' అని వివరించాడు.

మధ్యాహ్నం 1.30 నుంచి సోనీ టెన్- 1, 3లో ప్రసారం





కోహ్లి తప్పులను ఎత్తి చూపే వాళ్లేరి?

దిల్లీ: విరాట్ కోహ్లి నిర్ణయాలను జట్టులో ఎవరూ సవాల్ చేయకపోవడాన్ని భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తప్పుపట్టాడు. మైదానంలో నాయకుడు చేసే తప్పులను సహచరులు ఎత్తి చూపాలన్నాడు. ''తాను చేసే తప్పులను వెతికే ఆటగాళ్లు ఇప్పుడు విరాట్ కోహ్లికి కావాలి. ప్రతి జట్టులోనూ ఇలాంటి ఆటగాళ్లు నలుగురైదుగురు ఉంటారు. నాయకుడు తప్పు చేయకుండా వీరు చూస్తారు. భారత జట్టులో మాత్రం అలాంటి ఆటగాళ్లు లేరు. కోహ్లి సెలక్షన్ నిర్ణయాలను ఎవరూ డ్రెస్సింగ్ రూమ్‌లో సవాల్ చేయడం లేదు'' అని సెహ్వాగ్ అన్నాడు. సహచర ఆటగాళ్లపై విపరీత అంచనాలు కూడా కోహ్లి కెప్టెన్సీపై ప్రభావం చూపిస్తున్నాయని వీరూ అన్నాడు. ''క్లిష్టపరిస్థితుల్లో కూడా అద్భుతంగా ఆడే స్థాయికి విరాట్ చేరుకున్నాడు. జట్టులో ఇతర ఆటగాళ్లు ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదు. ఇది కోహ్లి నాయకత్వంపై ప్రభావం చూపిస్తోంది. తనలానే ఇతర ఆటగాళ్లు కూడా ధైర్యంగా ఆడాలని కోరుకుంటాడు. ఇందులో తప్పు కూడా లేదు. సచిన్ కూడా తాను నాయకుడిగా ఉన్నప్పుడు ఇలానే అనుకునేవాడు. తాను ఆడుతున్నప్పుడు మిగతావారు ఎందుకు ఆడడం లేదని ప్రశ్నించేవాడు. అయినా ఏ ఒక్క ఆటగాడి వల్ల విజయం రాదు. సమష్టి కృషి కీలకం. ప్రతి ఒక్క ఆటగాడు తన వంతు పాత్ర పోషించాలి'' అని సెహ్వాగ్ అన్నాడు.

ఈ ఒక్కటైనా..

విజయం కోసం భారత్ ఆరాటం ● దక్షిణాఫ్రికాతో నేటి నుంచే మూడో టెస్టు

బలమైన జట్టు. వరుస సిరీస్ విజయాలు.. ఫామ్‌లో ఆటగాళ్లు. ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం. దక్షిణాఫ్రికా గడ్డపై టీమ్‌ఇండియా చరిత్ర సృష్టించే సత్తా కోహ్లీసేనకు ఉందనడానికి ఎన్నో కారణాలు. కానీ జరిగింది వేరు. జట్టు మారినా.. కథ పాతదే!

ఎన్నో అంచనాలతో దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టిన భారత్ పేలవ ప్రదర్శనతో తొలి రెండు టెస్టుల్లోనూ ఓడి సిరీస్‌ను కోల్పోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణాఫ్రికా గడ్డపై వైట్‌వాష్ ముప్పును ఇప్పుడు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఒక్క మ్యాచ్‌లోనైనా నెగ్గి పరువు కాపాడుకోవాలనుకుంటున్న భారత్.. ఆఖరి సమరానికి సన్నద్ధమైంది. నేటి నుంచే మూడో టెస్టు. మ్యాచ్ వేదిక వాండరర్స్‌లో ఏనాడూ ఓడిపోకపోవడం సానుకూలాంశమే. కానీ బ్యాటింగ్‌కు కష్టమని భావిస్తున్న పచ్చని పిచ్‌పై ఆతిథ్య జట్టును అడ్డుకోవడం భారత్‌కు పెను సవాలే!

జొహానెస్‌బర్గ్

బ్యాట్స్‌మెన్ ఫామ్ వేధిస్తుంటే..వైట్‌వాష్ ముప్పు వెంటాడుతుంటే కోహ్లీసేన ఆఖరి పరీక్షకు సిద్ధమైంది. రెట్టించిన ఉత్సాహంతో ఉన్న దక్షిణాఫ్రికాతో.. ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన టీమ్ ఇండియాకు మూడో టెస్టు బుధవారం నుంచే. తొలి టెస్టులో 72 పరుగుల తేడాతో, రెండో టెస్టులో 35 పరుగుల తేడాతో గెలిచిన ఆతిథ్య జట్టు ఇప్పటికే సిరీస్‌ను చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

ఐదుగురు పేసర్లతో భారత్: సిరీస్‌లు గెలిచి ఉండకపోవచ్చు. కానీ ప్రస్తుత జట్టు కన్నా బలహీనంగా ఉన్నాయని భావిస్తున్న గత భారత జట్లు ఏనాడూ దక్షిణాఫ్రికాలో వైట్‌వాష్‌కు గురికాలేదు. కానీ కోహ్లీసేన ఈసారి 3-0 ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. క్లీన్‌స్వీప్‌తో.. గత భారత పర్యటనలో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోవాలనే పట్టుదలతో దక్షిణాఫ్రికా ఉంది. ఆ 2015-16 సిరీస్‌లో భారత్ 3-0తో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. ఈ నేపథ్యంలో కసితో ఉన్న దక్షిణాఫ్రికాను అడ్డుకోవాలంటే భారత్ శ్రమించాల్సిందే. ఐతే జొహానెస్‌బర్గ్‌లో రికార్డు కోహ్లీసేనకు స్ఫూర్తినిచ్చేదే. ఇక్కడ నాలుగు మ్యాచ్‌లు ఆడిన భారత్.. ఎప్పుడూ ఓడిపోలేదు. దక్షిణాఫ్రికా గడ్డపై ఆ జట్టు మొట్టమొదటి విజయం సాధించింది ఇక్కడే. భారత్ టీ20 ప్రపంచకప్‌ను అందుకుంది ఇక్కడే. కానీ ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా లేవు. పచ్చని పచ్చికతో ఉన్న వాండరర్స్ పిచ్‌పై బ్యాటింగ్ చేయడం కష్టమే. మంచి ఫామ్‌లో ఉన్న దక్షిణాఫ్రికా పేస్ దళం పెను సవాల్‌నే విసరనుంది. ఈ మ్యాచ్‌కు భారత తుది జట్టులో పలుమార్పులు జరగనున్నాయి. పిచ్ ఫాస్ట్‌బౌలింగ్‌కు అనుకూలించనున్న నేపథ్యంలో దక్షిణాఫ్రికాతో పాటు భారత్ కూడా ఒక్క స్పిన్నర్ కూడా లేకుండా, అంతా పేసర్లతోనే బరిలోకి దిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. కెప్టెన్ కోహ్లి కూడా ఐదుగురు పేసర్లతో ఆడతామని సూచనప్రాయంగా చెప్పాడు.


రహానె

అంతా ఊహిస్తున్నట్లు అజింక్య రహానె, అతడితోపాటు భువనేశ్వర్ జట్టులోకి రావొచ్చు. షమి, బుమ్రాల్లో ఒకరు భువికి దారి వ్వాల్సి రావొచ్చు. రహానెను తీసుకున్నా రోహిత్‌ను కూడా కొనసాగించే అవకాశముందన్న అంచనా ఆసక్తి రేపుతోంది. మరోవైపు పార్థివ్ పటేల్ స్థానంలో దినేశ్ కార్తీక్ వికెట్ కీపింగ్ బాధ్యతలు అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక దక్షిణాఫ్రికాకు సెలక్షన్ సమస్యలేమీ లేవు. స్పిన్నర్ కేశవ్ మహారాజ్‌ను తప్పించడం మినహా మార్పులేమీ ఉండవు. అతడి స్థానంలో పేసర్‌ను తీసుకుంటుందా లేదా అదనపు బ్యాట్స్‌మన్‌తో బరిలోకి దిగుతుందా అన్నది చూడాలి.

పచ్చికతో కళ కళ..: వాండరర్స్ పిచ్ పచ్చికతో కళకళలాడుతోంది. ఇక పచ్చికను కత్తిరించబోమని క్యురేటర్ బుతెలిజి చెప్పాడు. ఆకాశం మబ్బులు పట్టి ఉంది. మ్యాచ్ జరిగే ఐదురోజులూ ఆటను వర్షం పలకరించనుంది. పేస్, బౌన్స్ పుష్కలంగా లభించనున్న పిచ్‌పై బ్యాటింగ్ బ్యాట్స్‌మెన్‌కు పెద్ద పరీక్షే.

20.45 సిరీస్‌లో ఇప్పటివరకు భారత టాప్-6 బ్యాట్స్‌మెన్ సగటు. సెంచూరియన్‌లో కోహ్లి 153ను తీసేస్తే.. ఆ సగటు 14.08 మాత్రమే


నాదల్

రాడ్‌లేవర్ ఎరీనాలో మరో పెను సంచలనం! ప్రపంచ నం.1 రఫెల్ నాదల్ నిష్క్రమించాడు. మారిన్ సిలిచ్‌తో హోరాహోరీ పోరులో వెనుకబడి ఉన్నపుడు అతను గాయంతో తప్పుకున్నాడు. మరోవైపు బ్రిటన్ కుర్రాడు కైల్ ఎడ్మండ్.. సంచలన ప్రయాణాన్ని కొనసాగిస్తూ మూడో సీడ్ దిమిత్రోవ్‌ను ఇంటికి పంపాడు. అమ్మాయిల్లో నాలుగో సీడ్ స్వితోలినాను అన్‌సీడెడ్ మెర్టిన్స్ కంగుతినిపించింది.

రఫా కల చెదిరె

- గాయంతో నిష్క్రమించిన నాదల్
- దిమిత్రోవ్ ఔట్
- సెమీస్‌లో ఎడ్మండ్, మెర్టెన్స్, వోజ్నియాకి

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్ సంచలనాలతో మార్మోగుతోంది. నొవాక్ జకోవిచ్ వెనుదిరిగిన 24 గంటల్లోపే స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ ఇంటిముఖం పట్టాడు. 17వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలన్న అతని కల చెదిరింది. మంగళవారం హోరాహోరీ సాగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో రఫా 6-3, 3-6, 7-6 (7-5), 2-6, 0-2తో మారిన్ సిలిచ్ (క్రొయేషియా)పై వెనుకబడిన సమయంలో అతను గాయం కారణంగా మ్యాచ్‌ను వదులుకున్నాడు. తొలి సెట్లో నాదల్, సిలిచ్ నువ్వా నేనా అన్నట్లు ఆడడంతో ఒక దశలో స్కోరు 3-3గా నిలిచింది. ఈ స్థితిలో మెరుపు ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో రఫా సర్వీసు బ్రేక్ చేసిన సిలిచ్.. ఆ తర్వాత ఆ సెట్‌ను 6-3తో చేజిక్కించుకున్నాడు. రెండో సెట్లో నాదల్ పుంజుకున్నాడు. బలమైన ఫోర్ హ్యాండ్‌షాట్లు ఆడిన అతను.. వరుస పాయింట్లతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. సిలిచ్ డబుల్ ఫాల్ట్ చేయడంతో 4-2తో ఆధిక్యంలోకి వెళ్లిన రఫా.. ఆ తర్వాత 6-3తో సెట్ గెలిచాడు. 72 నిమిషాల పాటు సాగిన మూడో సెట్లో రఫా, సిలిచ్ ప్రతి పాయింట్‌కు పోరాడారు. టైబ్రేకర్‌లోనూ స్కోరు 5-5తో సమంగా నిలిచింది. ఈ స్థితిలో వరుసగా రెండు పాయింట్లు సాధించిన రఫా.. 7-6 (7-5)తో సెట్ గెలిచి మ్యాచ్‌లో ఆధిక్యం సాధించాడు. కానీ కాలి గాయం ఇబ్బంది పెట్టడంతో స్పెయిన్ స్టార్ జోరు అక్కడితోనే ఆగిపోయింది. నాలుగో సెట్ నాలుగో గేమ్‌లో నాదల్ సర్వీస్ బ్రేక్ చేసిన సిలిచ్.. ఆపై 6-2తో సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచాడు. అప్పటికే రఫా కుంటుతూనే ఆట కొనసాగించాడు. మధ్య మధ్యలో వైద్య విరామాలు తీసుకున్నాడు. ఐదో సెట్ రెండో గేమ్‌లో నాదల్ సర్వీసు బ్రేక్ చేసిన సిలిచ్ 2-0తో ఆధిక్యంలో నిలిచాడు. ఈ స్థితిలో గాయం తీవ్రత ఎక్కువవడంతో నాదల్ పోటీ నుంచి వైదొలిగాడు. మరోవైపు మూడో సీడ్ దిమిత్రోవ్‌కు బ్రిటన్ కుర్రాడు ఎడ్మండ్ షాకిచ్చాడు అతను 6-4, 3-6, 6-3, 6-4తో దిమిత్రోవ్‌ను ఓడించాడు.


సిలిచ్

స్వితోలినాకు షాక్: అమ్మాయిల్లో టైటిల్‌కు గట్టిపోటీదారు స్వితోలినాకు షాక్ తగిలింది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఎలిస్ మెర్టిన్స్ 6-4, 6-0తో స్వితోలినాను చిత్తు చేసింది. గంట 13 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో 26 విన్నర్లు కొట్టిన మెర్టిన్స్.. ఐదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసింది. ఒక్క రెండో సెట్లోనే మెర్టిన్స్.. మూడుసార్లు స్వితోలినా సర్వీసును బ్రేక్ చేసింది. రెండో సీడ్ కరోలినా వోజ్నియాకి (డెన్మార్క్) సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో ఆమె 6-0, 6-7 (3-7), 6-2తో సురెజ్ నవారో (స్పెయిన్)ను ఓడించింది. ఒక్క రెండో సెట్లో మాత్రమే వోజ్నియాకికి ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురైంది. ఈ మ్యాచ్‌లో ఆమె పది ఏస్‌లతో పాటు 34 విన్నర్లు కొట్టింది.

క్వార్టర్స్‌లో బోపన్న జోడీ: మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న, హంగేరి అమ్మాయి బబోస్‌తో కలిసి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. ప్రిక్వార్టర్స్‌లో బోపన్న-బబోస్ 6-4, 6-4తో వానియా కింగ్ (అమెరికా)-ఫ్రాంకో స్కుగర్ (క్రొయేషియా)ను వరుస సెట్లలో ఓడించారు. క్వార్టర్స్‌లో ఈ జోడీ.. జువాన్ సెబాస్టియన్ (కొలంబియా)-అబిగల్ స్పీయర్స్ (అమెరికా)తో తలపడనున్నారు. ఈ టోర్నీలో పోటీలో మిగిలున్న ఏకైక భారత ఆటగాడు బోపన్నే.

నలుగురు బౌలర్లు చాలు

మొహిందర్ అమర్‌నాథ్

భారత్ ఇప్పటికే దక్షిణాఫ్రికాకు సిరీస్ చేజార్చుకుంది. ఐతే ఈ సిరీస్ కనిపించే దాని కంటే హోరాహోరీగానే సాగింది. భారత బ్యాట్స్‌మెన్ ఇంకాస్త మెరుగ్గా ఆడి ఉంటే ఫలితం ఎలాగో ఉండేది. భారత బౌలర్లు చక్కటి ప్రదర్శన చేశారు. బ్యాటింగే ఆందోళనకరం. ఈ ప్రదర్శన రాబోయే విదేశీ పర్యటనలకు శుభ సూచకం కాదు. సిరీస్‌లో ఇప్పటికే భారత్ రకరకాల కూర్పుల్ని ప్రయత్నించింది. కానీ అవి ఫలితాన్నివ్వలేదు. దక్షిణాఫ్రికాకు పోటీ ఇవ్వాలంటే ఏదైనా కొత్తగా చేయాలి. బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చడం ఫలితాన్నివ్వొచ్చు. ఈడెన్‌లో ఆస్ట్రేలియాతో చారిత్రక టెస్టు మ్యాచ్‌లో లక్ష్మణ్ మూడో స్థానంలో రావడం వల్ల ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. అలాంటి మార్పు ఇప్పుడు పని చేయొచ్చేమో! ధావన్ తిరిగి జట్టులోకి వచ్చి విజయ్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించాలి. రాహుల్ లేదా రోహిత్ మూడో స్థానంలో ఆడాలి. పుజారా, రహానె 5-6 స్థానాల్లో ఉండాలి. జొహానెస్‌బర్గ్‌లో భారత్ నాలుగు బౌలర్లకు పరిమితమై, అదనపు బ్యాట్స్‌మన్‌ను ఆడించాలి. బ్యాట్స్‌మెన్‌లో దూకుడు అవసరం. ప్రస్తుతం అది కోహ్లి ఒక్కడిలో మాత్రమే కనిపిస్తోంది.

కోహ్లికి అండగా నిలవాలి

సౌరభ్ గంగూలీ

మూడో టెస్టులో భారత్ ఎలాంటి పిచ్‌పై ఆడుతుందన్న దాని గురించే ఎక్కువగా చర్చ సాగుతోంది. పిచ్‌పై పచ్చిక ఉన్నప్పటికీ దానిపై బంతి పడేవరకు అది ఎలా స్పందిస్తుందన్నది కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. ఈ సిరీస్‌లో భారత బౌలర్లు అద్భుత ఫామ్‌లో ఉన్నారు. రెండు టెస్టుల్లోనూ వారు 20 వికెట్లు పడగొట్టారు. వారికి బ్యాట్స్‌మెన్ మద్దతు కావాలి. మ్యాచ్‌లో ఎంత మంది బౌలర్లను ఆడించాలన్నదే భారత జట్టు తేల్చుకోవాలి. మ్యాచ్ ఆరంభం ముందు వరకు పిచ్‌పై పచ్చిక ఉంటే నలుగురు బౌలర్లతో సరిపెట్టుకుని అదనంగా ఓ బ్యాట్స్‌మన్ ఆడించాలి. లేదంటే ఐదుగురు బౌలర్లను జట్టులోకి తీసుకోవాలి. వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన నేపథ్యంలో విరాట్ కెప్టెన్సీపై చర్చ జోరుగా సాగుతోంది. విదేశాల్లో ఇది అతడికి తొలి కఠిన సిరీస్. ఎవరూ పుట్టుకతోనే నాయకుడు కారు. ప్రస్తుత స్థితి నుంచి కోహ్లి మెరుగవుతాడని నమ్ముతున్నా. ఈ ఏడాది టీమ్‌ఇండియా విదేశాల్లోనే ఎక్కువగా ఆడనుంది కాబట్టి.. అతడికి జట్టులో అందరి ఆటగాళ్ల మద్దతు చాలా అవసరం.



హర్మన్‌ప్రీత్ సారథ్యంలో..

దక్షిణాఫ్రికాలో భారత్ టీ20 సిరీస్

ముంబయి: దక్షిణాఫ్రికాలో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు స్టార్ ఆల్‌రౌండర్ హర్మన్‌ప్రీత్ కౌర్ భారత జట్టు కెప్టెన్‌గా ఎంపికైంది. స్మృతి మందానా వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. ఫిబ్రవరి 13న ఈ సిరీస్ ఆరంభం కానుంది. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ముగిశాక టీ20 సిరీస్ జరుగుతుంది. వన్డే జట్టుకు మిథాలీ రాజ్ కెప్టెన్.

భారత జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మందానా (వైస్ కెప్టెన్), మిథాలీ రాజ్, వేద కృష్ణమూర్తి, జెమీమా, దీప్తి శర్మ, అనుజ, తానియా, నుజాత్, పూనమ్ యాదవ్, రాజేశ్వరి గైక్వాడ్, జులన్ గోస్వామి, శిఖ పాండే, పూజ, రాధ.

రాహుల్‌కు స్వర్ణం

మంగళూరు: జాతీయ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాగాల వెంకట రాహుల్ స్వర్ణం గెలిచాడు. ఆర్‌ఎస్‌పీబీకి ప్రాతినిధ్యం వహిస్తున్న అతడు పురుషుల 85 కిలోల విభాగంలో స్వర్ణం సాధించాడు. ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్లు.. అలీమా బేగం 2 రజతాలు, 2 కాంస్యాలతో సత్తాచాటగా.. లలిత, రామకృష్ణ చెరో రజతం గెల్చుకున్నారు. మహిళల 69 కేజీల పోటీలో అలీమా.. జెర్క్‌లో కాంస్యం, క్లీన్ అండ్ జెర్క్‌లో రజతం, ఓవరాల్‌గా కాంస్య పతకాలు నెగ్గింది. అంతర్ రాష్ట్ర విభాగంలో మరో రజతం గెల్చుకుంది. మహిళల 63 కేజీల అంతర్ రాష్ట్ర పోటీలో లలిత రజతం సాధించింది. పురుషుల 77 కేజీల పోటీలో రామకృష్ణ రజతం నెగ్గాడు.



స్నేహిత్ జోడీకి రజతం

దుర్గాపూర్ (పశ్చిమ బంగ): జాతీయ జూనియర్, యూత్ అంతర్ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో ఫిదెల్ ఆర్. స్నేహిత్- మహ్మద్ అలీ (తెలంగాణ) జోడీ రజతం సాధించింది. మంగళవారం జూనియర్ బాలుర డబుల్స్ ఫైనల్లో స్నేహిత్- అలీ 0-3తో మానవ్- సోన్యా చిన్మయ చేతిలో ఓడి ద్వితీయ స్థానంలో నిలిచారు. జూనియర్ బాలికల సెమీస్‌లో వరుణి జయస్వాల్ 1-4తో అర్చన చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది.


లాయిడ్ పోప్

పోప్ 8/38

అండర్-19 ప్రపంచకప్ సెమీస్‌లో ఆస్ట్రేలియా

క్వీన్స్‌టౌన్: అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో తొలి సెమీస్ బెర్తును ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది. మంగళవారం క్వార్టర్ ఫైనల్లో ఆ జట్టు ఇంగ్లాండ్‌ను 31 పరుగుల తేడాతో ఓడించింది. మొదట ఆస్ట్రేలియా 33.3 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ జేసన్ (58) మినహా ఎవ్వరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్‌ను లెగ్ స్పిన్నర్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లాయిడ్ పోప్ (8/38) కుప్పకూల్చాడు. ఓపెనర్ బాంటన్ (58) మినహా ఎవ్వరూ క్రీజులో నిలవకపోవడంతో ఆ జట్టు 23.4 ఓవర్లలో 96 పరుగులకే ఆలౌటైంది.


తమీమ్

ఫైనల్లో బంగ్లాదేశ్

ఢాకా: ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ వరుసగా మూడో విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జింబాబ్వేను 91 పరుగుల తేడాతో చిత్తు చేసింది బంగ్లా. మొదట బంగ్లా 9 వికెట్లకు 216 పరుగులే చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' తమీమ్ (76), షకిబ్ (51) మినహా అంతా విఫలమయ్యారు. లక్ష్యం చిన్నదే అయినా జింబాబ్వే నిలవలేకపోయింది. షకిబ్ (3/34), మొర్తజా (2/29)ల ధాటికి 36.4 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది.

సెమీస్‌లో హ్యామర్స్

దిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో హరియాణా హ్యామర్స్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పోరులో హ్యామర్స్ 4-3తో యూపీ దంగల్‌ను ఓడించింది. రెండో స్థానంలో నిలిచిన హ్యామర్స్.. యూపీ దంగల్‌తోనే సెమీస్ ఆడనుంది.

కూచిపూడి నృత్య కళాకారుడు వెంపటి రవిశంకర్ కన్నుమూత



హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రసిద్ధ కూచిపూడి నాట్య కళాకారుడు, పద్మభూషణ్ డా.వెంపటి చినసత్యం రెండో కుమారుడు, కళారత్న వెంపటి రవిశంకర్(46) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున ఫిలింనగర్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. రవిశంకర్ ప్రస్తుతం ఇండియన్ కల్చరల్ కౌన్సిల్ ప్యానెల్ ఆర్టిస్ట్ సభ్యులుగా, ఇంటర్నేషనల్ డాన్స్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు. చిన్ననాటి నుంచి తన తండ్రి వద్ద నృత్యాన్ని అభ్యసించిన రవిశంకర్ ఆ నాట్య సంపదను పదిలపరిచే క్రమంలో తండ్రి మార్గాన్ని అనుసరించారు. పెద్ద తండ్రి పెదసత్యంగారి బాణీని సైతం చేర్చి కూచిపూడి నాట్యంలో శిల్పప్రాధాన్యానికి మరింత శోభను తెచ్చారు. సుమారు 80కి పైగా నృత్యాంశాలను నృత్యీకరించి, దేశ విదేశాల్లో అనేక మందికి శిక్షణ ఇచ్చారు. 200కు పైగా స్వీయరచనలు చేసి వాటికి సంగీతాన్ని కూర్చి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ వద్ద నేర్చుకున్న సంగీతానుభవంతో అతి మధురంగా గానంచేసి యువ కూచిపూడి వాగ్గేయకారుడిగా ప్రసిద్ధి పొందారు. ఆయన కళాసేవను గుర్తించి కేరళ ప్రభుత్వం సిద్ధేంద్ర పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న పురస్కారంతో సత్కరించాయి. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. బుధవారం అంత్యక్రియలు జరుగుతాయి.

వెలిగొండలో అక్రమ చెల్లింపులు

- ఎం బుక్ నమోదు లేకుండా రూ.11.67 కోట్ల అందజేత
- సాంకేతిక అనుమతి లేకుండా ఇచ్చేసిన ఖజానా అధికారులు
- 5 ప్రశ్నలతో ఎస్ఈకి మెమో జారీ చేసిన చీఫ్ ఇంజినీరు

ఈనాడు – అమరావతి

వెలిగొండ ప్రాజెక్టులో తాజాగా పని ప్రారంభించిన హెడ్ రెగ్యులేటర్ నిర్మాణానికి సంబంధించి గుత్తేదారుకు చెల్లించిన రూ.11.67 కోట్ల చుట్టూ వివాదాలు ముసిరాయి. ఈ పనులకు సంబంధించి ఎంబుక్‌లో నమోదు చేయకుండా, లెవిల్స్ తీయకుండా చెల్లింపులు జరిపిన వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో వారు దీని లోతుపాతులపై దృష్టి సారించారు. పాత గుత్తేదారు నుంచి పని తొలగింపు వ్యవహారం రాష్ట్ర స్థాయి స్టాండింగు కమిటీలో ఆమోదం పొందకపోవడం, చీఫ్ ఇంజినీరు సాంకేతిక అనుమతులు లేకుండా పనులు ప్రారంభించి బిల్లులు చెల్లించడమూ ప్రశ్నార్థకమవుతోంది. ఈ వ్యవహారం ఖజానా అధికారులకు చుట్టు



కునేలా ఉంది. అనుమతులు ఉన్నాయో లేదో చూసుకున్న తర్వాతే ఖజానా అధికారులు బిల్లులు చెల్లించాలి. కేవలం నెల రోజుల్లో 31 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకంతో పాటు 1,90,000 క్యూబిక్ మీటర్ల మేర రాయి పేల్చి తవ్వే పని జరిగినట్లు చూపించారు. ఎంబుక్‌లో ఈ వివరాలు ఏమీ నమోదు చేయకుండానే చెల్లింపులు జరగడం తాజా వివాదం. పైగా ఈ పనులు చేపట్టేందుకు అవసరమైన సన్నాహక పనులకే టెండరు మొత్తంలో ఏకంగా 15.40శాతం నిధులు కేటాయించడమూ చర్చనీయాంశమవుతోంది. ఈ మధ్య టన్నెళ్ల పనికి సయితం కొత్తగా టెండర్లు పిలిచే ప్రక్రియ చేపట్టడంతో కొత్తగా బాధ్యతలు చేపట్టిన చీఫ్ ఇంజినీరు జబ్బార్ దృష్టికి ఈ విషయాలు వచ్చాయి. దీంతో వెలిగొండ సూపరింటెండెంట్ ఇంజినీరు రెడ్డయ్యకు చీఫ్ ఇంజినీరు కొన్ని ప్రశ్నలతో మెమో జారీ చేశారు.

మోమోలో అడిగిన వివరాలివీ...

- పాత గుత్తేదారు నుంచి పని తొలగించి కొత్తవారికి అప్పగించేందుకు ప్రభుత్వం నుంచి తీసుకున్న అనుమతులు ఏవి?
- ఈ కొత్త పనికి సంబంధిత చీఫ్ ఇంజినీరు నుంచి తీసుకున్న సాంకేతిక అనుమతుల వివరాలు ఎక్కడ?
- ఈ పని చేపట్టేందుకు దశలవారీగా ఎంతెంత పని ఎప్పుడు చేయాలి, ఆర్థికంగా ఎంతెంత ఎప్పుడు ఖర్చు చేయాలో రూపొందించిన ప్రణాళికలు ఇవ్వండి.
- ఇప్పటి వరకు సంబంధిత ఆర్.కె.ఇన్‌ఫ్రా కంపెనీకి ఎంత బిల్లు చెల్లించారు, ఏ పనికి ఎంత చెల్లింపులు జరిగాయి, ఎంబుక్‌లో నమోదు చేసిన వివరాలు ఇవ్వండి.
- హెడ్‌రెగ్యులేటర్‌లో దశలవారీగా చేపట్టే పనులకు సంబంధించి ఆమోదించిన ప్రణాళిక - ఎంతవరకు పనులు చేపట్టారో ఆ వివరాలు తెలియజేయండి.

ఈ అంశాన్ని అత్యవసరంగా భావించి తక్షణమే రెండ్రోజుల్లో సమాచారం ఇవ్వాలని జనవరి 17న చీఫ్ ఇంజినీరు మెమో జారీ చేయగా ఇప్పటివరకు సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. సాధారణంగా ఒక సర్కిల్‌లో సీఈ, ఎస్ఈలు ఒకే చోట ఉంటారు. అవసరమైన సమాచారం మౌఖికంగా ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ వ్యవహారంలో పైన పేర్కొన్నవి ఏవీ రికార్డుల్లో లేకపోవడంతో చీఫ్ ఇంజినీరు అధికారికంగా మెమో జారీ చేసినట్లు సమాచారం. రాష్ట్రస్థాయి అధికారులకు సయితం ఆయన నివేదించినట్లు తెలిసింది.



ఆలయం వద్ద బృహత్తర ప్రణాళికను పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్న, ఇతర అధికారులు

శ్రీకాళహస్తీశ్వరాలయం 'బృహత్తర ప్రణాళిక' నివేదికలు సిద్ధం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయం చుట్టూ రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన బృహత్తర ప్రణాళిక నివేదికలు సిద్ధమయ్యాయని చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న తెలిపారు. శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయంలో వచ్చే నెల 8వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆయన ఆలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు బృహత్తర ప్రణాళిక నివేదికలు సిద్ధం చేసినట్లు వివరించారు. వీటిని ఇక్కడి ఆలయ కార్యనిర్వహణ అధికారికి అందజేస్తామని, అక్కడ నుంచి దేవాదాయశాఖకు వెళ్లనున్నట్లు తెలిపారు. అక్కడ ఆమోదం పొందాక పనులు ప్రారంభమవుతాయని కలెక్టర్ ప్రద్యుమ్న వివరించారు.

వెలిగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలి

- నేటి నుంచి పాదయాత్ర

ఈనాడు, హైదరాబాద్: వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల రైతులను ఆదుకోవాలని రైతు సేవా సంఘం విజ్ఞప్తి చేసింది. ఇందుకోసం ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 9 వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు సంఘం అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారావు పేర్కొన్నారు. 24న నెల్లూరు జిల్లా సీతారాంపురం నుంచి తురకపాలెం, నారాయణమ్మపేట, కడప జిల్లాలో టేకూరిపేట, కవలకుంట్ల, అక్కిలరెడ్డి పాలెం, ప్రకాశం జిల్లాలోని కొమరోలు, నల్లగుంట్ల, రాచర్ల, తురిమెళ్ల, కంభం, తిప్పాయపాలెం, దేవరాజు గట్టు, పెద్దారవీడు, దోర్నాల, కొత్తూరు, వెలిగొండ ప్రాజెక్టు వరకు పాదయాత్ర సాగుతుందని ఆయన పేర్కొన్నారు. నీటి వసతి సక్రమంగా ఉంటే ఈ ప్రాజెక్టు పరిధిలోని భూములు అన్ని పంటలకు అనువైనవని, ముఖ్యమంత్రి ఈ సమస్యపై స్పందించాలని కోరారు. ప్రాజెక్టు పూర్తి చేసి రైతులను కష్టాల నుంచి గట్టెక్కించాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఆత్మహత్యలొద్దు.. ఆలోచనే ముద్దు!

- విద్యార్థుల బలవన్మరణాల నివారణపై కడప పోలీసుల ప్రత్యేక దృష్టి
- 'జయహో.. యువత' పేరుతో కొత్త కార్యక్రమం
- నేడు 3 వేల మందితో భారీ సదస్సు

ఈనాడు, కడప: 'ప్రశ్న ఉన్నచోటే సమాధానమూ ఉంటుంది. సమస్య ఉన్నప్పుడు దానికి పరిష్కారమూ ఉంటుంది. సమస్యకు చావు పరిష్కారం కాదు.' అన్న సత్యాన్ని మరచి చిన్నపాటి ఒత్తిళ్లకూ ప్రాణాలు తీసుకుంటున్న విద్యార్థులు, యువతలో మార్పు తెచ్చేందుకు పూనుకున్నారు కడప పోలీసులు. కొద్దికాలంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల బలవన్మరణాలు ఎక్కువైన క్రమంలో వారికి అవగాహన కల్పించేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోనే తొలిసారిగా కడప జిల్లాలో 'జయహో.. యువత' పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, పాలనా యంత్రాంగంతో పాటు పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం సుమారు 3వేల మంది విద్యార్థులతో ఆత్మహత్యల నివారణ సదస్సు నిర్వహిస్తున్నారు. మూడు నెలల కాలంలో కడప జిల్లాలోనే పలువురు యువతీయువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారి కుటుంబాలు, తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్న క్రమంలో ఎస్పీ బాబూజీ, కలెక్టర్ బాబూరావు నాయుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఆత్మహత్య చేసుకున్న యువతీయువకుల కుటుంబ సభ్యుల బాధకు అద్దం పట్టడంతోపాటు.. ఆత్మహత్యల దిశగా అడుగేయకుండా ఉండాల్సిన విధానంపై మానసిక నిపుణుల ద్వారా అవగాహన కల్పిస్తారు. **అనేక కార్యక్రమాలు:** కడప పోలీసుశాఖ గత ఏడు నెలల కాలంలో అనేక అవగాహనా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రాయలసీమ జిల్లాలను పట్టిపీడిస్తున్న మట్కా మహమ్మారికి చెక్‌పెట్టే క్రమంలో 'పరివర్తన' అనే కార్యక్రమాన్ని పోలీసులు చేపట్టారు. ఇందులో భాగంగా సుమారు వెయ్యి అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. వీరిలో 20 మందికి ప్రభుత్వ రుణాలు అందించి ఉపాధి కల్పించారు. మార్పు చెందని వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. గల్ఫ్ బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు 'బంధం' కార్యక్రమం రూపొందించారు. తద్వారా 10వేల గల్ఫ్ బాధిత కుటుంబాల సమాచారాన్ని సేకరించి వారికి అండగా నిలిచారు.



సిరిమానోత్సవానికి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు

వైభవంగా శంబర పోలమాంబ సిరిమానోత్సవం

ఈనాడు, విజయనగరం: ఉత్తరాంధ్ర ప్రజలు ఆరాధ్య దైవంగా కొలిచే శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం విజయనగరం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మ దర్శనానికి తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు సిరిమానోత్సవానికి హాజరయ్యారు. మధ్యాహ్నం 2.45 గంటలకు ఆలయ ప్రధాన పూజారి జన్నిపేకాపు రామారావు సిరిమానుని అధిరోహించారు. అనంతరం సిరిమాను.. నడివీధి, పణుకువీధి, గొల్లవీధిల మీదుగా గాంధీనగర్ చేరుకుంది. రాష్ట్ర గనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, పార్వతీపురం ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చెన్నైలో తెలుగు విద్యార్థి ఆత్మహత్య

ఈనాడు డిజిటల్, చెన్నై: నగర శివారులోని ఓ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న తెలుగు విద్యార్థి సోమవారం రాత్రి వసతి గృహం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన వసతి గృహం సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. విజయవాడకు చెందిన సాయినాథ్ (22) ఎస్ఆర్ఎం వర్సిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ.. వర్సిటీ వసతి గృహంలో ఉంటున్నాడు. పరీక్షల్లో మార్కులు పెంచుకోవడానికి విద్యార్థి అక్రమాలకు పాల్పడ్డాడనే ఆరోపణతో అధ్యాపకులు మందలించి.. జరిమానా విధించారు. ఇదే అంశంపై కుటుంబ సభ్యులు కూడా ఫోన్‌లో మందలించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురై సాయినాథ్ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యార్థుల ఆత్మహత్యలు దురదృష్టకరం

- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలతోపాటు నారాయణ, శ్రీచైతన్య కళాశాలలకు హైకోర్టు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: తల్లిదండ్రులు తమ లక్ష్యాల సాధన కోసం పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారని, దీన్ని వారు తట్టుకోలేకపోతున్నారని మంగళవారం ఉమ్మడి హైకోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం దురదృష్టకరమని, వాటి నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు ఆదేశాలిచ్చింది. ఆత్యహత్యలపై వివరణ కోరుతూ ప్రతివాదులైన ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, హోంశాఖ, విద్యాశాఖల ముఖ్యకార్యదర్శులు, ఇంటర్ బోర్డులు, స్విమ్స్, నిమ్స్‌లతోపాటు శ్రీచైతన్య, నారాయణ కళాశాలలకు నోటీసులు జారీ చేసింది. కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడంలేదంటూ ప్రకాశం జిల్లాకు చెందిన లోక్‌సత్తా అజిటేషన్ సొసైటీ జిల్లా కోకన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయెల్ రాసిన లేఖను ఉమ్మడి హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణనలోకి తీసుకుంది. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆత్మహత్యల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలంటూ విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

కనిపించని పురపాలక ఉపాధ్యాయుల తప్పనిసరి పొదుపు మొత్తాలు: ఏపీటీఎఫ్

ఈనాడు, అమరావతి: తప్పనిసరి పొదుపు కిందకు మళ్లించిన పురపాలక ఉపాధ్యాయులకు చెందిన 19 వాయిదాల కరవు భత్యం (డీఏ) నిధులివ్వడంలో ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) అధ్యక్షుడు హృదయరాజు ఆరోపించారు. 2009 నుంచి పురపాలక ఉపాధ్యాయులకు 010 కింద వేతనాలు చెల్లిస్తున్నారని, ఆ నాటి నుంచి వీరికి జీపీఎఫ్ సౌకర్యం లేకపోవడంతో పెరిగిన కరవు భత్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా తప్పనిసరి పొదుపు కిందకు మళ్లించారని తెలిపారు. ప్రస్తుతం పదవీ విరమణ చేసిన వారికి, మరణించిన వారి వారసులకు ఆ మొత్తాలు చెల్లించాలని అడుగుతుంటే ట్రెజరీ, పురపాలక అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మొత్తాలు రూ.వందల కోట్లలో ఉంటాయని, సర్వీసులో ఉన్న వారికి ఎంత ఉందో తెలుపుతూ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



రాజమహేంద్రవరంలోని అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వద్ద బుద్ధుని విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రులు కామినేని, గంటా, ఎంపీ మురళీమోహన్, ఎమ్మెల్యేలు తదితరులు

వైద్య, విద్యారంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర మంత్రులు కామినేని, గంటా

రాజమహేంద్రవరం నగరం, న్యూస్‌టుడే: వైద్య, విద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంగళవారం వివిధ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడి డాక్టర్ అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని మాట్లాడుతూ.. వైద్య శాఖలో వివిధ ఖాళీలను ఇప్పటికే భర్తీ చేశామని వివరించారు. త్వరలో ప్రత్యేక వైద్యాధికారుల పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మూడు చక్రాల అంబులెన్సులు అందుబాటులోకి రానున్నాయన్నారు. మానవ వనరుల మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ విభజన చట్టాన్ని అనుసరించి ఇప్పటికే అయిదు కేంద్ర విద్యాసంస్థలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్నాయన్నారు. వీటికి అదనంగా 17 విశ్వవిద్యాలయాలు కేంద్ర అనుమతులతో రానున్నాయని తెలిపారు. జూన్‌లో పాఠశాలలు తెరిచే నాటికి కొత్త ఉపాధ్యాయుల భర్తీని చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.

అలాంటి వ్యాఖ్యలు చేయొద్దని సత్యపాల్‌కు సూచించా

- 'డార్విన్ సిద్ధాంతం' దుమారంపై స్పందించిన ప్రకాశ్ జావడేకర్

దిల్లీ: మానవ పరిణామక్రమంపై చార్లెస్ డార్విన్ వెలువరించిన సిద్ధాంతం అశాస్త్రీయమైనదంటూ కేంద్ర మానవ వనరుల శాఖ సహాయమంత్రి సత్యపాల్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగడంతో ఆ శాఖ మంత్రి(కేబినెట్ హోదా) ప్రకాశ్ జావడేకర్ మంగళవారం స్పందించారు. సత్యపాల్‌తో తాను చర్చించానని.. మరోసారి అలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయనకు సూచించానని చెప్పారు. డార్విన్ సిద్ధాంతం అశాస్త్రీయమైనదని నిరూపించేందుకు జాతీయ సదస్సు నిర్వహించే ప్రణాళికేదీ లేదని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి

- మృతుల్లో తండ్రి, రెండేళ్ల చిన్నారి
- రెండు నెలల క్రితమే చిన్నారి తల్లి మృతి

నల్లజర్ల, ఆకివీడు, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాలో మంగళవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో తండ్రీ, రెండేళ్ల కుమార్తె సహా ఐదుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో జోస్యుల సురేష్ అనే వ్యక్తి భార్య.. రెండు నెలల క్రితమే మృతి చెందగా మంగళవారం ప్రమాదంలో సురేష్, వారి చిన్న కుమార్తె మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి చెందిన జోస్యుల సురేష్ భార్య రెండు నెలల క్రితం మృతి చెందారు. ఆమె అస్తికలను నిమజ్జనం చేసేందుకు సురేష్ తల్లిదండ్రులు, మామ.. వారణాసి బయలుదేరారు. వారిని విజయవాడ రైల్వేస్టేషన్‌లో దింపేందుకు సురేష్, ఇతర కుటుంబ సభ్యులు కారులో వెళ్లారు. వీరు తిరిగి వస్తుండగా నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో జోస్యుల సురేష్ (30), ఆయన కుమార్తె నిశ్చల (2), సోదరి పొన్నాదేవి (28) మృతి చెందారు. సురేష్ పెద్ద కుమార్తె ఐదేళ్ల సువర్చల, మరో బంధువు రఘునాథశర్మ గాయాలపాలయ్యారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు..: ఆకివీడు శివారు అజ్జమూరుగర్వు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎండీ షకీల్ (18), ఉడా నాగార్జున (18) అనే యువకులు మృతి చెందారు. కృష్ణా జిల్లా గుడివాడలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసే ఈ యువకులు ఉండిలో జరుగుతున్న మత్స్య మేళాలో పాల్గొని ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. వీరిలో షకీల్‌ది తెలంగాణలోని నాగర్‌కర్నూలు కాగా.. నాగార్జునది ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం రాజుపాలెం అని పోలీసులు తెలిపారు.

తూర్పు గోదావరి జిల్లా చింతూరు మండలం తూలగొండ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఒడిశావాసులు మృతి చెందారు.

మొలతాడు.. ప్రాణాలను ఈడ్చేసిందా?

- వ్యక్తిని ఢీకొన్న మినీ వ్యాను..
- కిమీ దూరం ఈడ్చుకెళ్లిన డ్రైవర్

నక్కపల్లి, న్యూస్‌టుడే: అర్ధరాత్రి జాతీయ రహదారిని దాటుతున్న ఓ వ్యక్తిని మినీ వ్యాన్ ఢీకొట్టింది. వాహనం కింది భాగంలో సదరు వ్యక్తి చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు. వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా కిమీ దూరం ఆ దేహాన్ని ఈడ్చుకెళ్లి.. టోల్‌గేట్ ముందు ఆపి పరారయ్యాడు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు వద్ద సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘోర ప్రమాదం జరిగింది. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న యనపు వెంకటరమణ (46) సోమవారం క్లీనర్‌తో కలిసి విశాఖ నుంచి విజయవాడకు లారీ తీసుకెళుతూ.. అర్ధరాత్రికి వేంపాడు చేరుకున్నారు. వీరితో పాటు మరో లారీని నడుపుకుంటూ విజయవాడ వస్తున్న డ్రైవర్, క్లీనర్లు కలిసి టీ తాగేందుకు ఓ బంకు దగ్గర ఆగారు. అక్కడ రోడ్డు దాటి వెళ్లి టీ తాగారు. వెంకటరమణ మినహా మిగిలిన ముగ్గురు ముందుగానే తిరిగి వాహనాల వద్దకు వెళ్లారు. ఆ తర్వాత రోడ్డు దాటుతున్న వెంకటరమణను రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్తున్న ఒడిశాకు చెందిన బొలెరో మినీవ్యాన్ ఢీకొట్టింది. ఆయన దేహం ఇంజిన్ అడుగుభాగంలో చిక్కుకుపోవడంతో భయపడిన వ్యాన్ డ్రైవర్ అక్కడి నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న టోల్‌గేట్‌కు కొద్ది దూరం వరకు అలానే ఈడ్చుకెళ్లిపోయాడు. వెంకటరమణ ఎంతసేపటికీ రాకపోవడంతో మిగిలిన వారు వెతుకుతూ టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. ఆగి ఉన్న వాహనం అడుగున మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి మొలతాడు వాహనానికి పట్టేసినట్లుగా పోలీసులు గుర్తించారు. వెంకటరమణది తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామమని తెలిపారు.




వ్యాన్ అడుగు భాగంలో చిక్కుకున్న మృతదేహం

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00



విధి రాత.. మన సమాజంలో ఎక్కడోచోట ఏదోరకంగా వినిపించే మాట ఇది. మన కష్టాల్, నష్టాల్, కోపాల్‌తాపాల్ అన్నింటికీ అంతా 'నా తల రాత' అని సులభంగా అనేస్తాం. మన జీవితం ఈ విధి రాత ప్రకారం నడుస్తుందో లేదో తెలియదుకానీ.. నూటికి నూరుపాళ్లు మన శరీరంలోని 'జన్యు రాత'ని బట్టే నడుస్తుంది. ఏమిటిది? ఇంగ్లిషులో జినోమ్ కోడ్ అంటారు. అప్పుడప్పుడూ ఈ రాతలో దొర్లే తప్పుల వల్ల కొన్ని తీవ్రమైన సమస్యలు వస్తుంటాయి. సికిల్ సెల్, మస్క్యులర్ డిస్ట్రఫీ వంటి సమస్యలూ, కొన్ని రకాల క్యాన్సర్‌లూ.. ఇలాంటివే! మొన్న మొన్నటిదాకా 'ఈ రాతని మార్చే నాథుడే లేడా!' అని వాపోయేది ప్రపంచం. ఇప్పుడు ఆ రాతని మార్చుకునే ఆయుధమొకటి మనకి దొరికింది. దాని పేరు 'క్రిస్పర్'!

దేహానికి జన్యు రాత!



మీరు కంప్యూటర్‌లో రాసేటప్పుడు తప్పులు దొర్లితే ఏం చేస్తారు? దాన్ని కట్ చేసి.. కొత్తది దిద్దుతారు కదా! అలాగే ప్రతి వ్యక్తిలోని జన్యురాత(జినోమ్ కోడ్)లో దొర్లిన తప్పుల్ని సవరిస్తుంది క్రిస్పర్. సవరించి అవసరమైతే కొత్తవాటినీ రాస్తుంది. ఈ 'క్రిస్పర్' గురించి మరింత తెలుసుకోవడానికి ముందు మన జన్యురాతకి సంబంధించి ఇంకొంచెం లోతుకువెళ్లాలి.

300 కోట్ల పదాలు!

ఇప్పుడు మీరు చదువుతున్న ఈ వ్యాసంలో రమారమి 500 పదాలుంటాయి. అదే మన శరీరంలోని ఈ జన్యురాతలో మూడువందల కోట్ల పదాలు ఉంటాయి! దాన్నో పుస్తకంగా వేస్తే.. కోటీ రెండువందల పేజీల గ్రంథమవుతుంది! అందులోని ఆ పదాలనే 'డీఎన్‌ఏ'లు అంటారు. మన శరీరం కణాలతో నిర్మితమైందని తెలుసు కదా! అలాంటి కణాల్లోని అతి చిన్న అణువుల్లో ఒకటి ఈ డీఎన్‌ఏ. కాకపోతే.. ఇది మన తల్లిదండ్రుల శరీరాల నుంచి కొంత 'సమాచారం' తెచ్చుకుంటుంది. ఇలాంటి ఎంతో సమాచారం ఉన్న డీఎన్‌ఏ అణువులన్నీ కలిసి జన్యువులు(జీన్స్)గా ఏర్పడతాయి. ఇందాక డీఎన్‌ఏలని పదాలని అనుకున్నాం కదా! ఆ పదాలు(అన్నీ కాదు!) అక్కడక్కడా కొన్ని అర్థవంతమైన వాక్యాలుగా మారి ఉంటాయి. ఇలాంటి జన్యువులు ప్రతి వ్యక్తి శరీరంలో 21 వేలదాకా ఉంటాయి! అంటే 21 వేల వాక్యాలు. ఈ జన్యువులే మన శరీరం ఎలా రూపుదిద్దుకోవాలో.. నలుపోతెలుపో, ఒడ్డోపొడవో, ఇతరత్రా మన ఆరోగ్యం ఎలా ఉండాలో.. వీటన్నింటినీ నిర్దేశిస్తాయన్నమాట! కొన్నిసార్లు ఈ జీన్స్‌లోనే తప్పులు దొర్లుతాయి. అర్థవంతంగా ఉండకపోవడం అటుంచితే.. ప్రమాదకరంగానూ మారతాయి. థలసీమియా, సికిల్ సెల్ వంటి రక్తసంబంధిత సమస్యలూ, కొన్నిరకాల క్యాన్సర్‌లు ఇలాంటివేనన్నమాట.

ఎలా సవరించాలబ్బా?

మన శాస్త్రవేత్తలు జన్యువుల్నీ, అందులోని డీఎన్‌ఏని అన్నింటినీ విడదీసి.. చూడగలిగారు. పూర్తిగా కాకున్నా కొంతవరకు చదవగలుగుతున్నారు. సమస్యంతా.. ఇందులో తప్పుడు వాక్యాలని ఎలా సవరించాలి అన్నదే! దీనిపై దాదాపు ముప్పైఏళ్ల నుంచే ఎన్నో ప్రయోగాలు జరుగుతున్నాయి. వాటన్నింటి ఫలితమే ఈ క్రిస్పర్! దీన్నో కట్ అండ్ పేస్ట్ పరికరం..అనుకున్నాం కదా. వాడేటప్పుడు మనకు అలాగే అనిపిస్తుందికానీ.. నిజానికిదో సైన్యంగానే మనకి పరిచయమైంది.

మనం వాటి గుప్పెట్లో..!

మీకో ప్రశ్న. మన ప్రపంచంలో అత్యధికంగా ఉండే జీవులు ఏమిటో తెలుసా? బ్యాక్టీరియా అనంటారా! కాదు. బ్యాక్టీరియాలకంటే సూక్ష్మాతి సూక్ష్మమైన ఫేజస్ అనే వైరస్‌లు. మనుషులూ, జంతువులూ, పురుగులూ, చెట్లూచేమలూ, సూక్ష్మజీవులు.. ఇలా అందరినీ కలుపుకున్నా కూడా భూమిలో వీటి సంఖ్యే ఎక్కువ! ఈ వైరస్‌లు బ్యాక్టీరియాలకి బద్ధశత్రువులు. వాటికి వ్యతిరేకంగా కొన్ని బ్యాక్టీరియాలు తమ శరీరంలో 'శత్రు నిరోధక వ్యవస్థ'(ఇమ్యూనిటీ)ని తయారుచేసుకున్నాయి. అదే వాటి సైన్యం.

ఆ సైన్యం బలమైందే కాదు.. చాలా తెలివైంది కూడా! తమపై దాడికి వచ్చే శత్రువుతో పోరాడటమే కాదు వాళ్ల డీఎన్‌ఏని కూడా పసిగట్టేస్తుంది. దాన్ని గుర్తుపెట్టుకుని తర్వాత ఆ విరోధి ఏ మారువేషంలో వచ్చినా పసిగట్టేస్తుంది! మళ్లీ మళ్లీ తనని మార్చుకుని పోరాడుతుంది. అది పోరాడే పద్ధతిని బట్టి మనవాళ్లు దానికి క్రిస్పర్ అని పేరుపెట్టారు. క్లస్టర్డ్ రెగ్యులర్లీ ఇంటర్‌స్పేస్డ్ పాలిండ్రోమిక్ రిపీట్స్.. ఈ పదాలని కుదిస్తేనే క్రిస్పర్!

దాన్ని ఇలా వాడుకున్నారు..

డీఎన్‌ఏని గుర్తుంచుకుని పోరాడటమనే గుణం మనకు అద్భుతంగా అనిపించింది. ఆ సైనిక వ్యవస్థని మాత్రమే తీసుకున్నారు. ఆ సైన్యాన్ని ఇతర జీవుల శరీరాలపై ప్రయోగించారు. అద్భుతంగా పనిచేసింది. అలా సైనిక వ్యవస్థ సిద్ధమైంది. ఆ సైనికులు ఏ డీఎన్‌ఏపై పోరాడాలో.. ఎవరు మంచో ఎవరు చెడో చెప్పే ఓ మార్గదర్శకుడు కావాలి కదా! దాన్నీ సిద్ధం చేశారు. దాన్నే 'గైడ్ ఆర్‌ఎన్‌ఏ' అంటారు. శత్రు డీఎన్‌ఏని గుర్తించారు సరే.. వాటిని తెగనరకడం ఎలా? ఇందుకోసం 'కత్తి'లాంటి ప్రొటీన్‌లని కనిపెట్టారు. దాన్ని 'కాస్ 9' అంటారు. అందుకే ఈ వ్యవస్థని 'క్రిస్పర్-కాస్ 9' అని పిలుస్తున్నారు. సంక్షిప్తంగా.. క్రిస్పర్! అలా మూడు విభాగాలున్న ఓ సైనిక వ్యవస్థ అన్నమాట ఇది. దీన్నే మన జన్యురాతని దిద్దుకునే రబ్బర్ పెన్సిల్‌లా మార్చుకున్నాం. ప్రపంచం 2013లో దీన్ని కనిపెట్టారు. 2015లోనే శాస్త్రప్రపంచంలోని అత్యద్భుత మేలిమలుపు(బ్రేక్ త్రూ)గా దీన్ని ప్రకటించింది అమెరికాలోని ప్రఖ్యాత ఎంఐటీ సంస్థ దీన్నిప్పుడు 'జీన్ ఎడిటర్'గా పిలుచుకుంటోంది ముద్దుగా!

వేటిపై ప్రయోగించారు..?


బేకరీల్లోవాడే 'ఈస్ట్'పైనే దీన్ని తొలిసారి ప్రయోగించారు. తర్వాత చేపలూ, పండ్లపై వాలే నుసి పురుగులూ, మొక్కలూ, పేను, దోమలూ.. ఇలా మొదలుపెట్టి కోతుల దాకా వచ్చారు. మానవులపై ఆచితూచే అడుగులు వేస్తున్నారు. సరే.. ఈ క్రిస్పర్‌తో ఇప్పటిదాకా ఏం సాధించారూ అని అడుగుతారా? కేవలం తప్పులు సరిదిద్దడమే కాదు.. మన అవసరాల మేరకు ఇతర జీవుల డీఎన్‌ఏని సవరించారు. తొలిసారి ఈస్ట్‌పై ప్రయోగం చేసినప్పుడు దాన్ని 'జీవ ఇంధనం'గా సవరించగలిగారు! భవిష్యత్తులో పెట్రోల్‌కి ఇది ప్రత్యామ్నాయం కావొచ్చు. మనం జన్యుమార్పిడి కాయగూరల గురించి వింటున్నాం కదా! అందులోనూ క్రిస్పర్‌ది కీలకపాత్ర. ఆ మధ్యే మలేరియాని వ్యాప్తి చేయకుండా దోమల డీఎన్‌ఏని కూడా మార్చారు!

14 శాతం వ్యాధులుండవ్

క్రిస్పర్-9ని మొన్నటిదాకా.. ఓ కత్తెరలా ఉపయోగించి మన జన్యుపటంలోని పదం(డీఎన్‌ఏ) లేదా ఓ వాక్యాన్ని(జీన్స్) మారుస్తుండేవారు. అంత అవసరం లేకుండా లోపం ఉన్న ఒకే ఒక అక్షరాన్ని మార్చగలిగితే? క్రిస్పర్‌ని ఓ కత్తెరలాకాకుండా.. ఓ రబ్బర్ పెన్సిల్‌లా వాడగలిగితే? రెండు నెలల కిందట హార్వర్డ్ శాస్త్రవేత్తలు అదే చేశారు. దీన్ని బేస్ ఎడిటింగ్ అని పిలుస్తున్నారు. ఈ కొత్త పద్ధతితో మానవుల్లోని 14 శాతం వ్యాధుల్ని నిరోధించొచ్చట.


2017లో మనుషులపై!

'క్రిస్పర్ ప్రయోగం మంచికే కాదు.. ఒకవేళ చెడుకీ ఉపయోగపడితే? జన్యు మార్పులతో అతి భయంకరులని సృష్టిస్తే' ఈ ప్రశ్నలతోనే కొన్నిదేశాలు దీంతో మానవులపై ప్రయోగాలు చేయడానికి ఆచితూచి అనుమతిస్తున్నాయి. ఈ విషయంలో బ్రిటన్ ముందుగా అనుమతించింది. తర్వాత అమెరికా! కానీ చైనా మిగతా అందరికంటే ముందుంది. అక్కడ నేరుగా మనుషులపైనా ప్రయోగాలు చేసేస్తున్నారు. 2016 నుంచి ఊపిరితిత్తులు, కాలేయ క్యాన్సర్ బాధితుల నుంచి కణాలు బయటకు తీసి ప్రయోగాలు చేశారు. గత అక్టోబర్‌లో అలా క్రిస్పర్‌తో సరిదిద్దిన జన్యువూ, అది ఉన్న ఓ కణాన్ని మనుషులపై ప్రయోగించారు. ఇది ఇలా ఉంటే.. ఆ మధ్య బ్రిటన్‌లో క్రిస్పర్ ద్వారా ఏ వ్యాధులూ, సమస్యలూ రాని.. ఓ అద్భుత శిశువుని(డిజైనర్ బేబీ!)ని పుట్టిస్తామని ప్రకటించింది. అది పూర్తిగా అనైతికమంటూ దుమారం రేగింది!! అదే లండన్‌లో ప్రభుత్వ అనుమతితోనే ఆ మధ్యే 58 మానవ అండాలపై క్రిస్పర్‌తో ప్రయోగాలు చేశారు..! ఐరోపాలోని థెరప్యుటిక్ క్రిస్పర్ అనే ప్రైవేటు సంస్థ, అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయం సికిల్ సెల్ సమస్యలపై ప్రయోగానికి ఇదివరకే అనుమతి తీసుకున్నాయి. ఈ ఏడాదిలోపు ఈ సమస్యకి క్రిస్పర్ ద్వారా చికిత్స అందించగలమని ధీమాగా చెబుతున్నాయి.



అదెట్టా!

నెట్ 'హైక్' అవుతోంది





ఇప్పటి వరకూ ఫోన్‌లో నెట్‌ని యాక్సెస్ చేయాలంటే? చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండాలి... డేటా ప్యాక్ యాక్టివేట్ అయ్యుండాలి. ఈ రెండూ లేకుండా ఆన్‌లైన్ సేవల్ని పొందడం సాధ్యమేనా? దేశీయ మెసెంజర్ 'హైక్' త్వరలోనే అందుబాటులోకి తేనున్న 'టోటల్' అప్లికేషన్‌తో సాధ్యమే. డేటా అవసరం లేకుండా మెసేజ్‌లు పంపొచ్చు. ఫోన్ రీఛార్జ్‌లు, ఆన్‌లైన్ చెల్లింపులు చేయవచ్చు. క్రికెట్ లైవ్ స్కోర్ చూడొచ్చు. రైల్వే సమాచారాన్ని తెలుసుకోవచ్చు. చెప్పాలంటే భవిష్యత్తులో 'టోటల్'గా చాలానే చేయవచ్చని హైక్ సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. ఓపెన్ సోర్స్ ఆండ్రాయిడ్ ఓఎస్ నుంచే ఈ 'టోటల్ టూల్'ని రూపకల్పన చేశారు. తక్కువ బడ్జెట్‌లో హైక్ పరిచయం చేయనున్న బేసిక్ ఫోన్లలో ఒదిగిపోయి ఇది పని చేస్తుంది. మొదటి వెర్షన్ అప్లికేషన్‌ని రెండు నెలల్లో ప్రవేశపెట్టేందుకు సంస్థ సిద్ధం అవుతోంది. ఇప్పటికే దేశీయ ఫోన్ల తయారీ సంస్థలు ఇంటెక్స్, కార్బన్‌లతో హైక్ చేతులు కలిపింది. ఫోన్ల ధర రూ.3,500 నుంచి 5,000 ఉండొచ్చని అంచనా.

మీకు తెలుసా?

ఇన్‌స్టాగ్రామ్ 'యాక్టివ్'



వాట్సాప్‌లో మాదిరిగా మిత్రులు ఎంతసేపటికి ముందు ఆన్‌లైన్‌లో ఉన్నారో (ఆన్‌లైన్ స్టేటస్) తెలుసుకునేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఆప్షన్ అందుబాటులోకి వచ్చేసింది. దీంట్లో ప్రత్యేకత ఏంటంటే... మిమ్మల్ని ఫాలో అవ్వనివారి స్టేటస్‌ని చూడొచ్చు. మొబైల్ ఆప్‌లో ఈ సౌకర్యాన్ని ఎనేబుల్ చేసి వాడుకోవచ్చు. మీ స్టేటస్ ఇతరులకు తెలియక్కర్లేదు అనుకుంటే ఆప్షన్‌ని డిసేబుల్ చేయవచ్చు. అంతేనా... 'టైప్' పేరుతో మరో సరికొత్త సౌకర్యాన్ని పరిచయం చేసేందుకు సిద్ధం అవుతోంది. ఇప్పటి వరకూ ఫొటోలు, వీడియోలకు మాత్రమే పరిమితమైన ఇన్‌స్టాగ్రామ్‌లో పలు టెక్స్ట్ ఫార్మెట్స్‌తో మెసేజ్‌లనూ షేర్ చేయవచ్చేమో!!

వాడి చూద్దురూ!

పండగలు ముగిశాయి... ఇంటిల్లిపాదీ ఎంతో సందడి చేసుంటారు... ఆ జ్ఞాపకాలు గ్యాలరీల్లో నిండిపోయుంటాయి... స్వైప్ చేస్తూ... స్మైల్ ఇస్తూ... చూసుకుంటున్నారు సరే! వాటిని ఏ మేరకు బ్యాకప్ చేశారు? ఎవరెవరితో ఎలా పంచుకున్నారు? ఇవిగోండి చిట్కాలు... ఫాలో అయిపోండి!

ఆ జ్ఞాపకాలు భద్రం

ఫోన్‌లో తీసినవి ఎస్‌డీ కార్డులో... డీఎస్‌ఎల్‌ఆర్‌తో తీసినవి పీసీలో... ఇలా స్టోరేజ్ డివైజ్‌ల్లోనే ఫొటోలు ఉంటే పలు కారణాలతో డిలీట్ అయ్యే అవకాశాలు ఎక్కువే. అందుకే క్లౌడ్ స్టోరేజ్‌లో బ్యాక్‌అప్ చేయడం అనివార్యం. తగినంత స్పేస్, క్వాలిటీ, సులువైన ఇంటర్ఫేస్, షేరింగ్... సౌకర్యాలతో ఆన్‌లైన్‌లో అనేక సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.



ఫ్లిక్కర్

1టీబీ స్టోరేజ్ స్పేస్ ఉచితం. ఆప్ రూపంలో ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తే ఎప్పటికప్పుడు ఫొటోలు ఆటో సింక్ అయ్యేలా చేయవచ్చు. పీసీలో ఉన్నవాటిని డ్రాగ్ అండ్ డ్రాప్ పద్ధతిలో అప్‌లోడ్ చేయాలి. ఫొటోలను ఆల్బమ్స్‌గా విభజించుకుని ఇతరులతో పంచుకోవచ్చు. కావాలంటే ఎడిటింగ్‌తో ఫొటోలకు అదనపు మెరుగులు అద్దొచ్చు.

గూగుల్ ఫొటోలు

ఆండ్రాయిడ్ ఫోనంటే గూగుల్ ఎకౌంట్‌తో లాగిన్ అవ్వాల్సిందే. అందుకే ఫోన్‌లో తీసుకున్న ఫొటోలన్నీ గూగుల్ స్థావరంలోనే భద్రం చేస్తే! 'గూగుల్ ఫొటోస్' అందుకు తగిన స్థావరం. అపరిమిత స్పేస్‌లో ఫొటోలను ఆటోమాటిక్‌గా సింక్ చేసుకోవచ్చు. కాకపోతే డీఎస్‌ఎల్‌ఆర్ కెమెరాతో తీసిన హై రిజల్యూషన్ ఫొటోల రిజల్యూషన్ కాస్త తగ్గుతుంది. అప్‌లోడ్ చేసిన వాటిని ఎడిట్ చేసి షేర్ చేయవచ్చు.

కెనాన్ ఐరిస్టా

డీఎస్‌ఎల్‌ఆర్ యూజర్లకు సుపరిచితమైన కెనాన్ క్లౌడ్ స్పేస్‌ని అందిస్తోంది. ఉచిత ఎకౌంట్ ద్వారా 15జీబీ స్పేస్‌ని పొందొచ్చు. ఫొటోలను కుదించకుండా పూర్తి నాణ్యతతో అప్‌లోడ్ చేయవచ్చు. వాడుతున్న అన్ని పరికరాల్లోకి ఫొటోలను సింక్ చేసుకుని చూడొచ్చు. కెనాన్ నుంచి సరాసరి ఫొన్ ఆప్‌లోకి ఫొటోలను అప్‌లోడ్ చేసే వీలుంది.

ప్రైమ్ ఫొటోలు

అమెజాన్‌ని ఈ-షాపింగ్ అడ్డాగానే కాదు. 'అమెజాన్ ప్రైమ్ ఫొటోస్'తో ఫొటోలను భద్రం చేయవచ్చు. సభ్యులైన యూజర్లకు 5జీబీ స్టోరేజ్ స్పేస్‌ని ఉచితంగా అందిస్తున్నారు. వెబ్ సర్వీసుగానే కాకుండా ఆప్‌లోనూ సర్వీసుని యాక్సెస్ చేయవచ్చు. స్టోర్ చేసిన వాటిని 'అలెక్సా' అసిస్టెంట్స్‌లోనూ చూడొచ్చు.

ఐక్లౌడ్

యాపిల్ యూజర్లకు ప్రత్యేకం. 5జీబీ స్పేస్ ఉచితం. 'ఐక్లౌడ్ ఫొటో లైబ్రరీ'లో భద్రం చేసిన అన్ని ఆల్బమ్‌లను సులువుగా మేనేజ్ చేయవచ్చు. ఎక్కువ స్టోరేజ్ కావాలంటే నెలకి రూ.75 చెల్లించి 50 జీబీ స్పేస్‌ని వాడుకోవచ్చు.

'బకెట్' ఒకటి

ఆల్బమ్‌లను 'ఫొటో బకెట్'లోనూ పెట్టుకోవచ్చు. 2జీబీ స్పేస్ ఉచితం. ఎక్కువ కావాలనుకుంటే ప్రీమియం ఎకౌంట్‌లను తీసుకోవచ్చు.

బుల్లి డ్రోన్... 'బొమ్మ' సూపర్



చేయి చాచో... సెల్ఫీ స్టిక్‌తోనో సెల్ఫీలు తీసుకుని ఉంటారు. కానీ, ఓ బుజ్జి డ్రోన్‌ని ఎగరేసి ఫొటోలు తీసుకున్నారా? వీడియోలు చిత్రీకరించారా? మీ చుట్టూనే తిప్పుకొంటూ..'ఫాలో మీ' అంటూ ఫోజులిచ్చారా? సాధ్యమేనా... అనే సందేహం వద్దు. ఎందుకంటే బుల్లి 'డీజేఐ స్పార్క్' డ్రోన్ అలాంటిదే. నాలుగు పంకాలతో సమాంతరంగా చేతిలో నుంచే గాల్లోకి ఎగిరిపోతుంది. 'ఫేస్‌వేర్' టెక్నాలజీతో మీ ముఖాన్ని గుర్తుంచుకుని మీ వెంటే ఫాలో అవుతుంది. డ్రోన్‌కి మీరే రిమోట్‌లా 'సెల్ఫ్ కంట్రోల్' చేయవచ్చు. చేతులు ఎటు తిప్పితే అటు తిరుగుతుంది. దీని బరువు 300 గ్రాములు. స్పోర్ట్ మోడ్‌లో 16 నిమిషాల పాటు గంటకి 30 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. వీడియో, ఇతర వివరాలకు https://goo.gl/nGBLn8

ఈ వారం ప్రశ్నజవాబులకు www.eenadu.net చూడండి.

గ్యాడ్జెట్ గురూ

'బూమ్' మ్యూజిక్ మస్తీ



వైర్లతో పని లేకుండా ఎప్పుడైనా.. ఎక్కడైనా మ్యూజిక్ మస్తీ చేద్దాం అనుకుంటే 'మెగాబూమ్' బ్లూటూత్ స్పీకర్ ఉండాల్సిందే. ట్రెండీ స్పీకర్లతో మార్కెట్‌లో సందడి చేసే మెగాబూమ్ కంపెనీ బడ్జెట్‌లో బుల్లి స్పీకర్‌ని పరిచయం చేయనుంది. 360 డిగ్రీల కోణంలో అన్ని వైపులకూ మ్యూజిక్ ట్రాక్స్‌ని స్పష్టంగా వినిపిస్తుంది. వాటర్‌ప్రూఫ్ రక్షణతో రూపొందించారు. ఫోన్‌కి కాల్స్ వస్తే స్పీకర్‌ఫోన్‌గా వాడుకోవచ్చు. ప్లే అవుతున్న ట్రాక్స్ ఆటోమాటిక్‌గా ఆగి కాల్ కనెక్ట్ అవుతుంది. స్పీకర్‌లో మీకు ఇష్టమైన పాటల్ని ఆలారం ట్యూన్స్‌గా సెట్ చేసుకునే వీలుంది. ఒకసారి స్పీకర్‌ని ఛార్జ్ చేసి 20 గంటల పాటు వాడుకోవచ్చు. స్పీకర్ ఎత్తు 9 అంగుళాలు. వ్యాసం 3.5 అంగుళాలు. ప్రయాణాల్లో ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లొచ్చు. ధర రూ.15,999.

ఎల్‌జీ 'మడతఫోన్'



తక్కువ మందంతో ఫోన్లు నాజూకు అయిపోవడమే కాదు. మడతపెట్టి వాడుకునేలా ముందుకొచ్చేస్తున్నాయి. ఎల్‌జీ కంపెనీ ఆ ప్రయత్నాల్లోనే ఉందని నెట్టింట్లో టెక్ ప్రియుల ముచ్చట. ట్యాబ్ పరిమాణంలో ఉన్న ఫోన్‌ని రెండుగా మడిచి వాడుకోగలిగే నమూన ఫోన్ చిత్రం ఒకటి నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. వచ్చే నెల్లో జరగబోయే 'వరల్డ్ మొబైల్ కాంగ్రెస్-2018'లో మడతపెట్టి వాడుకునే ఫోన్‌ని పరిచయం చేసేందుకు రంగం సిద్ధం చేస్తోందట. పేటెంట్ హక్కులకూ ప్రయత్నాలు మొదలుపెట్టిందట. గత ఏడాదిలో జెడ్‌టీఈ కంపెనీ ప్రవేశపెట్టిన 'ఆక్సాన్ ఎమ్' ఫోన్ మోడల్‌ని పోలి ఉండొచ్చని అంచనా!

ఈనాడు సినిమా


రకుల్‌ప్రీత్ సింగ్

అదో అందమైన అబద్ధం

'ఈ కథ కొత్తది.. కథనం కొత్తది.. నా పాత్ర కొత్తది' ఇలాంటి మాటలు తరచూ వింటుంటాం. ఓ సినిమా మొదలవుతోందంటే చిత్రబృందం అంతా ఈ పాటే పాడుతుంటుంది. అయితే రకుల్‌ప్రీత్ సింగ్ మాత్రం ఇంకొంచెం 'కొత్త'గా మాట్లాడుతోంది. "కొత్త పాత్రలు, కొత్త కథలు పుట్టడం చాలా కష్టం. చిత్రసీమలో ఎన్నో కథలొచ్చాయి. ఎంతోమంది నటీమణులు వైవిధ్యభరితమైన పాత్రలు పోషించారు. వాటిని మించిన కొత్తదనం ఇంకెక్కడి నుంచి వస్తుంది? 'ఇదో కొత్త పాత్ర' అన్నామంటే అది అందమైన అబద్ధం అనుకోవాలంతే. అయితే అప్పుడప్పుడూ దర్శకులు, రచయితలూ విభిన్నంగా ఆలోచిస్తారు. నటులు తమదైన శైలిలో ఆ పాత్రకు వన్నె తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుంటారు. అలాంటప్పుడు మాత్రమే కొత్తదనం చూసే అవకాశం వస్తుంది. ఎంత రొటీన్ పాత్ర అయినా.. .అందులో ఏదో ఓ రూపంలో కొత్తగా కనిపించాలన్న తపన ఈతరం కథానాయికలకు ఎక్కువ అవుతోంది" అని చెప్పుకొచ్చింది రకుల్.

రెండో పేజీ ఓపెన్ అయితే...


మోహన్‌బాబుకు సన్నివేశాన్ని వివరిస్తున్న మదన్

మోహన్‌బాబు డైలాగెప్పుడూ డైనమైట్‌లా పేలుతుంది. ఆయన విరుపులు మెరుపులైపోతుంటాయి. చాంతాడంత సంభాషణని సైతం చాయ్ తాగినంత అవలీలగా పలికేస్తారు. సాదాసీదా మాట కూడా.. తూటాలా దూసుకుపోతుంది. అందుకే మోహన్ బాబు సినిమాల్లో సంభాషణలకు అగ్ర తాంబూలం ఇస్తుంటారు దర్శకులు. మదన్ స్వతహాగా రచయిత. పెన్ను తిరిగిన చేయి కాబట్టి, ఎక్కడ ఎలాంటి డైలాగులు రాయాలో ఆయనకు బాగా తెలుసు. పైగా మోహన్‌బాబులాంటి నటుడు ఎదురైనప్పుడు ఆయన కలం కదం తొక్కాల్సిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో 'గాయత్రి' చిత్రం తెరకెక్కుతోంది. అందులో శివాజీగా కనిపించబోతున్నారు మోహన్ బాబు. ఇప్పటికే విడుదలైన టీజర్‌లోని డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో "నిప్పు కాల్చేస్తుంది, నీరు ముంచేస్తుంది, గాలి లేపేస్తుంది, ఆకాశం పిడుగేస్తుంది, భూమి పాతేసుకుంటుంది. ప్రాణం పోసే పంచభూతాలే వాటి రెండో పేజీ ఓపెన్ చేస్తే ప్రాణం తీస్తాయి. నా రెండో పేజీ ఓపెన్ అయినా అంతే" అనే డైలాగ్ ఉంది. ప్రస్తుతం అదే మోహన్‌బాబు నోట్లోంచి పేలబోతోంది. దానికి సంబంధించిన కసరత్తే ఇక్కడ జరుగుతోంది. అన్నట్టు ఇటీవల 'గాయత్రి' సెట్లో నందమూరి బాలకృష్ణ సందడి చేశారు. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న విష్ణు, శ్రియలతో సరదాగా మాట్లాడారు. ఆ దృశ్యాలివి.

సెట్లో సందడి


షూటింగ్ విరామంలో బాలకృష్ణతో విష్ణు, శ్రియ


అల్లు అర్జున్

దిల్లే ఇండియా... ఇల్లే ఇండియా

దేశం కోసం అహర్నిశలు పాటుపడే సైనికుడుకి నిజంగా మనమంతా వందనం చేయాల్సిందే. ఇందుకోసం అతను పడే కష్టనష్టాలు, చేసే త్యాగాలు అనిర్వచనీయం. ఓ సైనికుడైతే దేశం కోసం ఆఖరికి తన ప్రేమని కూడా వదులుకోవడానికి సిద్ధపడతాడు. అతని కథే... 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. జనవరి 25న ఈ చిత్రంలోని ఓ గీతాన్ని విడుదల చేయనున్నారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. అను ఇమాన్యుయేల్ నాయిక. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. లగడపాటి శ్రీధర్ నిర్మాత. విశాల్ శేఖర్ స్వరకర్త. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ ''ప్రస్తుతం హైదరాబాద్‌లో పీటర్‌హెయిన్స్ నేతృత్వంలో యాక్షన్ దృశ్యాల్ని చిత్రిస్తున్నాం. గురువారం 'దిల్లే ఇండియా... ఇల్లే ఇండియా' అనే పాట విడుదల చేస్తాం. ఫిబ్రవరి 14న మరో పాటని వినిపిస్తాం. ప్రేక్షకుల అంచనాలకి తగ్గకుండా వాణిజ్యాంశాలు మిళితమై నవరసభరితంగా ఈ సినిమాని దర్శకుడు తెరకెక్కిస్తున్నాడు. అల్లు అర్జున్ కెరీర్‌లో మర్చిపోలేని చిత్రమవుతుంది. అత్యున్నతమైన ప్రమాణాలు, సాంకేతిక విలువలతో తెరకెక్కించాం. అంతకుముందు అనుకున్నట్టే ఏప్రిల్‌లోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామ"న్నారు. గీతరచయిత రామజోగయ్యశాస్త్రి మాట్లాడుతూ "సైనికుడి గొప్పతనాన్ని చాటేలా 'ఓ సైనికుడా... దిల్లే ఇండియా ఇల్లే ఇండియా' అనే గీతం రాశా. ఈ చిత్రంలో నేను మొత్తం నాలుగు పాటలు రాశా. ప్రతి పాటా సందర్భానుసారంగానే వస్తుంద"న్నారు. ఈ కార్యక్రమంలో బన్నీ వాసు పాల్గొన్నారు.

పరిశ్రమకి మంచి సినిమాలు కావాలి!


విజయ్ చందర్, విక్రమ్, తమన్నా, డి.సురేష్‌బాబు

"ప్రతి వారం ఒక మంచి సినిమా వస్తేనే చిత్ర పరిశ్రమ మనుగడ సాధిస్తుంది" అన్నారు ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు. ఆయన 'స్కెచ్' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. విక్రమ్, తమన్నా జంటగా విజయ్ చందర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. త్వరలోనే చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా డి.సురేష్‌బాబు మాట్లాడుతూ "విక్రమ్ చాలా రోజుల నుంచి పరిచయం. పాతికేళ్ల ముందు ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలాగే ఉన్నారు. తమన్నా పదేళ్ల కిందట ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. వాళ్లిద్దరూ కలిసి నటించిన 'స్కెచ్' తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందని నా విశ్వాసం. పరిశ్రమకి మంచి సినిమాలు కావాలి. ఈ చిత్రంతో తమిళంలో విజయాన్ని అందుకొన్న చిత్రబృందానికి అభినందనలు" అన్నారు. విక్రమ్ మాట్లాడుతూ "పదిహేనేళ్ల తర్వాత నేను చేసిన మాస్ మసాలా సినిమా ఇది. తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా ఇంకా బాగా నచ్చుతుంది. సురేష్‌బాబు తెలుగులో విడుదల చేస్తున్నాడని తెలియగానే చాలా సంతోషించా. 'బంగారు కుటుంబం' సమయంలో నేనొక చిన్న నటుడిని. కానీ వెంకటేష్ నన్నెంతో ప్రేమగా పలకరించేవారు. పెద్ద కథానాయకుడైనా నేనిలాగే ఉండాలని అప్పుడే అనుకొన్నా" అన్నారు. "ఈ సినిమా నాకు ప్రత్యేకం. కెరీర్ ఆరంభం నుంచి విక్రమ్‌తో కలిసి పనిచేయాలనుకొనేదాన్ని. ఆ కోరిక పదేళ్ల తర్వాత తీరింది. ఆయనతో నటిస్తూ చాలా నేర్చుకొన్నా" అన్నారు తమన్నా.

టూ స్టేట్స్... తెలుగులో

బాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్న చిత్రం 'టూ స్టేట్స్'. తెలుగులో ఈ చిత్రాన్ని లక్ష్య ప్రొడక్షన్స్ సంస్థ పునః నిర్మిస్తోంది. అడవి శేష్ కథానాయకుడిగా నటిస్తున్నారు. నాయికగా రాజశేఖర్ కుమార్తె శివానీని ఎంచుకున్నారు. వెంకట్ రెడ్డి దర్శకుడు. ఎం.ఎల్.వి సత్యనారాయణ నిర్మాత. "శివానీ తొలి సినిమా కోసం చాలా కథలు విన్నారు. 'టూ స్టేట్స్' రీమేక్ అయితే నటనకు ఆస్కారం ఉంటుందని ఈ చిత్రంతో అరంగేట్రం చేయబోతున్నారు. ఇదో వినూత్న ప్రేమ కథ. త్వరలో షూటింగ్ మొదలవుతుంద"న్నారు. సంగీతం: అనూప్ రూబెన్స్.


శివాని


అడవి శేష్



రానా, కరణ్‌జోహార్

'బాహుబలి 2' విడుదలై చాలా రోజులైంది కదా. అయినా రానా ఇప్పుడు 'జై మాహిష్మతి' అంటున్నాడు. అదేంటి? బహుశా 'బాహుబలి 3' మొదలవుతుందేమో.. అనుకుంటున్నారా? అది కాదు కానీ రానా 'జై మాహిష్మతి' అనడం నిజమే. అయితే అది ఒక హిందీ సినిమా కోసం. రానా, కరణ్‌జోహార్, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'వెల్‌కం టు న్యూయార్క్'. చక్రి తోలేటి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. అందులో కరణ్ జోహార్‌ను ఎవరో కిడ్నాప్ చేస్తే వాళ్ల నుంచి ఆయన్ని కాపాడి తీసుకొస్తూ 'జై మాహిష్మతి' అంటాడు రానా. దీన్ని తొలి త్రీడీ కామెడీ చిత్రంగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ అతిథి పాత్రలో నటిస్తున్నాడు. వచ్చే నెల 23న విడుదల కానుంది.

గీతోపదేశం

ఆత్మయే నిత్యమూ
జీవితం సత్యమూ
చేతలే నిలుచురా చిరకాలం
బతికిననాడు బాసటగా
పోయిననాడు ఊరటగా
అభిమానం అనురాగం చాటేదీ
ఆ నలుగురూ ఆ నలుగురూ

గీతం: ఒక్కడై రావడం... చిత్రం: ఆ నలుగురు
రచన: చైతన్య ప్రసాద్
- పంపినవారు: నాగుల చిన్నయ్య, మెట్‌పల్లి

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

నిత్య అందరికీ నచ్చుతుంది


అమైరా దస్తూర్

"అందంతో అలరించాలి, అభినయంతో ఆకట్టుకోవాలి. ఈ రెంటికీ ప్రాధాన్యతిస్తాను. నా తొలి తెలుగు చిత్రం 'మనసుకు నచ్చింది'లో అలాంటి పాత్రే దక్కింది" అంటోంది అమైరా దస్తూర్. సందీప్ కిషన్ కథానాయకుడుగా నటించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. అమైరా దస్తూర్ కథానాయిక. మంజుల దర్శకత్వం వహించారు. పి.కిరణ్, సంజయ్ స్వరూప్ నిర్మాతలు. ఫిబ్రవరి 16న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో అమైరా దస్తూర్ విలేకర్లతో మాట్లాడింది.

■ "ఇందులో నా పాత్ర పేరు నిత్య. అందరికీ నచ్చే పాత్ర. సంప్రదాయమైన దుస్తుల్లో కనిపించే తెలుగు అమ్మాయిని. యోగా టీచర్‌గా కనిపిస్తా. పాటలకు వచ్చి వెళ్లిపోయే పాత్ర కాదు. కథతో పాటు సాగేది. ప్రేమ, అందులోని పరిపక్వత, ఆ తరవాత ఎదురయ్యే పరిణామాలు ఆకట్టుకునేలా ఉంటాయి. మంజుల ఆడిషన్ ద్వారా నన్ను ఎంపిక చేశారు. కొంచెం కొంచెం తెలుగు పదాలు అర్థం అవుతున్నాయి. రెండేళ్లలోగా నా సంభాషణలు సొంతంగా చెప్పుకునే ప్రయత్నం చేస్తాను. ఇప్పుడు రాజ్‌తరుణ్‌తో కలిసి 'రాజుగాడు'లోనూ నాయికగా నటిస్తున్నాను"

■ "బి.కామ్ చదివాను. మోడల్‌గా చేశాను. 'ఇస్సక్' హిందీ చిత్రం ద్వారా తొలిసారి కెమెరా ముందుకొచ్చా. జాకీచాన్ 'కుంగ్ ఫు యోగ'లో నటించా. ఇమ్రాన్ హాష్మి 'మిస్టర్ ఎక్స్'తో పాటు ధనుష్ కథానాయకుడిగా రూపొందిన 'అనెగన్' అనే తమిళ చిత్రంలో నటించా. బాలీవుడ్‌తో పాటు అన్ని దక్షిణాది భాషా చిత్రాల్లో నటించాలనుంది"

అంతరిక్షంలో హంగామా


నివేదా

"అంతరిక్ష నేపథ్యంలో సాగే తొలి భారతీయ సినిమాలో నేను కథానాయకుడిని కావడం ఆనందంగా ఉంది. ఇలాంటి సినిమాల్ని చేయడం వెనక చాలా కష్టం ఉంటుంది" అన్నారు జయం రవి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'టిక్ టిక్ టిక్'. నివేదా పేతురాజ్ కథానాయిక. శక్తి సౌందర్‌రాజన్ దర్శకత్వం వహించారు. తెలుగు, తమిళ భాషల్లో ఒకే రోజు విడుదల కాబోతోంది. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై పద్మావతి చదలవాడ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. చదలవాడ బ్రదర్స్ సమర్పిస్తున్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జయం రవి మాట్లాడుతూ "దర్శకుడు ఈ సినిమా నేపథ్యం గురించి చెప్పగానే నేను ఆశ్చర్యపోయా. 90వ దశకంలో విదేశీ భాషల్లో ఇలాంటి సినిమాలు ఎక్కువగా వచ్చాయి. కానీ ఇప్పుడు ఆ నేపథ్యంతో సినిమా చేయాలంటే చాలా పెట్టుబడి కావాలి. అదృష్టవశాత్తూ మాకు మంచి నిర్మాణ సంస్థతో పాటు, చెన్నైలో అజాక్స్ గ్రాఫిక్ స్టూడియో దొరికింది. లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమా ఇది. ఈ సినిమాలో నాతో పాటు, మా అబ్బాయి నటించాడు" అన్నారు. చిత్ర సమర్పకుల్లో ఒకరైన చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ "నిర్మాతలకి గౌరవం తెచ్చిన వ్యక్తి ఎడిటర్ మోహన్. ఆయన తనయుడు జయం రవి కథానాయకుడిగా నటించిన చిత్రాన్ని మేం తెలుగులో విడుదల చేస్తుండడం ఆనందంగా ఉంది. అమెరికన్ సినిమాల స్థాయి సాంకేతికతతో పాటు, మంచి భావోద్వేగాలకి ప్రాధాన్యమున్న చిత్రమిద"న్నారు. కార్యక్రమంలో చదలవాడ లక్ష్మణ్, అజయ్, అల్లాణి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టుకున్న భర్త కాదు పొమ్మంటే.... కన్నీళ్లతో బయటకొస్తుంది ఒకావిడ... ప్రేమించిన వాడు చేసిన మోసం ప్రాణం తీసుకోమంటుంటే... ఆవేశంగా బయటికొస్తుంది మరో అమ్మాయి. వీళ్లేకాదు ఆదరణలేక... ఏదో ఒక సమస్యతో గుమ్మందాటి బయటకొచ్చి, ఆశ్రయం దొరక్క అల్లాడిపోతున్న అమ్మాయిలకు మేమున్నాం అంటున్నారు హైదరాబాద్‌కు చెందిన సయోధ్య సంస్థ స్థాపక సభ్యురాలు మృదుల.





- ప్రణవికి రెండేళ్లక్రితం పెళ్లయ్యింది. కానీ తన పెళ్లికంటే ముందునుంచే ఆమె భర్తకూ, తన తల్లికీ సంబంధం ఉందని తెలిసి ఆమె మానసికంగా కుంగిపోయింది. ఇంటి నుంచి బయటికి వచ్చేసింది. చివరకు మా దగ్గరకు చేరింది. ఆపేసిన చదువుని కొనసాగించి ఈ మధ్యే ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు పిలుపును సంపాదించగలిగింది. ఉద్యోగాన్ని సాధించింది.
- లలిత భర్తకి ఆదర్శ ఉపాధ్యాయుడిగా మంచి పేరు. కానీ భార్యపై అనుమానం. అది తట్టుకోలేక పిల్లల్ని తీసుకుని బయటికి వచ్చేసింది. బాగా చూసుకుంటానని తీసుకెళ్లి మళ్లీ అదే పరిస్థితి. విడాకులు తీసుకున్నా భరణం నేటికీ చెల్లించలేదు. దాంతో చిన్న ఉద్యోగం చేస్తూ తన పిల్లలతో మా దగ్గరే ఉంటోంది.
- ప్రేమలో మోసపోయింది పూజిత. మానసికంగా దెబ్బతింది. రోడ్డున తిరుగుతున్న ఆమెను ఎవరో కొందరు మా దగ్గరకు తీసుకొచ్చారు. ప్రస్తుతం మానసిక చికిత్స అందిస్తున్నాం.

కష్టాల్లో ఉన్నారా మా ఇంటికి రండి!

వన్నీ మా సయోధ్య సంస్థకు వచ్చిన కొన్ని కేసుల వివరాలు మాత్రమే....ఇలాంటివి గత ఏడేళ్లలో సుమారు నాలుగు వేలు ఉంటాయి. మా దగ్గర ఎక్కువ రోజులుగా ఉంటున్న వారు కనీసం పదిహేను నుంచి ఇరవై మంది అయితే... ఏ రోజుకారోజు ఆశ్రయం పొందేవారి సంఖ్యా ఎక్కువే.

అసలీ సయోధ్య ఏంటి? ఏం చేస్తుంది అంటారా? కొన్ని ఛిద్రమైన జీవితాలను బాగు చేసే క్రమంలో ఏర్పడిన ఆలోచనకు తుది రూపం ఇది. దీన్ని ప్రారంభించేందుకు కారణం లేకపోలేదు. 2002లో నేను రెడ్డీస్ ఫౌండేషన్‌లో పనిచేసేదాన్ని. బడికి రాని పిల్లల్ని స్కూలుకి పంపించేందుకు చేసిన కార్యక్రమం అది. నాతో పాటు మరో నలుగురు సహోద్యోగినులూ పనిచేసేవారు. ఆ క్రమంలోనే బడికిరాని పిల్లల కుటుంబాల్ని పరిశీలిస్తే చాలా విషయాలే తెలిశాయి. వారిని బళ్లో చేర్చాలంటే... తల్లులకు ఆసరా ఇవ్వడం తప్పనిసరి అని అర్థమైంది. వారిలో కొందరికి ఉపాధి కల్పించడం, మరికొందరికి ఆశ్రయం ఇవ్వాల్సిన అవసరం వచ్చింది. మా ఇళ్లల్లోనే ఉంచుకునేవాళ్లం. తెలిసిన వారి దగ్గర పనికి కుదిర్చేవాళ్లం. ఈ విషయం అలా ఒకరి నుంచి మరొకరికి తెలిసి మమ్మల్ని సంప్రదించే మహిళల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దాంతో అప్పటికే మేం చేస్తున్న కార్యక్రమాలకు ఏ ఇబ్బందీ కలగకుండా ఇలాంటి మహిళల కోసం కూడా పనిచేయాలనుకున్నాం. అందుకే 'సయోధ్య' పేరుతో 2010లో ప్రారంభించాం. ఆపదలో ఉన్న నిస్సహాయ మహిళలకు అండగా నిలబడాలనుకున్నాం. దానిలో భాగంగా వారికి ఉపాధి కల్పించడం, అవసరమైన సందర్భాల్లో తలదాచుకునేందుకు ఆశ్రయం ఇవ్వడం మా సంస్థ ప్రధాన ఉద్దేశాలు.

ఆదిలోనే దెబ్బ...

సంస్థ మొదలైంది కానీ దాని నిర్వహణ మాటల్లో చెప్పినంత సులువుకాదని అప్పుడే అర్థం అయ్యింది. సంస్థ ప్రారంభించాక దాని విధి విధానాలూ, లక్ష్యాల కోసం పలు ఎన్‌జీఓలూ, మహిళాసంఘాలతో ఓ సమావేశం పెట్టా. మా ఉద్దేశం ఎంత మంచిదైనా... దాని అమలులో ఉన్న ఇబ్బందులు గురించి ఒక్కొక్కరూ ఒక్కో రకంగా చెప్పేవారు. ఎక్కువ మంది మాకిచ్చిన సలహా...'ఆశ్రయం పొందాలనుకునేవారి పక్కా ఆధారాలు ఉంటేనే కానీ షెల్టర్‌లో చేర్చుకోవద్దు' అని. అలా వచ్చేవాళ్లల్లో ఎక్కువమంది సెక్స్‌వర్కర్‌లూ, సంఘవిద్రోహ శక్తులు ఉంటారనేది వారి వాదన. నేను దానికి అంగీకరించలేదు. ఎందుకంటారా? కష్టాల్లో ఉన్న ఆడపిల్లలు ఆధారాలన్నీ పెట్టుకుని తిరగరు. కట్టుబట్టలతోనే బయటికొచ్చేవారే ఎక్కువ. చేతిలో చిల్లిగవ్వ ఉండదు. అలాంటివారికే కదా.. మనం అండగా ఉండాల్సింది. అందుకే నేను వ్యతిరేకించాను. దాంతో ముగ్గురు తప్పుకొన్నారు. అయినా భయపడలేదు.... ఎంతకష్టమైనా నిలబడాలనుకున్నా.

ఎవరెవరికి సాయమంటే...

కుటుంబ ఆదరణ లేకపోవడం, ప్రేమలో ఓడిపోవడం, ఒత్తిడి...కారణాలు ఏవైనా సరే! ఇంటిని నుంచి బయటికొచ్చిన ఆడపిల్లలు ఏ దిక్కూలేక చిక్కుల్లో పడకుండా మేం ఆశ్రయం ఇస్తాం. ఇలాంటివారిని గుర్తించి సరైన దారిలో నడిపించడమే అసలైన సవాలు. వారి పరిస్థితి తీవ్రతను బట్టి కౌన్సెలింగ్, చికిత్స, ఉపాధి శిక్షణ, కల్పన అందించి తిరిగి వారి కాళ్లపై వాళ్లు నిలబడేలా చేస్తాం. ఈ క్రమంలో మాకు యశోదా, రెడ్డీస్ ఫౌండేషన్‌లు సాయపడుతున్నాయి. ఇక మా దగ్గర ఉన్న వారు పారాలీగల్ వాలంటీర్లుగా, నర్సులుగా శిక్షణ పొందుతున్నారు. ఉన్నత చదువులు చదివించేందుకు ప్రథమ్ ఎన్‌జీఓతో కలిసి పనిచేస్తున్నాం. అవసరాన్ని బట్టి చికిత్స, న్యాయ సేవలూ అందిస్తున్నాం. అలా రెండేళ్లక్రితం ప్రేమలో విఫలమై, చనిపోవాలనుకున్న ఓ అమ్మాయి మా దగ్గరకు వచ్చాక నర్సు శిక్షణ తీసుకుంది. ఇప్పుడు వృద్ధాశ్రమాన్ని నడుపుతూ నలుగురికీ సాయపడుతోంది. ఇంతకంటే సంతృప్తి ఏం ఉంటుంది చెప్పండి.

తీసుకెళ్లేందుకూ ఎవరూ రారు....

మానసికంగా కుంగిపోయిన బాధితుల్ని చికిత్స అనంతరం తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు రారు. అలాంటి పరిస్థితుల్లో వాళ్లు మా దగ్గరే ఉండొచ్చు. గత కొంత కాలంగా పోలీసులూ, కోర్టులు కూడా మా కస్టడీకి అందిస్తోన్న మహిళల సంఖ్యా గణనీయంగా పెరిగింది. పెళ్లి కాకుండానే గర్భం దాల్చడం, అత్తింటివారి ఆదరణ లేకపోవడం, భర్త చేతిలో మోసపోయిన ఏడుగురు మహిళలు గతేడాది మా సంస్థలో ప్రసవం చేసుకున్నారు. పలు రకాల కారణాల వల్ల మానసికంగా కుంగిపోయిన వారిని చేర్చుకునే పరిస్థితి మా దగ్గర లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో భరోసా టీంతో కలిసి మానసిక అనారోగ్యానికి గురైన ఏడుగురు అమ్మాయిల్ని కాపాడాం. వీరికి డ్రగ్స్ ఇచ్చి అత్యాచారం చేశారని తెలిసింది. ఎఫ్ఐఆర్ ఫైల్‌చేసి వారిని చికిత్సకు పంపించాం.


ఇల్లు ఖాళీ చేయమన్నారు...

మొదట్లో మేం మా హోంని ఓ అద్దె భవనంలో ఉంచాం. అక్కడికి కొన్ని కేసుల్లో తరచూ పోలీసులు రావడం, దిగువ తరగతి వ్యక్తులు ఆ ప్రదేశంలో ఉండటం చాలామందికి నచ్చేదికాదు. దాంతో అక్కడి నుంచి ఖాళీ చేయమన్నారు. అప్పుడే జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడాం. ఓ కమ్యూనిటీ హాలుని మాకు ఇచ్చారు. అక్కడ మహిళలకు నైట్ షెల్టర్ఇచ్చేందుకు ఉపయోగపడుతోంది. కిందటేడాది డాక్టర్ రెడ్డీస్ సంస్థ మాకు సాయం చేసింది. సభ్యులంతా తలా కొంచెం వేసుకుంటాం. ఇప్పుడు జీహెచ్ఎంసీ, పౌరసరఫరాలశాఖ రాయితీమీద పప్పుధాన్యాలు అందిస్తోంది. భూమిక హెల్ప్‌లైన్ కేర్‌టేకర్స్ కోసం ప్రతినెలా పదివేల రూపాయలను అందజేస్తోంది. ఈ క్రమంలో శాంతిప్రియ, జ్యోతి మొదటినుంచీ నాకు తోడుగా ఉన్నారు. బాధితులు సంప్రదించాల్సిన మా హెల్ప్‌లైన్ నంబరు 18005991811,040-23524144

– స్వాతి కొరపాటి

మెగ్నీషియం కోసం చాక్లెట్

మెగ్నీషియం మన శరీరానికి అవసరమైన అత్యవసర మూలకాల్లో ఒకటి. ముఖ్యంగా మహిళల్లో ఈ ఖనిజం కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే మెగ్నీషియం పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలేంటో ఒకసారి తెలుసుకుందాం.



- టీనేజీ అమ్మాయిలకు రోజుకు 360 మిల్లీగ్రాముల మెగ్నీషియం అవసరమవుతుంది. ఆ తరువాత ముప్పై ఏళ్లలోపువారికి 310 మి.గ్రా, ఆపైన 320 మి.గ్రా. కావాలి.
- మనం ఇష్టంగా తినే డార్క్ చాక్లెట్‌లో ఇది పుష్కలంగా దొరుకుతుంది. రోజూ మనం తీసుకోవాల్సిన మెగ్నీషియం శాతంలో ఇరవై శాతం ఇది తింటే పొందొచ్చు. అలాగే దీంట్లో మాంగనీసు, రాగి, ఇనుము వంటివి కూడా ఎక్కువ శాతంలోనే ఉంటాయి.
- మాంసకృత్తులు మెండుగా ఉండే బీన్స్, తృణధాన్యాలను ఎక్కువగా తీసుకోవడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా ఒక కప్పు సోయాతోనే 85 గ్రాముల మెగ్నీషియం ఉంటుంది.
- 28 గ్రాముల జీడిపప్పు తింటే ఒక రోజుకు అవసరమయ్యే మెగ్నీషియంలో 20 శాతం తీసుకున్నట్లే. అలాగే అరటి పండులో రోజుకు మన శరీరానికి కావల్సిన మెగ్నీషియంలో 10 శాతం దొరుకుతుంది. దాంతోపాటే వీటిలో విటమిన్ సి, పీచు, యాంటీ యాక్సిడెంట్లు ఉంటాయి.

విడాకులు ఇచ్చాడు.. మళ్లీ ఇష్టం అంటున్నాడు!

? నాకు మూడు సంవత్సరాల కిందట పెళ్లైంది. మొదటి రోజు నుంచీ మావారికి నా మీద అనుమానమే. దాంతో ఇద్దరం విడాకులు తీసుకున్నాం. దాదాపు ఆరు నెలలవుతోంది. ఇప్పుడు ఆయన తరచూ ఫోన్ చేసి క్షమించు.. నాదే తప్పు.. మనం మళ్లీ కలిసి ఉందామని బతిమాలుతున్నారు. ఇంట్లో చెబితే తప్పేంటీ అంటున్నారు. దీనికి కారణం నేను రెండో పెళ్లికి ఒప్పుకోకపోవడమే. నేనిలా ఒంటిరిగా ఉండటం అమ్మానాన్నలకు బాధగా ఉందన్న విషయం నాకు తెలుసు. కానీ విడాకులు తీసుకున్న వ్యక్తితో తిరిగి కలిసి ఎలా ఉండగలను? ఏం నిర్ణయం తీసుకోవాలో అర్థం కావట్లేదు. **- ఓ సోదరి**

డియర్ వసుంధర



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

✔ కొంతమందిది అనుమానించే తత్వం. పెళ్లయిన తర్వాత భార్యను అనుమానించడం మరింత ఎక్కువవుతుంది. దీన్నే సైకోసిస్ పారినాయిడ్ అంటారు. విడాకుల కన్నా ముందే మానసిక నిపుణుల్ని సంప్రదిస్తే పరిష్కారం దొరికేది. కానీ అలా జరగనట్టుంది. సమస్య తీవ్రమై విడాకులు తీసుకున్నారు. ఇప్పుడు ఇంట్లో మిమ్మల్ని మళ్లీ పెళ్లి చేసుకోమని అడుగుతున్నట్టున్నారు. కానీ మీ వాళ్లకోసం పెళ్లికి అంగీకరిస్తే మళ్లీ బాధపడాల్సి వస్తుందేమో ఆలోచించండి. అది కూడా మీకు ఇంకో కొత్త సమస్యేనని గుర్తుంచుకోండి. అలా కాకుండా మీకూ ఇష్టం ఉంటే ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిందే. కౌన్సెలింగ్ తీసుకోవాలి. ముందు ఆర్థికంగా స్థిరపడండి. అది మీకు అండగా నిలుస్తుంది. ఏ కష్టాన్నైనా ఎదుర్కొనే భరోసా ఇస్తుంది. బాధలో ఉన్నప్పుడు తీసుకునే నిర్ణయానికీ, ధైర్యంతో తీసుకునే నిర్ణయానికి తేడా ఉంటుంది. ఒకవేళ మీ మనసులో ఏ మూలైనా ఆయనమీద ఇష్టంతో కలిసి ఉండాలనుకుంటే... ఇంతకు ముందే విడాకులు తీసుకున్నారు కాబట్టి ఇప్పుడు మళ్లీ పునర్వివాహం చేసుకోవాల్సి ఉంటుంది. ఇది పెద్ద సమస్యేమీ కాదు. ఇక కుటుంబం విషయానికొస్తే మీ గాయం మానడానికి సమయం పడుతుంది. దీని గురించి మీ తల్లిదండ్రులు కూడా ఆలోచించాలి. ఇంత హడావుడిగా నిర్ణయం తీసుకోకపోవడమే మంచిది. ఇంతగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన వ్యక్తి ఇప్పుడు నిజంగానే మారారో లేదో అని విచారించాల్సిన బాధ్యత కూడా వాళ్లమీద ఉంది. ఇవన్నీ ఆలోచించాకే ఒక నిర్ణయానికి రండి.

బంగారం వెండి

23న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,882	2,878
వెండి (గ్రా)	42.00	42.00



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,170	31,120	30,860	30,700	30,750	30,680	30,820	30,780	30,950	30,950
ఆర్నమెంట్	29,110	29,130	28,650	28,500	28,480	28,410	28,820	28,780	28,780	28,780
వెండి(కిలో)	39,940	39,980	40,300	40,200	39,900	39,900	39,300	39,300	40,500	40,500

నజరానా

క్యాబేజీ రసంలో కొంచెం తేనె కలిపి ముఖానికి రాసుకోవాలి. పది నిమిషాల తరువాత కడిగేస్తే.. ముడతల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.

సబలల ఉపాధ్యాయం

ఆ ఇద్దరి స్నేహితురాళ్ల నేపథ్యం పేదరికం. అయినా కష్టపడి చదువుకున్నారు. ఉపాధ్యాయులయ్యారు. ఆ కష్టమే వారికి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఈరోజు (జనవరి 24)న జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిని సత్కరించనుంది. వాళ్లిద్దరే అంజులమ్మ, సులోచన. వీరిరువురూ ఈ రోజు బెస్ట్ పెర్ఫార్మెన్స్ సర్టిఫికెట్ అందుకోబోతున్నారు. మరి వారి విజయ గాథను మనమూ తెలుసుకుందామా!

నాన్న మరణంతో చదువు మానేశా!

– అంజులమ్మ

'మాది చిత్తూరు. అమ్మానాన్నలకు మేం ముగ్గురం. నేను పెద్దదాన్ని. నా తరువాత తమ్ముడూ, చెల్లి. నాన్న చంద్రయ్య వ్యవసాయ కూలీ. అమ్మ బుజ్జమ్మ ఇంట్లోనే ఉంటుంది. నాకు పదకొండేళ్లప్పుడు అనారోగ్యంతో నాన్న చనిపోయాడు. దాంతో నా చదువు ఆపేయాల్సి వచ్చింది. అమ్మ వ్యవసాయ పనులకు వెళ్లి మమ్మల్ని పోషించేది. నాకేమో బాగా చదువుకోవాలని కోరిక. కానీ ఇంట్లో ఆ పరిస్థితి లేదు. అలాంటి సమయంలో కస్తూర్బా పాఠశాల నాకు అండగా నిలిచింది. పదోతరగతి వరకూ అక్కడే చదువుకున్నా. పదోతరగతిలో మంచి మార్కులు రావడంతో ఇంటరులో ఉచితంగా సీటు దొరికింది. కష్టపడి చదివా. 2012 డైట్‌సెట్ ప్రవేశ పరీక్ష రాశా. సీటు వచ్చింది. నెల్లూరులో పల్లిపాడు డైట్ కళాశాలలో రెండేళ్లు శిక్షణ తీసుకున్నా. నా లక్ష్యం డీఎస్సీ.



ఉచితంగా తరగతులు...

డైట్‌సెట్ అయ్యాక డీఎస్సీ పై దృష్టిపెట్టా. అందులో 63వ ర్యాంకు సాధించి, బి.కొత్తకోట మండలం కొండ ప్రాంతంలోని ఇరివాండ్లపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్నా. అలాగే చదువులో వెనుకబడి ఉన్న పిల్లలకు ఇంటి దగ్గర ప్రత్యేకంగా తరగతులు తీసుకుంటున్నా. వీలైనంతమంది అమ్మాయిల్ని చదువుకునేలా చేయడమే నా లక్ష్యం. పిల్లలను పాఠశాలకు పంపమని తల్లిదండ్రులకు ఉన్నతాధికారులతో కౌన్సెలింగ్ కూడా ఇప్పిస్తున్నా. నిరుపేద, మధ్య తరగతి ఆడపిల్లలు చదువు కోసం ఎవరిపై ఆధారపడాల్సిన అవసరంలేదనీ, కస్తూర్బాలో అన్ని సౌకర్యాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయంటూ చెబుతాను. టీచర్‌గా పని చేస్తున్నంతకాలం వీలైనంత మంది ఆడపిల్లలు చదువుకునేలా చేయడమే నా లక్ష్యం.



తిండి లేని రోజులెన్నో!

–పెంగడి సులోచన

'మాది చిత్తూరు జిల్లా కంభంవారిపల్లె మండలం. మేం ముగ్గురం సంతానం. అందరి వేళ్లు నోట్లోకెళ్లాలంటే అమ్మానాన్న కష్టం సరిపోయేది కాదు. దాంతో సంపాదన కోసం నాన్న వలస వెళ్లాడు. అమ్మ కూలీ పనులు చేసేది. తాను కష్టపడుతుంటే బాధగా ఉండేది. అలాంటి పరిస్థితుల్లో చదువుకోవాలనే ఆశ ఉన్నా.. ఆరో తరగతిలో బడి మానేసి అమ్మతో పనులకు వెళ్లేదాన్ని. ఇక ఇదే జీవితం అనుకున్నా.. నా చదువు అర్ధాంతరంగా ఆగిపోయిందని కుమిలిపోయేదాన్ని. అప్పుడు స్థానిక కస్తూర్బా పాఠశాల సిబ్బంది ఇంటికి వచ్చారు. అక్కడ ఉండే సౌకర్యాల గురించి వివరించారు. అమ్మకు నన్ను కస్తూర్బాలో చేర్పించేందుకు సిద్ధపడలేదు. చదువుకుంటానని పట్టుబట్టడంతో చివరకు ఒప్పుకొంది. మధ్యలోనే ఆగిపోయిన నా చదువు మళ్లీ పట్టాలెక్కింది. కస్తూర్బా పాఠశాలలో ఏడో తరగతిలో చేరాను. అక్కడే పదోతరగతి పూర్తిచేశా. స్కూల్ ఫస్ట్ రావడంతో మండలంలోని ఓ ప్రైవేటు ఇంటర్ కళాశాల ఉచితంగా చదివించేందుకు ముందుకొచ్చింది. దాంతో కష్టపడి పూర్తిచేశా. ఎంపీసీలో వెయ్యికి 848 మార్కులొచ్చాయి. అదయ్యాక ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవాలని అనిపించింది. డైట్‌సెట్ కూడా పూర్తిచేశా. రాష్ట్రస్థాయిలో 150వ ర్యాంకు వచ్చింది. దీంతో చిత్తూరు జిల్లా కార్వేటిలో ఉచితంగా సీటు లభించింది. రెండేళ్ల శిక్షణ పూర్తి చేశా. అదే ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చింది. ప్రణాళికాబద్ధంగా చదివి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యా. ప్రస్తుతం రాగులవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నా.'బడి బయట పిల్లలు' లేకుండా ప్రయత్నం చేస్తున్నా. నాలా చాలామంది పిల్లలు పేదరికంతో చదువుకోలేపోతున్నారు. అలాంటి వారిని చేరదీసి, మండల వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి, సమీప పాఠశాలల్లో చేర్పిస్తున్నా. బాలికల విద్య కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలూ, సౌకర్యాలను వివరిస్తున్నా. మా కష్టం వృథా పోలేదని అర్థమైంది. నాకూ, అంజులమ్మకు గుర్తింపు వచ్చింది. ఇది మాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ స్ఫూర్తితో వీలైనంతమంది అమ్మాయిల్ని మళ్లీ బడిబాట పట్టించాలనేదే మా లక్ష్యం.

కరీముల్లా షేక్, ఈనాడు డిజిటల్, చిత్తూరు



చదువు

ఈనాడు విజయవాడ బుధవారం జనవరి 24, 2018 ■ e-mail: edc@eenadu.in

బిజినెస్ డెవలప్‌మెంట్‌లో..

తాజా ఇంటర్న్‌షిప్స్

ఈ-పబ్లిషింగ్ (ఎక్స్ఎంఎల్, హెచ్‌టీఎంఎల్)
సంస్థ: Cassius Technologies
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.5000
లింకు: internshala.com/i/8482
గడువు: జనవరి 30, 2018
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: Gangez Support Services
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.10,000
లింకు: internshala.com/i/8483
గడువు: జనవరి 30, 2018
అర్హత: తెలుగు, హిందీ, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.



వెబ్ డెవలప్‌మెంట్
సంస్థ:- Wedesign Solutions
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.5000
లింకు: internshala.com/i/8484
గడువు: జనవరి 30, 2018
అర్హత: హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావాస్క్రిప్ట్, జెక్వెరీ, వర్డ్‌ప్రెస్, జేఎస్ఓఎన్ నైపుణ్యాలు.

క్యూఏ టెస్టింగ్
సంస్థ: Mobigesture Software
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.14,000-రూ.16,000
లింకు: internshala.com/i/8485
గడువు: జనవరి 30, 2018
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

మరిన్ని ఇంటర్న్‌షిప్‌లకు **www.eenadupratibha.net** చూడవచ్చు.

జేఈఈ-2018



బీఈ/ బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించే పరీక్ష జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ). ఇందులో రెండో దశ అయిన అడ్వాన్స్‌డ్ పరీక్ష... ఐఐటీ సీటును ఖరారు చేస్తుంది. 2018 నుంచీ పూర్తిగా దీన్ని ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్టు) పద్ధతిలోకి మార్చారు. దీనిపై అభ్యర్థులు అనవసర ఆందోళనలకు గురికాకుండా ముందస్తుగా తగిన అవగాహన ఏర్పరచుకోవాలి. ఆన్‌లైన్ పద్ధతికి అలవాటు పడే విధంగా సాధన చేయాలి.

అడ్వాన్స్‌డ్‌గా.. ఆన్‌లైన్‌లో!

2018 జేఈఈ- అడ్వాన్స్‌డ్‌ను ఐఐటీ కాన్పూర్‌వారు నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇదే విద్యాసంస్థ 2004, 2011ల్లో ఈ పరీక్షను నిర్వహించింది. పరీక్ష తీరు అనూహ్యమైనప్పటికీ... 2018 జేఈఈ అడ్వాన్స్‌డ్ రాయబోయేవారు ఈ పూర్వ ప్రశ్నపత్రాల సరళిని అవగాహన చేసుకుంటే మార్గం సులభతరమయ్యే అవకాశముంది.



ఎం. ఉమాశంకర్
శ్రీ చైతన్య విద్యాసంస్థలు

2011 జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రశ్నపత్ర విశ్లేషణ

» **ఫిజిక్స్ పేపర్-1:** మొత్తమ్మీద 36% తేలికపాటి, 34% మధ్యమ స్థాయి, 24% కఠినస్థాయి ప్రశ్నలున్నాయి. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. మధ్యమస్థాయి ప్రశ్నలను కూడా తేలికగా తీసుకోరాదు. ఈ ప్రశ్నలన్నీ ఫిజిక్స్‌లో వేవ్స్ అండ్ సౌండ్స్, కరంట్ ఎలక్ట్రిసిటీ, కెపాసిటర్స్, ఎలక్ట్రో మాగ్నటిక్ ఇండక్షన్, రొటేషనల్ డైనమిక్స్, న్యూటన్స్ లాస్ ఆఫ్ మోషన్, ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్‌ల నుంచి ఇచ్చారు. ఎలక్ట్రోస్టాటిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మోడర్న్ ఫిజిక్స్, ఎస్‌హెచ్ఎం, రొటేషనల్ డైనమిక్స్ వంటి అధ్యాయాల నుంచి కఠినస్థాయి ప్రశ్నలను అడిగారు.

ఫిజిక్స్ పేపర్-1లో మెకానిక్స్‌పై 31%, హీట్ అండ్ థర్మోడైనమిక్స్‌పై 9%, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌పై 16%, ఎలక్ట్రోడైనమిక్స్‌పై 31%, మోడర్న్ ఫిజిక్స్‌పై 13% ప్రశ్నలను ఇచ్చారు.

» **ఫిజిక్స్ పేపర్-2:** దీనిలో 49% తేలికపాటి, 46% మధ్యమ స్థాయి, 5% కఠినస్థాయి ప్రశ్నలను అడిగారు. అయితే కైనమాటిక్స్, వర్క్, పవర్ అండ్ ఎనర్జీ, ఎస్‌హెచ్ఎం, ఎలక్ట్రో మాగ్నటిక్ ఇండక్షన్, కరంట్ ఎలక్ట్రిసిటీ, ఈఎంఐ అండ్ ఏసీ, మోడర్న్ ఫిజిక్స్ లాంటి అధ్యాయాల నుంచి మధ్యమ స్థాయిలో అడిగినప్పటికీ ఈ అంశాల నుంచి కఠినస్థాయి ప్రశ్నలు కూడా వచ్చాయి. పేపర్-2లో మెకానిక్స్‌పై 31%, హీట్ అండ్ థర్మోడైనమిక్స్‌పై 10%, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌పై 18%, ఎలక్ట్రో డైనమిక్స్‌పై 28%, మోడర్న్ ఫిజిక్స్‌పై 5%, ఆప్టిక్స్‌పై 9% ప్రశ్నలను ఇచ్చారు.

మెకానిక్స్, ఎలక్ట్రో డైనమిక్స్ లాంటి అధ్యాయాలపై పట్టు సాధించినవారికి ఫిజిక్స్ పేపర్‌లో మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది.

» **కెమిస్ట్రీ పేపర్-1:** కోఆర్డినేషన్ కాంపౌండ్స్, సొల్యూషన్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, స్టైక్యోమెట్రీ, స్టేట్స్ ఆఫ్ మ్యాటర్, హైడ్రో కార్బన్స్, ప్రాక్టికల్ ఇనార్గానిక్ కెమిస్ట్రీ లాంటివాటిపై మధ్యమస్థాయి ప్రశ్నలను లోతుగా ఇచ్చారు. జీఓసీ, న్యూక్లియర్ కెమిస్ట్రీ, అటామిక్ స్ట్రక్చర్ లాంటి అధ్యాయాలపై కఠిన స్థాయి ప్రశ్నలు వచ్చాయి.

ఫిజికల్ కెమిస్ట్రీపై 46%, ఆర్గానిక్ కెమిస్ట్రీపై 25%, ఇనార్గానిక్ కెమిస్ట్రీపై 24% ప్రశ్నలను ఇచ్చారు.

» **కెమిస్ట్రీ పేపర్-2:** మెటలర్జీ, కోఆర్డినేషన్ కాంపౌండ్స్, ప్రాక్టికల్ కెమిస్ట్రీ, సొల్యూషన్స్, అయానిక్ ఈక్విలిబ్రియం, కెమికల్ ఈక్విలిబ్రియం, కెమికల్ కైనెటిక్స్, సాలిడ్ స్టేట్స్, థర్మోడైనమిక్స్, కార్బొనైల్ కాంపౌండ్స్, ఈథర్స్, నైట్రోజన్ అండ్ ఇట్స్ కాంపౌండ్స్, బయోమాలిక్యూల్స్ లాంటి అధ్యాయాలపై మధ్య స్థాయి నుంచి కఠిన స్థాయి వరకూ ప్రశ్నలను అడిగారు. ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి 43%, ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి 36%, ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి 21% ప్రశ్నలు వచ్చాయి.

అంటే 2011 జేఈఈ పేపర్‌లో కెమిస్ట్రీలో ఎక్కువ శాతం ప్రశ్నలు ఫిజికల్ కెమిస్ట్రీ నుంచీ, తర్వాత ఆర్గానిక్, చివరగా ఇనార్గానిక్ కెమిస్ట్రీల నుంచి ఇచ్చారు.

ఇది గుర్తు చేయటంలో ముఖ్యోద్దేశం... ఈమధ్య కాలంలో జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పేపర్లో కెమిస్ట్రీ కీలకమైన పాత్ర పోషిస్తోంది. అందులోనూ ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీల నుంచి సుమారుగా సమానస్థాయిలో ప్రశ్నలను ఈమధ్యకాలంలో ఇచ్చారు. కానీ 2011 జేఈఈలో ఫిజికల్ కెమిస్ట్రీకే ప్రాధాన్యం ఇవ్వటం గుర్తుంచుకోవాలి.

» **మ్యాథ్స్ పేపర్-1:** లాగరిథమ్స్, సెట్స్, మ్యాట్రిసెస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, ప్రాబబిలిటీ, ట్రిగొనామెట్రిక్ ఈక్వేషన్స్, స్ట్రెయిట్ లైన్స్, పెరాబోల, మాక్సిమా అండ్ మినిమా వాల్యూస్, ఏరియాస్‌లపై మధ్య స్థాయి ప్రశ్నలను, డిఫరెన్షియబిలిటీ, డెఫినిట్ ఇంటిగ్రేషన్, హైపర్‌బొలా, ప్రోగ్రెషన్స్, ఇన్‌వర్స్ ట్రిగొనామెట్రిక్ ఫంక్షన్స్, కాంప్లెక్స్ నంబర్స్‌లపై కఠినస్థాయి ప్రశ్నలను ఇచ్చారు. మొత్తమ్మీద పేపర్-1లో ఆల్జీబ్రా నుంచి 38%, కాల్‌క్యులస్ నుంచి 33%; ట్రిగొనామెట్రీ నుంచి 14%, వెక్టార్ ఆల్జీబ్రా నుంచి 4%, టూ, త్రీ డైమెన్షనల్ జామెట్రీ నుంచి 13% ప్రశ్నలను ఇచ్చారు.

» **మ్యాథ్స్ పేపర్-2:** మాట్రిసెస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, ఫంక్షన్స్, ఏరియాస్, పెరాబొల, హైపర్‌బొల, ప్రాబబిలిటీ, కాంప్లెక్స్ నంబర్స్ నుంచి మధ్య స్థాయి ప్రశ్నలనూ, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, కాంప్లెక్స్ నంబర్స్, సర్కిల్స్, పెరాబొల, లిమిట్స్, కంటిన్యుటీ అండ్ డిఫరెన్షియేషన్, డెఫినిట్ ఇంటిగ్రేషన్స్‌ల నుంచి కఠినస్థాయి ప్రశ్నలను అడిగారు. 31% ప్రశ్నలను ఆల్జీబ్రా నుంచీ, 43% కాల్‌క్యులస్ నుంచీ, 18% కోఆర్డినేట్ జామెట్రీ నుంచీ, 9% వెక్టార్ ఆల్‌జీబ్రా నుంచీ అడిగారు.

ఎప్పటిలాగే కాల్‌క్యులస్ తర్వాత ఆల్జీబ్రా మ్యాథ్స్‌లో కీలకపాత్రను పోషిస్తున్నాయి. అందులోని అంశాలపై పట్టు సాధిస్తేనే ఫలితం ఉంటుంది.

మరిన్ని వివరాలు, స్టడీమెటీరియల్, ఆన్‌లైన్ పరీక్షలు, ప్రీవియస్, మోడల్ పేపర్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

2018లో పరీక్ష ప్రశ్నల సరళిపై అంచనా

ఐఐటీ కాన్పూర్ నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ 2018 ఆన్‌లైన్ ప్రశ్నపత్రంపై మాక్ టెస్టును ఆ విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఆ ప్రశ్నపత్ర విధానాన్ని గమనిస్తే 2018 జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రశ్నపత్ర నమూనా కిందివిధంగా ఉండొచ్చు.

విభాగం	ప్రశ్నల పద్ధతి	+ మార్కులు	– మార్కులు	ప్రశ్నలు	మొత్తం మార్కులు
సెక్షన్-1	ఇంటీజర్ టైపు	4	0	8	32
సెక్షన్-2	ఒకటి కంటే ఎక్కువ జవాబులు	4	-2	8	32
సెక్షన్-3	రెండు పేరాగ్రాఫ్‌లు, ఒక్కోదాంట్లో 2 ప్రశ్నలు; ఒకటి కంటే ఎక్కువ జవాబులు	4	-2	4	16
మొత్తం మార్కులు					80

అంటే ఆన్‌లైన్లో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ 2018 ప్రశ్నపత్రంలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ఒక్కోదాంట్లో 20 ప్రశ్నలు, ఒక్కో సబ్జెక్టుకు 80 మార్కుల చొప్పున అంటే మొత్తమ్మీద పేపర్-1, 2లను 240 మార్కులకు నిర్వహించవచ్చని తెలుస్తోంది. గతంలో ప్రశ్నలకు ఇచ్చిన రుణాత్మక మార్కులకంటే ఎక్కువ రుణాత్మక మార్కులు; సెక్షన్-2, సెక్షన్-3 రెండిట్లోనూ ఒకటి కంటే ఎక్కువ సమాధానం ఉండే ప్రశ్నలు ఇవ్వటం గమనించవచ్చు.

మాక్ టెస్టులో మ్యాథ్స్‌లో ఆల్జీబ్రా, కాల్‌క్యులస్; ఫిజిక్స్‌లో ఎలక్ట్రో డైనమిక్స్, మెకానిక్స్, మోడర్న్ ఫిజిక్స్; కెమిస్ట్రీలో ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారు.

ఇవి గమనించండి!

- 2018లో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ ఆధారిత టెస్టుకు సంబంధిత వెబ్‌సైట్‌లో విద్యార్థులు తెలుసుకోవాల్సిన సూచనలతో కూడిన వీడియోను ఉంచారు.
- పరీక్ష హాల్లో విద్యార్థులు పాటించాల్సిన నియమ నిబంధనలూ, కంప్యూటర్ ఆధారిత టెస్టుకు సంబంధించిన ముఖ్య సూచనలూ అందులో పొందుపరిచారు.
- ఐఐటీ కాన్పూర్ మాక్ టెస్టును పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే మేలో జరిగే తుది పరీక్షను సులువుగా ఎదుర్కోవచ్చు.
- అయితే... మాక్ టెస్టులో ఇచ్చిన విధంగానే ఫైనల్ జేఈఈ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఉంటుందని భావించటం సరికాదు. కానీ మోడల్ ఆ విధంగా ఉండవచ్చు.
- ప్రవేశపరీక్షలో ఇచ్చే నియమ నిబంధనలు చదివి, అర్థం చేసుకున్నాకే ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడం ప్రారంభించాలి.

2016 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో సీట్లు సాధించారు. మారిన కంప్యూటర్ ఆధారిత టెస్టులో కూడా మన విద్యార్థులు ప్రతిభ చూపేందుకు అవగాహనతో కృషి చేయాలి.

అవుదామా.. అకౌంట్స్ ఆఫీసర్!

కామర్స్ అభ్యర్థులు డైరెక్ట్‌గా ఆఫీసర్ ఉద్యోగాన్ని సంపాదించుకునే అవకాశం వచ్చింది. కేవలం రాత పరీక్ష మార్కుల ఆధారంగా టీఎస్ఎస్‌పీడీసీఎల్‌లో జేఏఓగా జాయిన్ కావచ్చు. ప్రధానంగా బీకామ్ డిగ్రీలో చదివిన సిలబస్‌నే గట్టిగా మరోపట్టు పడితే ఉద్యోగం ఖాయం చేసుకోవచ్చు.

తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) ఇటీవల 114 జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ (జేఏఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఆన్‌లైన్ దరఖాస్తు ఫిబ్రవరి 2న ప్రారంభమై అదే నెల 19తో ముగుస్తుంది. ఉద్యోగ పరీక్షను 25 మార్చి, 2018న నిర్వహిస్తారు. రాత పరీక్ష మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ఇంటర్వ్యూ ఉండదు.



డాక్టర్ ఎమ్. మల్లారెడ్డి
కామర్స్ సహాయ ఆచార్యులు

రాత పరీక్ష 100 ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలతో 100 మార్కులకు ఉంటుంది. ఇందులో ప్రధానంగా రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో ప్రధాన సబ్జెక్టుల నుంచి 80 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. రెండో విభాగంలో జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో జరుగుతుంది.



సిలబస్ విశ్లేషణ

విభాగం-ఎ లో మొత్తం 80 మార్కులకు కామర్స్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఇందులో అకౌంటెన్సీ, అడ్వాన్స్‌డ్ అకౌంటెన్సీ 35, కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ 25, ఆడిటింగ్ 20 మార్కులకు ఉంటాయి.

అకౌంటెన్సీ, అడ్వాన్స్‌డ్ అకౌంటెన్సీ: ఈ సబ్జెక్టులో బీకామ్‌లోని మూడు సంవత్సరాల అకౌంటింగ్ సిలబస్‌ను ఇచ్చారు. దీని నుంచి దాదాపు 10 నుంచి 12 ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఫైనాన్షియల్ అకౌంటింగ్ భావనలు, సంప్రదాయాలు, అకౌంటింగ్ ప్రక్రియలోని వివిధ అంశాలైన చిట్టా, ఆవర్జా, సహాయక పుస్తకాలు, బ్యాంకు నిల్వల సమన్వయ పట్టిక, వినిమయ బిల్లులు, అంకణా, ముగింపు లెక్కలు తదితరాలను సూత్రాల సహా లోతుగా చదవాలి. సాధ్యమైనన్ని లెక్కలు చేయాలి.

సెల్ఫ్ బ్యాలెన్సింగ్ లెడ్జర్, రాయల్టీలు, అద్దె కొనుగోలు, వాయిదా కొనుగోలు పద్ధతులు, ఒంటి పద్దు విధానం, వ్యాపారేతర సంస్థల ఖాతాలు, అసంపూర్ణ రికార్డుల నుంచి ఖాతాలు, భాగస్వామ్య ఖాతాలు (ప్రవేశం, విరమణ, మరణం, రద్దు), బ్రాంచి ఖాతాలు, కంపెనీ ఖాతాలు - వాటాలు మొదలైన వాటిని అధ్యయనం చేయాలి. వాటిలోని వివిధ పద్ధతులను, సూత్రాలను, వివిధ ఖాతాల నమూనాలను, షెడ్యూల్ నెంబర్లను గుర్తు పెట్టుకోవాలి. ఇందులో లెక్కలకు సంబంధించిన ప్రశ్నలు ఎక్కువగా వస్తాయి.

కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్: జేఏఓ సాధించడంలో ప్రముఖపాత్ర వహించే సబ్జెక్టుల్లో ఇది ప్రధానమైంది. దీని నుంచి 25 మార్కులకు ప్రశ్నలు రావచ్చు. వ్యయ ప్రాథమిక భావనలు, మెటీరియల్, లేబర్ వ్యయాలు, ఓవర్ హెడ్స్, వివిధ కాస్టింగ్ పద్ధతులు, బ్రేక్-ఈవెన్ విశ్లేషణ తదితరాలను గత ప్రశ్నపత్రాల ఆధారంగా అధ్యయనం చేయాలి. ముఖ్యంగా వివిధ కాస్టింగ్ నిర్వహణలు, వాటిని పాటించే సంస్థలు, సూత్రాలను విశ్లేషిస్తూ చదవాలి. వివిధ పద్ధతుల్లో లెక్కలను ప్రాక్టీస్ చేయాలి. ముఖ్యాంశాలను, సూత్రాలను నోట్ చేసుకుని మళ్లీ మళ్లీ చదవడం మంచిది.

ఆడిటింగ్: ఉద్యోగ ఎంపికలో కీలకమైన మరో సబ్జెక్టు ఆడిటింగ్. దీని నుంచి 20 మార్కులకు ప్రశ్నలను ఇస్తారు. ఆడిటింగ్ ప్రాథమికాంశాలు, అంతర్గత తనిఖీ, వెరిఫికేషన్, కంపెనీల ఆడిట్, విభాజనీయ లాభాలు, భారతీయ ఆడిటింగ్ ప్రమాణాలు మొదలైన వాటిని చదవాలి. ఇందులో వివిధ సెక్షన్లు, సంవత్సరాలు, కనీస, గరిష్ఠ సంఖ్య, ఇతర నియమాలను విశ్లేషిస్తూ ప్రిపేర్ కావాలి. నిర్దేశించిన సిలబస్‌తో పాటు అకౌంటింగ్, వ్యాపార, ఆర్థిక రంగాల్లో వస్తున్న సంస్కరణలు, వర్తమానాంశాలను అధ్యయనం చేయాలి.

విభాగం-బి జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ: ఇందులో అభ్యర్థుల సాధారణ పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు వివిధ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. ఇందులో న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, ఆంగ్ల పరిజ్ఞానం, తెలంగాణ ఉద్యమం-సంస్కృతి, కంప్యూటర్ పరిజ్ఞానం మొదలైనవి ప్రధానమైనవి.

రాత పరీక్షకు దాదాపు రెండు నెలల సమయం ఉంది. ప్రామాణిక పుస్తకాల ఆధారంగా రోజుకు 10 నుంచి 12 గంటల సమయాన్ని ప్రిపరేషన్‌కు అభ్యర్థులు కేటాయించాలి. వీలైనన్ని మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయాలి.

రిఫరెన్స్ పుస్తకాలు

తెలుగు మాధ్యమం: ● ఫైనాన్షియల్ అకౌంటింగ్, అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్, కార్పొరేట్ అకౌంటింగ్ ● కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ ● ఆడిటింగ్ - తెలుగు అకాడమీ, హిమాలయ పబ్లికేషన్స్, కల్యాణి పబ్లికేషన్స్.

ఇంగ్లిష్ మీడియం: ◆ ఫైనాన్షియల్ అకౌంటింగ్, అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్, కార్పొరేట్ అకౌంటింగ్ కోసం ఎస్‌పీ జైన్ అండ్ కెఎల్ నారంగ్, ఎస్ఎన్ మహేశ్వరి, ఆర్ఎల్ గుప్తా, వీకే గుప్తా పుస్తకాలు. ◆ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ కోసం ఎంఎన్ అరోరా, జైన్ అండ్ నారంగ్ ◆ ఆడిటింగ్‌కి ఆర్‌జీ సక్సేనా, టీఎన్ టాండన్ - తెలుగు అకాడమీ, హిమాలయ పబ్లికేషన్స్, కల్యాణి పబ్లికేషన్స్.

జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ కోసం ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకం.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్ఎండీసీ, హైదరాబాద్

1. మెయింటెనెన్స్ అసిస్టెంట్ ట్రెయినీ (మెకానికల్/ ఎలక్ట్రికల్): 154 పోస్టులు
2. ఎలక్ట్రీషియన్/ క్యూసీఏ/ హెచ్ఈఎం (మెకానికల్/ఆపరేటర్) గ్రేడ్-3 ట్రెయినీ: 15 పోస్టులు

అర్హత: ఐటీఐ/డిప్లొమా, డిగ్రీ, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య. **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్/ జాబ్ ప్రొఫిషియన్సీ టెస్టుల ఆధారంగా.
దరఖాస్తు: ఆన్‌లైన్.
చివరితేది: 19.02.2018.
వెబ్‌సైట్: https://www.nmdc.co.in/

నుమలిగర్ రిఫైనరీలో ట్రెయినీలు

1. గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ (కెమికల్/ ఎలక్ట్రికల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ సివిల్/ ఐఐఎస్): 19 పోస్టులు
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ/ ఆఫీసర్ (ఫైనాన్స్): 02 పోస్టులు

అర్హత: ఇంజినీరింగ్ డిగ్రీ, ఎంబీఏ/ పీజీడీఎం, సీఏ ఉత్తీర్ణత.
ఎంపిక: రాతపరీక్ష, బృందచర్చలు, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఆన్‌లైన్. **చివరితేది:** 23.02.2018.
వెబ్‌సైట్: https://www.nrl.co.in/

ఏపీహెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్, బాపట్ల

ప్రాజెక్ట్ మేనేజర్ (వాటర్, శానిటేషన్ అండ్ హైజీన్): 03 పోస్టులు
అర్హత: పీజీ సోషల్ సైన్సెస్, పని అనుభవం.
వయసు: 40 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు: మెయిల్ ద్వారా పంపాలి
చివరితేది: 10.02.2018.
వెబ్‌సైట్: https://aphrdi.ap.gov.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

రెప్కో హోం ఫైనాన్స్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

అసిస్టెంట్ మేనేజర్ (హెచ్ఆర్)/ మేనేజీరియల్ కేడర్ (హెచ్ఆర్) పోస్టులు
అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, మూడేళ్ల పని అనుభవం.
వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేది: 27.01.2018.
వేదిక: రెప్కో హోం ఫైనాన్స్ లిమిటెడ్, కార్పొరేట్ ఆఫీస్, సర్దార్ పటేల్ రోడ్, గిండి, చెన్నై.
వెబ్‌సైట్: https://www.repcohome.com/

ఎయిర్ ఇండియా, చెన్నై

1. కస్టమర్ ఏజెంట్: 23 పోస్టులు
2. హ్యాండీమెన్: 98 పోస్టులు

అర్హత: ఏదైనా డిగ్రీ, ఏఈపీ ఉత్తీర్ణత, పని అనుభవం.
వయసు: 28 ఏళ్లు మించకూడదు.
వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేది: 27.01.2018.
వేదిక: గవర్నమెంట్ హయ్యర్ సెకండరీ స్కూలు, అశోక్‌నగర్, చెన్నై.
వెబ్‌సైట్: http://www.airindia.in/

డీఆర్‌డీవోలో జేఆర్ఎఫ్

జూనియర్ రిసెర్చ్ ఫెలో (కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్/ సైకాలజీ): 04 పోస్టులు
అర్హత: బీఈ/బీటెక్, పీజీతోపాటు నెట్/ గేట్ ఉత్తీర్ణత. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేది:** 15.02.2018. **వేదిక:** హెడ్ క్వార్టర్స్ ఆర్ఏసీ, లఖ్‌నవూ రోడ్, దిల్లీ. **వెబ్‌సైట్:** https://rac.gov.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.